





# మనసులో మాట

KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక








ప్రచురణ:- విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర:- సంపుటి: 1 సంచిక: 98 శనివారం, నవంబర్ 2025: ఎడిటర్ కంచర్ల అచ్యుత రావు పేజీలు 24: వెలరూ 7/-

శ్రీకాకుళం: విజయనగరం: విశాఖపట్నం: తూర్పుగోదావరి: పశ్చిమగోదావరి: కృష్ణ: గుంటూరు: ప్రకాశం: నెల్లూరు: కర్నూల్: కడప: హైదరాబాద్.




04

## అంతరిక్ష ప్రయాణమే సులువు

బెంగళూరు రోడ్లు, ట్రాఫిక్‌పై శుభాంశు శుక్లా వ్యాఖ్యలు నెట్టింట్లో పెద్ద ఎత్తు చర్చ



## ఇంకా టైం కావాలి

**స్పీకర్‌ను కలిసి లేఖ అందజేసిన కడియం శ్రీహరి**

**సానుకూలంగా స్పందించిన గడ్డం ప్రసాద్**

ఎమ్మెల్యే కడియం శ్రీహరి శుక్రవారం ఉదయం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిశారు. తన వివరణకు అదనపు సమయం కావాలని లేఖ అందజేశారు. విజ్ఞప్తిపై స్పీకర్ సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది.

03



# ఘనంగా

**రాష్ట్రపతికి స్వాగతం పలికిన గవర్నర్, సీఎం**

**హైదరాబాద్, నవంబర్ 21 :** రాష్ట్రపతి ద్రౌపది ముర్మును హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో కలి సిఎం రేవంత్ రెడ్డి స్వాగతం పలికారు. అలాగే రాష్ట్రపతికి స్వాగతం పలికిన వారిలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, హైదరాబాద్ సీపీ సజ్జనార్, తదితరులు ఉన్నారు. తిరుపతి నుంచి నేరుగా హైదరాబాద్ చేరుకున్న రాష్ట్రపతి తిరిగి శనివారం పుట్టపర్తి వెళ్లనున్నారు.

## మారేడుమిల్లి ఎన్‌కౌంటర్

# కట్టుకథ



## పోలీసుల వద్ద ఉన్నారనే ఆధారాలు లేవు

- హెబియస్ కార్పస్ పిటిషన్‌పై హైకోర్టు స్పష్టీకరణ
- మావోయిస్ట్ అగ్రనేతల విడుదలపై విచారణ

02

### హిడ్మా, రాజే, టెక్ శంకర్ ఎన్‌కౌంటర్ ఫేక్

**15న పట్టుకొని క్రూరంగా చంపారు**

**హత్యాకాండకు నిరసనగా రేపు నిరసన**

**మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి అభయ్ సంచలన లేఖ**

**రాయపూర్, నవంబర్ 21 :** మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, ఆ పార్టీ అగ్రనేత హిడ్మాతో పాటు పలువురిని పోలీసులు క్రూరంగా హత్య చేసి ఎన్‌కౌంటర్‌గా చిత్రీకరించారంటూ మావోయిస్టు పార్టీ ఆరోపించింది. అందుకు నిరసనగా నవంబర్ 23వ తేదీన భారత్ బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ మేరకు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట శుక్రవారం లేఖ విడుదల చేసింది. పోలీసుల క్రూర హత్యకు నిరసనగా దేశవ్యాప్తంగా బంద్‌కు పిలుపు ఇచ్చినట్లు వివరించింది.నవంబర్ 18వ



## మిస్ యూనివర్స్‌గా మెక్సికో భామ

**ఫాతిమా బాష్‌కు అందాల కిరీటం**

- పోటీల్లో పాల్గొన్న 121 దేశాల సుందరీమణులు
- అన్ని విభాగాల్లో రాణించిన ఫాతిమా
- భారత్ భామ మణిక విశ్వకర్మకు నిరాశ

04


ఈ ఏడాది విశ్వ సుందరి కిరీటం మెక్సికో భామను వరించింది. థాయ్‌లాండ్ వేదికగా జరిగిన మిస్ యూనివర్స్-2025 పోటీల్లో మిస్ మెక్సికో ఫాతిమా బాష్ విజేతగా నిలిచింది. గతేడాది మిస్ యూనివర్స్‌గా నిలిచిన డెన్మార్క్ భామ విక్టోరియా కెజార్ హెల్విగ్.. ఫాతిమాకు అందాల కిరీటాన్ని అందజేశారు. అందాల పోటీల్లో పాల్గొన్న తొలి ప్రయత్నంలోనే ఫాతిమా విశ్వసుందరిగా నిలిచి అందర్నీ ఆశ్చర్యపర్చారు.

## మూడేళ్లలో 17 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి

- కుప్పంలో సంజీవని ప్రాజెక్టు అమలు
- యూనివర్సల్ హెల్త్ స్కీమ్‌పై ఆరా
- అధికారులతో సమీక్షించిన సిఎం చంద్రబాబు
- మత్స్యకారులకు బాబు శుభాకాంక్షలు

3లో

అమరావతి, నవంబర్ 21 : సంజీవని ప్రాజెక్టును జనవరి నుంచి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ప్రారంభించనున్నారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మేరకు వైద్యారోగ్య శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయంలో సమీక్ష నిర్వహించారు.





03

## రాష్ట్రంలో భారీ భూకుంభకోణం

- 4 లక్షల కోట్ల భూమికి రెక్కలు
- భూములపై రేవంత్ ముఠా
- నన్ను అరెస్ట్ చేసే ధైర్యం లేదు
- మీడియ సమావేశంలో కేటీఆర్

## త్వరలోనే స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ

- ఏటీసీలుగా 65 ఐటీఐ కళాశాలల మార్పు
- జేఎన్టీయూ డైమండ్ జూబ్లీ వేడుకల్లో డిప్యూటీ సీఎం

హైదరాబాద్, నవంబర్ 21 : 65 ఐటీఐ కళాశాలలను ఏటీసీలుగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క తెలిపారు. హైదరాబాద్ కూకట్‌పల్లిలోని జేఎన్టీయూ డైమండ్ జూబ్లీ వేడుకలకు ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరయ్యారు. విద్యార్థుల భవిష్యత్తులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. త్వరలోనే స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు.



3లో

## దుబాయ్ ఎయిర్ షోలో ప్రమాదం

- ప్రదర్శన సమయంలో కుప్పకూలిన తేజస్

04

ఎయిర్ షోలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం సమయంలో ప్రదర్శన జరుగుతుండగా.. విమానం ఒక్కసారిగా కూలిపోయింది.

## పంచాయితీ రిజర్వేషన్లపై కసరత్తు

- నేడు జీవో విడుదల చేయనున్న పంచాయితీరాజ్ శాఖ
- ఒకటి రెండు రోజుల్లో రిజర్వేషన్లు ఖరారు

02

డెడికేటెడ్ కమిషన్ సిఫార్సులను సర్క్యులేషన్ విధానంలో రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. మంత్రుల వద్దకు ఫైలు పంపించి ఆమోదిస్తున్నట్లు సంతకాలు తీసుకున్నారు.

## అబద్దాల ప్రచారంలో కేటీఆర్ దిట్ట


- గతంలో లాగా అడ్డగోలు నిర్ణయాలకు మేం దూరం
- కేటీఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు

02

## భారీగా ఐపీఎస్‌ల బదిలీ

- 32మందికి స్థానచలనం
- పలు జిల్లాలకు కొత్త ఎస్పీల నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్‌రామకృష్ణారావు
- స్థానిక సంస్థల ఎన్నికల వేళ కీలక పరిణామం

వివరాలు 2వ పేజీలో



మాట

22 శనివారం నవంబర్ 2025

# సంపాదకీయం

## నక్సల్స్ ఏరివేతే కాదు.. గిరిజనుల అభివృద్ధి ముఖ్యం !

కార్పొరేట్ల కన్ను అటవీ ప్రాంతాలపైన, కొండల కింద ఉన్న గనుల పైన పడటంతో గిరిజనులను అక్కడి నుండి వెళ్లగొట్టడానికి వివిధ పేర్లతో కుట్రలు జరుగుతున్నాయన్నది లెఫ్ట్ పార్టీల వాదనగా ఉంది. ఇది ఎంత వరకు నిజయమో తెలియాలి. ఇదే నిజమైతే దీనికి ప్రజాస్వామ్య పద్దతిలో లెఫ్ట్ నేతలు కూడా పోరాటం చేపట్టాలి. ప్రజలను సమీకరించాలి. అడవులను నాశనం చేసేవారు ఎంతటి వారైనా నిలదీయాల్సిందే. అటవీ హక్కులను తిరస్కరిస్తున్నట్లుగా గుర్తిస్తే అందుకు ప్రజా ఉద్యమాలను నిర్వహించాలి. గిరిజనులతో నామమాత్రంగా కూడా చర్చించకుండానే పలు ప్రాజెక్టులను వారి నివాస ప్రాంతాల్లో చేపడుతున్నట్లుగా ఆరోపణలు చేస్తున్నారు. చట్ట ప్రకారం తప్పనిసరైన గ్రామసభలనుసైతం దాటవేస్తున్నారు. ఈ తరహా సర్కారీ దమనకాండపై అసంతృప్తిని, నిరసనను వ్యక్తం చేయడానికి కూడా అవకాశం ఇవ్వకుండా ఉక్కుపాదం మోపుతున్నారని అంటున్నారు. లెఫ్ట్ పార్టీలకు ఉద్యమాలు, పోరాటాలు కొత్త కాదు. ఇవే నిజమైతే ప్రజా ఉద్యమాలను నిర్మించాల్సిందే. కేంద్ర ప్రభుత్వం ప్రకటించినట్లుగానే తీవ్ర నిర్బంధ చర్యల ద్వారా మావోయిస్టులపై పై చేయి సాధించవచ్చు. కానీ, అణచివేతకు గురవుతున్న ప్రజానీకపు జీవన పరిస్థితుల్లో మార్పు రాకుంటే వారిలోని అసంతృప్తి మరోరూపం తీసుకోవచ్చు. ఇది ఒక సామాజిక ఆర్థిక సమస్య. క్షేత్రస్థాయిలో అసమానతలు రూపుమాపడమే దీనికి పరిష్కారం కావాలి. అలాగే గిరిజనులను పాలనలో భాగస్వాములను చేయాలి. వారి నివాస ప్రాంతాల్లో అభివృద్ధికి సంబంధించిన అంశాల్లో నిర్ణయాధికారం వారిదే కావాలి. విద్య, వైద్య సౌకర్యాలతో పాటు, ఉపాధిని పెద్ద ఎత్తున కల్పించాలి. దీంతో అడవుల్లో అన్నల అవసరం రాకపోవచ్చు. మావోయిస్టుల పేరుతోనో, వారి సానుభూతిపరుల పేరుతోనో గిరిజనులపై పోలీసుల వేధింపులను, నిర్బంధాన్ని తక్షణం నిలిపివేయాలి. ఇకపోత నక్సల్స్ ఏరివేత వెనక ఇదే పరమార్థం అని అంటున్నారు. నక్సల్స్ ఏరివేతతో అటవీ సంపద వినాశనాన్ని ముడిపెట్టరాదు. ఇవి రెండు కూడా వేర్వేరు అంశాలు. అందువల్ల మావోయిస్టులు ఏరివేతను అడవుల సంరక్షణతో పోల్చరాదు. అడవులను కార్పోరేట్లకు కట్టిపెడుతున్నారని ఖచ్చితమైన సమచారం ఉంటే ఎవ్వరైనా పోరాడవచ్చు. ఇకపోతే లొంగిపోవడానికి వచ్చిన నక్సల్స్ నేత హిడ్మాను, ఆన భార్య, ఇతర అనుచరులను మట్టుపెట్టారని, క్రెడిట్ దక్కించు కోవడానికే పోలీసులు ఈ పనిచేశారని వస్తున్న వార్తలపై పోలీసులే నిజాలు వెల్లడిస్తారని అనుకుంటే పోరపాటే. ఎందుకంటే ఖాకీ దుస్తులు వేసుకున్న తరవాత వారికి మానవత్వం అన్నది ఉండదు. నక్సలైట్ ఉద్యమంలో ఎందరో పోలీసులు అసువులు బాసారు. ఎందరో క్రూరంగా హత్యకు గురయ్యారు. మందుపాతరలకు బలయ్యారు. ఇవన్నీ వారు తప్పకుండా పరిగణలోకి తీసుకుంటారు. దీనికితోడు ప్రభుత్వం వారికి టార్గెట్లు విధించింది. అందువల్ల చిక్కిన అవకాశాన్ని వదులుకోరు. అందులోనూ నక్సల్స్ విషయంలో అస్సలు ఉండదు. మనం ఇక్కడ రెండు వైపులా ఆలోచన చేయాలి. నక్సల్స్ కూడా తమ ఉద్యమంలో కిరాతకంగా వ్యవహరించారు. చంపడంలో ఆరితేరారు. ఖతం చేయడమే వారి ఉద్యమంగా సాగింది. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారు. మొత్తంగా నక్సల్స్ ఉద్యమంలో రెండువైపులా ప్రాణనష్టం జరిగింది. అమాయకులను ఎందరినో వారు పొట్టన పెట్టుకున్నారు. నేతలను బలితీసుకున్నారు. దీంతో వారు సాధించిందేమీ లేకపోగా, ఉద్యమం వల్ల దేశానికి తీవ్ర నష్టమే జరిగింది. అందుకే హిడ్మా లొంగిపోవడానికి వచ్చినా పట్టుకుని కాల్చేశారని అంటున్నారు. పోలీసులు అవకాశం కోసం చూస్తారు. అదను చూసి దెబ్బ తీస్తారు. ఇదంతా ఎలా ఉన్నా ఇరువైపులా హింస సరికాదు. నక్సల్స్ కూడా ప్రజల పక్షాన పోరాడడం మాని కేవలం అడవుల్లోనే ఉంటూ హింసాత్మక ఘటనలతో భీతావాహ పరిస్థితులను సృష్టించారు. నిజంగానే ఇప్పటికైనా నక్సల్స్ ఉంటే వారంతా జనజీవన స్రవంతిలోకి రావాలి. ప్రజల పక్షాన సమస్యలపై పోరాడాలి. ఇకపోతే అసలు ఆపరేషన్ కగార్ చేపట్టిందే హిడ్మా కోసమని, ఆయన కోసం డెడ్‌లైన్ కూడా పెట్టారని, ఆ గడువులోపలే పనిపూర్తయిందని మీడియాలో వస్తున్న కథనాలను చూస్తూనే ఉన్నాం. కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా కూడా పదేపదే మార్చి అంటూ టార్గెట్ పెడుతూనే ఉన్నారు. అందుకే తాజా రెండు ఎన్‌కౌంటర్లతో ఏం జరిగిందో అర్థం చేసుకోవచ్చు. భయోత్పాతం సృష్టించడమే లక్ష్యంగా జరిగే పోలీసు కనుసన్నల్లో జరిగే ఈ తరహా సంఘటనలు ఎంతమాత్రం సమర్థనీయం కాదని కొందరు అంటున్నారు. నక్స్‌కు మద్దతుగా నిలిచిన వారికి ఇది మారణహోమంగానే ఉంటుంది. అదే సందర్భంలో రాజకీయ నేతలను, పోలీసులను నక్సల్స్ అత్యంత కిరాతకంగా హత్య చేసిన పలు సందర్భాల్లో ఇప్పుడు విమర్శలు చేస్తున్నవారు ఏనాడూ స్పందించలేదు. నక్సల్స్‌కు భయపడి వీరంతా మిన్నకున్నారు. నిజానికి ఇటువంటి అప్రజాస్వామిక, హింసాత్మక విధానాలను ఎవరు అవలంబించినా ఖండించాల్సిందే. ఇకపోతే మరో నక్సల్ నాయకుడు తిప్పిరి తిరుపతి పోలీసుల అదుపులో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. అదే నిజమైతే పోలీసులు అదుపులోకి తీసుకున్న వారందరినీ తక్షణం న్యాయస్థానాల ముందు హాజరుపర్చాలి. ఇకపోతే రెండు రోజులుగా రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవల కాలంలో ఎన్నడూ లేని విధంగా వరుసగా జరుగుతున్న మావోయిస్టుల ఎన్‌కౌంటర్లు, అరెస్టులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఒక కుదుపు కుదిపాయి. ఎందుకంటే ఇటీవలి కాలంలో ఎపిలో నక్సల్స్‌ఉన్న జాడలేదు. అందుకే ఈ ఎన్‌కౌంటర్లపై సహజంగానే అనుమానాలు రవాడం సహజం. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీప్రాంతంలో మంగళవారం ఉదయం జరిగిన పోలీసు కాల్పుల్లో మావోయిస్టు పార్టీ అగ్రనేత హిడ్మా, ఆయన భార్య రాజక్కతో సహా ఆరుగురు మరణించారు. ఈ సంఘటన రేపిన కలకలం చల్లారకముందే, 24 గంటలలోపే బుధవారం ఉదయం దాదాపు అదే ప్రాంతంలో జరిగిన మరో ఘటనలో ఏడుగురు మావో యిస్టులు ప్రాణాలు నేలకొరిగారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వమే మావోయిస్టుల నిర్మూలన కార్యక్రమాన్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఆయుధాలతో సహా బేషరతుగా లొంగిపోవడం తప్ప మరో మార్గంలేదని సాక్షాత్తు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా పదేపదే ప్రకటించారు. ఆ హెచ్చరికల నేపథ్యంలోనే ఇవన్నీ సాగుతున్నాయని భావించాల్సిందే. ఆపరేషన్ కగార్ చేపట్టినతరువాత అంతా అయిపోయిందనుకుంటే పొరపాటు. అక్కడ నివసిస్తున్న గిరిజనుల సమస్యలు పరిష్కరించకుండా ముందుకు సాగితే పరిస్థితుల్లో మార్పు రాదని ప్రభుత్వాలు గుర్తించాలి.

# మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ కట్టుకథ

మొదటి పేజీ తరువాయి

తేదీ ఉదయం అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం అటవీ ప్రాంతం సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హిడ్మా, ఆయన భార్య రాజేతోపాటు పలువురు మావోయిస్టులు మృతి చెందారు. వారి మృతదేహాలకు రంప చోడవరం ఏరియా ఆసుపత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించి.. ఛత్తీస్‌గఢ్ సుక్మా జిల్లాలోని పువ్వర్తి గ్రామానికి తరలించారు. ఈ మృతదేహాలకు హిడ్మా కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఏడాది మేలో ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 28 మంది మావోయిస్టులు మరణించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో పార్టీ అగ్రనేత సంబాల కేశవరావు అలియాస్ బసవరాజు మరణించారు. ఈ ఎన్‌కౌంటర్‌ను నిరసిస్తూ.. జూన్ 10వ తేదీన భారత్ బంద్‌కు మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హిడ్మాతోపాటు పలువురు మావోయిస్టులు మృతి చెందడంతో.. నవంబర్ 23వ తేదీ ఆదివారం భారత్ బంద్‌కు పార్టీ పిలుపునిచ్చింది. 2026, మార్చి నెలాఖారు నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలిస్తామని కేంద్రం ప్రకటించింది. మావోయిస్టులు లొంగిపోయి.. జన జీవన స్రవంతిలో కలిసి దేశాభివృద్ధికి పాటుపడాలని కేంద్రం పిలుపునిచ్చింది. దేశంలోని వివిధ రాష్టాల్లో మావోయిస్టులు పూర్తిగా తుడిచి పెట్టుకుపోయారు. ఛత్తీస్‌గఢ్‌లో వీరి ప్రాబల్యం



అధికంగా ఉంది. భద్రతా బలగాలతో కూంబింగ్ నిర్వహిస్తోంది. వరుస ఎన్‌కౌంటర్లతో వందలాది మంది మావోయిస్టులు మరణించారు. పలువురు మావోయిస్టులు అరెస్టయ్యారు. ఇంకొందరు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. వరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టు పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లింది. దేశంలో ఆ పార్టీ దాదాపుగా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది.

# పోలీసుల వద్ద ఉన్నారనే ఆధారాలు లేవు

### హెబియస్ కార్పస్ పిటిషన్‌పై హైకోర్టు స్పష్టీకరణ

### మావోయిస్ట్ అగ్రనేతల విడుదలపై విచారణ

**అమరావతి, నవంబర్ 21 :** మావోయిస్టు అగ్రనేతల ఆచూకీ కోసం ఏపీ హైకోర్టులో దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై శుక్రవారం మరోసారి విచారణ జరిగింది. మావోయిస్ట్ పార్టీ కీలక నేతలు దేవ్ జీ, రాజిరెడ్డి... పోలీసుల వద్ద ఉన్నారనేందుకు ప్రాథమిక ఆధారాలు లేవని.. వ్యాజ్యంలో జోక్యం చేసుకోలేమని హైకోర్టు ధర్మాసనం తేల్చిచెప్పింది. పోలీసుల వద్ద ఆ ఇద్దరు అగ్రనేతలు ఉన్నారనే దానిపై ఆధారాలు లభిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు పిటిషనర్లకు వెసులుబాటు కల్పించింది. ఆపై మావోయిస్ట్ నేతల బంధువులు వేసిన పిటిషన్‌పై విచారణను ధర్మాసనం మూసివేసింది. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు దేవ్ జీ, మల్లా రాజిరెడ్డిని కోర్టులో హాజరుపరచాలని పోలీసులను ఆదేశించాలని కోరుతూ రాజారెడ్డి కుమార్తె స్నేహలత, దేవ్ జీ సోదరుడు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు. దీనిపై గురువారం హైకోర్టులో విచారణ జరిగిన విషయం తెలిసిందే. మావోయిస్టు కీలక నేతలు తమ ఆధీనంలో ఉన్నారని పోలీసులు ప్రెస్‌స్టేట్‌మెంట్ ఇచ్చారని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలుపగా.. ఆధారాలు సమర్పించాలని కోర్టు ఆదేశించింది. దీంతో నేటి విచారణలో పోలీసుల ప్రెస్ స్టేట్‌మెంట్‌కు సంబంధించిన వీడియోను పిటిషనర్ల తరుపు న్యాయవాది కోర్టుకు సమర్పించారు. వీడియోను చూసిన ధర్మాసనం.. సెక్యూరిటీ సిబ్బంది తమ అదుపులో ఉన్నారని పోలీసులు చెప్పినట్లు గుర్తించింది. దేవ్ జీ గురించి మీడియా ప్రతినిధులు అడగ్గా.. తమ ఆధీనంలో లేరని పోలీసు ఉన్నతాధికారులు చెప్పినట్లు వీడియోలో ఉందని న్యాయస్థానం గుర్తించింది. దీంతో దేవ్ జీ, రాజిరెడ్డిలు పోలీసుల నిర్బంధంలో ఉన్నట్లు ప్రాథమిక ఆధారాలు లేవని ధర్మాసనం నిర్ధారించింది.




ఈ వ్యాజ్యంలో తాము జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టం చేస్తూ.. పిటిషన్‌ను క్లోజ్ చేసింది.

# అబద్దాల ప్రచారంలో కేటీఆర్ దిట్ట


**హైదరాబాద్, నవంబర్ 21 :** పదేళ్లు మంత్రిగా పనిచేసిన కేటీఆర్ రాష్ట్ర ప్రజలకు అసత్యాలు చెబుతున్నాని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం సిఎం రేవంత్ నేతృత్వంలో పెట్టుబడుల కోసం, ఉపాధి, ఉద్యోగాల కల్పనకు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నదని అన్నారు. అచిర కాలంలోనే తెలంగాణ అనేక విజయాలు సాధించిందని అన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా అడ్డగోలుగా జీవోలు, చెల్లింపులు చేయడం లేదని, వారి హయాంలో ఏం చేసినా దాని వెనుక ఓ మతలబు ఉండేదని ఆరోపించారు. శుక్రవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'మా కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలపై కేటీఆర్ ఆరోపణలు చేశారు. మొత్తం 9,292 ఎకరాల భూమి గురించి మాట్లాడారు. పరిశ్రమలను ప్రోత్సహించాలని ప్రభుత్వం భూములను తక్కువ ధరకు ఇస్తోంది. 2023లో భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం మూడు జీవోలు ఇచ్చింది. ఆ జీవో ప్రకారం హైదరాబాద్‌లోని భూములను ట్రాన్స్‌ఫర్‌కు అనుమతి ఇచ్చారు. ప్రభుత్వ భూమి అమ్ముకున్నట్టు కేటీఆర్ మాట్లాడుతున్నారు. ఫ్రీహోల్డ్, ల్యాండ్ లీజ్‌కు తేడా లేకుండా మాట్లాడారు. 2023లో భారత రాష్ట్ర సమితి తెచ్చిన జీవో ప్రకారమే



భూములు ఇస్తున్నాం. భూమి హక్కులు ఉన్న వారికి మేలు చేయాలని చూస్తున్నాం. గత ప్రభుత్వం హయాంలో చాలా భూములు బదిలీ చేశారు. పరిశ్రమలకు ఉపయోగపడాలని గ్రిడ్ పాలసీ తీసుకున్నారని అనుకున్నాం. పారిశ్రామిక వేత్తలను ఇబ్బంది పెట్టకూడదు. పెట్టుబడులు రావాలని రాయితీలతో కూడిన పాలసీలు తీసుకుంటాం. కొన్ని రాష్ట్రాల్లో 99 పైసలకే భూములు ఇస్తున్నారు. పెట్టుబడులు రావాలి, ఉపాధి పెంచాలి అనేది మా లక్ష్యం. ఫ్రీహోల్డ్ ల్యాండ్ ఉన్నవారు పాలసీ ద్వారా అవకాశం ఉంటే దరఖాస్తు చేసుకుంటారని అన్నారు. భారత రాష్ట్ర సమితి నేతలు అభూత కల్పనలతో రాష్ట్ర ప్రజలకు సత్యదూరమైన మాటలు చెబుతున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమి తర్వాత ఆ పార్టీ నేతలకు పగలే చుక్కలు కనిపిస్తున్నాయి. పెట్టుబడులు రాకూడదు, రాష్ట్ర అభివృద్ధి జరగకూడదు అనేది కేటీఆర్ ఆలోచన. ఆధారాలు ఉంటేనే మాట్లాడాలి. కేటీఆర్ కొంత మంది పేర్లు చెప్పారు.. వారు ప్రభుత్వంలో లేరు. ఆధారాలు ఉంటే చెప్పండి.. చర్యలు తీసుకుంటాం అని శ్రీధర్‌బాబు తెలిపారు. రాష్ట్ర ప్రగతిని అడ్డుకునేలా అబద్దాల ప్రచారం మానుకోవాలన్నారు. గతంలో లాగా అడ్డగోలు నిర్ణయాలు జరగడం లేదన్నారు. స్వలాభం అన్నదానికి వారు హయాంలో తీసుకున్న నిర్ణయాలే నిదర్శనమని శ్రీధర్ బాబు అన్నారు.

# భారీగా ఐపీఎస్‌ల బదిలీ

**హైదరాబాద్, నవంబర్ 21 :** తెలంగాణలో స్థానిక ఎన్నికలకు రంగం సిద్ధంచేస్తున్న వేళ ప్రభుత్వం భారీ ఎత్తున పోలీస్ అధికారులను బదిలీ చేసింది. పలు జిల్లాలకు కొత్త ఎస్పీలను నియమించింది. డిసెంబర్‌లో స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నోటిఫికేషన్ వస్తే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. దీంతో ముందుగానే ప్రభుత్వం ఐపిఎస్‌లను బదిలీ చేసినట్లు అర్థం అవుతోంది. ప్రస్తుతం ఉన్న వారిలో చాలామందిని బదిలీ చేసింది. ఈ క్రమంలో మొత్తం 32మంది ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అడిషనల్ డీజీగా జయేంద్రసింగ్ చౌహాన్, సీఐడీ డీజీగా పరిమళ హన నూతన్ జాకబ్, పోలీసు అకాడమి డిప్యూటీ డైరెక్టర్‌గా చేతన్ మైలబత్తుల, మహేశ్వరం జోన్ డీసీపీగా కే నారాయణ రెడ్డి, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీగా పీవీ పద్మజలు నియమితులయ్యారు. ఇక నాగర్‌కర్నూల్ ఎస్పీగా సంగ్రామ్ సింగ్, హైదరాబాద్ సౌత్ జోన్ డీసీపీగా కిరణ్ ప్రభాకర్, మహబూబాబాద్ ఎస్పీగా శబరీష్, కుమ్రంభీం ఆసిఫాబాద్ ఎస్పీగా నిఖిత, టీజీ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీగా గిరిధర్, వికారాబాద్ ఎస్పీగా స్నేహా మిశ్రా బదిలి అయ్యారు. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీగా గైక్వాడ్ వైభవ్, ములుగు ఎస్పీగా కేకన్ సుధీర్ రామ్‌నాథ్, జయశంకర్ భూపాలపల్లి ఎస్పీగా సంకీర్త్, గవర్నర్ ఏడీసీగా పాటిల్ కాంతిలాల్ సుభాష్, పెద్దపల్లి డీసీపీగా రామ్ రెడ్డి, మల్కాజ్‌గిరి డీసీపీగా సీహెచ్ శ్రీధర్, భద్రాద్రి కొత్తగూడెం అడిషనల్ ఎస్పీగా అవినాష్ కుమార్, భువనగిరి అడిషనల్ ఎస్పీగా కంకణాల రాహుల్ రెడ్డి, జగిత్యాల అడిషన్ ఎస్పీగా శేషాద్రిని రెడ్డి, ములుగు అడిషనల్ ఎస్పీగా శివం ఉపాధ్యాయ, ఆదిలాబాద్ అదనపు ఎస్పీగా మౌనిక, ఏటూరు నాగారం ఏఎస్పీగా మనన్ భట్, నిర్మల్ ఏఎస్పీగా సాయికిరణ్, వేములవాడు ఏఎస్పీగా రుత్విక్ సాయి, సత్తుపల్లి ఏసీపీగా యాదవ్ వసుంధర, టీజీ ట్రాన్స్‌కో ఎస్పీగా శ్రీనివాస్, వనపర్తి ఎస్పీగా సునీత నియామకం అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.




# పంచాయితీ రిజర్వేషన్లపై కసరత్తు

### నేడు జీవో విడుదల చేయనున్న పంచాయితీరాజ్ శాఖ

**హైదరాబాద్, నవంబర్ 21 :** పంచాయితీ ఎన్నిక లకు వడివడిగా అడు గులు పడుతున్నాయి. ఈ క్రమంలో మరో కీలక నిర్ణయం తీసుకు న్నారు. గ్రామ పంచా యతీలు, వార్డుల రిజ ర్వేషన్ల విధి విధానాలు పంచాయతీ రాజ్ శాఖ ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు శనివారం జీవో ఇవ్వనుం ది.



రిజర్వేషన్లు 50శాతం మించకుండా కొత్త రిజర్వేషన్లను సిఫార్సు చేస్తూ డెడికేటెడ్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి గురువారం నివేదిక సమర్పించింది. డెడికేటెడ్ కమిషన్ సిఫార్సులను సర్క్యులేషన్ విధానంలో రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. మంత్రుల వద్దకు ఫైలు పంపించి ఆమోదిస్తున్నట్లు సంతకాలు తీసుకున్నారు. ఈ క్రమంలో పంచాయతీలు, వార్డుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లపై విధివిధానాలు ఖరారు చేస్తూ పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేయనుంది. జీవోకు అనుగుణంగా ఎంపీడీవోలు వార్డులకు, ఆర్డీవోలు సర్పంచి పదవులకు రిజర్వేషన్లు ఖరారు చేస్తారు. రాజకీయ పార్టీల సమక్షంలో లాటరీ పద్ధతిలో మహిళలకు సీట్లు కేటాయిం చనున్నారు. శని, ఆదివారాల్లో జిల్లాల యంత్రాంగం రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయనుంది. రిజర్వేషన్లు ఖరారు చేసిన తర్వాత పంచాయతీ ఎన్నికల కు సంసిద్ధత వ్యక్తం చేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ప్రభుత్వం లేఖ రాయనుంది. ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నామని, పిటిషన్‌పై విచారణ ముగించాలని ఈనెల 24న హైకోర్టుకు ప్రభుత్వం, ఎస్ఈసీ తెలపనున్నా యి. హైకోర్టు అంగీకరిస్తే అదే రోజు లేదా మరుసటి రోజు షెడ్యూలు విడుదల చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం భావిస్తోంది. మొత్తానికి ఇటీవల కేబినేట్‌లో ఆమోదించిన మేరకు డిసెంబర్ రెండోవారంలో నోటిఫికేషన్ విడుదల కానుంది.

# మూడేళ్లలో 17 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి

మొదటి పేజీ తరువాయి



సంజీవని ప్రాజెక్టును జనవరి నుంచి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ప్రారంభించనున్నారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మేరకు వైద్యారోగ్య శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. కుప్పంలో సంజీవని ప్రాజెక్టు అమలు, యూనివర్సల్ హెల్త్ స్కీమ్‌పై చర్చించారు. తొలివిడతలో చేపట్టనున్న ఆదోని, మదనపల్లి, మార్కాపురం, పులివెందుల మెడికల్ కాలేజీల నిర్మాణంపై కూడా చర్చించారు. విద్యార్థులు, ప్రజలు, సామాజిక ప్రయోజనం కోసం వీటిని ప్రభుత్వం పీపీపీ ప్రాతిపదికన నిర్మిస్తోంది. దీంతో బోధనాసుపత్రులు వేగంగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. ఇదిలావుంటే ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా మత్స్యకార సోదరులకు, ఆక్వా రైతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. సుదీర్ఘ సముద్ర తీరం, డెల్టా ప్రాంతం, సరస్సులు, రిజర్వాయర్లు మనల్ని బ్లూ ఎకానమీలో దేశంలోనే ముందు నిలిపాయని గుర్తుచేశారు. రాష్ట్ర జీఎస్డీపీలోనూ మత్స్య రంగానిదే అగ్ర వాటా అని పేర్కొన్నారు దీనికి మరింత మద్దతిచ్చేలా మత్స్యకారులకు, ఆక్వారైతులకు ప్రోత్సాహకాలు ఇస్తున్నామని వెల్లడించారు. వేట నిషేధ సమయంలో 'మత్స్యకారుల సేవలో' పథకం కింద ఒక్కొక్కరికి రూ.20 వేలు ఆర్థిక సాయంగా ఇచ్చినట్లు తెలిపారు. గంగపుత్రులు కోరుకున్నట్టుగా 217 జీవో రద్దు చేసి సొసైటీలకే హక్కు కల్పించినట్లు వివరించారు. ఆక్వా రంగాన్ని ఆంధ్రప్రదేశ్‌కు ఆశాకిరణంలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు. మరోవైపు టిడ్కో, గృహనిర్మాణ శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. మూడేళ్లలో 17 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు స్పష్టం చేశారు. ప్రతి 3 నెలలకోసారి సామూహిక గృహప్రవేశాలు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వచ్చే ఉగాది నాటికి 5 లక్షల మంది లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అప్పగించాలన్నారు. లబ్ధిదారుల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని తేల్చిచెప్పారు. గత ప్రభుత్వ కక్షసాధింపుతో నిలిపివేసిన ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్ బిల్లులు వచ్చేలా కేంద్రంతో సంప్రదించాలని సీఎం సూచించారు.

# త్వరలోనే స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ






మొదటి పేజీ తరువాయి

విద్యార్థుల భవిష్యత్తులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. త్వరలోనే స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. జేఎన్‌టీయూ ఒక విశ్వవిద్యాలయం మాత్రమే కాదని.. ఇది దేశానికి, ముఖ్యంగా తెలంగాణకు గొప్ప ఆస్తి అని పేర్కొన్నారు. ఇంజనీర్లను తయారు చేసే శక్తివంతమైన దేశ ఇంజిన్ అని ప్రశంసించారు. విద్యార్థుల ప్రతిభ ప్రపంచానికి ఎంతో గర్వకారణమన్నారు. విద్య అనేది ఖర్చు కాదని, భవిష్యత్తును నిర్మించే పెట్టుబడని విద్యార్థులకు భట్టి విక్రమార్క సందేశం ఇచ్చారు. ఉద్యోగాలు వెతికే వారిగా కాకుండా ఉద్యోగాలు సృష్టించే వారిగా ఎదగాలని సూచించారు. మొదటి 60 ఏళ్ల కంటే, వచ్చే 60 ఏళ్లు మరింత మహోన్నతంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు.

# రాష్ట్రంలో భారీ భూకుంభకోణం

**4 లక్షల కోట్ల విలువచేసే భూమికి రెక్కలు**

**భూములపై వాలిపోతున్న రేవంత్ ముఠా**

**నన్ను అరెస్ట్ చేసే ధైర్యం రేవంత్‌కు లేదు**

**మీడియ సమావేశంలో కేటీఆర్ విమర్శలు**




**హైదరాబాద్, నవంబర్ 21 :** రాష్ట్రంలో భారీ భూకుంభకోణం జరుగుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఏకంగా నాలుగు లక్షల కోట్ల విలువచేసే భూమిని కొల్లగొట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డి ముఠా కుట్ర చేస్తున్నదని ఆయన సంచలన ఆరోపణ చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ యువతకు ఉద్యోగాలు ఇవ్వలేకపోయిందని విమర్శించారు.తెలంగాణ భవన్‌లో కేటీఆర్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో భూములు ఎక్కడున్నా రేవంత్ ముఠా అక్కడ వాలిపోతోందని అన్నారు. ఎంతో విలువైన భూములపై రేవంత్ కుటుంబసభ్యుల కన్ను పడిందని ఆరోపించారు. బాలానగర్ పరిసరాల్లో సుమారు 9300 ఎకరాల భూకుంభకోణం జరుగుతోందని చెప్పారు. బాలానగర్, కాటేదాన్, జీడిమెట్లలో రేవంత్ తన వాళ్లకు భూములిచ్చారని విమర్శించారు. మొత్తం నాలుగు లక్షల కోట్ల కుంభకోణం జరుగుతోందని ఆరోపించారు. జపాన్‌లో ఉన్నప్పుడు కూడా ఆ భూమికి సంబంధించిన ఫైల్‌పై రేవంత్ ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ప్రతి ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు రాయితీలు ఇస్తుందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం హైదరాబాద్‌లో అతిపెద్ద భూకుంభకోణానికి తెరలేపిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో 2022లో భూముల రెగ్యులేషన్ కోసం చట్టం తీసుకొచ్చామని, భూములకు వంద శాతం ఫీజులు చెల్లించేలా నిబంధన చేర్చామని కేటీఆర్ తెలిపారు. భూములు వేరేవాళ్లకు అమ్ముకుంటే రెండు వందల శాతం చెల్లించాలని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనలు పట్టించుకోకుండానే భూకేటాయింపులు చేసిందని విమర్శించారు. 30 శాతం చెల్లిస్తే రెగ్యులర్ చేస్తామని ఉత్తర్వులు ఇచ్చారని ఆరోపించారు. ఇకపోతే రేవంత్ రెడ్డి నన్ను అరెస్టు చేసే ధైర్యం చేయరు. ఈ ఫార్ములా రేస్ కేసులో ఏమీ లేదని రేవంత్ రెడ్డికి కూడా తెలుసు. ఏ తప్పూ చేయలేదు.. లై డిటెక్టర్ టెస్టుకైనా సిద్ధమే అని కేటీఆర్ పేర్కొన్నారు. కడియం శ్రీహరిని కాపాడేందుకు దానం నాగేందర్‌తో రాజీనామా చేయించే ప్రయత్నం చేస్తున్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడితే ప్రభుత్వం పరువు పోతుందని ముందుగానే ఎమ్మెల్యేలచే రాజీనామా చేయించేందుకు సిద్ధమవుతున్నారు. ముందుగా జీహెచ్ఎంసీ ఎన్నికలు వస్తాయి. ఆ తర్వాత ఉప ఎన్నికలు వస్తాయి అని కేటీఆర్ పేర్కొన్నారు.

# రైతుల ఆత్మహత్యపై స్పందించరేం!

**భూమాత వచ్చినా సమస్యలు పరిష్కరించరా**

**సీఎం రేవంత్ రెడ్డి తీరుపై హరీష్ రావు విమర్శలు**

**హైదరాబాద్, నవంబర్ 21 :** ఒక్క రైతు కూడా భూ సమస్య వల్ల ఆత్మహత్య చేసుకోకూడదు. రైతుల భూమి హక్కులు 100 శాతం కాపాడతాం అని ఎన్నికల ప్రచారంలో అదరగొట్టిన రేవంత్‌రెడ్డికి మీ పార్టీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల వద్ద, తహసిల్దార్ కార్యాలయాల వద్ద జరుగుతున్న రైతు ఆత్మహత్యాయత్నాలు కనిపించడం లేదా అని మాజీ మంత్రి హరీశ్‌రావు సూటిగా ప్రశ్నించారు. అధికారం లోకి వస్తే 3 నెలల్లో భూమి సమస్యలు పరిష్కరిస్తాం అన్న హామీ ఏమైంది రేవంత్ రెడ్డి అని నిలదీశారు. భూముల రికార్డులు సరిచేస్తాం, రైతుల హక్కులు కాపాడతాం అని చెప్పి మీరు రెండేళ్లుగా కుంటి సాకులు చెబుతూ రిజిస్ట్రేషన్లు చేయకుండా రైతుల జీవితాలతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు. రైతు భూమి మీద ఆ రైతుకే హక్కు లేకుండా చేస్తున్న దుర్మార్గ ప్రభుత్వం మీది. ఇది రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ద్రోహం. ఆపదకో, అవసరానికో ఉన్న భూములు అమ్ముకోలేక.. అధిక వడ్డీకి రుణాలు తీసుకోలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు అని హరీశ్‌రావు పేర్కొన్నారు.ప్రజా పాలన దరఖాస్తులు ఏమయ్యాయి? రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు ఏమయ్యాయని అన్నారు. ధరణి పేరు మార్చి తెచ్చిన భూ భారతి ఏమైందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 70 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే మీ ప్రభుత్వం ఏం చేస్తున్నట్లు? నెలల తరబడి రెవెన్యూ ఆఫీసులు,కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా రైతులు, ప్రజల సమస్యలు మాత్రం పరిష్కారమవడం లేదు. ఇప్పటికే మీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాల వల్ల 700 పైగా అన్నదాతలు ప్రాణాలు కోల్పోయారు. రుణమాఫీ కాక, రైతు భరోసా అందక, పంట బోనస్ ఇవ్వక పోవడంతో రైతులు ఆత్మస్థైర్యం కోల్పోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, రెవెన్యూ శాఖ మేలుకుని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, రైతు ఆత్మహత్యలు చేసుకోకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.



# స్వదేశీ వినియోగం పెరగాలి



**హైదరాబాద్, నవంబర్ 21 :** భారతదేశంలో స్వదేశీ వస్తువుల వినియోగం పెరగాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు సూచించారు. ప్రజల ఆలోచనా స్వదేశీ వస్తువులని వినియోగించేలా ఉండాలని కోరారు. భారతదేశం ఇతర దేశాల వస్తువుల మీద ఆధారపడకూడదని ఆత్మనిర్భర్ భారత్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారని గుర్తుచేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆత్మనిర్భర్ భారత్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో రామచంద్రరావు, బీజేపీ నేతలు చంద్రశేఖర్ తివారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడారు. యాంటీ ఇండియా ఐడియాలజీ ఉన్నవారికి కాంగ్రెస్ నిన్న ఇందిరా గాంధీ అవార్డులు ఇవ్వడం దుర్మార్గమని మండిపడ్డారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా మనమందరం ముందుకెళ్లాలని సూచించారు.



# రాయపూర్‌లో 3 రోజులు డీజీపీల సమావేశం

**హాజరవుతున్న ప్రధాని మోడీ, అమిత్‌షా హాజరు**

**రాయపూర్, నవంబర్ 21 :** ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో ఈ నెల 28 నుంచి 30 వరకు అన్ని రాష్ట్రాల డీజీపీల సమావేశం జరగనున్నది. ఈ సమావేశానికి ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షా హాజరుకానున్నారు. ఈ సమావేశంలో అన్ని రాష్ట్రాల డీజీపీలు, ఐజీలు, సీనియర్ అధికారులు పాల్గొంటారు. ఈ వార్షిక సమావేశంలో ప్రధానంగా ఆపరేషన్ కగార్ పురోగతి, ఉగ్రవాద దాడుల నిరోధక వ్యూహాలు ప్రధాన అజెండాగా ఉండనున్నాయని తెలిసింది. మావోయిస్టుల లొంగుబాట్లు, వరుస ఎన్‌కౌంటర్లు జరుగుతున్న నేపథ్యంలో ప్రధాని, కేంద్ర హోంమంత్రి హాజరవుతుండటంతో సమావేశానికి మరింత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే కేంద్రం, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం భారీ స్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ప్రత్యేక కమాండోలు, సీఆర్‌పీఎఫ్, ఎన్ఐఏ, ఐబీ బృందాలు రాయ్‌పూర్ చేరుకుని వ్యూహాత్మక భద్రతా ప్రణాళికను అమలు చేస్తున్నాయి. ఈ సమావేశానికి తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ డీజీ విజయ్‌కుమార్, ఎస్ఐబీ చీఫ్ సుమతి తదితరులు హాజరుకానున్నారు. శాటిలైట్ నిఘా, డ్రోన్ పెట్రోలింగ్, గ్రౌండ్ ఆపరేషన్స్ ను మరింత సమర్థవంతంగా మార్చడంపై కీలక నిర్ణయాలు తీసుకుంటారని అధికారవర్గాలు చెప్తున్నాయి. ఇటీవలి వరుస ఎన్‌కౌంటర్లు, హిడ్మా తదితరుల హతం తరవాత దీనికి ప్రత్యేకత ఏర్పడింది.

# నిఖత్ జరీన్‌కు స్వర్ణం

**సీఎం రేవంత్, డీజీపీ అభినందనలు**




**హైదరాబాద్, నవంబర్ 21 :** భారత బాక్సింగ్ స్టార్, తెలంగాణ అమ్మాయి నిఖత్ జరీన్ తాజాగా మరో స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. వరల్డ్ బాక్సింగ్ కప్ లో భాగంగా 51 కిలోల విభాగంలో స్వర్ణ పతకం కైవసం చేసుకుంది. నవంబర్ 20న జరిగిన ఫైనల్ మ్యాచ్ లో చైనీస్ తైపీకి చెందిన జువాన్ యి గోవోపైన విజయం సాధించింది. ఆమెపై ఏకంగా 5-0 తేడాతో విజయం సాధించిన నిఖత్ జరీన్ స్వర్ణ పతకం అందుకుంది. దీంతో తెలంగాణ అమ్మాయి నిఖత్ జరీన్ పై ప్రశంసల వర్షం కురుస్తోంది. నిఖత్ జరీన్ సాధించిన ఈ పతకంతో ప్రస్తుత బాక్సింగ్ కప్ లో మహిళలు సాధించిన పథకాల సంఖ్య ఐదుకు చేరుకోవడం జరిగింది. నిఖత్ జరీన్ అద్భుతమైన ప్రతిభ కనబరిచి ప్రపంచ వేదికపై తెలంగాణ కీర్తిని చాటి చెప్పారని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఈ విజయం యువ క్రికెటర్లకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని కూడా చెప్పారు. ఫ్యూచర్ లో నిఖత్ జరీన్ మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలకు చేరాలని కోరారు. ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్‌లో నిఖత్ జరీన్ గోల్డ్ మెడల్ సాధించడంపై డీజీపీ శివధర్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. ఉత్తర ప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో నిర్వహించిన ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్‌లో నిఖత్ జరీన్ గోల్డ్ మెడల్ సాధించారని తెలిపారు. ఆమె తెలంగాణ స్పెషల్ పోలీస్‌లో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ గా పనిచేస్తున్నారని గుర్తు చేశారు. బంగారు పతాకం సాధించినందున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయం నిఖత్ జరీన్ సామర్థ్యం, కృషి, అంకితభావానికి నిదర్శనం అన్నారు. ఇక నిఖత్ గోల్డ్ మెడల్ సాధించి తెలంగాణ పోలీస్ శాఖకు గర్వకారణంగా నిలిచిందని తెలిపారు. క్రీడల్లో అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పిన నిఖత్ విజయం ఇతర క్రీడాకారులకు ఆదర్శం అంటూ వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్ర కుటుంబం తరఫున నిఖత్ జరీన్ భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి శిఖరాలు అందుకోవాలని పేర్కొన్నారు.

# ఇంకా టైం కావాలి

**స్పీకర్‌ను కలిసి లేఖ అందజేసిన కడియం శ్రీహరి**



**హైదరాబాద్, నవంబర్ 21 :** ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిశారు. ఈ నెల 23 లోపు పార్టీ ఫిరాయింపు ఆరోపణలపై వివరణ ఇవ్వాలని స్పీకర్ నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో ఆయన కలిశారు. పార్టీ ఫిరాయింపు ఫిర్యాదులకు సమాధానాలు ఇవ్వాల్సిందిగా ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ మరోసారి నోటీసులు జారీ చేశారు. ఈ నెల 23వ తేదీలోగా సమాధానాలను అఫిడవిట్ రూపంలో స్పీకర్ కార్యాలయంలో అందజేయాలని వాటిలో సూచించారు. గత ఆగస్టులో ఫిర్యాదులొచ్చిన 10 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు జారీ చేశారు. వారిలో దానం, కడియం మినహా మిగిలిన ఎనిమిది మంది తమ సమాధానాలను అఫిడవిట్ రూపంలో అసెంబ్లీ కార్యదర్శికి దాఖలు చేశారు.ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తక్షణమే వివరణ ఇవ్వాలని కోరుతూ స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ గురువారం మరోసారి నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఎమ్మెల్యే కడియం శ్రీహరి కలిశారు. ఈ నెల 23వ తేదీ లోపు ఫిరాయింపు ఆరోపణలపై వివరణ ఇవ్వాలని నోటీసుల్లో స్పీకర్ పేర్కొన్నారు. దీంతో వివరణ ఇచ్చేందుకు మరింత సమయం కావాలని స్పీకర్‌ను కడియం శ్రీహరి కోరారు. ఢిల్లీ నుండి రాగానే స్పీకర్‌ను దానం నాగేందర్ కలవనున్నారు. దానం నాగేందర్ మరింత సమయం కోరుతాడా లేదా రాజీనామా చేస్తాడా అనే అంశంపై సందిగ్ధత నెలకొంది.




## మిస్ యూనివర్స్‌గా మెక్సికో భామ

# ఫాతిమా బాష్

**పోటీల్లో పాల్గొన్న 121 దేశాల సుందరీమణులు**

**భారత్ భామ మణిక విశ్వకర్మకు నిరాశ**

**థాయ్‌లాండ్, నవంబర్21:** ఈ ఏడాది విశ్వ సుందరి కిరీటం మెక్సికో భామను వరించింది. థాయ్‌లాండ్ వేదికగా జరిగిన మిస్ యూనివర్స్-2025 పోటీల్లో మిస్ మెక్సికో ఫాతిమా బాష్ విజేతగా నిలిచింది. గతేడాది మిస్ యూనివర్స్‌గా నిలిచిన డెన్మార్క్ భామ విక్టోరియా కెజార్ హెల్విగ్.. ఫాతిమాకు అందాల కిరీటాన్ని అందజేశారు. అందాల పోటీల్లో పాల్గొన్న తొలి ప్రయత్నంలోనే ఫాతిమా విశ్వసుందరిగా నిలిచి అందర్నీ ఆశ్చర్యపర్చారు. ప్రపంచ దేశాల నుంచి దాదాపు 120 మందికి పైగా ఈ పోటీల్లో పాల్గొనగా.. వారందరినీ వెనక్కినెట్టి ఈ 25 ఏళ్ల భామ అందాల కిరీటాన్ని దక్కించుకుంది. ఇక తొలి రన్నరప్‌గా థాయ్‌లాండ్‌కు చెందిన ప్రవీనర్ సింగ్, రెండో రన్నరప్‌గా వెనెజువెలాకు చెందిన స్టిఫానీ అబాసలీ నిలిచారు. మెక్సికోలోని శాంటియాగో డి తెపా ప్రాంతానికి చెందిన ఫాతిమా.. ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు చేశారు. స్కూల్‌లో చదువుతున్నప్పుడు డిస్లెక్సియా, హైపర్‌యాక్టివిటీ డిజార్డర్‌తో బాధ పడినట్లు ఫాతిమా గతంలో తెలిపారు. వాటిని దాటుకొని అందాల పోటీలకు ప్రాతినిధ్యం వహించడం గర్వంగా ఉందన్నారు. ఈ ఏడాది సెప్టెంబరులో జరిగిన మిస్ యూనివర్స్ మెక్సికో 2025 పోటీల్లో విజేతగా నిలిచారు. ఈ పోటీల్లో భారత్ నుంచి మణికా విశ్వకర్మ ప్రాతినిధ్యం వహించినప్పటికీ.. ఆమె కిరీటం దక్కించుకోలేకపోయారు. రాజస్థాన్‌కు చెందిన మణిక.. స్విమ్‌సూట్ రౌండ్‌తో టాప్ 30 వరకు చేరుకుంది. టాప్ 12లో నిలవలేకపోవడంతో ఈ ఏడాది భారత్‌కు అందాల కిరీటం చేజారింది. ఇక, మిస్ యూనివర్స్ పోటీల్లో మన బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్.. న్యాయనిర్ణేతల్లో ఒకరిగా ఉండటం విశేషం.

## స్పోర్ట్స్ విజేతలకు సీఎం అభినందనలు



**హైదరాబాద్, నవంబర్ 21 :** 4వ ఇఎంఆర్ఎస్ నేషనల్ స్పోర్ట్స్ మీట్-2025లో ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను సాధించిన తెలంగాణ విద్యార్థులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈఎంఆర్ఎస్ నేషనల్ స్పోర్ట్స్ మీట్-2025లో రికార్డ్-బ్రేకింగ్ మెడల్స్ సాధించిన తెలంగాణ అథ్లెటిక్స్, ఆర్చరీ, స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్, బాక్సింగ్, జూడో, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, టైక్వాండో, యోగా, షూటింగ్, చెస్ ఇతర ఈవెంట్లలో అన్ని రాష్ట్రాలకంటే అత్యధికంగా 230 పతకాలను తెలంగాణ సాధించింది. నవంబర్ 15న ఒడిశాలో జరిగిన ఈ పోటీల్లో తెలంగాణలోని 23 సంస్థలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.. దేశవ్యాప్తంగా ఈ జాతీయ క్రీడా పోటీల్లో 22 రాష్ట్రాల్లోని 499 సంస్థలకు చెందిన 5,500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొత్తం 22 ఈవెంట్లలో పోటీలు నిర్వహించగా ఇందులో వ్యక్తిగత ఈవెంట్లు - 15, జట్టు ఈవెంట్లు 07, తెలంగాణ తరపున ఈ జాతీయ ఈవెంట్‌లో 23 పాఠశాలలకు చెందిన 580 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వ్యక్తిగత, జట్టు ఈవెంట్లలో అత్యుత్తమ ప్రదర్శనను తెలంగాణ విద్యార్థులు ప్రదర్శించారు.మొత్తం 714 పాయింట్లతో అద్భుతమైన ఛాంపియన్‌షిప్‌ను తెలంగాణ కైవసం చేసుకున్నది .

# హైదరాబాద్‌లో మరో జాతీయ సదస్సు

**డిసెంబర్‌లో చారిత్రక నాణెల సదస్సు ■ మంత్రి జూపల్లి**

**హైదరాబాద్, నవంబర్ 21 :** హైదరాబాద్ మరో జాతీయ సదస్సుకు వేదిక కాబోతున్నది. తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా జాతీయ స్థాయిలో చారిత్రక నాణెల సదస్సు నిర్వహణకు రంగం సిద్ధమైంది. రాష్ట్ర వారసత్వ శాఖ ఆధ్వర్యంలో డిసెంబర్ 11, 12 తేదీల్లో 107వ వార్షిక జాతీయ నాణెల సదస్సు, సెమినార్‌ను నిర్వహించనున్నారు. ఈ సదస్సు బ్రోచర్‌ను శుక్రవారం సచివాలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు లాంఛనంగా ఆవిష్కరించారు. న్యూమిస్మాటిక్ సొసైటీ ఆఫ్ ఇండియా సహకారంతో తెలంగాణ వారసత్వ శాఖ సంయుక్తంగా ఈ ప్రతిష్ఠాత్మక సదస్సును నిర్వహిస్తోంది. రాష్ట్ర ఆవిర్భావం తరువాత నాణెల అధ్యయనంపై ఇంతటి ముఖ్యమైన జాతీయ స్థాయి కార్యక్రమం హైదరాబాద్‌లో జరగడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. నాణెల చరిత్ర ద్వారా తెలంగాణ రాష్ట్ర గొప్ప చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని దేశానికి చాటి చెప్పేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్‌లోని ఎంసిఆర్ హెచ్ఆర్డి ఇన్‌స్టిట్యూట్‌లో డిసెంబర్ 11, 12న ఈ సదస్సు జరగనుంది. భారతదేశ నలుమూలల నుంచి విద్యార్థులు, స్కాలర్స్, పరిశోధకులు (రీసర్చర్స్), న్యూమిస్‌మటిక్స్ నిపుణులు పాల్గొనే ఈ సదస్సు, నాణెల చారిత్రక, సాంస్కృతిక, కళాత్మక ప్రాముఖ్యతపై చర్చించేందుకు ఒక వేదికగా ఉపయోగపడనుందని భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, వారసత్వ శాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్ రావు కుతాడి, డిప్యూటీ డైరెక్టర్లు డా. డి. రాములు, డా. పి. నాగరాజు పాల్గొన్నారు.



# అంతరిక్ష ప్రయాణమే సులువు


- బెంగళూరు రోడ్లు, ట్రాఫిక్‌పై శుభాంశు శుక్లా వ్యాఖ్యలు
- వైరల్‌లగా మారి నెట్టింటో పెద్ద ఎత్తు చర్చ



**బెంగళూరు, నవంబర్ 21 :** బెంగళూరులో రోడ్ల దుస్థితి, ట్రాఫిక్ సమస్యలపై విమర్శల వర్షం కొనసాగుతూనే ఉన్న. బయోకాన్ ఛైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా, ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో మోహన్‌దాస్ వంటి ప్రముఖులు కూడా ఈ సమస్యలను లేవనెత్తారు. ఇక ఆన్‌లైన్ ట్రక్కింగ్ స్టార్టప్ బ్లాక్‌బక్ సీఈవో రాజేశ్ యాబాజీ ఏకంగా తమ ఆఫీస్‌ను బెంగళూరు నుంచి మార్చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ జాబితాలో వ్యోమగామి శుభాన్షు శుక్లా కూడా చేరారు. అంతరిక్షంలో ప్రయాణించడమే తేలిక..అంటూ బెంగళూరు ట్రాఫిక్‌పై వ్యోమగామి శుభాన్షు శుక్లా కామెంట్ చేశారు. అంతరిక్షయానంపై తాను చేసే ప్రసంగ సమయంతో పోలిస్తే బెంగళూరు రహదారులపై ప్రయాణం మూడు రెట్లు అధికమని వ్యోమగామి శుభాన్షు శుక్లా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారయి. గురువారం బెంగళూరు టెక్నాలజీ సమ్మిట్ లో 'ఫ్యూచర్ మేకర్స్ కాంక్లేవ్'కు హాజరయ్యే క్రమంలో మారతహళ్లి నుంచి మూడు గంటలపాటు ప్రయాణం చేయాల్సి వచ్చిందని శుక్లా పేర్కొన్నారు. ఇందులో మూడో వంతు సమయంలోనే తాను ప్రసంగాన్ని పూర్తి చేశానన్నారు. గత జూన్‌లో 'యాగ్జియం మిషన్' ద్వారా చేపట్టిన అంతరిక్ష ప్రయాణంపై ఆయన మాట్లాడుతూ అంతరిక్షంలో అడుగుపెట్టాక మన గుండెపై మోటారు వాహనం ప్రయాణించినట్లు ఉంటుందన్నారు. అక్కడి పరిస్థితులకు అలవాటు పడేందుకు కనీసం వారం రోజులు పడుతుందని వివరించారు. భూమికి వచ్చాక రెండు వారాలపాటు మన శరీరం అదుపు తప్పే ఉంటుందని తన అనుభవాన్ని వివరించారు. ఈ ప్రయాణం భారతీయ అంతరిక్ష విజయానికి ప్రతీక అని తెలిశాక గర్వంగా ఉందన్నారు. మనకు, మన అంతరిక్ష ప్రగతికి హద్దుల్లేవని ప్రకటించారు. అంతరిక్షం నుంచి భారతదేశం ఎలా కనపడుతుందో శుభాన్షు వీడియో రూపంలో చూపారు. ఈ సందర్భంగా ఆయన బెంగళూరు రోడ్లు, ట్రాఫిక్ సమస్యపైనా చేసిన కామెంట్స్ వైరల్‌గా మారాయి. దేశ ఐటీ రాజధానిలో జరిగిన బెంగళూరు టెక్నాలజీ సమ్మిట్ లో 'ఫ్యూచర్ మేకర్స్ కాంక్లేవ్'కు శుభాన్షు శుక్లా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు తాను మారతహళ్లి నుంచి ఎగ్జిబిషన్ సెంటర్‌కు మూడు గంటలు ప్రయాణం చేయాల్సి వచ్చిం. ఇందులో మూడో వంతు సమయంలో నే తాను ప్రసంగాన్ని పూర్తి చేశానంటూ వ్యాఖ్యానించారు. మారతహళ్లి నుంచి బీఈఎస్ వేదిక అయిన బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్‌కు మధ్య 34 కిలోమీటర్ల దూరం ఉంటుంది. సాధారణంగా ఒక గంటలో ప్రయాణించవచ్చు.


## దుబాయ్ ఎయిర్ షోలో ప్రమాదం

**ప్రదర్శన సమయంలో కుప్పకూలిన తేజస్ యుద్ధ విమానం**



**న్యూఢిల్లీ, నవంబర్ 21 :** దుబాయ్‌లో జరుగుతున్న ఎయిర్ షోలో ప్రమాదం చోటు చేసుకుంది. భారత్‌కు చెందిన తేజస్ యుద్ధ విమానం కూలిపోయింది. ఎయిర్ షోలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం సమయంలో ప్రదర్శన జరుగుతుండగా.. విమానం ఒక్కసారిగా కూలిపోయింది. ఆ వెంటనే పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. ఈ ఘటనతో అక్కడ ఒక్కసారిగా భయాందోళనకర వాతావరణం నెలకొంది. పైలట్ ప్రమాదం నుంచి బయటపడ్డాడా? లేదా? అన్నది స్పష్టంగా తెలియలేదు. కానీ, ప్రమాద తీవ్రతను చూస్తుంటే పైలట్ బతికే ఛాన్స్ లేదనే తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ కూడా ఇంకా ఎలాంటి ప్రకటనా చేయలేదు. కాగా, పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఈ యుద్ధ విమానాన్ని బెంగళూరులోని హిందూస్తాన్ ఎరోనాటికల్ లిమిటెడ్ తయారు చేసింది.

## బంగ్లాదేశ్‌లో భూ ప్రకంపనలు



**కోల్‌కతా పరిసరాల్లోనూ ప్రభావం**

**ఢాకా, నవంబర్ 21:** పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో భారీ భూప్రకంపనలు సంభవించాయి. రిక్టర్ స్కేలుపై భూప్రకంపనల తీవ్రత 5.2 మాగ్నిట్యూడ్‌గా నమోదు అయింది. శుక్రవారం ఉదయం 10 గంటల 8 నిమిషాల ప్రాంతంలో ఘోరాశల్ దగ్గర భూప్రకంపనలు సంభవించాయి. యునైటెడ స్టేట్స్ జియోలాజికల్ సర్వే ప్రకారం.. నార్సింగ్దికి 14 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉంది. ఇక, బంగ్లాదేశ్‌లో భూకంపం రావటంతో కోల్‌కతాతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో భూమి స్వల్పంగా కంపించింది. ఇళ్లలోని ఫ్యాన్లతో పాటు ఇతర వస్తువులు అటు, ఇటు ఊగాయి. దీంతో జనం భయపడిపోయారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. పెద్ద సంఖ్యలో జనం వీధుల్లోకి వచ్చి చేరారు. అయితే, భూ ప్రకంపనల కారణంగా ఎవరైనా చనిపోయారా? లేక గాయాలు అయ్యాయా? అన్న దానిపై ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. భూ ప్రకంపనలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియ రావాల్సి ఉంది. బంగ్లాదేశ్‌లో భూ ప్రకంపనలకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఓ వీడియోలో ఢాకాలోని బద్దా లింక్ రోడ్ ఏరియాలోని ప్రజలు పెద్ద సంఖ్యలో వీధిలోకి వచ్చి నిలబడ్డారు. పక్కన ఉన్న అపార్ట్‌మెంట్స్ స్వల్పంగా కంపిస్తూ ఉన్నాయి. జనం భయంభయంగా అటు, ఇటు చూస్తూ ఉన్నారు. కొంతమంది వాటిని వీడియో తీస్తూ ఉన్నారు.




## అల్ ఫలా యూనివర్శిటీ కార్యకలాపాలపై నిఘా

**ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ ఏర్పాటు చేస్తూ ఆదేశం**

**న్యూఢిల్లీ, నవంబర్ 21 :** అల్ ఫలా యూనివర్శిటీ కార్యకలాపాలపై నిఘా కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్)ను ఏర్పాటు చేసినట్లు ఫరీదాబాద్ పోలీసులు శుక్రవారం తెలిపారు. ఇద్దరు అసిస్టెంట్ కమిషనర్స్ ఆఫ్ పోలీస్, ఇన్‌స్పెక్టర్ మరియు ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లతో కూడిన సిట్‌యూనివర్శిటీ కార్యకలాపాలపై సమగ్ర నివేదికను రూపొందిస్తోందని అన్నారు. ఫరీదాబాద్‌లోని అల్ ఫలా యూనివర్శిటీ వ్యవహారాలను దర్యాప్తు చేయడానికి సిట్‌ను ఏర్పాటు చేశామని, అన్ని అంశాలను పరిశీలిస్తున్నామని ఫరీదాబాద్ పోలీస్ ప్రతినిధి తెలిపారు. ఈ కేసుకు సంబంధించి యూనివర్శిటీకి చెందిన పలువురు వైద్యులను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.ర్యాప్తు సంస్థలు క్యాబ్ డ్రైవర్, మతాధికారి, ఉర్దూ ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. క్యాబ్ డ్రైవర్ ధౌజ్ గ్రామానికి చెందినవారు కాగా, మిగిలిన ఇద్దరు నుహ్ జిల్లాకు చెందిన వారని పేర్కొన్నాయి. సోహ్నా సమీపంలోని రాయ్‌పూర్ గ్రామంలోని షాహిజామా మసీదు నుండి వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి.

## శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్రపతి

**తిరుమల, నవంబర్ 21 :** రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. గురువారం రాత్రి తిరుమలకు చేరుకున్న రాష్ట్రపతి శుక్రవారం ఉదయమే దర్శనం చేసుకున్నా ఆలయ మహాద్వారం వద్ద ఆమెకు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈ ఓవో అనిల్ కుమార్ సింఘాల్, అర్చకులు ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. దర్శనానంతరం అర్చకులు ఆమెకు వేదాశీర్వచనాలిచ్చి తీర్థప్రసాదా లను అందజేశారు. రాష్ట్రపతికి స్వామివారి చిత్రపటాన్ని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు అందించారు. అనంతరం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆలయం నుంచి పద్మావతి అతిథి గృహానికి బయలుదేరారు. దారి మధ్యలో రాంభగీచ వసతిగృహం వద్ద వాహనం దిగి అక్కడి భక్తులతో మాట్లాడారు. వారికి చాక్లెట్లు కూడా పంచారు. రాష్ట్రపతి రాకతో తిరుమలలో భారీగా భద్రత కల్పించారు.

# హమాస్ తరహాలో దాడులు.. ఆయుధాల సమీకరణ

- ఆయుధాగారాలుగా ఆస్పత్రుల ఎంపిక
- ఎన్ఐఏ దర్యాప్తులో కుట్రలు వెల్లడి



**న్యూఢిల్లీ, నవంబర్ 21 :** ఢిల్లీ పేలుడు ఘటనపై అధికారు లు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తులో భాగంగా అరెస్టయిన టెర్రర్ వైద్యులను విచారిస్తున్నారు. ఈ విచారణలో వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ కుట్రలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఇజ్రాయెల్‌పై 2023 అక్టోబర్ 7న హమాస్ ఉగ్రవాదులు జరిపిన దాడి తరహాలో ఢిల్లీలోని రద్దీ ప్రదేశాల్లో దాడులకు కుట్ర పన్ని నట్లు తేలిన విషయం తెలిసిందే. తాజాగా మరో విషయం వెలుగులోకి వచ్చింది. హమాస్ తరహాలోనే ఆయుధాలను దాచేందుకు ఈ వైట్ కాలర్ ఉగ్ర ముఠా ఆసుపత్రులను ఎంచుకున్నట్లు తేలింది. ఇజ్రాయెల్‌తో యుద్ధం సమయంలో గాజాలోని పలు ఆసుపత్రుల కింద హమాస్ స్థావరాలు బయటపడిన సంగతి తెలిసిందే. పెద్ద ఎత్తున పేలుడు పదర్థాలు, ఆయుధాలను ఆసుపత్రుల కింద డంప్ చేసినట్లుగా ఐడీఎఫ్ గుర్తించింది. అదే తరహాలో జమ్ము ఆసుపత్రుల కింద ఆయుధ డంప్‌ను ఏర్పాటు చేసేందుకు వైట్ కాలర్ టెర్రర్ కుట్ర పన్నినట్లు అధికారులు గుర్తించారు. ఢిల్లీ పేలుడు, ఫరీదాబాద్ ఉగ్ర మాడ్యూల్‌తో సంబంధం ఉన్న వైద్యులు మొహమ్మద్ షకీల్, అదిల్ అహ్మద్ రాథర్, షాహీన్ సయీద్‌ను దర్యాప్తు అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్న విషయం తెలిసిందే. వీరిలో షకీల్, షాహీన్ ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. ఇక అహ్మద్ రాథర్ మాత్రం జమ్ము కశ్మీర్ అనంత్‌నాగ్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఉద్యోగి. అతడిని విచారించగా ఈ ఆయుధ డంప్ కుట్ర విషయం బయటపడింది. విదేశాల నుంచి ఇంపోర్ట్ చేసుకున్న ఆయుధాలను దాచేందుకు అనంత్‌నాగ్, శ్రీనగర్, బారాముల్లా, బుద్గాం, నౌగమ్‌లోని ఆసుపత్రులను ఈ ఉగ్ర మాడ్యూల్ పరిశీలించినట్లు దర్యాప్తులో తేలినట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. మరోవైపు ఈ కేసు దర్యాప్తులో హమాస్ తరహాలో డ్రోన్లతో దాడులకు కుట్ర పన్నినట్లు వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఎర్ర కోట వద్ద ఈ నెల 10న ఆత్మాహుతి దాడికి ముందు ఈ ఉగ్ర ముఠా భారీ ఆయుధాలతో కూడిన డ్రోన్లతో రద్దీ ప్రదేశాల్లో దాడులు చేయాలని ప్రణాళిక రచించింది. ఇజ్రాయెల్‌పై 2023 అక్టోబర్ 7న హమాస్ ఉగ్రవాదులు జరిపిన దాడి తరహాలో దాడులకు పాల్పడాలని వీరు ప్రయత్నించారు. సూసైడ్ బాంబర్, డాక్టర్ ఉమర్ ఉన్ నబీతో కలిసి పని చేసిన జసిర్ బిలాల్ వానీ వురపు డానిష్ ఈ భయానక వివరాలను వెల్లడించాడు. ఇతనిని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) బృందం శ్రీనగర్‌లో అరెస్ట్ చేసింది. కారు బాంబు పేలుడుకు ముందే, డ్రోన్లకు భారీ ఆయుధాలను అమర్చి, రాకెట్లను తయారు చేసి, రద్దీ ప్రదేశాల్లో దాడులకు పాల్పడేందుకు సాంకేతిక సహకారాన్ని డానిష్ అందించాడని ఎన్ఐఏ ఓ ప్రకటనలో తెలిపింది. సూసైడ్ బాంబర్ ఉమర్‌తో సహ కుట్రదారుగా డానిష్ పని చేసినట్లు తెలిపింది. మీడియా కథనాల ప్రకారం, పెద్ద బ్యాటరీలతో అత్యంత శక్తిమంతమైన బాంబులను తీసుకెళ్లగలిగే డ్రోన్లను తయారు చేయడానికి డానిష్ ప్రయత్నించాడు. ఆయుధాలతో కూడిన డ్రోన్లను తయారు చేయడంలో అతనికి అనుభవం ఉంది. రద్దీ ప్రదేశాల్లో డ్రోన్ల దాడి చేయాలని నిందితులు ప్రయత్నించారు.

## మరుగుదొడ్ల వినియోగంపై
# గ్రామీణ ప్రజలను చైతన్యపర్చండి



### జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ చే గోడపత్రిక అవిష్కరణ

**అనకాపల్లి (మనసు లో మాట) నవంబర్ 21 :** గృహ మరియు సామూహిక మరుగుదొడ్ల వినియోగంపై గ్రామీణ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, జిల్లా గ్రామీణ మంచి నీటి సరఫరా శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని తన చాంబర్లో అంతర్జాతీయ మరుగుదొడ్ల దినోత్సవ గోడపత్రిక ను కలెక్టర్ విజయ కృష్ణన్ ఆవిష్కరించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు అంతర్జాతీయ దినోత్సవం కార్యక్రమాన్ని జిల్లాలో అన్ని గ్రామలలో నవంబర్ 19 నుండి డిసెంబర్ 10 తేదీ వరకు నిర్వహించాలన్నారు. గ్రామాలలో మరమత్తులకు గురైన వ్యక్తిగత గృహ మరియు కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల (సి ఎస్ సి ) ల మరుగుదొడ్లు గూర్తించి వాటిని సత్వరమే వాడుకలోకి తీసుకురావాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు ప్రతి సంవత్సరం నవంబర్ 19న అంతర్జాతీయ మరుగుదొడ్ల దినోత్సవం జరుపుకుంటారని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ కార్యనిర్వాహక ఇంజనీర్ జె అనిల్ కుమార్, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ సావిత్రి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## చిన్నారి గుండెకు ప్రాణం పోసిన
# స్పీకర్ అయ్యన్నపాత్రుడు



**నర్సీపట్నం ,నవంబర్ 21 (మనసులో మాట)..** గొలుగొండ మండలం చీడిగుమ్మల గ్రామానికి చెందిన షేక్ వహీదా బేగం(11) గుండె సమస్యతో బాధపడుతోంది. ఆమె గుండెలో రంధ్రం ఉండటం వలన ఆపరేషన్కు విశాఖపట్నం ఆసుపత్రిలో సుమారు రూ.5లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. నిరుపేదలైన ఆ కుటుంబానికి అంత స్తోమత లేకపోవడంతో, స్థానిక నాయకులు కామిరెడ్డి గోవిందు, షేక్ అజీన్ ఈ విషయాన్ని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకెళ్లారు. కామిరెడ్డి గోవిందు, షేక్ అజీన్ ద్వారా ఈ విషయం స్పీకర్ సతీమణి, కౌన్సిలర్ పద్మావతి దృష్టికి చేరింది. ఆమె వెంటనే ఈ విషయాన్ని స్పీకర్ కు తెలియజేయడంతో వెంటనే స్పందించారు. చిన్నారి వహీదాను తక్షణమే చికిత్స నిమిత్తం తిరుపతిలోని పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంకు పంపించారు. అక్కడి డాక్టర్లతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్వయంగా ఫోన్లో మాట్లాడి, పాపకు ప్రత్యేక శ్రద్ధ స్పెషల్ కేర్) తీసుకొని ఉచితంగా ఆపరేషన్ చేయించేలా చూశారు. ఆపరేషన్ విజయవంతం కావడంతో, తగిన మందులతో వహీదాను క్షేమంగా ఇంటికి పంపించారు. చిన్నారి ఆపరేషన్ విజయవంతమైన సందర్భంగా, శుక్రవారం కామిరెడ్డి గోవిందు ఇతర గ్రామ నాయకులతో కలిసి షేక్ వహీదాను, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కామిరెడ్డి గోవిందు మాట్లాడుతూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తమ దృష్టికి విషయం వచ్చిన వెంటనే స్పందించి, ప్రత్యేక శ్రద్ధతో ఉచితంగా ఆపరేషన్ చేయించినందుకు పద్మావతికి, అయ్యన్నపాత్రుడుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇంత పెద్ద సాయం చేసి, మా బిడ్డకు ప్రాణం పోసి, క్షేమంగా ఇంటికి తీసుకువచ్చినందుకు స్పీకర్ కుటుంబానికి ఎల్లవేళలా రుణపడి ఉంటామని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## సమస్యలపై జిల్లా కలెక్టర్ కు
# వినతి

### గసబ మాజీ సర్పంచ్ పాంగి సురేష్ కుమార్




**దుంబ్రిగుడ, నవంబర్ 21,(మనసులో మాట):** గసభ పంచాయతీ పరిధి గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ కు వినతిపత్రం అందజేసినట్లు గసభ పంచాయతీ మాజీ సర్పంచ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామంలో ఇంటర్నల్ సీసీ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలనీ కోరారు. అలాగే గరిడేలు గ్రామంలో అడవి తల్లి బాట రోడ్డు నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయిందని వెంటనే పూర్తి చేయాలన్నారు.నాడు నేడు పథకం క్రింద మంజూరైన గొందివలస, చిమిలిగూడ, జంగిడివలస, మొర్రిగూడ పాఠశాల భవనం వెంటనే నిర్మాణం చేయాలనీ, పాఠశాల భవనం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారనీ చెప్పారు. పాడేరు జిల్లా విద్యా శాఖా కార్యాలయంలో ఉన్న మొర్రిగూడ టీచర్ సాగర విశ్వనాధంను వెంటనే మొర్రిగూడ పాఠశాలలో పంపించాలని, ఉపాధ్యాయులు కొరత ఉండటంతో విధ్యాభోధన కష్టంగా మారిందనీ , వెంటనే ఉపాధ్యాయుని నియమించాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ పి సత్యనారాయణ, సిపిఎం నాయకులు పద్దు, బాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే
# కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత

### రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రాక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ



**అనకాపల్లి, నవంబర్ 21 (మనసు లో మాట):** అనకాపల్లి పట్టణం లోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ సెల్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిధిలు రాష్ట్ర అర్భన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డవలెప్మంట్ కార్పొరేషన్ ఛైర్మన్, మాజి ఎమ్మెల్యే, నియోజకవర్గ టిడిపి ఇంచార్జి పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర లు టీడీపీ శ్రేణులు, ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా పాస్ పుస్తకాల కోసం అనకాపల్లి మండలానికి చెందిన రైతులు వారికి పిర్యాదు చేయగా తహశీల్దార్ తో మాట్లాడి వెంటనే పాస్ పుస్తకాలను మంజూరు చేయాలనీ కోరారు. అనంతరం ఏనుగు తుని గ్రామంలో వీధి లైట్లు ఏర్పాటు చేయాలనీ, కొంతమంది కి స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వాలని వారికీ వినతిపత్రం అందజేశారు. అంతేకాకుండా అనకాపల్లి, కశింకోట మండలంలోని కొన్ని గ్రామాలలో విద్యుత్ సమస్యలపై మరియు వీధి లైట్లు వెయ్యాలని గ్రామ టీడీపీ నాయకులు వారి దృష్టికి తీసుకువచ్చారు. టీడీపీ శ్రేణులు 2014-2019 మధ్య చేసిన పనులకు బిల్లులు ఇవ్వాలని వారికీ వినతిపత్రం అందజేశారు.పెండింగ్ బిల్లుల కోసం ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా అర్హులైన పేద లబ్దిదారులందరికి పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరు చేస్తామన్నారు. అంతేకాకుండా ఏపిటిఐడిసిఒ గృహాలను అర్హులైన ప్రభుత్వాని కి డిడి కట్టిన లబ్దిదారులకు కేటాయిస్తామని అన్నారు.అంతేకాకుండా విదేశీ విద్య కోసం ఆర్థిక సహాయం చేయాలనీ కోరగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని అన్నారు. 2014-19 తెలుగు దేశం ప్రభుత్వం లో మంజూరు అయి గత ప్రభుత్వం లో రద్దు చేయబడిన అర్హులైన వారి పించన్లను మళ్ళీ పునరుద్ధిస్తామని అన్నారు. అంతేకాకుండా రేషన్ కార్డులు,ఇండ్ల స్థలాలు, పింఛన్లు, సిసి రోడ్లు, కాలువల కోసం వినతులు అందజేయగా మాజీ మంత్రి,శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ , పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దివ్యంగుల వారి సమస్యల కోసం వినతి పత్రాన్ని అందజేయగా, సమస్యల పరిస్కారం కోసం హామీ ఇచ్చారు. అంతేకాకుండా గ్రామాలలో వీధి లైట్లు కోసం విజ్ఞప్తి చేయగా విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు,ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 26 న జిల్లా కేంద్రాలలో నిరసన, ప్రదర్శనలు

### సంయుక్త కిసాన్ మోర్చా- ట్రేడ్ యూనియన్ల పిలుపు




**అనకాపల్లి, నవంబర్ 21 (మనసులో మాట):** జిల్లా లో సంయుక్త కిసాన్ మోర్చా, ట్రేడ్ యూనియన్ ల అధ్వర్యంలో ఈనెల 26 న నిరసన ప్రదర్శన లు నిర్వహించ నున్నట్టు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం. అప్పలరాజు, సి ఐటియు జిల్లా అధ్యక్షులు వి. వి శ్రీనివాసరావు తెలిపారు. ఢిల్లీ లో రైతు ఉద్యమం జరిగి నవంబర్ 26 నాటికి 5 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నిరసన ప్రదర్శనలు చేపట్టడం జరుగుతుందన్నారు. చారిత్రాత్మకమైన ఆ పోరాటంలో 736 మంది రైతులు అమరులయ్యారు. స్వాంత్ర్యనంతరం భారత చరిత్రలో జరిగిన అత్యంత పెద్ద పోరాటం, కార్పొరేట్ల కు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాల రద్దు కోసం రైతాంగం సాగించిన పోరాటం, కార్మిక వర్గం మద్దతుతో ఏడాది పాటు సాగించి ప్రభుత్వ మెడలు వంచిన పోరాటమని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం. అప్పలరాజు, సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు అన్నారు. నవంబర్ 26 న అనకాపల్లి జిల్లా లో జరిగే నిరసన కార్యక్రమంలో రైతులు కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలమైన మార్కెట్ల చట్టాలను, మొత్తం విద్యుత్ రంగాన్ని ప్రైవేటు పరం చేసే విద్యుత్ చట్టాన్ని చేయనుందన్నారు. కార్పొరేట్ల కోసం తగిన నష్టపరిహారం ఇవ్వకుండా భూసేకరణకు పూనుకుంటుందని విమర్శించారు. ఈ ఏడాది ఎరువుల కొరత, బ్లాక్ మార్కెటింగ్, పంటలను కనీస మద్దతు ధరలు కూడా లేకపోవడం, ప్రకృతి వైపరీత్యాలు రైతాంగాన్ని మరింత కృంగ తీశాయని అవేదన వ్యక్తపరిచారు. బాధితులకు నష్టపరిహారం, పంటల బీమా నామమాత్రం అయ్యాయి. ఉపాధి హామీకి నిధులు కోత విధించింది. వ్యవసాయ సబ్సిడీలు కోత విధించింది.

ఈ స్థితిలో సంయుక్త కిసానోమోర్చా, ట్రేడ్ యూనియన్ యాక్షన్ కమిటీ, వ్యవసాయ కార్మిక సంఘాల ఐక్యవేదిక లు నవంబర్ 26 న జిల్లాలో సామూహిక నిరసన, ప్రదర్శనలు చేపట్టాలని నిర్ణయించాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, కోశాధికారి గండి నాయన బాబు, సిఐటియు జిల్లా నాయకులు గంటా శ్రీరామ్ ఎం రాజేష్, కే తెల్లయ్య బాబు, నాగిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# హరిత రాయబారుల సేవలు వెలకట్టలేనివి

### కరోనాలో వారి సేవలు అద్భుతం - ఎమ్మెల్యే బండారు



**మాడుగుల నవంబర్ 21 (మనసులో మాట)..** నిత్యం గ్రామాలలో ప్రజా ఆరోగ్యం కోసం గ్రామాల శుభ్రతకు నిరంతరం కృషి చేస్తున్న గ్రీన్ అంబాసిడర్ల అనబడే హరిత రాయబారుల (పారిశుద్ధ్య కార్మికుల) సేవలు వెలకట్టలేనని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కొనియాడారు. ముఖ్యంగా కరోనా సమయంలో వారు అందించిన సేవలు అద్భుతమని అందుకు ఎందరో పాద పూజలు కూడా నిర్వహించారని చెప్పుకొచ్చారు. శుక్రవారం మాడుగుల మండలం చింతలూరు గ్రామంలో నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా గ్రామాలు పచ్చదనంతో పరిశుభ్రంగా ఉండాలని అందువల్ల సంపూర్ణ ఆరోగ్యం లభించగలదన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న పారిశుద్ధ్య కార్యక్రమంలో తడి చెత్త పొడి చెత్త విధానం ఆరోజు పాన్ మంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడుతో కలిసి సింగపూర్ వెళ్లి అక్కడ అమలు చేస్తున్న ఈ పథకాన్ని పరిశీలించి ఆంధ్రాలో అమలు చేయడం జరిగిందన్నారు. ఈ తడి చెత్త పొడి చెత్త తో విద్యుత్తు ఎరువులు తయారు చేయవచ్చని అలాగే రహదారులు కూడా నిర్మించవచ్చున్నారు. పచ్చదనంతో నిండిన గ్రామాలు ఆరోగ్యంగా ఉంటాయని ప్రస్తుతం రాష్ట్రంలో అనేక గ్రామాలు ఇదే విధానంలో ఆనందంగా అందంగా కనిపిస్తున్నాయని చెబుతూ ప్రతి గ్రామం కూడా పచ్చదనంతో పరిశుభ్రతతో ఉండాలంటే ప్రతి ఒక్కరు గ్రామ అభివృద్ధికి కృషి చేయాలన్నారు.



అలాగే గ్రీన్ నెంబర్ సెటర్లకు స్వచ్ఛత కార్పొరేషన్ ద్వారా జీతాలు చెల్లించాలని, వారికి జీతాలు పెంచాలని, దుస్తులు, ట్రై సైకిల్లు వంటివి అందజేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డిప్యూటీ డి డి ఓ నాగలక్ష్మి మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో ప్రస్తుతం 570 షెడ్లలో తడి చెత్త పొడి చెత్త కార్యక్రమాలు జరుగుతున్నాయని మరికొన్నిచోట్ల షెడ్ల నిర్మాణం లో ఉన్నాయని చెప్పారు. ఇంకొన్నిచోట్ల స్థలం భావించేత షెడ్ల నిర్మాణం జరగలేదన్నారు. ఒకక హరితరాయి వారి నెలకు 300 కేజీల చెత్త సేకరించాలని ఒక టన్ను ఎరువు తయారు చేయాలని వాటి ద్వారా వచ్చే ఆదాయంతో జీతభత్యాలతో పాటు పంచాయతీ నిర్వహణ జరుగుతుందని చెప్పారు. 144 కోట్లు గల దేశ జనాభా ఆరోగ్యంగా ఉండాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని ఆ దిశగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ముఖ్యంగా ప్రజలు ప్లాస్టిక్ నిషేధించాలని ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా గ్రీన్ అంబాసిడర్లకు ఆరోగ్య జాగ్రత్తలు కుటుంబ సంక్షేమ కార్యక్రమాలు భీమా సౌకర్యం జీతభత్యాలు చెల్లింపు వంటి వాటిపై శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. గ్రామ సర్పంచ్ కళ్యాణ రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షుడు మెలిపాక రాజు, ఎండిఓ కే అప్పారావు డిప్యూటీ ఎండిఓ పి సతీష్ తోపాటు 29 పంచాయతీలు చెందిన గ్రామ కార్యదర్శిలు, కూటమి నాయకులు నాయుడు, విజయలక్ష్మి రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలో గల 110 మంది గ్రీన్ అంబాసిడర్లను సత్కరించి వారికి నిత్యవసర వస్తువులు, దుస్తులు చింతలూరు క్వారీ యజమానులు స్థానికుల సహాయంతో అందజేశారు. దీంతో క్వారీ యజమానులను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు.






## వాడ నర్సాపురంలో
# ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం

**రాంబిల్లి నవంబరు 21 ( మనస్సులో మాట)..** ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం శుక్రవారం రాంబిల్లి మండలం వాడ నరసాపురం గ్రామంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా మత్స్య శాఖ అధికారిని జి విజయ్ మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. మత్స్యకార కుటుంబాలు జీవనొపాదిలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కార దిశగా కృషి చేస్తానని ఆమె అన్నారు. శార్దాస్ ఎన్జీవో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బండారు మంగమ్మ మాట్లాడుతూ రొయ్యల పరిశ్రమలలో పనిచేస్తున్న మహిళల అభివృద్ధికి కృషి చేస్తామని వారి జీవనోపాధి మెరుగుపడేలా చర్యలు తీసుకుంటామన్నారు. మరో అతిధి ఫిష్ కాన్ నెట్వర్క్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి అర్జిల్లి దాస్ మాట్లాడుతూ వాడబల్జీలను షెడ్యూల్ కులాల జాబితాలోకి చేర్చాలని, అలాగే సముద్రంపై వేటకు వెళ్లి ప్రమాదశాస్తు మరణిస్తే వారి కుటుంబానికి ఇచ్చే ఎక్స్‌గ్రేషియా రూ.10లక్షలకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో మత్స్యకార సహకార సొసైటీ అధ్యక్షుడు చేపల చిట్టిబాబు, ఎఫ్డిఓ రవితేజతో పాటు అధికారులను అతిధులను సొసైటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. మాజీ సర్పంచ్ చింతకాయల ఎర్రయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చెల్లూరి నూకరాజు, సూరాడా నూకరాజు, కోడా శ్రీను, మంగరాజు, ఆనంద్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## కూటమి కార్యకర్తల
## సమస్యలు పరిష్కారానికే
# ప్రజావేదిక




**విమాడుగుల నవంబర్ 21 (మనసులో మాట)..** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత ప్రజా సమస్యల తో పాటు కూటమి కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి ప్రతి శుక్రవారం ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు శుక్రవారం మాడుగుల పి ఆర్ అతిథి గృహ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదికలో ఆయన కూటమి పార్టీలు చెందిన కార్యకర్తల నుంచి వివిధ సంస్థలపై అర్జీలు స్వీకరించారు. వాటి పరిష్కారానికి ప్రభుత్వ పరమ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ కార్యకర్త సమస్య అధినేతకు తెలియాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో ప్రతి శుక్రవారం ఒక మండలంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. వచ్చిన సమస్యలను స్థానిక అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని అలాగే వాటిని జిల్లా కలెక్టర్ దృష్టికి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రెవెన్యూ హౌసింగ్ మంచినీరు వంటి వివిధ సమస్యలపై 50 అర్జీలు స్వీకరించడం జరిగిందని చెప్పారు. ఎక్కువగా రెవిన్యూ పరమైన సమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో మాడుగుల గ్రామం నుంచి కూడా ఎంతోకాలంగా ప్రజలు ఎదురుచూస్తున్న బస్సులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లారు. విశాఖ, అనకాపల్లి డిపోల నుంచి పాడేరు వెళ్లే ప్రతి బస్సు మాడుగుల మీదుగా రాకపోకలు సాగించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు గతంలో ఇదే విధానం ఉండేదని తదుపరి వివిధ కారణాలు పేరుతో నేరుగా ఘాటి రోడ్డు మీదగా బస్సులు వెళ్ళిపోతున్నాయని చెప్పారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఈ విషయాన్ని ఇప్పటికే డిఆర్సి మీటింగ్లో చర్చించడం జరిగిందని మరల మరో సమావేశంలో చర్చిస్తామని చెప్పారు. మాడుగుల మీదుగా పాడేరు బస్సులు వెళ్తే తమ బస్సులో ప్రయాణించమని పాడేరు ప్రాంతాలు చెబుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని ఎమ్మెల్యే తెలిపారు. అయితే ఇదంతా కట్టు కథనని ప్రభుత్వం ఆదేశిస్తే ఎందుకు బస్సులు తిరగవని స్థానికులు ప్రశ్నించారు. కావలసిన రహదారి సౌకర్యం కూడా ఉందని చెప్పారు. వైజాగ్ వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఇప్పుడు వస్తున్న బస్సులు ఒకేసారి వచ్చి ఒకేసారి వెళ్ళిపోతున్నాయని సమయం పాటించలేదని చెప్పారు.ఈ విషయంలో ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పి అప్పలరాజు, కూటమి నాయకులు ఎన్ సన్యాసిరావు, మెల్లిపాక స్వామి, పి రమేష్,పి లక్ష్మీ నారాయణ,వడ్డే రాజ్ కుమార్,పి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



### అల్లూరి జిల్లా ఆశ్రమ పాఠశాలల్లో

# యాజమాన్య నిర్లక్ష్యం

### అర్జున్ రెడ్డి (సామాజిక సేవకుడు)

**కొయ్యూరు నవంబర్ 21 (మనసులో మాట):** అల్లూరి సీతారామరాజు జిల్లా, కొయ్యూరు మండల కేంద్రంలో బాలికల ఆశ్రమ పాఠశాలలో ఈ మధ్యనే పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా 32మంది విద్యార్థినులు ఫుడ్ పాయిజన్ అయి, అస్వస్థతకు గురయ్యారు. కొయ్యూరు మండలంలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా ఆశ్రమ పాఠశాలల యాజమాన్యం చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, పాఠశాల యాజమాన్యం నెలనెలా వచ్చే జీతం తీసుకుంటూ.. వాళ్ళ ఉద్యోగాన్ని కాపాడుకోవడం కోసమే పనిచేస్తున్నారని సామాజిక సేవకుడు అర్జున్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా ఎన్డీయే కూటమి పరిపాలనలో మండల, జిల్లా నాయకులు చాలా నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారని, ఒక్కరికీ కూడా బాధ్యత, సేవాభావం లేదని విమర్శలు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి ఇటువంటి సంఘటనలపై ప్రత్యేక దృష్టి సారించాలని, లేదంటే భవిష్యత్తులో ప్రజలే బుద్ధి చెబుతారని అర్జున్ రెడ్డి అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ పాఠశాల బాగోగులపై శ్రద్ధ వహించి, నిర్లక్ష్యంగా ఉన్న వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. లేదంటే భవిష్యత్తులో మేమేంటో చూపిస్తామని అన్నారు.

# రేపు జాబ్ కార్డు మెగా గ్రామసభలు



**కోటవురట్ల(మనసులో మాట) నవంబర్ 21:** కోటవురట్ల మండలంలో గల 25 పంచాయతీలోనూ ఈనెల 22వ తేదీన ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు మెగా గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఏపీఓ నాగరాజు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు గ్రామ సభలం జరుగుతాయన్నారు. జాబ్ కార్డులు లేనివారికి కొత్తగా మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అలాగే గతంలో జాబ్ కార్డులు రద్దు అయిన వారికి తిరిగి పునరుద్ధరిస్తాన్నారు. గ్రామ సభల్లో జాబ్ కార్డులు కావలసినవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండలంలో 23,000 మంది ఉపాధి హామీ కూలీలు ఉన్నట్లు తెలిపారు. వీరిలో 19,000 మందికి ఈ కేవైసీ పూర్తి చేస్తామన్నారు. వచ్చే ఏడాది పనులు గుర్తింపు కోసం గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామసభల అనంతరం ప్రణాళికలను రూపొందించి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. 6 లక్షల పని దినాలు కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మునగపాక లో ఘనంగా పోలి పాడ్యమి వేడుకలు



**మునగపాక, నవంబర్ 21, మనసులో మాట..** మునగపాక మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పోలి పాడ్యమి వేడుకలు మహిళా భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. తెల్లవారు 3 గంటలకే లేచి భక్తులు స్నానాలు ఆచరించి నదులు వద్దకు, సాగునీటి కాలువల వద్దకు చేరి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించుకునే అరటి డొప్పలపై దీపాలు వెలిగించి పారే గంగమ్మ తల్లి ఒడిలో విడిచారు. కార్తీకమాసం నాలుగు వారాలు ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన మహిళా భక్తులు కార్తీక మాసం పూర్తి అవ్వడంతో పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి మునగపాక శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ సమీపంలో శారదా నదిలోని దీపాలను వెలిగించి గంగమ్మ తల్లికి పూజలు చేశారు మహిళా భక్తులు ఇబ్బందులు పడుకుంటా అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా విద్యుత్తు లైటింగ్ ఏర్పాటు చేశారు.

# సాగునీటి చెరువు ఆక్రమణ గర్తింపు....

### కొబ్బరి చెట్లు పంచాయతీ కి అప్పగింత



**ఎస్. రాయవరం, నవంబర్20, (మనసులో మాట):** ఎస్.రాయవరం మండలం కర్రివానిపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలోని లింగరాజుపాలెం గ్రామ సరిహద్దు లో ఉన్న పాత చెరువు అనే నక్కల చెరువు సర్వే నెంబర్ 159 ఎ. 16.20 సెంట్లు లో ముగ్గురు అక్రమదారులు 0.52 సెంట్లు ఆక్రమణలు చేసినట్లు గుర్తించినట్లు ఇరిగేషన్ ఎఇ భానుతెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడాలని గౌరవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లోకాయుక్త, ఉపలోకాయుక్త కు సోమిరెడ్డి రాజు గతం లో చేసిన పిర్యాదు పై రెవెన్యూ, నీటిపారుదల, పంచాయతీ శాఖ అధికారులు ఆక్రమణలు గుర్తించి, ఆక్రమణదారుల నోటీసులు జారీ చేసారు. చెరువు గర్భం ఆక్రమించి కొబ్బరి చెట్లు వేయడం తో కాపు కాయడం తో కర్రివానిపాలెం గ్రామ పంచాయతీ కి పంటకు వచ్చిన 59 కొబ్బరి చెట్లును తహసీల్దార్ జె.రమేశ్ బాబు, నీటిపారుదల శాఖ ఏ.ఇ భాను, సర్పంచ్, ఉప సర్పంచ్, రెవెన్యూ సిబ్బంది, నీటిపారుదల శాఖ సిబ్బంది, పిర్యాదుదారుడు సోమిరెడ్డి రాజు తదితరుల సమక్షంలో స్వాధీనం చేసినట్లు తెలిపారు.

# బాలుడు మిస్సింగ్ కేసును 48 గంటల్లోనే చేధించిన పోలీసులు..

### బాలుడును గుర్తించి, సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగింత.....




**కశింకోట, నవంబర్ 21,మనసులో మాట..** యజల్ల నరేంద్ర (15 ఏళ్లు), కశింకోటలోని డీపీఎన్ హైస్కూల్లో చదువుకుంటూ, బీసీ వెల్ఫేర్ హాస్టల్లో ఉంటున్నాడు. రెండు రోజుల క్రితం హాస్టల్ నుండి వాచ్‌మెన్‌కు సమాచారం ఇవ్వకుండా బయటికి వెళ్లడంతో, తిరిగి వచ్చినప్పుడు వాచ్‌మెన్ మందలిస్తూ "నీ తండ్రికి చెబుతా" అని చెప్పాడు. దీంతో భయపడిన బాలుడు తండ్రి తనను కొడతాడేమో అనుకుని హాస్టల్‌ను విడిచి బయటకు వెళ్లిపోయాడు. శోధన జరుగుతున్న నేపథ్యంలో, భీమవరం ప్రాంతం నుండి ఒక వ్యక్తి "ఇలాంటి లక్షణాలు ఉన్న బాబును బస్ స్టాండ్‌లో చూశాను" అని సమాచారం ఇచ్చాడు. వెంటనే హాస్టల్ వార్డెన్, వాచ్‌మెన్, ఒక హెడ్ కానిస్టేబుల్ భీమవరానికి వెళ్లి, అక్కడి సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలించి సమాచారాన్ని ధృవీకరించారు. కానీ ఆ బాలుడు నడుచుకుంటూ నీలకంఠపురం గ్రామానికి వెళ్లి అక్కడే ఉండిపోయాడు. పోలీసులు కేసు పై నిరంతర శ్రమ చేస్తూ, సామాజిక మాధ్యమాలు,పత్రికల ద్వార బాలుడి వివరాలను ప్రజలకు చేరవేశారు. వాటిని చూసిన నీలకంఠపురం గ్రామస్థులు బాలుడిని గుర్తించి, కశింకోట ఇన్‌స్పెక్టర్ అల్లు. స్వామినాయుడుకి సమాచారం ఇవ్వగా, ఆయన సిబ్బంది తో వెళ్లి బాలుడిని పోలీస్ స్టేషన్ కు తీసుకు వచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేవలం 48 గంటల్లోనే తమ బిడ్డను తమకు అప్పగించిన సిఐ స్వామి నాయుడు,పోలీసులకు కుటుంబ సభ్యులు తోపాటు పలువురు అభినందనలు తెలిపారు . ఈ కేసులో, ఎస్సై కే. లక్ష్మణ్ రావు, పి. మనోజ్ కుమార్ లు, హెడ్ కానిస్టేబుల్ మధు, కానిస్టేబుల్ రాజశేఖర్, గోపి లు తదితరులు ఉన్నారు.

# రావణాపల్లి లో 'దృశ్యపరంగా శుభ్రం చేయబడిన గ్రామం'

### కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓ



కొయ్యూరు నవంబర్ 21 (మనసులో మాట): అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం లోని రావణాపల్లి పంచాయితీ గ్రామంలో 'దృశ్య పరంగా శుభ్రం చేయబడిన గ్రామం' కార్యక్రమం నిర్వహించారు. వీధుల్లో పారిశుధ్యం, చెత్త తొలగింపు,రోజువారి చెత్త సేకరణలో భాగంగా పాటించవలసిన పద్ధతులు అన్ని గ్రామాల నుండి పాల్గొన్న 'క్లాప్ మిత్రా'లకు ఎంపీడీఓ జిడివి ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీఓ అవగాహన కల్పించారు. థీమ్ 5 శిక్షణ నిమిత్తం ప్రతి రోజూ 'క్లాప్ మిత్రాలు' చేయాల్సిన పనులు, అనంతర కార్యకలాపాలపై ప్రత్యేక చర్యలు దాని సమీక్ష నిర్వహణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రావణాపల్లి పంచాయితీ కార్యదర్శి రజనీ, అన్ని పంచాయితీల కార్యదర్శులు, క్లాప్ మిత్రాలు పాల్గొన్నారు.

# మహిళా భద్రతపై పోలీసుల అవగాహన





**గొలుగొండ, నవంబర్ 21,(మనసులో మాట):** గొలుగొండ గ్రామంలోని కస్తూరిబా బాలికల పాఠశాల లో విద్యార్థినుల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ , గొలుగొండ ఎస్ఐ రామారావు పాల్గొని విద్యార్థినులను ఉద్దేశించి వారు మాట్లడుతూ మహిళలపై నేరాలు, కొత్త చట్టాలు, పోక్సో కేసుల ప్రాముఖ్యత, బాల్యవివాహాల ప్రమాదాలు వంటి కీలక అంశాలపై విద్యార్థినులకు వివరించారు. సమస్యలు ఎదురైనప్పుడు పోలీసుల సహాయం ఎలా పొందాలి, ఎలాంటి సందర్భాల్లో వెంటనే ఫిర్యాదు చేయాలి వంటి అంశాలపై కూడా మార్గదర్శకత్వం అందించారు. విద్యార్థినుల్లో చట్టపరమైన అవగాహన పెంచడమే ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశ్య మని అధికారులు తెలిపారు... ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పలువురు పాల్గొన్నారు

# కాఫీ బెర్రీ బోరర్ నియంత్రణకు కలెక్టర్ కీలక ఆదేశాలు

### డుంబ్రిగూడ, అనంతగిరి మండలాల్లో కాఫీ క్రయవిక్రయాలకు లైసెన్స్ తప్పనిసరి - అల్లూరిజిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్



**అరకులోయ, నవంబర్ 21 (మనసులో మాట):** కాఫీ తోటలను ఆశిస్తున్న కాఫీ బెర్రీ బోరర్ పురుగు వ్యాప్తిని నియంత్రించడానికి జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా పాక్షికంగా ప్రభావితమైన ప్రాంతాలలో ఈ పురుగు వ్యాప్తి బయటికి వెళ్లకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని గురువారం అరకులోయ పర్యటనలో స్పష్టం చేశారు. అరకులోయ డుంబ్రిగూడ, అనంతగిరి మండలాల్లో కాఫీ కొనుగోలు, అమ్మకాలకు కచ్చితమైన నియంత్రణ విధించారు. ఎఫ్‌పీఓలు, ఎన్జీఓలు లేదా కమీషన్ ఏజెన్సీలు ఎవరైనా సరే ఇష్టం వచ్చినట్టు కాఫీ కొని అమ్మడానికి క్రయవిక్రయాలు తాత్కాలికంగా నిషేధం విధిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కాఫీ కొనుగోలు, విక్రయాలు చేసేవారు కచ్చితంగా సర్టిఫికేషన్, లైసెన్స్ కలిగి ఉండాలని ఆదేశించారు. లైసెన్స్ ఉన్నవారికి మాత్రమే కాఫీ కొనుగోలు, అమ్మకాలు చేయడానికి అనుమతి ఉంటుందన్నారు. జిల్లా కలెక్టర్ జిల్లా ఉద్యాన అధికారి కర్ణ, కాఫీ డిప్యూటీ డైరెక్టర్, పిహెచ్ఓ రాజశేఖర్, ఎడి కాఫీ ఐటిడిఏ పాడేరు బొంజుబాబు తో కలసి అరకులోయలో పరిస్థితిని కలెక్టర్ దినేష్ కుమార్ సమీక్షించారు. ? పా క్షి క ం గా ప్ర భా వి త మై న ప్రాంతాల నుంచి బెర్రీ బోరర్ పురుగు బయటికి వెళ్లకుండా రైతులు, ఏజెన్సీలు తీవ్రమైన నిబంధనలను పాటించాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.

# 10 విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఉచితంగా పంపిణీ



**ఎస్సై. రాయవరం, నవంబర్ 20, మనసులో మాట:** ఎస్ రాయవరం మండలంలోని దార్లపూడి, చినగుమ్ములూరు, పెద్దగుమ్ములూరు, గుడివాడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆదర్శ విద్యాసంస్థలు చైర్మన్ సీతారామరాజు, వెంకటేశ్వర పోలి క్లినిక్ డాక్టర్ అనిల్ వర్మ సంయుక్తంగా పదవ తరగతి స్టడీ మెటీరియల్స్ ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో సీతారామరాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు విద్యలో ఉన్నతంగా రాణించడానికి ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తామని, పేద విద్యార్థులకు సహాయం చేయడం దైవత్వంతో సమానమని అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత వైద్య సహాయం నిమిత్తం వెంకటేశ్వర పోలి క్లినిక్ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని డాక్టర్ అనిల్ వర్మ విద్యార్థులకు తెలిపారు. విద్యార్థులు స్టడీ మెటీరియల్ ను స్వీకరించిన అనంతరం దాతలకు ధన్యవాదాలు తెలియజేశారు.కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.



# రాజానగరం హైస్కూల్లో ప్రమాదం

### ఉపాధ్యాయురాలు మృతి



**పాయకరావుపేట నవంబర్ 21 మనసులో మాట..** పాయకరావుపేట మండలం రాజానగరం గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ప్రమాదంలో ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు జోత్స్నా బాయ్(47) మృతి చెందారు.బిల్డింగ్ పనులు జరుగుతుండగా స్లాబ్ వేసే క్రమంలో కాంక్రీట్ మోసుకెళ్లే ఐరన్ బకెట్ తెగి ఆ పక్కగా వెళ్తున్న టీచర్ జోత్స్న పై పడటంతో అక్కడి అక్కడే మృతి చెందారు.అయితే ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఉపాధ్యాయురాలు మృతి చెందడం పట్ల హోం మంత్రి అనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఘటన పై అధికారులతో మాట్లాడిన హోంమంత్రి విచారణకు ఆదేశించారు.ఉపాధ్యాయురాలు కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# అయ్యప్ప బిక్ష దాతలకు సత్కారం



**ఎస్. రాయవరం, నవంబర్ 21: మనసులో మాట:** ఎస్ రాయవరం మండలం తిమ్మాపురం లోని అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో 41 రోజులు పాటు అయ్యప్ప స్వాములకు ఉచిత బిక్ష ఏర్పాటు చేసిన సందర్భంగా భిక్ష ఏర్పాట్లుకు అర్ధికంగా సహకరించిన దాతలను శుక్రవారం ఘనంగా సత్కరించారు.41 వరోజు చివరరోజున బిక్ష ఏర్పాటు చేసిన గుర్రం సత్యనారాయణ, భవాని దంపతులను పలురు శాలువాతోసత్కరించి జ్ఞాపకను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, మాజీ మండల అధ్యక్షుడు వై వినోదరాజు, టిడిపి నియోజకవర్గ ఇన్ చార్జి కొప్పిశెట్టివెంకటేశ్, ఎన్. వెంకట్రాజు,రిటైర్డ్ ఉపాధ్యాయుడు కె. ధర్మారావు,, జనసేన నాయకుడు సేనాపతి బాబురావు మాస్టర్ తదితరులు దాతలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవా సంఘం సభ్యులు గుర్రం రామకృష్ణ, పపైపల శివ, సూర్యం,బద్దిరెడ్డి లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

# సత్య సాయి జన్మదిన వేడుకలకు ముస్తాబవుతున్న మందిరాలు...



**కె.కోటపాడు,నవంబర్21( మనసులో మాట):** ఈ నెల 23వ తేదీనశ్రీ సత్య సాయి బాబా శతవర్ష జన్మదినోత్సవాన్ని వేడుకగా నిర్వహణకు మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న సత్యసాయి మందిరాలు ఎంతో ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంటున్నాయి. దీనిలో భాగంగా మండల కేంద్రం కోటపాడు శ్రీ సత్య సాయి రామ మందిరం కన్వీనర్ బండారు నారాయణ పాత్రుడు ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు సత్యసాయి నగర సంకీర్తన, నామ సంకీర్తన, సాయంత్రం వివిధ భక్తితో కూడిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అలాగే కింతాడ పంచాయతీ పరిధి కూండ్రపువానిపాలెం శ్రీ రామసత్యసాయి మందిరం సిద్ధమయింది. పుట్టపర్తివాసి పుట్టుపండుగను పురస్కరించుకొని మందిరాన్ని సాయి భక్తులు నవీకరించారు. ఆదివారం అత్యంత భక్తి, శ్రద్ధలతో నిర్వహించనున్న ప్రేమావతారి పుట్టినరోజు పురస్కరించుకొని విద్యుత్ వెలుగులతో మందిరాన్ని అలంకరించారు. ఉదయం 5:00గంటల నుండి 10:00 గంటల వరకు ఓంకారం, సుప్రభాతం, నగరసంకీర్తన, మంగళహారతి, 108పర్యాయాలు సాయి గాయత్రి, నామసంకీర్తన, ప్రశాంతి పతాకావిష్కరణ, జ్యోతి ప్రకాశనం కార్యక్రమాలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12:30గంటలకు మహా నారాయణ సేవ సాయంత్రం 6:30 గంటల నుండి దీపాలంకరణ, నామ సంకీర్తన ఊయల సేవ, మంగళహారతి కార్యక్రమాలు నిర్వహిస్తారు. సేవాకార్యక్రమాల్లో భాగంగా 100 మంది నారాయణలకు వస్త్ర వితరణ, దివ్యాంగులకు ఉపకరణాలు గర్భిణులకు పోషకాహారం ఉచితంగాపంపిణీ చేస్తారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, అతిథులుగా రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ పి.వి.జి. కుమార్, శ్రీ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు, గోపాలపట్నం భవాని ట్రేడర్స్ యజమాని కొల్లి ఈశ్వరరావు పాల్గొంటారని శ్రీ సత్య సాయి సేవా సంస్థల జిల్లా సహ సమన్వయకర్త కన్నూరు అప్పలనాయుడు తెలిపారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



నేడు గవర్ల అనకాపల్లి

## శ్రీ గౌరీ పరమేశ్వరుల మహోత్సవం

**మునగపాక, నవంబర్ 21, మనసులో మాట..** మునగపాక మండలం తొటాడ పంచాయతీ గవర్ల అనకాపల్లిగ్రామంలో శ్రీ గౌరీ పరమేశ్వరుల మహోత్సవం 22న అనగా శనివారము జరుగును. అదే రోజు సాయంత్రం 3.గంటలకు గౌరీ పరమేశ్వరుల సారే ఊరేగింపుజరుగును. కావున గ్రామములో ఉన్న మహిళా మణులు అందరూ సారిని తయారు చేసుకుని 3 గంటలకు క్రింది రామాలయం దగ్గరికి రావలసిందిగా నిర్వాహకులు కోరుచున్నా మనీఅన్నారు. అదే రోజు సాయంత్రం 7గంటల నుండి పులివేశములునుండిపులి వేసములు, వల్లూరు వారిచే కోలాటం,మహిళల సేవ గరిడి లు, తీన్మార్, మరియు. మందు గుండు హాస్య వేసములు కడు రమ్యంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాము నెహ్రూ యూత్ క్లబ్ మరియుగవర్ల అనకాపల్లి గ్రామ పెద్దలు వివిధ సంఘమున వారు మహిళా మణులు గ్రామ ప్రజలు సహకారంతోఈ కార్యక్రమము నెహ్రూ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో జరుగుచున్నది. గౌరీ సేవా సంఘం తోటాడ క్లస్టర్ అధ్యక్షులు పొలమరశెట్టి ఆనందరావు మరియు ఉత్సవ కమిటీ చైర్మన్ పొలమర శెట్టి భాగేశ్వరరావు మరియు ఉత్సవ కమిటీ తెలిపారు.

కార్మిక సమస్యల పరిష్కారానికై జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలను

## జయప్రదం చేయండి



**అచ్యుతాపురం నవంబర్ 21 మనసులో మాట..** మహాసభలను జయప్రదం చేయాలని ఈరోజు ఎస్ ఈ జెడ్ లో కార్మికులతో సమావేశాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకర్రావు , మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ కార్మికులకి కనీస వేతనాలు అమలు చేయటం లేదు. సామాజిక భద్రత సౌకర్యాలు అమలు కావటం లేదు . విద్యుత్తు ,బ్యాంకులో తదితర సంస్థల్లోప్రైవేటీకరణ విధానాలు వేగంగా అమలు చేస్తుంది .కార్మిక హక్కులు కాల్ రాసే లేబర్ కోడ్ లను తీసుకువచ్చింది ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని జరిగే సిఐటియుఅఖిలభారత 18వ మహాసభలు మొదటిసారి ఆంధ్ర రాష్ట్రంలో విశాఖపట్నంలో2025 డిసెంబర్ 31 నుండి2026 జనవరి 4 వరకు జరుగుతున్నాయి .ఈ మహాసభలు 22 రాష్ట్రాల నుండి 2000 మంది ప్రతినిధులుజనవరి 4న ల లక్షమందితో భారీ బహిరంగ సభ జరుగుతుంది. ఈ మహాసభల జయప్రదానికి కార్మికులందరూ కృషి చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆర్ రాము, గురుజాపాలెం ముఠా సంఘము మెస్రి ఎస్ రాము తాతారావు నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

# దొంగ బంగారం కొంటే చర్యలు తప్పవు

**- విజయనగరం డిఎస్పీ ఆర్.గోవింద రావు -**



**విజయనగరం (మనసులో మాట) నవంబర్ 21:** విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఆదేశాల మేరకు ఇటీవల జరుగుతున్న నగల దుకాణ దోపిడీలు, మోసపూరిత సంఘటనలను ద ృష్టిలో ఉంచుకుని భద్రత, సురక్షా చర్యలను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విజయనగరం పట్టణంలో బంగారు షాపులలో దొంగతనాలను నివారించుటకు అన్ని బంగారు షాపులలో సి.సి.టి.వి. కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అదే విధంగా సెక్యూరిటీ గార్డ్ ను కూడా పెట్టుకోవాలనివిజయనగరం డిఎస్పీ ఆర్.గోవింద రావు సూచించారు. విజయనగరం పట్టణంలో వుండే బంగారు షాపు యజమానులుతో విజయనగరం 1వ పట్టణ పోలీస్ స్టేషన్లో సిఐ ఆర్.వి.ఆర్.కే.చౌదరి సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సమావేశానికి విజయనగరం డిఎస్పీ ఆర్.గోవిందరావు విచ్చేసి బంగారం షాపు యజమానులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. బంగారం షాపు యజమానులు ఎట్టి పరిస్తితులలో కూడా దొంగ బంగారం కొనకూడదని వారిని హెచ్చరించారు. ఒక వేళ ఎవరైనా బంగారం అమ్మేందుకు బంగారం షాపుకు వస్తే అది దొంగ బంగారం అని అనుమానం వస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పట్టణంలో దొంగతనాలను అరికట్టడంలో ప్రజలు అందరు సహకరించాలని, భద్రతా చర్యలు మరింతగా పెంచేందుకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ సమావేశంలో 1వ పట్టణ సిఐ ఆర్.వి.ఆర్.కే చౌదరి, సిసిఎస్ సిఐ కాంతారావు మరియు ఎస్ఐలు పాల్గొన్నారు.

# నేచర్ - యూనిసెఫ్ ఆధ్వర్యంలో బాలల హక్కులు




**విజయనగరం (మనసులో మాట) నవంబర్ 21:** జిల్లాలో యూనిసెఫ్ సహకారంతో నేచర్ స్వచ్ఛంధ సేవ సంస్థ సఖి ప్రోగ్రాం నిర్వహిస్తుందని ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం యు.ఎన్.సి.ఆర్.సి 2025 -'ప్రతి ఒక్కరు పిల్లల హక్కుల గురించి తెలుసుకోవాలి' దీనిలో భాగంగా ప్రతి ఒక్క విద్యార్థి విద్యార్థిని కూడా హక్కుల పట్ల, ఆరోగ్యం పట్ల ,విద్య పట్ల సరైన అవగాహన కలిగి ఉండాలని, ఈ ప్రధాన ఉద్దేశంతో సఖి ప్రోగ్రాం జిల్లాలో నిర్మించబడుతుందని సిడిపిఓ జి.ప్రసన్న తెలియజేసారు. జిల్లా కలెక్టరేట్లో ఉన్న సఖి కార్నర్లో మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్య, ఆరోగ్యశాఖ సహకారంతో సఖి ప్రాజెక్టులో భాగంగా బాలలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ సిడిపిఓ భారతి మాట్లాడుతూ పిల్లలందరూ ఆరోగ్యంగా ఉండి డ్రగ్స్ వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయాలని మాట్లాడడం జరిగింది. సిడిపిఓ ఆరుద్ర మాట్లాడుతూ చాలామంది పిల్లలు అవగాహన లేక లైంగిక వేధింపులకు గురవుతున్నారని సేఫ్ టచ్ -అన్ సేఫ్ టచ్ పట్ల అవగాహన కలిగి ఉండాలనిఅన్నారు. నేచర్ యూనిసెఫ్ సఖి ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.అనిష్ మాట్లాడుతూ పిల్లలందరూ ఆరోగ్యంగా ఉండి మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని తద్వారా ఆరోగ్యవంతమైన విజయనగరాన్ని నిర్మించి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ని చూడవచ్చని పిల్లలతో చర్చించడం జరిగింది. ఏ.పీ.ఎస్.హెచ్ .డబ్ల్యు.పి.వెబ్సైట్ ద్వారా జిల్లాలో పిల్లలందరికీ రిజిస్ట్రేషన్ చేయించడం. ఈ మాడ్యూల్స్ చూపించి ,క్విజ్ చేయించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో నవంబర్ 14 నుండి 20 వరకు పాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా స్కూల్స్ లోను, ప్రజల్లోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. పిల్లలకు చిత్రలేఖనం ,వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో ఐ.సి.డి.ఎస్ సిడిపిఓస్, సిబ్బంది రజిని, నేచర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.అనీష్, చైతన్య, రామకృష్ణ, దుర్గ, శంకర్ నాయక్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంతో తక్కువ పెట్టుబడి అధిక దిగుబడి

**అనకాపల్లి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు సిహెచ్ సుబ్రహ్మణ్యం**



**మునగపాక, నవంబర్ 21, మనసులో మాట...** అనకాపల్లి డివిజన్, మునగపాక మండలం , చూచుకొండ గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ )వారి సౌజన్యంతో పకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి అనకాపల్లి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడిఏ) సిహెచ్. సుబ్రమణ్యం మాట్లాడుతూ పకృతి వ్యవసాయం చేయడం వలన రైతుల తక్కువ పెట్టు బడి తో అధిక దిగుబడి సాధించవచ్చు అని ఈ పకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడం వలన భూమి సారం పెరుగుతుందని, భూమి సారం పెరగడం వల్ల భూమిలో ఉన్న వానపాములు పెరిగి భూమి గొల్లపరుస్తుందని, దీనివలన వానపాముల అభివృద్ధి చెందుతాయని ,ఈ పకృతి వ్యవసాయ పద్ధతులైన ఘనజీవమృతం, ద్రవ జీవమృతం పిఎండిఎస్ పద్ధతులు మరియు నీమాస్త్రం,బ్రహ్మాస్త్రం,అగ్నిస్త్రం వంటి కషాయాలు వాడడం వలన పురుగులు, తెగులు నివారించవచ్చని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి జోష్ణ కుమారి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా అమలయ్యే పథకాలు రాయితీలు, అన్నదాత సుఖీభవ పథకం గురించి మరియు పతి రైతు కూడా ఈ పంట నమోనా తప్పనిసరిగా చేసుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఆత్మ ఏటీఎం పి రామకృష్ణ మాట్లాడుతూ పకృతి వ్యవసాయ పద్ధతులు, రైతులు పాటించడం వలన భూమి పాడవకుండా మరియు వాతావరణం కలుషితం కాకుండా ఉంటుందని తెలియజేశారు, ఈ రసాయనిక ఎరువులు, రసాయనిక పురుగు మందులు వాడడం వలన మనుషులు అనారోగ్యాలకి గురవుతున్నారని క్యాన్సర్ వంటి వ్యాధులు ఈ రసాయనిక ఎరువులు,రసాయనిక మందులు వాడడం వల్ల వస్తుందని కావున రైతులందరూ ఈ పకృతి వ్యవసాయం పద్ధతులు పాటించాలని ఈ సందర్భంగా తెలియజేశారు. అదేవిధంగా పకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడం వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయని, ఈ పకృతి వ్యవసాయ పద్ధతిలో రాజీలేని సూత్రాలు గురించి వివరించారు, ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపి-ఎం ఐ ఏ ఓ రంజిత మాట్లాడుతూ మైక్రో ఇరిగేషన్ ద్వారా 50% సబ్సిడీపై స్ప్రింక్లర్ పైపులు, గొట్టం పైపులు సబ్సిడీ మీద ఉన్నాయని కావలసిన రైతులు ఒక ఎకరా భూమి, భూమి పాస్ పుస్తకాలు జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్ మీ దగ్గరలో ఉన్న రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సంప్రదించాలని సందర్భంగా తెలియజేశారు, ఈ కార్యక్రమంలో ఆత్మ ఏటీఎం పి.రామకృష్ణ , గ్రామ వ్యవసాయ సహాయకరాలు బి. పార్వతి, వెటర్నరీ అసిస్టెంట్ జయలక్ష్మి, గ్రామ సర్పంచ్ దొడ్డి సూరి అప్పారావు, రైతు నాయకులు పెంటకోట శివ, పెంటకోట హరి రామ్, పకృతి వ్యవసాయ సిబ్బంది, మహిళా సంఘ సభ్యులు గ్రామ రైతులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# క్లాప్ మిత్రులుకు ఒక రోజు శిక్షణ



**ఎస్. రాయవరం, నవంబర్ 20,(మనసులో మాట):** ఎస్. రాయవరం మండలంలోని గుడివాడ గ్రామ పంచాయతీలో క్లీన్అండ్ గ్రీన్ విలేజ్ అనే అంశాలపై మండలంలోని క్లాప్ మిత్రులకు ఒకళరోజు శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు.. గుడివాడ, లక్ష్మీపతి రాజుపేట.,కొత్త పోలవరం గ్రామాలలో వీరందరికి బృందాలుగా పంపించి ప్రతి ఇంటి నుంచి తడి మరియు పొడి చెత్తలను వేరు చేసి సంపద తయారీ కేంద్రాలకు ఎలా తరలించాలి అనే విషయాన్ని ఎంపిడిఓ పి. మీనా కుమారి,డిప్యూటీ ఎంపిడిఓ బంగారు సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధూళి శ్రీనుబాబు, ఉప సర్పంచ్ రామకృష్ణ రాజు పాల్గొని స్థానికప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గుడివాడ గ్రామము లో గల సంపద తయారీ కేంద్రం వద్ద సర్పంచ్ ధూళి శ్రీనుబాబు అధ్యక్షతన జరిగిన క్లాప్ మిత్రుల అవగాహన కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బంది సేవలను కొనియాడుతూ వారికి ఎంత చేసినా తక్కువే అని పేర్కొన్నారు.. ఎంపిడిఓ పి. మీనా కుమారి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తద్వారా గ్రామ పంచాయతీ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని పేర్కొన్నారు. డిప్యూటీ ఎంపిడిఓ బంగారు సత్యనారాయణ మాట్లాడుతూ స్వచ్ఛ గ్రామం సాధించడం ద్వారా స్వచ్ఛ ఆంధ్రా.. స్వచ్ఛ భారత్ సాకారం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని క్లాప్ మిత్రలు,పంచాయతీ కార్యదర్శిలు పాల్గొన్నారు.

# స్ఫూర్తిదాత సర్దార్ వల్లభ భాయ్ పటేల్ - డిప్యూటీ డైరెక్టర్ జి. మల్లేశ్వరరావు




**అరకులోయ, నవంబర్ 21 (మనసులో మాట):** సర్దార్ వల్లభ భాయ్ పటేల్ 150వ జయంతి పురస్కరించుకొని అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఐక్యత యాత్ర నిర్వహిస్తున్నట్లు మై భారత్ విశాఖపట్నం డిప్యూటీ డైరెక్టర్ జి మహేశ్వరరావు తెలియజేశారు. ఈ యాత్రను అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి గిరిజన మ్యూజియంఅరకులోయ వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ మై భారత్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేడుకలో ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, విద్యార్థులు మేధవి వర్గ ప్రముఖులు పాల్గొంటారని అన్నారు. దేశభక్తి, సామాజిక సామరస్యాన్ని ప్రోత్సహించడంయువతను భాగస్వాములను చేస్తూఐక్యతా స్ఫూర్తి యాత్ర నిర్విస్తున్నట్లు తెలియజేశారు. భారత తొలి ఉప ప్రధాని, హెూమ్ మినిస్టర్ సర్దార్ వల్లభ భాయ్ పటేల్ 150 వ జయంతి వేడుకలు దేశ వ్యాప్తంగాజరుగుతు న్నాయని ఆయన చెప్పారు. స్వాతంత్ర్య భారతదేశంలో 565 సంస్థలను విలీనం చేసిన ఘనత సర్దార్ వల్లభ భాయ్ పటేల్ కు దక్కుతుందనిఅయన అన్నారు. అత్యంత ధైర్యశాలి, రాజకీయ చతురత కలిగిన సర్దార్ జీవితం నేటి యువతకు స్ఫూర్తి దాయకమన్నారు. దేశ వ్యాప్తంగా నెల రోజులపాటు ఐక్యతా మార్చ్ ప్రచారకార్యక్రమాలనునిర్వహిస్తున్నట్లు కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ మై భారత్ డిప్యూటీ డైరక్టర్ గొర్లి మహేశ్వరరావు వివరాలను వెల్లడించారు. ఈ సమావేశంలో అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భరత్ కుమార్ నాయక్, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ పి.నాగబాబు, వై. విజయలక్ష్మి, ఇందిరాగాంధీ ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత ఆర్ లీలా ప్రసాద్ పాల్గొన్నారు.



# పకడ్బందీగా ధాన్యం కొనుగోలు

**కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన జెసి సేధు మాధవన్**

**విజయనగరం (మనసులో మాట) నవంబర్ 21:** ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎస్. సేధుమాధవన్ అధికారులను ఆదేశించారు. రైతులు ఇబ్బంది పడకుండా ప్రక్రియను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. ఆయన శుక్రవారం బొబ్బిలి, రామభద్రాపురం మండలాల్లో పర్యటించారు. బొబ్బిలి మండలం మెట్టవలస, రామభద్రపురం మండలం రొంపల్లి గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, సజావుగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో తహసీల్దార్లు ఎం.శ్రీను, రఫీజాన్, డిటీ సాయికృష్ణ, మండల వ్యవసాయాధికారులు ఎం.శ్యాంసుందర్, ఎ.శివ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# కనుల విందుగా పోలిపాడ్యమి ఉత్సవం



**విజయనగరం (మనసులో మాట) నవంబర్ 21:** పోలిపాడ్యమి పర్వదినం సందర్భంగా... విజయనగరం పట్టణంలోని రింగ్ రోడ్ శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శుక్రవారం ప్రాతఃకాలంనుండి భక్తులు పోటెత్తారు. కార్తీకమాసం కార్యక్రమాలలో వ్రతాలు ఆచరించుకున్న భక్తులు తెల్లవారు ర%ఝ%రీమున ఆలయప్రాంగణంలోగల వరాహ పుష్కరిణి వద్దకు చేరిన మహిళలు అరటిదొన్నెలలో నేతి దీపాలు వెలిగించి నీటిలో వదిలి భక్తురాలు పోలిని స్వర్గానికి పంపారు. చిరుగాలిలో అలలపై తేలియాడుతూ కదిలే చిరు దీపాల సవ్వడులు చూపరులకు కనువిందుచేసాయి. శ్రీకృష్ణునికి అర్చనలుచేసారు. కార్తీకమాసంలో ప్రతిరోజు ఆలయంలో ఆకాశదీపాలు వెలిగించారు. దామోదరునికి పూజలుచేసారు. ముందురోజు గురువారం అమావాస్య,పాడ్యమి కలసిరావడం విశేషంగా భావించిన భక్తులుసంధ్యా సమయంలో దీపోత్సవాలలోపాల్గొన్నారు

# తోటాడ బావనాఋషి ఆలయం వద్ద అన్నసమారాధన




**మునగపాక, నవంబర్ 21, మనసులో మాట...** మండలంలోని తోటాడ గ్రామంలో వేంచేసి యున్న శ్రీ భావనారుషి భద్రావతి కాశీ విశ్వేశ్వర దేవస్థానంలో కార్తీక మాసం ఆఖరి రోజు పోలి పాడ్యమి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు భక్తులు పోటెత్తారు. నాలుగు గ్రామాల నుంచి భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. పద్మశాలీ సేవా సంఘం నిర్వహణలో సుమారు 2200 మందికి అన్న ప్రసాద వితరణ జరిగింది. నెలరోజులుగా నిత్య పూజలు చేస్తున్న మహిళలు ఉద్యయాన్నే త్రిమూర్తుల ఆలయం సమీపంలోని ఆవ కాలువ వద్ద దీపాలను విడిచిపెట్టి పూజలు చేసారు. అనంతరం భావనారుషి ఆలయ సన్నిధికి చేరుకొని అక్కడ మహా శివలింగాన్ని దర్శించుకున్నాక అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ధర్మకర్తలు దొడ్డి సూర్య నారాయణ,త్రినాధ్,సన్యాసిరావు, తాతబాబు, సత్యనారాయణ, పద్మ శాలీ సంఘం కమిటీ ప్రతినిధులు,మహిళలు,గ్రామస్తులు పాల్గొన్నారు

మండల వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులతో

# కీలకసమావేశం

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ , బొడ్డేడ ప్రసాద్**



**మునగపాక, నవంబర్ 21, మనసులో మాట...** అనకాపల్లి జిల్లా యలమంచిలి నియోజకవర్గం మునగపాక మండలం మునగపాక బొడ్డేడ ప్రసాద్ గారి కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా వైఎస్ఆర్సీపీ కోటి సంతకాలు ప్రజా ఉద్యమం కార్యక్రమం మరియు గ్రామ కమిటీలు మునగపాక మండలంలో దిగ్విజయంగా పూర్తి అయినా సందర్భంగా 26 పంచాయితీల ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ శాసనసభ్యులు ప్రభుత్వ విప్, పి సి ఎస్ సభ్యులు,యలమంచిలి నియోజకవర్గం సమన్వయకర్త కరణం ధర్మశ్రీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కోటి సంతకాల సేకరణ పత్రాలను కార్యకర్తల నుండి స్వీకరించారు. అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త & అరకు పార్లమెంట్ పరిశీలకులు బొడ్డేడ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఆడారి గణపతి ఆచ్చినాయుడు,జడ్పిటిసి సోమ సత్యనారాయణ,మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీలు,వివిధ గ్రామాల సర్పంచ్లు,క్లస్టర్ ఇన్చార్జిలు,ముఖ్య నాయకులు,కార్యకర్తలు అభిమానులు,తదితరులు పాల్గొన్నారు.



## బీహార్ ఎన్నికల విధులు నిర్వర్తించిన పోలీసులు నిరుపేద విద్యార్థులకు

# బ్యాగులు పంపిణీ

**అరకులోయ, నవంబర్ 21 (మనసులోమాట):** ఇటీవల జరిగిన బీహార్ ఎన్నికల్లో విధులు నిర్వహించడానికి వెళ్లిన ఆంధ్రప్రదేశ్ పోలీసులు బీహార్ రాష్ట్రంలోనిసూపౌల్ జిల్లా, చాటాపూర్ బ్లాక్ పరిధిలోని బేలా సింగర్ మోతే గ్రామంలో శుక్రవారం విధులు నిర్వర్తించేందుకు వచ్చిన సిబ్బంది అందరూ కలిసి స్వచ్ఛందంగా కొంత మొత్తాన్ని సేకరించి, గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. విధులు నిర్వర్తిస్తూనే సమాజ సేవ చేయాలన్న ఆలోచనతో ఉదార చాటుకున్న పోలీసులుహెచ్ బి లక్ష్మణరావు, తోటి పోలీస్ సిబ్బంది కి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## ఆంగ్ల భాష పట్ల

# శ్రద్ధ వహించాలి



**డుంబ్రిగుడ, నవంబర్ 21, మనసులో మాట:** గిరి విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచి ఆంగ్ల బాసపట్ల నైపుణ్యం పెంచే విధంగా ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని ఫార్వర్డ్ సంఘం అల్లూరి జిల్లా కోఆర్డినేటర్ కిమ్ముడు రమేష్ చెప్పారు. మండలంలోని గుంటగన్నేల పిత్త గూడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆంగ్ల బోధనపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు ఆంగ్ల బాసపై బాగా చదువుతుండగా మరికొంతమంది వెనుకబడి ఉన్నారన్నారు. అటువంటి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరిచి ఆంగ్లంపై పట్టు సాధించేవరకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పోలి పాడ్యమి సందర్భంగా భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు



**మునగపాక, నవంబర్ 21, మనసులో మాట...** కార్తీకమాసం నెల రోజు పాటు ఎంతో భక్తి ప్రవర్తలతో పూజలు నిర్వహించిన మహిళా భక్తులు శుక్రవారం తో కార్తీక మాసం ముగింపు అవడంతో శుక్రవారం తెల్లవారుజామునే భక్తులు స్నాన ఆచరించి శివాలయాలకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మహిళ భక్తులు తీసుకొచ్చిన కాయలు పండ్లు, బియ్యం వంటి సామాగ్రిని బ్రాహ్మణులకు అందజేశారు. మునగపాకతి పురాతన శివాలయం శ్రీ కాలేశ్వరం భీమేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు వెలవలపల్లి కోటేశ్వర శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి మహిళా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ప్రసిద్ధి చెందిన వాడ్రాపల్లి శ్రీ దక్షిణ కాశీ విశ్వేశ్వర స్వామి భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు. శివునికి పాలాభిషేకం చేసి పండ్లు కాయలు అందజేశారు. అలాగే మునగపాక లోని మెయిన్ రోడ్ లో గల కాశీ విశ్వేశ్వర స్వామి, టి శిరసపల్లి శ్రీ వీరభద్ర స్వామి, నాగులపల్లి శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేకమైన పూజలు నిర్వహించి భక్తులకు ఆశీర్వచనాలు చేశారు.



# పరిశుభ్రత-పారిశుద్యంపై అవగాహన పెంపే లక్ష్యం

## గడికించుమండలో శిక్షణా కార్యక్రమం



**హుకుంపేట నవంబర్ 21 (మసులో మాట)..** హుకుంపేట మండలంలోని గడికించుమండ గ్రామంలో సస్టైనబుల్ డెవలప్మెంట్ లక్ష్యాలు పరిశుభ్రత, పారిశుద్యం పై ఒక రోజు శిక్షణా కార్యక్రమం శుక్రవారం జరిగింది. గ్రామాల్లో శుచిత పెంపుదల, పారిశుధ్య సదుపాయాల బలోపేతానికి ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని శిక్షణలో పాల్గొన్న అధికారులు తెలిపారు. పరిశుభ్రతపై గ్రామస్థాయి యాక్షన్ ప్లాన్ అమలు, చెత్త నిర్వహణ పద్ధతులు, మురికివాడల నిర్మూలన, తెరచి మలప్రసాదానికి పూర్తిగా చెక్ పెట్టడం, తాగునీటి శుద్ధీకరణ, కాలువల సంరక్షణ వంటి అంశాలపై నిపుణులు విపులంగా అవగాహన కల్పించారు. వ్యక్తిగత ఆరోగ్యం, ఇంటి పరిసర శుభ్రత, పర్యావరణ పరిరక్షణ ఒకదానికొకటి అనుబంధమని పేర్కొన్నారు.
పిల్లల్లో పరిశుభ్రత అలవాటు,పాఠశాల – విలేజ్ శానిటేషన్ కార్యక్రమాల్లో పాక్రియ పాల్గొనడం, మహిళల మాసిక పారిశుద్యం, వ్యర్థాలను వర్గీకరించి పునర్వినియోగం వంటి అంశాలపై కూడా చర్చ జరిగింది. గ్రామంలోని ప్రతి నివాసి తన బాధ్యతగా భావించి గ్రామ అభివృద్ధిలో భాగం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ వి. ఈశ్వరమ్మ , ఎంపీటీసీ శెట్టి మహేశ్వరరావు , డిప్యూటీ ఎంపీడీవో, ఏఓ సన్యాసిరావు, ఎంపీపీ, పంచాయతీ కార్యదర్శి తదితర శాఖా సిబ్బంది హాజరయ్యారు. శిక్షణలో పాల్గొన్న వెల్ఫేర్ సమితుల సభ్యులు, మహిళా సంఘాలు, ఆశా–అంగన్వాడీ సిబ్బంది, గ్రామ యువత ఆసక్తి చూపారు.
గ్రామాలు శుభ్రంగా ఉండేలా అందరూ ఒక కుటుంబంలా పనిచేయాలని, పరిశుభ్రతను నిత్యజీవిత భాగమై చేస్తేనే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మితమవుతుందని అధికారులు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు నిర్వాహకులు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

# బయలు పూడి వైయస్ఆర్ కాంగ్రెస్ వైకాపా గ్రామ కమిటీ ఏర్పాటు



**చీడికాడ, నవంబర్ 21, (మనసులో మాట)** రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సిఈసి మెంబర్,మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు ఆదేశాల మేరకు చీడికాడ మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గొల్లవెల్లి రాజబాబు గారి ఆధ్వర్యంలో బైలపూడి గ్రామ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గం ఎన్నికలు శుక్రవారం జరిగాయి బైలపూడి గ్రామ అధ్యక్షుడిగా జాజిమొగ్గల అప్పారావు(సూదులు), ఉపాధ్యక్షుడుగా గొల్లవెల్లి రామకృష్ణ మహిళా విభాగం అధ్యక్షులుగా గుమ్మాల కుమారి, ఉపాధ్యక్షులుగా దారపు కోటిలక్ష్మి,ఖండివెల్లి సన్యాసమ్మ రైతు విభాగం అధ్యక్షులుగా గాడి సత్తిబాబు, ఉపాధ్యక్షులుగా గెంజి శ్రీను, గుమ్మడి నాయుడు యూత్ విభాగం అధ్యక్షులుగా గెంజి నాగేష్ ఉపాధ్యక్షులుగా దారపు చెల్లారావు సోషల్ మీడియా విభాగం అధ్యక్షులుగా పర్రె రవి ఉపాధ్యక్షులుగా గుమ్మాల తేజ,గొల్లవెల్లి గణేష్ బీసీ విభాగం అధ్యక్షులుగా కాశి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా కిర్లంపల్లి చిన్న,బొట్ట దేముడుబాబు,కుమార అప్పారావు ఎస్సీ విభాగం అధ్యక్షులుగా పట్నాల రామారావు ఉపాధ్యక్షులుగా పట్నాల ఈశ్వరరావు విద్యార్థి విభాగం అధ్యక్షులుగా గుమ్మాల త్రినాథ్ ఉపాధ్యక్షులుగా గాడి శశిధర్ ఎన్నికయ్యారు ఎన్నికైన కమిటీని మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అభినందించారు.

# ఘనంగా గౌరీపరమేశ్వరుల ఊంజల సేవా కార్యక్రమం



**అనకాపల్లి, నవంబర్ 21 (మనసులో మాట):** అనకాపల్లి శ్రీ గౌరీ పంచాయతన దేవస్థాన ప్రాంగణంలో శుక్రవారం శ్రీ గౌరీ పరమేశ్వరుల ఉంజల్ సేవా కార్యక్రమం ఘనంగా జరిగింది. దేవాలయ అర్చకులు అంపోలు గోపాల కృష్ణశర్మ , పొందూరు సూర్యనారాయణశాస్త్రి , వేదవిదులైన పండితులచే ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ ఉంజల్ సేవ కార్యక్రమానికి మళ్ల అప్పలనాయుడు ఇంద్రర దంపతులు, కుటుంబ సభ్యులు హాజరయ్యారు. అతిథులు శ్రీ గౌరీ గీత మహిళా మండలి, శ్రీ సత్తెమ్మ తల్లి దేవస్థానం మహిళా మండలి, శ్రీ గౌరీ పరమేశ్వరి అమృత వర్షిని, పెంతకం శెట్టి సుజాత, ఆలయ అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ , ఆళ్ళ మహాలక్ష్మి నాయుడు, మళ్ల సురేష్,, ఆళ్ల ప్రసాద్, పాలకవర్గ సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# గన్నెల, సుంకరమెట్ట పిహెచ్‌సి లను ఆకస్మిక తనిఖీ

## అల్లూరి జిల్లా వైద్యాధికారి కృష్ణమూర్తి నాయక్



**అరకులోయ, నవంబర్ 21 (మనసులో మాట):** అల్లూరి సీతారామరాజు జిల్లా అరుకులోయ మండల పరిధి గన్నెల మరియు సుంకరమెట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అకస్మికంగా తనిఖీ చేసినట్టు అల్లూరి సీతారామరాజు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. డి . కృష్ణ మూర్తి నాయక్ తెలియజేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ముందుగా గన్నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోగల మాదెల పంచాయితీ ములియగలుంగు గ్రామంలో శిశు మరణం జరిగిన విషయమై తమ దృష్టికి రావడంతో సందర్శించడం జరిగిందన్నారు. మృత శిశువు తల్లిదండ్రులు బెబోర్త సంగీత, అప్పలరాజు దంపతుల 49 రోజుల ఆడ శిశువు బుధవారం సాయంత్రం 09:00 లకు మృతి చెందిన విషయమై ప్రాథమిక విచారణచేపట్టడంజరిగిందన్నారు. పూర్తి విచారణ చిన్నపిల్లల ప్రత్యేక వైద్య నిపుణులతో నిర్వహించడం జరిగిందని తెలియజేసారు. గ్రామంలో ఇంటింటికి సందర్శించి గర్భిణిలను బాలింతలను, శిశువు లను పరిశీలించారు వారియొక్క ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో వైద్య శిభిరం నిర్వహించి చికిత్సలు అందించాలని వైద్యాధికారికి జిల్లా వైద్యాధికారి ఆదేశించారు.
చిన్నారుల్లో పెరుగుతున్న న్యూమోనియా కేసుల దృష్ట్యా ముందుగానే అవగాహన కలిగి తగు జాగ్రత్త తీసుకున్నట్లయితే వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చు అన్నారు. శీతాకాలంలో న్యూమోనియా వ్యాధి తీవ్రంగా వ్యాప్తిచెందే అవకాసం ఉన్నదని కావున అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదు సంవత్సరాల లోపు చిన్నపిల్లల్లోను, వృద్ధులలో మరియు రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిలో వ్యాధి వ్యాప్తిచెందే అవకాసం ఎక్కువగా ఉంటుందని అన్నారు. ఐదు సంవత్సరాల లోపు చిన్నారులు వ్యాధి బారినపడి అధిక సంఖ్యలో మృతిచెందడం జరుగుచున్నదని తెలిపారు. న్యూమోనియా వ్యాధి ముఖ్య లక్షణాలు జ్వరం, దగ్గు, శ్వాసలో ఇబ్బంది, ఆయాసం, ఛాతీ నొప్పి, శరీరం నీలం రంగులోకి మారడం, పిల్లలలో మగత, ఆకలి లేకపోవడం వంటి మున్నగు వ్యాధి లక్షణాలు ఉంటాయని తెలిపారు. వ్యాధి లక్షణాలు కనిపించిన రోగులను సకాలంలో గుర్తించి చికిత్సలు అందించాలని అన్నారు. నిమోనియావ్యాధివ్యాప్తిచెందకుండా చర్యలుగా శిశువులకు తల్లిపాల ప్రాధాన్యత, పి.సి.వి వ్యాక్సిన్ మొదటి, రెండవ మరియు బూస్టర్ డోసులు మరియు రొటీన్ వ్యాక్సినేషన్‌ను సకాలంలో పూర్తి చేయించాలని, పిల్లలను పొగ, కాలుష్యం నుంచి దూరంగా ఉంచుట, అనారోగ్యం నుంచి కోలుకున్నవారికి పోషకాహారం అందించుట, వ్యాధి తో బాదపడుతున్న రోగులకు సకాలంలో చికిత్స అందించడం ద్వారా న్యూమోనియా వ్యాధి నుంచి కోలుకోవచ్చుననిఅన్నారు.
అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ వారి ఆదేశాలమేరకు జిల్లాలో శిశు మరణాలు అరికట్టేందుకు ముందస్తు చర్యలు చేపట్టడం జరిగిందని జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధి గ్రామాలలో ప్రజలకు, చిన్నారుల తల్లిదండ్రులకు న్యూమోనియా వ్యాధిపై, తల్లిపాల ప్రాముఖ్యత, పాలుపట్టే విధానం, శిశువులకు వెచ్చటి దుస్తులతో కప్పిఉంచే విధానం, చలిలో తిరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, అనారోగ్యం వచ్చిన వెంటనే తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కలిపించేందుకు చర్యలు తీసుకున్నట్టు తెలియజేసారు. పి.హెచ్.సిల పరిధి వైద్య సిబ్బంది ఏ.ఎన్.ఏంలు, సి.హెచ్.ఓలు మరియు ఆశ కార్యకర్తలతో టీమ్ లను ఏర్పాటుచేసి ఇతర శాఖల సమన్వయంతో ఫిబ్రవరి 2026 వరకు విశ్రుతంగా న్యూమోనియా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వైద్యాదికారులకు ఆదేశించడం జరిగిందని అన్నారు. సచివాలయంల పరిధి గ్రామ స్థాయిలో ప్రత్యేక ప్రణాలికను ఏర్పాటుచేసుకోని ఏ.ఎన్.ఏంలు, సి.హెచ్.ఓలు మరియు ఆశ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి 0 %-% 5 సంవత్సరాల శిశువుల మాతా శిశు సంరక్షణ కార్డులను పరిశీలించి వారి ఆరోగ్య పరిస్థితులను పరిశీలించాలని అన్నారు. ఈ న్యూమోనియా అవగాహన కార్యాక్రమాన్ని విస్తృతంగా నిర్వహించేలా పి.హెచ్.సిల వైద్యాధికారులు చర్యలు తీసుకోని రోజువారి నిర్వహించిన శిభిరాలు, గుర్తించిన రోగ లక్షణాలు గల శిశువులు, సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్సలు అందించిన వివరాలను కార్యాలయానికి పంపించాలని ఆయనఆదేశించడం జరిగిందన్నారు. అనతరం సుంకరమెట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సందర్శించి అన్ని వార్డులను మరియు ప్రసూతి గదిని పరిశీలించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై వైద్యాధికారి మరియు వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలపై వైద్య సిబ్బంది మరియు వైద్యాధికారుల ప్రత్యేక పర్యవేక్షణ అవసరమని అప్పుడే మాత్రు, శిశు మరణాలను అరికట్టవచ్చని అన్నారు. కాన్పుకు సిద్దంగా ఉండి సుఖ ప్రసవాల కొరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే గర్భిణీలకు వైద్యాధికారి పర్యవేక్షణలో మాత్రమే సుఖ ప్రసవం జరగాలని ఆదేశించడం జరిగింది. పి.హెచ్.సి లో ప్రతి నెల 15 సుఖ ప్రసవాలు విధిగా జరుగునట్లు చర్యలు తీసుకొనునట్లు వైద్యాధికారికి ఆదేశిస్తూప్రసూతి తేదికి వారం రోజులు ముందు దగ్గర్లో ఉన్న ప్రసుతీ నిరీక్షణ కేంద్రానికి లేదా బర్త్ వెయిటింగ్ హెూమ్ కు తరలించాలని సూచించారు. గర్భిణులు, రోగులు వైద్యం కొరకు ఆసుపత్రులకు తరలించేందుకు ఐ.టి.డి.ఏ అంబులెన్స్ లను, 108 మరియు ఫీడర్ అంబులెన్స్ వాహనములను ఉపయోగించుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న మందుల నిల్వలను, రికార్డులను తనిఖీ చేశారు. ప్రసవ గది మరియు వార్డులను పరిశీలించడం జరిగింది. ఎపిడమిక్ సీజన్ కావడంతో అత్యవసర మందులు, వ్యాక్సిన్ లను సిద్దంగా ఉంచుకోవాలని తెలియజేశారు. గ్రామాలలో చిన్నారులు, రోగులు అనారోగ్యంతో బాదపడుతూ వైద్యం అందక ఇండ్లల్లో వేచి ఉండకూడదని, వైద్యం అందక మరణిస్తే సహించేది లేదని అన్నారు. గ్రామ స్థాయిలో క్షేత్ర స్థాయి సిబ్బంది రోగులను గుర్తింఛి చికిత్సలు అందించాలని లేదా వైద్య సిబ్బంది పర్యవేక్షణలో మెరుగైన వైద్యం కొరకు ఇతర ఉన్నతాసుపత్రులకు తరలించి చికిత్సలు జరిపించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధి గ్రామాలలో ఇంటింటి సందర్శనలు నిర్వహించే క్షేత్ర స్థాయి సిబ్బంది, పర్యవేక్షణ సిబ్బంది అంకిత భావంతో తమ విధులను నిర్వర్తించాలని విధినిర్వహణలో ఆలసత్వం ప్రదర్శించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భనలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి తో పాటు పి.హెచ్.సి వైద్యాధికారులు డా. జే కే నాయుడు, కే ఉపేంద్ర, డా. ఎస్ ఉదయ్ కుమార్ మరియు వైద్య సిబ్బంది పాల్గున్నారు.



## వార్డెన్ లను సస్పెండ్ చేస్తే

# సమస్య పరిష్కారం కాదు

### - ఆదివాసీపార్టీ -

కొయ్యూరు నవంబర్ 21 (మనసులో మాట): వార్డెన్ లను సస్పెండ్ చేస్తే సమస్య పరిష్కారం కాదని భారత్ ఆదివాసీపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు అన్నారు. అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం లోని రాజేంద్రపాలెం ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి,పిల్లల ఆరోగ్యం గురించి వివరాలు అడిగి తెలుసుకొని,జాగ్రత్తగా ఉండాలని,మంచి నీళ్లు బాగా తాగాలని,ఆరోగ్యం బాగుండేటట్లు చూసుకోవాలని,బాగా చదువుకోవాలని,తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని మాట్లాడారు. అనంతరం వంటగది, పరిసరాలు పరిశీలించి,కిచెన్ నుండి వచ్చే మురికి నీరు బయటకు వెళ్ళడానికి అవకాశం లేదని గమనించారు. ఆ మురికి నీరు పోవాలంటే రైతుల పట్టా స్థలం అడ్డంగా ఉందని ప్రధాన ఉపాధ్యాయుడు గోపాలం చెప్పారు. ఆ రైతులతో మాట్లాడి అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ఏర్పాటు చేస్తే గానీ ఆ సమస్య పరిష్కారం కాదని,ఈ ఆశ్రమ పాఠశాల లోనే కాదు చాలా ఆశ్రమ పాఠశాలలో ఇలాంటి సమస్యలు చాలా ఉన్నాయని,ప్రభుత్వం పట్టించుకోకుండా ఉన్నతాధికారులు సంబందిత వార్డెన్ లను ఉపాధ్యాయులను సస్పెండ్ సరికాదని,దాంతో సమస్యలు పరిష్కారం కావని,ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలలో ఉపాధ్యాయులు అత్యధికంగా విధులు నిర్వహిస్తున్నారని,ఏమైనా సంఘటనలు జరిగితే వేటు వీరి పైనే పడుతుందని,పాఠశాలలలో వీరికి కనీ సౌకర్యాలు కల్పించడం లేదని,హస్టల్లో పిల్లలకు ఏమైనా జరిగితే వార్డెన్ లను,ఉపాధ్యాయులను,ప్రధానోపాధ్యాయులను సస్పెండ్ చేసి కంటి తుడుపు చర్యలు చేపట్టడం వల్ల ఉపయోగం లేదని ప్రతి ఆశ్రమ పాఠశాలలో సమస్యలు ఉన్నాయని,వాటి పరిష్కారం కోసం అధికారులు,పాలకులు ఆలోచించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాపారావు మాష్టారు,సూరిబాబు పాల్గొన్నారు.

## మునగపాక శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణం లో

# ఘనంగా ముగిసిన అన్న సమారాధన

### అయ్యప్ప స్వామి లకు సేవలందించిన వారికి సత్కారం



**మునగపాక, నవంబర్ 21, మనసులో మాట..** మండల కేంద్రం మునగపాక మెయిన్ రోడ్డు పక్కన గల శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో మాలలు ధరించిన అయ్యప్ప భక్తులకు 40 రోజులు పాటు అయ్యప్ప భక్తులకు బిక్ష ఏర్పాటు చేసి శుక్రవారం ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు మొల్లేటి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఏటా అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో మాలలు ధరించిన భక్తులు కు 40 రోజుల పాటు అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేసి దిగ్విజయంగా నడుస్తుందని, శుక్రవారం ముగింపు రోజున అయ్యప్ప స్వాములు బిక్ష ఏర్పాటుకు సహాయ సహకారాలు సేవలు అందించిన సేవకులకు సత్కరించడం జరిగిందని సత్యనారాయణ తెలిపారు. మునగపాక నుండే కాకుండా నాగులపల్లి, అరబ్బు పాలెం, వాడ్రాపల్లి, ఒంపోలు గ్రామాలు భక్తులు ఈ ఆలయ ప్రాంగణంలోనే 40 రోజులు పాటు బిక్షకు తరలివస్తారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు దాడి ముసిలి నాయుడు, కాంట్రేకులు జగ్గారావు, ఉప సర్పంచ్ బొడ్డేడ అప్పలనాయుడు, కాండ్రేగుల పరదేశి రావు, పెంటకోట ఉమేష్, పొన్న కిరణ్, స్వాతి, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## అనకాపల్లి లో ఉచిత సిద్దా ఆయుర్వేద

# వైద్య శిబిరానికి విశేష స్పందన



**అనకాపల్లి, నవంబర్ 21 (మనసులో మాట):** అనకాపల్లి గవరపాలెం లోని మళ్ళ జగన్నాధం కళ్యాణ మండప ప్రాంగణంలో శుక్రవారం అనకాపల్లి రోటరీ క్లబ్ అధ్వర్యంలో ఏపి గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ సేవా సంఘం సౌజన్యంతో నిర్వహించిన ఉచిత సిద్దా ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన లబించింది. ముందుగా బి.ఎస్ గుప్తా, కర్రి సన్యాసినాయుడు, బొడ్డేడ రామ సత్యనారాయణ తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంబించారు. ఈ శిబిరంలో వెన్నుముఖ, మోకాళ్లు, మెడ, భుజాలు, కీళ్ళ నొప్పుల సమస్యలను ఆయుర్వేద నిపుణులు చింతల జగదీష్, బిహెచ్ శ్రీనాథ్, స్వాతి పరిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అనకాపల్లి రోటరీ క్లబ్ అధ్యక్షులు బుద్ధ శ్రీనివాసరావు, కార్యదర్శి కెవిపిఎస్ ప్రకాష్ రావు, కోశాధికారి బి సర్వారావు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, క్లబ్ సభ్యులు బుద్ధ సత్యనారాయణ, దాడి రవి, సాన తిరునాద్ తదితరులు పాల్గొన్నారు.



## దర్శకుడు రాజమౌళిపై కేసులు అన్యాయం

▸▸ బీజేపీ అసహనానికి, సంకుచిత మనస్తత్వానికి నిదర్శనం

▸▸ అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆగ్రహం

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 21:** ఆర్ఆర్ఆర్, బాహుబలి ఫ్రాంచైజీ వంటి చిత్రాలతో ప్రసిద్ధి చెందిన దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి మరోసారి వివాదాల్లో చిక్కుకున్నారు. ఆయనపై సరూర్ నగర్ పోలీసు స్టేషన్లో కేసు నమోదు అయింది. తాను దేవుళ్ళను నమ్మనని ఇటీవల రామోజీ ఫిల్మ్ సిటీలో నిర్వహించిన గ్లోబల్ ట్రాటర్ ఈవెంట్ లో చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వివాదాస్పదంగా మారాయి. ఈ వ్యాఖ్యలపైనే రాష్ట్రీయ వానరసేన సంఘం ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇదిలా ఉంటే రాజమౌళి పై కేసులేంటని మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత జీవీ హర్షకుమార్ మండిపడ్డారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. బీజేపీ నేతల తీరును తీవ్రంగా ఖండించారు.ప్రముఖ చలన చిత్ర దర్శకుడు, భారతీయ సినిమా ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తం చేసిన ఎస్ఎస్ రాజమౌళిపై బీజేపీ.. దాని అనుబంధ సంఘాలు చేస్తున్న విమర్శలను, ఇటీవల నమోదు చేసిన కేసులను మాజీ ఎంపీ హర్షకుమార్ తీవ్రంగా ఖండించారు. హనుమంతుడిపై రాజమౌళి చేసిన వ్యాఖ్యలను సాకుగా చూపి, ఆయనపై కేసులు నమోదు చేయడం బీజేపీ అసహనానికి, సంకుచిత మనస్తత్వానికి నిదర్శనమని మండిపడ్డారు.

"భారతీయ సినిమా స్థాయిని పెంచి, మన దేశానికి మరో ఆస్కార్ అవార్డును తెచ్చేందుకు అడుగు దూరంలో ఉన్న రాజమౌళిని అభినందించాల్సింది పోయి, రాజకీయ లబ్ధి కోసం బీజేపీ ఆయనను వివాదాల్లోకి లాగడం సిగ్గుచేటు" అన్నారు.

**అది వ్యూహం కూడా కావచ్చు..**

హనుమంతుడిపై రాజమౌళి చేసిన వ్యాఖ్యల వెనుక ఆంతర్యం గ్రహించే ఓపిక బీజేపీ నేతలకు లేదని హర్షకుమార్ ఎద్దేవా చేశారు. "నిజం చెప్పాలంటే, అది రాజమౌళి వ్యూహం కూడా అయి ఉండవచ్చు. మహేష్ బాబుతో చేయబోయే తన తదుపరి చిత్రంలో హనుమంతుడిని ఎవరూ ఊహించని రీతిలో, అత్యంత బ్రహ్మాండంగా చూపించడానికి ఆయన సిద్ధమవుతున్నారని మనం భావించవచ్చు. 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' సినిమాల ద్వారా మన పురాణాల గొప్పతనాన్ని, హిందూ సంస్కృతిని ప్రపంచానికి చాటిన ఏకైక దర్శకుడు రాజమౌళి. అటువంటి వ్యక్తిపై కేసులు పెట్టడం అవివేకం," అని హర్షకుమార్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

**రాజమౌళికి కాంగ్రెస్ అండ..**

కాంగ్రెస్ పార్టీ తరపున తాను రాజమౌళికి పూర్తి మద్దతు ఇస్తున్నట్లు హర్షకుమార్ తెలిపారు. "ఒక కాంగ్రెస్ నేతగా నేను రాజమౌళికి అండగా ఉంటాను. రాజకీయ స్వలాభం కోసం కళాకారుల స్వేచ్ఛను అణచివేసే ప్రయత్నాలను మేము సహించము. బీజేపీ నేతలు వెంటనే ఈ అర్థరహితమైన ఫిర్యాదులను వెనక్కి తీసుకోవాలి," అని మాజీ ఎంపీ జోవీ హర్షకుమార్ డిమాండ్ చేశారు.

**ఎప్పుడు అన్నారు..ఏమన్నారు?!..**

ఈ సంఘటన ఈ నెల15వ తేదీన మహేష్ బాబు, ప్రియాంక చోప్రా జోనాస్, పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్న చిత్రం 'వారణాసి' మొదటి గ్లింప్స్ విడుదల సందర్భంగా జరిగింది. ఈ చిత్రానికి దర్శకుడు రాజమౌళి. ఈవెంట్లో వారణాసి టీజర్ ప్రదర్శన సమయంలో సాంకేతిక లోపాలు జాప్యం కలిగించడంతో భావోద్వేగానికి గురైన రాజమౌళి తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. దర్శకుడు దేవుడిపై తనకున్న నమ్మకం లేమిని ప్రస్తావిస్తూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. "నాకు దేవుళ్లపై పెద్దగా నమ్మకం లేదు. ఇది నాకు చాలా భావోద్వేగమైన క్షణం. నేను దేవుడిని నమ్మను. మా నాన్న వచ్చి, హనుమంతుడు నా కోసం అన్నీ చూసుకుంటాడని చెప్పారు. లోపం జరిగిన తర్వాత 'ఆయన నన్ను ఇలా నడిపిస్తాడా?' అని అడిగాను. నా భార్య హనుమంతుడిని ఆరాధిస్తోంది. ఆమె ఆ దేవుడిని తన స్నేహితుడిలా భావించి ఆయనతో మాట్లాడుతుంది. నేను ఆమెపై కూడా నా కోపాన్ని వ్యక్తం చేశా. 'ఆయన ఇలా చేస్తాడా?' అని" అని రాజమౌళి అన్నారు.

**వానరసేన ఫిర్యాదు..**

గ్లోబ్ ట్రాటర్ ఈవెంట్లో టెక్నికల్ ఫెయిల్యూర్ కు హనుమంతుడిని బాధ్యతగా చేసి మాటలనడం వివాదానికి కారణమైంది. నెటిజన్లు, హిందు సంఘాలు రాజమౌళిపై విరుచుకుపడుతున్నాయి. సరూర్ నగర్ పోలీసు స్టేషన్లో రాజమౌళిపై రాష్ట్రీయ వానర సేన సంఘం సభ్యులు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మరో రెండు చోట్ల కూడా రాజమౌళిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.



### మత్స్య సహకార సంఘ సభ్యులకు ప్రభుత్వ సహాయం

- పీఎంఎంఎస్వై పథకం కింద మంజూరైన చెక్కును అందజేసిన సిటీ ఎమ్మెల్యే వాసు

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 21:** ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలోని కోటిలంగాల పేట మత్స్య సహకార సంఘం సభ్యులకు పీఎంఎంఎస్వై పథకం కింద మంజూరైన రూ. 2.54 లక్షల చెక్కును రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. స్థానిక తిలక్ రోడ్డులోని నగర టీడీపీ కార్యాలయంలో ఈ చెక్కును మత్స సహకార సంఘ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో 41వ డివిజన్ ఇన్చార్జ్ దినేష్ కుమార్, మత్స్య శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### పౌర సేవల మెరుగుదల కీలకం

- ఎంఎల్ఎస్ పాయింట్, రైతు సేవా కేంద్రాలను తనిఖీ చేసిన ఆర్డీఓ
- రికార్డులను సమగ్రంగా పరిశీలించిన ఆర్డీఓ కృష్ణ నాయక్

**కోరుకొండ (మనసులో మాట), నవంబరు 21:** రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్ కృష్ణ నాయక్ శుక్రవారం కొరుకొండలోని ఎంఎల్ఎస్ పాయింట్లను పరిశీలించారు. లబ్ధిదారులకు నిత్యావసర సరుకుల పంపిణీ పారదర్శకంగా జరుగుతున్నదని నిర్ధారించేందుకు స్టాక్ లభ్యత, పంపిణీ విధానాలు, స్టాక్ రిజిస్టర్ ఆధారంగా కేంద్రం మొత్తం నిర్వహణను ఖచ్చితంగా పరిశీలించినట్లు తెలిపారు. ఆ తరువాత గాడల గ్రామంలో ఉన్న రైతు సేవా కేంద్రం (ఆర్ఎస్కే)ను సందర్శించి మాయిశ్చర్ మీటర్ పనితీరు, ట్రక్-షీట్ తయారీ విధానాలు, కొనుగోలు ప్రక్రియను సమీక్షించారు. రైతులకు సేవలు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా అందించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వీ సుస్వాగతం, ఆర్ఎస్కే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇళ్లు

- సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కమిషనర్ రాహుల్ మీనా
- 409 మంది లబ్ధిదారులకు గృహ రుణ మంజూరు పత్రాల పంపిణీ





**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 21:** ప్రతీ పేదవానికీ సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వెళుతున్నట్లు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. శుక్రవారం ఆనం కళా కేంద్రంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై)- 2.0 కింద 409 మంది లబ్ధిదారులకు రూ. 10.22 కోట్ల విలువైన గృహ రుణ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. నగర కమిషనర్ రాహుల్ మీనా సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రధానమంత్రి ఆవాస్ యోజన్ 2.0 పథకంలో భాగంగా 409 మంది లబ్ధిదారులకు గృహ రుణ మంజూరు పత్రాలను అందజేయడం ఆనందంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలో నగరంలో రూ.15 కోట్ల వ్యయంతో 3,097 ఇళ్లను నిర్మించి పేదలకు ఇవ్వడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం అరకొరగా రూ. లక్షా 80 వేలు ఇచ్చేదని.. ఇందులో రూ. లక్షా 50 వేలు కేంద్ర సాయం కాగా, రూ. 30 వేలు ఎన్ఆర్ఈజీఎస్ నుంచి మ్యాచింగ్ చేసి ఇచ్చేవారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి నుంచి ఇచ్చిన దాఖలాలు లేవని.. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం రూ. 2.50 లక్షల సాయాన్ని అందజేస్తున్నట్లు వివరించారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ. 1.50 లక్షలు ఇస్తుండగా, రాష్ట్ర వాటాగా రూ. లక్ష సాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. పునాది స్థాయిలో రూ. 60 వేలు, రూఫ్ లెవెల్ లో రూ. 60 వేలు, స్లాబ్ లెవెల్ లో మరో రూ. 60 వేలు, కంప్లీషన్ స్టేజిలో రూ. 70 వేలు విడుదల చేయడం జరుగుతుందన్నారు. వీటితో పాటు లబ్ధిదారులకు ఉచిత ఇసుక పథకం కింద ఒక్కో ఇంటికి సుమారు 20 టన్నుల ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని ఈ ప్రభుత్వం నెరవేర్చుకుంటూ ముందుకు వెళుతోందని ఎమ్మెల్యే అన్నారు. ఆడపడుచులకు ఉచిత బస్సు ప్రయాణం మొదలుకుని 3 గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం ద్వారా ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికి పథకాన్ని వర్తింపజేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే అత్యంత పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నగరంలో 5,800 మందికి కొత్త రైస్ కార్డులు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఏ సంక్షేమ కార్యక్రమానికైనా రైస్ కార్డులే కొలమానమని, కనుక అర్హులెవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవలసిందిగా సూచించారు. అలాగే సదరం స్లాట్ బుకింగ్ ఓపెన్ అయిందని, అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకుంటే జనవరి మాసంలో కొత్త పింఛన్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అలాగే నగరంలో శాంతిభద్రతలను ఎప్పటికప్పుడు పరిరక్షిస్తూ.. మహిళలకు పూర్తి భద్రతను కల్పిస్తున్నట్లు వివరించారు. రానున్న రోజుల్లో పేద ప్రజల కోసం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ.. పేదలందరికీ సొంత ఇల్లు ఉండాలనేది ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కల అన్నారు. ఇందులో భాగంగా మన రాష్ట్రానికి ఈ మధ్య కాలంలో మరో 5 లక్షల నూతన ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. పెద్ద సంఖ్యలో ఇళ్ల నిర్మాణాల ద్వారా దాదాపు 15 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. ఇటు నిర్మాణ రంగం ద్వారా కూడా జీడీపీ వృద్ధికి అవకాశం ఏర్పడుతుందన్నారు. ఈ సందర్భంగా సొంత ఇల్లు నిర్మించుకుంటున్న ప్రతి ఒక్కరికీ ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. కమిషనర్ రాహూల్ మీనా మాట్లాడుతూ పీఎంఏవై - 2.0 ద్వారా ప్రభుత్వం అర్బన్ ఏరియాలలో రూ. 2.50 లక్షల సాయాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.1.50 లక్షలు ఇస్తుండగా, రాష్ట్ర వాటాగా రూ. లక్ష సాయాన్ని అందిస్తున్నట్లు వివరించారు. వీటితో పాటు ఎస్సీ, బీసీ వర్గాలకు అదనంగా రూ. 50 వేలు, ఎస్టీలకు రూ. 75 వేలు, పీవీజీటీలకు రూ. లక్ష అదనంగా ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. ఈ మొత్తాన్ని నాలుగు విడతలలో చెల్లింపులు చేయనున్నట్లు చెప్పారు. కనుక లబ్ధిదారులు నిర్దేశించిన గడువులోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరక్టర్ దాసరి ప్రియ సౌజన్య, పీడీ (హౌసింగ్) బుజ్జి, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు యేసు, అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, ఈఈ (ఇంజనీరింగ్) అలీ, ఈఈ (హౌసింగ్) రాజ్ కుమార్, ఇతర అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

### ప్రజల సమస్యలను పరిష్కరించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యం



**కాకినాడ (మనసులో మాట), నవంబరు 21:** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి కృషి చేయడం జరుగుతుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. శుక్రవారం కాకినాడ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలను (పీజీఆర్ఎస్) స్వీకరించారు. స్వయంగా అర్జిదారుల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రజా సమస్యలను పరిష్కరించడం కోసమే ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించడం జరుగుతుందని, ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు

- జిల్లా రెవెన్యూ అధికారి టీ సీతారామమూర్తి



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 21:** స్థానిక కలెక్టరేట్ పీజీ ఆర్ఎస్ సమావేశ మందిరంలో శుక్రవారం ప్రభుత్వ ఉద్యోగుల ఫిర్యాదులను జిల్లా రెవెన్యూ అధికారి టీ సీతారామ మూర్తి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెల మూడవ శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ డే నిర్వహించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసి ఉద్యోగుల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తున్నామని తెలిపారు. మొత్తం 21 మంది ఉద్యోగులు ఈ రోజు తమ ఫిర్యాదులు సమర్పించారని వివరించారు. గత ఉద్యోగుల గ్రైవేన్స్ లో వచ్చిన అర్జీలపై నివేదిక అనంతర చర్యలపై సమీక్ష నిర్వహించండం జరిగింది. జిల్లా కలెక్టర్ కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాలతో మహిళా ఉద్యోగుల కోసం ప్రభుత్వ కార్యాలయాల్లో వాష్‌రూమ్ సౌకర్యాల ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. ఉద్యోగుల న్యాయబద్ధమైన వినతులపై చర్యలు కొనసాగుతాయని హామీ ఇచ్చారు. కాగా ఉద్యోగులు సమర్పించిన అర్జీలలో ప్రధానంగా.. సీతానగరం మండలం ముగ్గళ్ల గ్రామానికి చెందిన వీఆర్ఓ గోసాల చిన్నా ట్రెజరీ టెక్నికల్ సమస్య కారణంగా నవంబరు జీతం రాలేదని, వెంటనే పరిష్కరించాలని కోరారు. వీ పట్టాభిరామయ్య (గ్రామ సర్వేయర్) గతంలో శస్త్ర చికిత్స జరగటం వల్ల దూర ప్రయాణం చేయలేక, కొంతమూరు లేదా కాతేరు ప్రాంతాలకు డిప్యూటేషన్ ఇవ్వాలని అభ్యర్థించారు. అదేవిధంగా ఏపీజీఈఏ ప్రతినిధులు ఆసుపత్రుల్లో పనిచేసే మహిళా ఉద్యోగులకు డైనింగ్, భద్రతా సౌకర్యాల లేమి, మెడికల్ విభాగంలో ఖాళీల వల్ల ఇబ్బందులు, పారా మెడికల్ సిబ్బందికి యూనిఫామ్ అలవెన్స్ అమలు, ట్రెజరీ అభ్యంతరాల కారణంగా పీహెచ్సీ ఉద్యోగుల అలవెన్స్ బకాయిలు, సచివాలయాల్లో పనిచేస్తున్న వీఆర్వోల జీతాల నిలుపుదల, ఆర్ అండ్ బీ విభాగంలో బదిలీ అయిన ఉద్యోగికి ఎల్పీసీ, ఎస్ఆర్ పంపకపోవడం వల్ల జీతం నిలిపివేత వంటి సమస్యలను వివరించి, వీటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి మహ్మద్ అలీ, జిల్లా ట్రెజరీ అధికారి ఎన్ సత్యనారాయణ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కేవన్ జ్యోతి హౌసింగ్ పీడీ నాతి బుజ్జి, డివిజనల్ పంచాయతీ అధికారి ఎం నాగలత, ఇతర శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### నేడు జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పై గ్రామ సభలు

- ప్రజలకు పారదర్శక సేవలందించడమే లక్ష్యం
- డ్వామా పీడీ ఎం నాగ మహేశ్వర రావు



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 21:** జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఈ నెల 22న గ్రామ సభలు నిర్వహించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం నాగ మహేశ్వరరావు శుక్రవారం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు పారదర్శకతను చేరువ చేయడం, సేవలను గ్రామ స్థాయిలోనే అందుబాటులోకి తేవడం ఈ గ్రామ సభల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పంచాయతీరాజ్ - గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన సేవలను ప్రజల ముందుకు తీసుకువచ్చేందుకు ఈ గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామ సభల్లో కొత్త జాబ్ కార్డు దరఖాస్తులను స్వీకరించి మంజూరు చేయాలని, ఇటీవల ఈ-కేవైసీ సమస్యల కారణంగా రద్దైన లేదా తొలగించిన జాబ్ కార్డులను మళ్లీ పరిశీలించి అర్హులైన వారికి పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉపాధి శ్రామికులు, గ్రామ ప్రజలు ఈ గ్రామ సభల్లో పాల్గొని, తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

### ఈనెల 26వ తేదీన కోనసీమలో ఉప ముఖ్యమంత్రి పవన్ పర్యటన

- జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ -







**అమలాపురం (మనసులో మాట) నవంబరు 21:** ఈనెల 26వ తేదీ బుధ వారం రాజోలు నియోజకవర్గంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటించను న్నారని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడించారు. శుక్రవారం ఉప ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై స్థానిక ఎమ్మెల్యే దేవవర ప్రసాద్, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనాలు సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ బుధవారం ఉదయం 10.30 గంటలకు ఉపము ఖ్య మంత్రి రాజోలు పర్య టనకు వచ్చే అవకాశం ఉన్నదన్నారు. 26వ తేదీ రాజమండ్రి నుండి ప్రత్యేక హెలికాప్టర్లో శివకోడు హెలి ప్యాడ్ చేరుకుంటారని అక్కడి నుంచి కేశనపల్లి, శంకరగుప్తం డ్రయిన్ ఆనుకుని ఉన్న 12 గ్రామాల పర్యటించి దారి పొడవునా కొబ్బరి చెట్లు చనిపోయిన బాధిత రైతులతో మాట్లాడతారన్నారు. తదుపరి శివకోడు చేరుకుని జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న కాపు కళ్యాణ మండపం వద్ద పల్లెపండుగ 2.0 రాష్ట్రస్థాయి మీటింగ్లో పవన్ కళ్యాణ్ పాల్గొంటారన్నారు. ప్రస్తుతం రెండో సంవత్సరం రోడ్డు పనులకు శంకుస్థాపన [illegible] ఆవిష్కరిస్తారన్నారు దీనిలో భాగంగా నియోజకవర్గానికి సంబంధించి ములికిపల్లి కాట్రేని పాడులంక మధ్య 3.21 కోట్లతో నిర్మించబోయే 4.5 కిలోమీటర్లు రోడ్డు కు శంకుస్థాపన చేస్తారన్నారు జాతీయ హరిత ట్రిబ్యునల్ నిధులైన 5 కోట్లతో గుడిమేల్లంక మంచినీటి పథకం రాపిడ్ సాండ్ ఫిల్టర్ శంకుస్థాపన ఓఎన్జిసి సిఎస్ఆర్ నిధులు కింద 7:50 కోట్లతో రాజోలు నియోజకవర్గం లో ఓహెచ్ ఎస్ఆర్ల శంకుస్థాపన చేస్తారని సామాజిక ఆరోగ్య కేంద్రం రాజోలుకు ఎక్విప్మెంట్లు పంపిణీ చేసి మరియు నరేగా అనుసంధానంతో రూ.11.451 కోట్లతో 177 రోడ్లకు శంకు స్థాపన [illegible] ఆవిష్కరిస్తారన్నారు. స్థానిక ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రసంగిస్తూ కేశనపల్లి [illegible] హెలిప్యాడ్లు సిద్ధం చేయా లన్నారు. మొత్తం పర్యటన సమయం సుమారు రెండున్నర గంటలు ఉంటుందని జిల్లా యంత్రాంగం పోలీస్ అధికారులు పర్యటన సంబంధించి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి పర్యటన విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రాహుల్ మీనా జాయింట్ కలెక్టర్ నిశాంతి, డిఆర్ఓ మాధవి జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# రామశర్మ చుట్టూ రాజకీయం?!

- ▸▸ టీడీపీ, వైసీపీ వ్యూహ ప్రతి వ్యూహాలు
- ▸▸ మీడియా సమావేశం అనగానే ప్రెస్ క్లబ్ వద్ద ఉద్రిక్తత
- ▸▸ అటు వైసీపీ శ్రేణులు, ఇటు రుణదాతలు, పోలీసులు..
- ▸▸ వాయిదాపడ్డ రామశర్మ మీడియా సమావేశం



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 21:** రాజమహేంద్రవరం నగరంలో అధికార ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. అధికార పార్టీపై విమర్శలకు వైఎస్సార్ సీపీ, ప్రతిపక్ష వైసీపీపై ఆరోపణలకు టీడీపీ..ఎవరికి వారు వ్యూహ ప్రతి వ్యూహాలతో పావులు కదుపుతున్నారు. అందులోనూ ఇటీవల మాజీ ఎంపీ భరత్ బాల్య స్నేహితుడు, చందా సత్రం మాజీ చైర్మన్ పీ రామశర్మ భరత్ ను ఉద్దేశించి చేసిన అభియోగాలు వైసీపీ శిబిరంలో ప్రకంపనలు పుట్టించాయి. టీడీపీ నేతలు రామశర్మ చేసిన ఆరోపణలు, అభియోగాలతో భరత్ పై చెడుగుడు ఆడుకున్నారు. మద్యం సిండికేట్లతో టీడీపీ నేతలు బేరసారాలపై వైసీపీ నేత మాజీ ఎంపీ భరత్, ఆయన అనుచరులు ప్రతి విమర్శలు గుప్పిస్తున్నారు. ఇదలా ఉంచితే..శుక్రవారం ఉదయం రాజమండ్రి ప్రెస్ క్లబ్ లో రామశర్మ మీడియా సమావేశం ఉందని సమాచారం రావడంతో దాదాపు 20-25 మంది మీడియా ప్రతినిధులు చెప్పిన సమయానికంటే ముందే ప్రెస్ క్లబ్ వద్దకు వచ్చేశారు. అంతకంటే ముందే రామశర్మ కు అప్పు ఇచ్చినట్టు చెబుతున్న (రుణదాతలు) కొందరు ప్రెస్ క్లబ్ వద్దకు వచ్చారు. వీరిలో మహిళలు కూడా ఉండటం గమనార్హం. మరో వైపు నుండి వైసీపీ శ్రేణులు అక్కడ కనిపించారు. క్రమేణా పరిస్థితి ప్రెస్ క్లబ్ వద్ద ఉద్రిక్తతకు దారితీసేలా కనిపించింది. ఈలోగా విషయం తెలుసుకున్న పోలీసులు కూడా ప్రెస్ క్లబ్ వద్దకు వచ్చి పరిస్థితిని పరిశీలించారు. అసలేమి జరుగుతుందో తెలియని పరిస్థితి.

ఇదిలా ఉండగా.. రామశర్మ ప్రెస్మీట్ వాయిదా పడినట్టు మీడియాకు సమాచారం వచ్చింది. రామశర్మ అనారోగ్య కారణంతో మీడియా సమావేశం వాయిదాపడినట్టు చెబుతున్నారు. మొన్నటి ప్రెస్మీట్ లో రామశర్మ..ఎవరికైతే నేను అప్పు ఉన్నానో వారందరికీ అణా పైసలతో సహా తీర్చేస్తానని, అందుకు తనకు కొంత సమయం కావాలని అర్థించిన విషయం తెలిసిందే. అయినా రుణదాతలమని చెబుతూ కొందరు శుక్రవారం ప్రెస్ క్లబ్ వద్దకు రావడం చర్చనీయాంశం అయింది. వీరికి ఉప్పందించినది ఎవరనే చర్చ జరిగింది. అలాగే ప్రెస్ క్లబ్ సమీపంలోను, గణేష్ చౌక్ వెనుక, సమీపంలోని రైతు బజార్ వద్ద, ఇటు గాంధీ విగ్రహం వద్ద..ఇలా జనం గుంపులు గుంపులుగా ఉండి..రామశర్మ గురించి చర్చించుకోవడం గమనార్హం. మహిళలు కూడా రావడం పలు సందేహాలకు దారితీస్తోంది. అలాగే ప్రెస్ క్లబ్ వద్ద పరిసరాలలో వైసీపీ శ్రేణులు సంచరించడం చూస్తుంటే.. ఎందుకింతమంది ప్రెస్ క్లబ్ చుట్టూ ఉండాల్సి వచ్చిందనే ఆసక్తికర చర్చ మీడియా ప్రతినిధులకు కలిగింది. ఈ లోగా పోలీసులు కూడా అక్కడకు రావడం..అసలేమి జరుగుతోందనే ఉత్కంఠ ప్రతి ఒక్కరిలోనూ కలిగింది. ఇదే సమయంలో మీడియా గ్రూప్ ద్వారా రామశర్మ ప్రెస్మీట్ వాయిదా పడిందనే సమాచారం పాత్రికేయ మిత్రులకు వచ్చింది. ఇలా మెస్సేజ్ పడిందో లేదో ఆ వెనువెంటనే ఒకరొకరుగా ప్రెస్ క్లబ్ నుంచి మెల్లిగా జారుకోవడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. అసలు మీడియాకు వచ్చిన సమాచారం సెకన్ల వ్యవధిలో రామశర్మ వ్యతిరేకులకు ఎలా తెలిసిందబ్బా..ఇదే ప్రశ్న మీడియా ప్రతినిధులందరిలోనూ వచ్చింది. మొత్తంపై రామశర్మ ఎపిసోడ్ టీడీపీ, వైసీపీ శ్రేణులలో ఉత్కంఠ, ఆందోళనకు దారితీస్తోంది. ఈ రెండు పార్టీలకు రామశర్మ పావుగా మారారా అనే సందేహం అందరిలోనూ కలుగుతోంది. చూస్తుంటే.. కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపం సామెత గుర్తుకొస్తోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో భరత్ ముఖ్య అనుచరుడిగా బాల్య మిత్రుడిగా రామశర్మ చెప్పిందే శాసనం అన్నట్టు వ్యవహరించిన కీలక నేత..ఇప్పుడు అజ్ఞాత వాసిగా ఎందుకు గడపవలసి వస్తోంది?, ఆయనకు ఎవరి వల్ల హానీ ఉంది?..ఎవరి వల్ల, ఎందుకు ఈ పరిస్థితి వచ్చిందనేది అందరిలోనూ కలుగుతున్న ప్రశ్నలు. మరెన్ని రాజకీయ మలుపులకు రామశర్మ కారణమవుతారో చూడాలి.



# ఉండవల్లి - సోమ భేటీ ఎప్పుడో?!

- ▸▸ అంతా సర్దుకున్నాకా: సోము
- ▸▸ గాంధీ, నెహ్రూ జయంతులు కూడా అయిపోయే..!

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 21:** ఆర్ఎస్ఎస్ అంశంపై ఒకరికొకరు సవాల్..ప్రతి సవాల్ విసురుకున్నారు. సీరియస్ గా మాత్రం కాదు. ఇదంతా అక్టోబరు నెలకు ముందు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పై మాజీ ఎంపీ ఉండవల్లి తన మనసులోని మాట, అభిప్రాయాన్ని మీడియా ఎదుట వ్యక్తపరిచారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను తనదైన శైలిలో వ్యక్తీకరించారు. ఒక విధంగా విభేదించారనే చెప్పాలి. తన బాల్య దశలో ఆర్ఎస్ఎస్ సభలూ సమావేశాలకు వెళ్ళానని, ఆర్ఎస్ఎస్ కు చెందిన 'నమస్తే సదా వత్సలే' పాటను కూడా పాడానని గుర్తు చేసుకున్న ఆయన..గురూజీ మాధవ్ సదాశివరావు గోల్వాల్కర్ రాసిన 'బంచ్ ఆఫ్ థాట్స్' (సంఘ్ బైబిల్) పుస్తకం చదివిన తరువాత ఆర్ఎస్ఎస్ పై తన అభిప్రాయాలను మార్చుకున్నానని తెలిపారు. గురూజీ గోల్వాల్కర్ రెండవ సర్ సంఘ్ చాలక్ గా బాధ్యతలు నిర్వర్తించారు. ఈయన రాసిన పుస్తకంలో కొన్ని పేజీలు చదివాక ఎక్కడో ఏదో తేడా ఉందనిపించిందన్నారు. అప్పట్నుంచీ ఆర్ఎస్ఎస్ పై తన అభిప్రాయాన్ని మార్చుకున్నట్టు తెలిపారు. దీనిపై ఎవరైనా చర్చకు వస్తే అందుకు తాను సిద్ధమేనని ఉండవల్లి పాత్రికేయ ముఖంగా ప్రకటించారు. దీనిపై బీజేపీ సీనియర్ నేత, రాష్ట్ర బీజేపీ మాజీ చీఫ్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు స్పందించారు. ఉండవల్లితో ఈ విషయమై చర్చించేందుకు తాను సిద్ధమేనని ప్రకటించారు. ఒక పుస్తకంలో కొన్ని లైన్లను చదివి ఉండవల్లి తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారని, అయితే పలు సందర్భాల్లో కూడా ఇదే అభిప్రాయాన్ని ఉండవల్లి తెలియజేశారని చెబుతూ.. ఉండవల్లి అరుణ్ కుమార్ సవాల్ ను ఎమ్మెల్సీ సోము స్వీకరించారు. దీనిపై మీడియా ఉండవల్లి దృష్టికి తీసుకు వెళ్ళగా ఆయన సంతోషంగా సోము సవాల్ పట్ల హర్షం వ్యక్తం చేశారు. సోము బీజేపీ సీనియర్ నేత అని, ఆర్ఎస్ఎస్ గురించి పూర్తి అవగాహన కల్గిన వ్యక్తి అన్నారు. ఆర్ఎస్ఎస్ పై ఆయన అభిప్రాయాలను, తనకు తెలియని విషయాలను తెలుసుకునేందుకు ఇదొక చక్కని అవకాశంగా భావిస్తున్నట్టు ఉండవల్లి సంతోషం వ్యక్తం చేశారు. సోముతో తాను స్నేహపూర్వక వాతావరణంలో చర్చించేందుకు సిద్ధమే అన్నారు. సమయం, స్థలం ఎప్పుడనేది తనకు ఒక నాలుగు రోజులు ముందు తెలియజేస్తే తప్పకుండా వస్తానని ఉండవల్లి మీడియాకు తెలిపారు. దీనిపై ఎమ్మెల్సీ సోము స్పందిస్తూ అక్టోబర్ 14 గాంధీ జయంతి తరువాత తప్పక ఇద్దరం భేటీ అవుతామని చెప్పారు. ఈ మధ్యలో శాసనమండలి సమావేశాలు ఉన్నాయని, అవి ముగియగానే.. కూర్చుంటామని తెలిపారు. ఇది కేవలం ఒక అంశంపై చర్చ తప్పిస్తే సవాల్, ప్రతి సవాల్ కాదని, సం'వాదన' మాత్రమే అన్నారు. ఎమ్మెల్సీ సోము చెప్పిన అక్టోబరు 14 గాంధీ జయంతి వెళ్ళిపోయింది, నవంబరు 14 నెహ్రూ జయంతి వెళ్ళిపోయింది. రెండు రోజుల క్రిందట మళ్ళా ఇదే విషయాన్ని మీడియా ఎమ్మెల్సీ సోము వీర్రాజును ప్రశ్నించింది. దానికి ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందిస్తూ.. "తప్పకుండా కూర్చుంటాం. అంతా సర్దుకున్నాక.. కూర్చుంటామని" సమాధానం చెప్పారు. ఇంతకూ సద్దుకోవడం ఏమిటో..సదరు మీడియా ప్రతినిధికి అర్థం అయిందో లేదో తెలియదు కానీ..ఆ వీడియో చూసిన ఎవరికీ క్లారిటీ రాలేదు. కాస్త ఎమ్మెల్సీ సోము వీర్రాజు స్పష్టత ఇస్తే బాగుంటుంది. ఇరువురి మధ్య జరిగే 'సంభాషణలను' వినేందుకు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలే కాదు..నగర వాసులంతా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. త్వరగా పరిస్థితులన్నీ సద్దిమణిగి..ఒక ఆరోగ్యకరమైన ఆహ్లాదకర వాతావరణంలో ఉండవల్లి, సోము భేటీ జరగాలని అంతా భావిస్తున్నారు. త్వరలోనే ఆ సమయం రావాలని ఆకాంక్షిస్తున్నారు.



## మాక్ అసెంబ్లీకి సీఎంహెచ్ విద్యార్థి

**- నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానం**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 21:** అసెంబ్లీ నిర్వహణను టీవీల్లో చూడటం తప్ప విద్యార్థులకు దీనిపై అవగాహన ఉండదు. పాఠశాల విద్యార్థులు అసెంబ్లీలో అడుగుపెట్టే అవకాశాన్ని విద్యా శాఖ అందుబాటులోకి తీసుకొచ్చింది. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న అమరావతిలో విద్యార్థులతో రాష్ట్ర స్థాయి స్టూడెంట్ మాక్ అసెంబ్లీ నిర్వహణకు చర్యలు చేపట్టింది. అందుకు అనుగుణంగా పాఠశాల, మండల, జిల్లా, నియోజక వర్గ స్థాయిలో పోటీలు నిర్వహించి నియోజకవర్గం నుండి ఒకరిని అమరావతి అసెంబ్లీలో మాక్ అసెంబ్లీకి ఎంపికజేశారు. స్థానిక వంకాయల వారి వీధిలో గల సిటీ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థి కాండ్రేగుల ఐజాక్ కుమార్ ఎంపికయినట్టు ప్రధానోపాధ్యాయుడు పీ దుర్గా ప్రసాద్ తెలిపారు. తమ పాఠశాల నుండి విద్యార్థి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మాక్ అసెంబ్లీలో తొలి సారి అసెంబ్లీకి అడుగు పెడుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. సిటీ నియోజకవర్గ నుండి ఎంపికైన కాండ్రేగుల ఐజాక్ కుమార్ ను జిల్లా విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు, అర్బన్ రేంజ్ డీఐ బీ దిలీప్ కుమార్ అభినందించారు.

## గోదావరిలో చేప, రొయ్య పిల్లల విడుదల

**-మత్స్యకారుల అభివృద్ధే లక్ష్యం - కలెక్టర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి**





**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 21:** రాజమహేంద్రవరం రూరల్ ధవళేశ్వరం కంచర్ల ఘాట్ వద్ద శుక్రవారం ఉదయం ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని గోదావరిలో 50 లక్షల చేప పిల్లలు, 5 లక్షల రొయ్య పిల్లలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి వ ా ట్లా ్డ ు త ా మత్స్యకార కుటుంబాల సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని తెలిపారు. చేపల వనరుల పెంపుతో పాటు, లైసెన్స్ వ్యవస్థను కచ్చితంగా అమలు చేయడం ద్వారా ప్రతి కుటుంబాన్ని ప్రభుత్వ పథకాల పరిధిలోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జిల్లాలో సుమారు 4 వేల మంది వేట వృత్తిలో ఉన్నప్పటికీ, అనేక మంది లైసెన్స్ లేకుండా పని చేస్తుండటాన్ని గుర్తించి, ఈ నెలాఖరులోగా ప్రతి మత్స్యకార కుటుంబం రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలనే దిశగా మత్స్య, రెవెన్యూ శాఖలకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. సచివాలయంలో రూ.120 (బోట్, నెట్), రూ.50 (విసుర వల) ఫీజుతో లైసెన్స్ దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని, లైసెన్స్ పొందిన వారికి గ్రూప్ ఇన్సూరెన్స్‌తో పాటు అన్ని పథకాల ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వివరించారు. సభాధ్యక్షుడు, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ భారత దేశంలో చేపల ఉత్పత్తిలో 25.64 శాతం, రొయ్యల ఉత్పత్తిలో 75 శాతం ఆంధ్రప్రదేశ్ నుండి వస్తున్నదంటే రాష్ట్ర ఆక్వా రంగం ఎంత శక్తివంతంగా ఉందో స్పష్టమవుతోందని తెలిపారు. వ్యవసాయం, ఐటీ వంటి రంగాలకు సమాన ప్రాధాన్యంతో ఆక్వా రంగాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, దీనివల్ల రాష్ట్ర జీడీపీ పెరుగడమే కాక ప్రజల ఆర్థికాభివృద్ధి కూడా సాధ్యమవుతుందన్నారు. మత్స్యకారులు ఎదుర్కొంటున్న మార్కెట్ సవాళ్లను తగ్గించేందుకు చేపలకు 20 శాతం సైజ్‌కు రూ.530ల ధరను నిర్ధారించడం, రొయ్యలకు 20 నుండి 100 కౌంట్ల ధరలు ప్రకటించడం వంటి చర్యలు చేపడుతున్నామని వివరించారు. గోదావరి పరీవాహక ప్రాంతంలో వేటపై ఆధారపడి ఉన్న దాదాపు రెండు వేల కుటుంబాల జీవనాధారాన్ని కాపాడేందుకు చేపలు పెరిగే కాలంలో వేట నిషేధాన్ని కచ్చితంగా అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలియజేశారు. ఈ లోటును భర్తీ చేసేందుకు 80%-%1000 ఎమ్ఎమ్ సైజుల్లో నాణ్యమైన చేప పిల్లలను నదిలో వదలడం ద్వారా వనరులు పెంచడమే కాక 90 శాతం సర్వైవల్ రేటు సాధించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మొంథా తుపాను వంటి విపత్తుల సమయంలో ఆదాయం కోల్పోయిన మత్స్యకారులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించా మన్నారు. కార్యక్రమంలో భాగంగా ఉత్తమ మత్స్యకారుల సహకార సంఘ ఇద్దరు అధ్యక్షులకు సత్కారం, ఫిష్ సీడ్ ఫామ్, కడియం, మొంథా తుపానులో ఉత్తమ సేవలను అందించినందుకు ఉత్తమ గ్రామ మత్స్య సహాయకులకు సత్కారం, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల రాజమహేంద్రవరంలోని యుజీ, పీజీ విద్యార్థులకు గ్రాడ్యుయేట్ ఇంటర్న్ షిప్ ప్రోగ్రామ్ విజయవంతంగా పూర్తి చేసిన 30 మందికి సర్టిఫికెట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆర్ కృష్ణ నాయక్, ఫిషరీస్ జేడీ ఎన్ నిర్మలా కుమారి, మత్స్యకారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, టీడీపీ మండల అధ్యక్షుడు మత్స్యేటి ప్రసాద్, రాష్ట్ర కుమ్మరి శాలివాహన డైరెక్టర్ పందురి అప్పారావు, పుక్కళ్ల రాజు, తలారి మూర్తి, ఎడ్ల మహేష్, గుర్రాల వెంకట్రావు, ఆళ్ల ఆనందరావు, తహసీల్దారు శ్రీనివాస్, ఎంపీడీఓ సునీల్ ఆర్మ్ స్ట్రాంగ్, పంచాయతీ కార్యదర్శి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.


## సామర్లకోటలో వైయస్సార్ కాంగ్రెస్ కోటి సంతకాల సేకరణ



**పెద్దాపురం, (మనసులో మాట) నవంబర్ 21..** కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణంలో శుక్రవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఇంటింటా కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. మెడికల్ కళాశాలలో ప్రభుత్వం ప్రై వే టీ క రి ం చ డా ని కి నిరసనగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పెద్దాపురం నియోజకవర్గ ఇన్చార్జ్ దవులూరి దొరబాబు, సామర్లకోట టౌన్ అధ్యక్షులు పాగా సురేష్ కుమార్, ఉపాధ్యక్షులు ఇరుసుమల్ల సాయి సత్యనారాయణ ఆధ్వర్యంలో పార్టీ నేతలు కార్యకర్తలు ఇంటింటా కోటి సంతకాల సేకరణ చేపట్టారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని దొరబాబు డిమాండ్ చేశారు. పేదల కోసం, పేద విద్యార్థుల కోసం, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరంతర పోరాటాన్ని సాగిస్తుందని మున్సిపల్ వైస్ చైర్మన్ జాన్ మోజేష్, సామర్లకోట ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు తెలిపారు. సామర్లకోట ఒకటో వార్డు, తదితర ప్రాంతాల్లో కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. కౌన్సిలర్లు రెడ్డి లోవ కుమారి శ్రీనివాస్, పెండ్యాల వెంకటలక్ష్మి అబ్బు, పాలిక కుసుమా చంటిబాబు, చిట్టి మాని శ్రీనివాసరావు, పలువురు నేతలు కార్యకర్తలు కోటి సంతకాల సేకరణలో పాల్గొన్నారు.

## ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ప్రజాదర్బార్

**కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**



**ఆత్రేయపురం( మనసులో మాట) నవంబర్ 21..** ప్రజా దర్బార్ వేదికగా ప్రజల సమస్యలను, సత్వరమే పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. శుక్రవారం రావులపాలెం క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల ప్రజలు తమ వినతులను అందజేశారు. వాటిని పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ ను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని, అధికారులు ప్రజలకు జవాబుదారిగా ఉండాలన్నారు. మొత్తం 312 వినతులు ప్రజల నుంచి అందగా పలు సమస్యలను అప్పటికప్పుడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏలేశ్వరంలో డిసెంబర్ 18 వినోద్ మిశ్రా వర్ధంతి

**సిపిఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా ఆర్గనైజాయినింగ్ రాష్ట్ర కార్యదర్శి కోసిరెడ్డి గణేశ్వరావు**



**ఏలేశ్వరం (మనసులో మాట) నవంబర్ 21..** వచ్చే డిసెంబర్ నెల 20వ తేది శనివారం ఏలేశ్వరం లోని వినోద్ మిశ్రానగర్ లో కామ్రేడ్ చారు మజుందార్ షహీద్ భగత్ సింగ్ ల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహింస్తున్నట్లు సి పి ఐ ఎం ఎల్ వినోద్ మిశ్రా రాష్ట్ర ఆర్గనైజషన్ కమిటీ కార్యదర్శి కోసిరెడ్డి గణేశ్వరావు శుక్రవారం తెలిపారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి భారీ ర్యాలీని ప్రజలంతా విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఏలేశ్వరంలో వినోద్ మిశ్రా నగర్ లో పాంప్లెట్స్ సిపిఐ ఎంఎల్ వినోద్ మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో విడుదల చేసినట్లు ఆయన చెప్పారు. వచ్చే నెల డిసెంబర్18 వినోద్ మిశ్రా వర్ధంతి పురస్కరించు కొని డిసెంబరు 20 వ తేది శనివారం ఉదయం 9 గంటలకు ఏలేశ్వరం ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి భారీర్యాలీ జరుగుతుందన్నారు. ఉదయం భాస్కర్ కళాబృందం వారిచే ఆటపాట కొమ్ము డాన్సులు తీన్మార్ తప్పిడి గుళ్ళు కోలాటం కోందుల దింసా డప్పుల తో నృత్యాలు తో ర్యాలీ చేసిన తర్వాత వినోద్ మిశ్రా నగర్ లో చారుమజుందార్ షాహిద్ భగత్ సింగ్ విగ్రహవిష్కరణకార్యక్రమం ఉంటుందాన్నారు. అనంతరం కమ్యూనిటీ హాలులో మహాసభ జరుగుతుందని తెలిపారు. ఏలేశ్వరం మండలంలో 11 స్థానిక సమస్యలు ప్రదానం గా ఉన్నట్లు ఆ పాంప్లెట్స్ లో పొందుపర్చమని గణేశ్వరావు వివరించారు. ఎన్డీఏ కోటమి ప్రభుత్వం ఈ 18 నెలల్లో చేసిన వైఫల్యాలను ఎత్తి చూపిస్తూ ప్రజా పోరాటాల వేదిక ద్వారా ప్రజల కు తెలపడం జరుగు తుందన్నారు. సిపిఐ ఎంఎల్ వినోద్ మిశ్రా ప్రజా గొంతుఎత్తి ప్రశ్నిద్దాం అన్యాయాలను ప్రతికటిద్దాం అనే పాంప్లెట్స్ పట్టుకున్న కార్యక్రమంలో కందుల ప్రసాదు కొంతం సోమరాజు ఎలమర్తి మనీ అనకాపల్లి కుమారి కందుల వరలక్ష్మి సాచపల్లి సీత వెన్నెమంగా కాకర నాగమణికమ్మ దుఃఖనూకరాజు చందక ఉష పశ్చిమళ్ళ సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో సోమనాథ్ వజ్ర శివలింగం పురవీధుల్లో రథోత్సవం

**జండా ఊపి రథోత్సవం ప్రారంభించిన ఎమ్మెల్యే నల్లమిల్లి**



**అనపర్తి (మనసులో మాట) నవంబరు 21:** స్థానిక బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో సహస్ర శివలింగం ప్రముఖ జ్యోతిర్లింగమైన సోమనాథ్ వజ్ర శివలింగం రథోత్సవం ఘనంగా జరిగింది. తొలుత అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డిచే జ్యోతి ప్రజ్వలన చేసి జెండా ఊపి రథోత్సవం ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ నేడు అనపర్తికి చేరుకుంన్న, ఈ రథోత్సవంలో సుబ్రహ్మణ్యస్వామి మాలదారులు, అయ్యప్ప మాలదారులు, స్థానిక భక్తులు కలశములు, జెండాలు చేతబట్టుకుని గ్రామంలో రథంతో ఓం నమశ్శివాయ అంటూ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అనపర్తి బ్రహ్మకుమారిస్ ఇంచార్జ్ సుశీల, కాకినాడ చెందిన నాలుగు జిల్లాల ఇంచార్జ్ రజిని అక్కయ్య, పాలకొల్లు ఇంచార్జ్ చక్రధర్, మీరా అక్కయ్య, లక్ష్మీ అక్కయ్య తదితర బ్రహ్మకుమారిస్, కూటమికి చెందిన నాయకులు, పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సత్యసాయి శత జయంతి వేడుకలకు ఆత్రేయపురం పూతరేకులు



**ఆత్రేయపురం మనసులో మాట నవంబర్ 21..** భగవాన్ సత్యసాయి శతజయంతి వేడుకలకు ఆత్రేయపురం పూతరేకులు తీసుకు వెళ్లే వాహనాలను. వాడపల్లి అలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, కాషాయ జెండా ఊపి ప్రారంభించారు. రాజమహేంద్రవరం సత్యసాయి భక్త సమాజం, ఆత్రేయపురం ఫికానా ఫుడ్స్ లో తయారుచేయించి శుక్రవారం పుట్టపర్తి పంపిచడం జరిగింది.. భగవాన్ సత్య సాయి బాబా నూరవ జన్మదిన వేడుకలులకు, పూతరేకు పుట్టిల్లు ఆత్రేయపురం నుండి ఫికానా ఫుడ్స్ గాదిరాజు ప్రసాదరాజు ఆధ్వర్యంలో తయారుచేసిన పూతరేకులు తరలించారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం సత్యసాయి భక్త సమాజం ప్రతినిధులు గంటా హనుమంతరావు, సాయిరాం , కాటికనేని రామకృష్ణారావు , చేకూరి రమేష్ సుబ్బరాజు, దండు బాబు, ముదునూరు శ్రీనివాసరాజు, రుద్రరాజు సుబ్బాబు, గుంటూరు ఆంజనేయరాజు తదితరులు పాల్గొన్నారు.



## మండల ఉత్తమ ఆక్వా రైతుగా సత్యనారాయణ

**కాజులూరు (మనసులో మాట) నవంబరు 21..** మండల ఉత్తమ ఆక్వా రైతుగా కాజులూరు గ్రామానికి చెందిన వట్టూరి వీర వెంకట సత్యనారాయణ ఎంపికయ్యారు. ప్రపంచ మత్స్య దినోత్సవం ను పురస్కరించుకుని శుక్రవారం కాకినాడ మత్స్య శాఖ కార్యాలయంలో అవార్డును జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ కాకినాడ పట్టణ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ చేతుల మీదుగా అవార్డును సత్యనారాయణ అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు అందుకున్న సత్యనారాయణ మండల కేంద్రమైన కాజులూరులో మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా ఆక్వా సాగు చేస్తున్నని ఈ నేపథ్యంలో ఈ అవార్డు రావడం చాలా గర్వంగా ఉందన్నారు.రొయ్యల సాగులో 25 ఏళ్లపాటు తన జీవితాన్ని అంకితం చేసి, కొత్త పద్ధతులు, ఆధునిక సాంకేతికతలను వినియోగిస్తూ, పర్యావరణానికి అనుకూలంగా చేపట్టిన సాగుతో మండలంలో ఆదర్శ రైతుగా గుర్తింపు పొందిన ఆయనకు "మండల ఉత్తమ ఆక్వా రైతు" పురస్కారం లభించింది."ఈ అవార్డు నా వ్యక్తిగత విజయమే కాదు, మా కుటుంబం, మా గ్రామం, మరియు నన్ను మద్దతిస్తూ నిలిచిన అధికారులందరి ఆశీస్సుల ఫలితం," అని అన్నారు. గత రెండున్నర దశాబ్దాలుగా రొయ్యల సాగులో నాణ్యత, ప్రామాణికత, శుభ్రతపై దృష్టిపెట్టి, కొత్త పద్ధతులను అనుసరించి అధిక దిగుబడులు సాధించిన సత్యనారాయణ ఇకపై మరింత ఆధునికీకరణతో సాగును మరింత విస్తృత పరుస్తానన్నారు. ఆక్వా రంగంలో నూతన ఆవిష్కరణలకు మార్గం చూపుతూ, యువ రైతులకు స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తున్న సత్యనారాయణ ను స్థానిక ఆక్వా రైతులు అభినందించారు.

## మాక్ అసెంబ్లీ కి ఎంపికైన సహస్ర



**కాజులూరు (మనసులో మాట) నవంబరు 21..** రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నవంబర్ 26 న అమరావతి శాసనసభ లో పాఠశాల విద్యార్థులతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మాక్ అసెంబ్లీకి రామచంద్రాపురం నియోజకవర్గం నుండి తమ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థిని యాళ్ళ సహర్ష ఎంపిక అయినట్టు కాజులూరు జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మార్ని విష్ణుమూర్తి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన కాజులూరు జిల్లా పరిషత్ పాఠశాలలో హెచ్ఎం విష్ణుమూర్తి ఒక ప్రకటనలో తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు భారత దేశ రాజ్యాంగ గొప్పదనం తెలియజేయడం కోసం ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఒక విద్యార్థి ను వారి సహపాఠ్య కార్యక్రమాలలో ప్రతిభ మరియు విద్యా ప్రగతి ఆధారంగా ఎన్నిక చేయడం జరిగిందని, వాటన్నింటిలో అత్యంత ప్రతిభ కనబరిచిన సహర్ష మాక్ అసెంబ్లీ కి ఎన్నిక కావడం నియోజకవర్గానికే గర్వకారణం అని ఆయన అన్నారు.. నవంబర్ 26 న అమరావతి శాసనసభలో మన నియోజకవర్గ ఎమ్. ఎల్. ఏ పాత్ర పోషించి వివిధ ప్రజా సమస్యలు మీద, రాజ్యాంగ విధి విధానాలు, శాసనసభ కార్యకలాపాలు వంటి అంశాలు మీద మాట్లాడే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించడం చాలా మంచి సాంప్రదాయం అని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాక్ అసెంబ్లీ కి ఎంపిక కావడం పట్ల పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పెంటపాటి పద్దరాజు, మండల విద్యా శాఖాధికారులు ఎస్. డేవిడ్ , పి.జాన్ లు, ఎంపీడీవో రాంబాబు ,తాహసిల్దార్ జి .రవీంద్రనాథ్ ఠాగూర్ ,ఫస్ట్ అసిస్టెంట్ చింతా నారాయణ మూర్తి, పాఠశాల విద్యాదాత అన్యం శ్రీ రామ చంద్ర మూర్తి, స్టాఫ్ సెక్రటరీ కె.హరనాథ్, ఉపాధ్యాయులు బాషా,కె.సత్య ప్రసాద్, లక్ష్మీ కామేశ్వరీ,గుత్తుల విజయ లక్ష్మి, బుజ్జి బాబు, సుబ్రహ్మణ్యం గ్రామస్తులు అభినందించారు.


## ఆంధ్రప్రదేశ్ ఎస్టి కమిషన్ చైర్మన్ నుసన్మానించిన రౌతులపూడి మండల గిరిజన నాయకులు



**రౌతులపూడి, (మనసులో మాట) నవంబర్ 21..** కాకినాడ జిల్లాకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ సొల్లా బొజ్జిరెడ్డి నీ రౌతులపూడి మండల గిరిజన నాయకులు ఈగల సత్తిబాబు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆయనను సబ్ ప్లాన్ గిరిజన గ్రామాల్లో పర్యటించాలని ఆయన్ని త్వరగా బొజ్జి రెడ్డి సానుకూలంగా స్పందించారు సబ్ ప్లాన్ గ్రామాల్లో పర్యటించి గిరిజన సమస్యలను పరిష్కరిస్తానని బోజ్జి రెడ్డి తెలిపారు ఈ కార్యక్రమంలో రౌతులపూడి మండల గిరిజన నాయకులు పోలోజు వరహాలు, బి. నాగబాబు, పి సూరిబాబు, పి తరుణ్, పి సాయి పాల్గొన్నారు.

## మత్స్య వనరులను భవిష్యత్తు తరాలకు అందించే

# లక్ష్యంతో పని చేయాలి





**కాకినాడ (మనసులో మాట)నవంబరు 21:** మత్స్యకారుల సుస్థిరజీవనోపాధిని పెంపొందించేందుకు, మత్స్య వనరులను భవిష్యత్తు తరాలకు అందించే లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న తోడ్పాటును మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ రూరల్ లోని ఫిషింగ్ హార్బర్ జెట్టి నెంబర్ 1లో జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కాకినాడ పార్లమెంటు సభ్యులు తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ షణ్మోహన్, శాసనమండలి సభ్యులు కర్రీ పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ ముఖ్య అతిథులుగా హాజరై 50 వేల పండుగప్ప చేప పిల్లలను సముద్రంలోకి విడుదల చేశారు.

అనంతరం కాకినాడ జగన్నాధపురం రాష్ట్ర మత్స్య సాంకేతిక సంస్థ (ఎస్ఐఎఫ్టీ)లో నిర్వహించిన ప్రపంచ మత్స్యకార దినోత్సవ సభలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కాకినాడ పార్లమెంటు సభ్యులు తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మొట్టమొదటిగా కాకినాడ జిల్లాలో తమిళనాడు రాజీవ్ గాంధీ సెంటర్ ఫర్ ఆక్వా కల్చర్ నుంచి తీసుకువచ్చిన 50 వేల పండుగప్పలు విడుదల చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో ఫాంపినో, టైగర్ రొయ్య పిల్లలు సముద్రంలో విడుదల చేసేందుకు ప్రయత్నం చేస్తామని ఆయన తెలిపారు. ప్రాముఖ్యంగా కాకినాడ ఫిషింగ్ అర్బన్ ఆధునికరించేందుకు కావలసిన రూ.90 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం నుండి విడుదల చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ద్వారా కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియం చేసుకోవాలని ఎంపీ తెలిపారు.

జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ.. ప్రపంచ మత్స్యకార దినోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. కాకినాడ జిల్లాలో 119 కిలోమీటర్ల సముద్ర తీర ప్రాంతతో 6 కోస్తా మండలాలు, 51 సముద్ర మత్స్యకార గ్రామాలు ఉన్నాయన్నారు. మత్స్యకార దినోత్సవ సందర్భంగా తన దృష్టికి తీసుకువచ్చిన కాకినాడ ఫిషింగ్ హార్బర్ కు అవసరమైన బేతమెట్రిక్ సర్వేను పూర్తిగా త్వరితగతిన పూర్తి చేయించి కేంద్ర ప్రభుత్వం నుండి హార్బర్ ఆధునికరణకు నిధులు మంజూరుకు అవసరమైన నివేదికను తయారు చేసి, పంపించడం జరుగుతుందన్నారు. మత్స్యకారుల సుస్థిర జీవనోపాధిని పెంపొందించేందుకు, మత్స్య వనరులను భవిష్యత్తు తరాలకు అందించే లక్ష్యంతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న తోడ్పాటును మత్స్యకారులు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ప్రాముఖ్యంగా ప్రభుత్వ క్లైమేట్ రిలీజియంట్ పోస్టల్ ఫిషర్మెన్ విలేజ్ (సీ.ఆర్.సీ.ఎఫ్.వీ) పథకం కింద తీర ప్రాంతంలో కమ్యూనిటీ హాళ్లు, నూరు శాతం రాయితీపై జీవనోపాధి పరికరాలు సరఫరా చేయడం ద్వారా తీర ప్రాంత గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించే దిశగా అడుగులు వేయడం జరుగుతుందని ఇందుకు కాకినాడ జిల్లాలో కూనపాపేట గ్రామాన్ని ఎంపిక చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు.

ఈ సందర్భంగా కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ మాట్లాడుతూ మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియం చేసుకోవాలన్నారు. మత్స్యకారుల జీవన విధానంలో కొత్త వరవడిని తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. గత మొంథా తుఫాను కాలంలో మత్స్యకారులు అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎంతగానో సహకారాన్ని అందించి జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లడంతో ప్రాణ నష్టం జరగలేదన్నారు. కూటమి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, కాకినాడ రూరల్ నియోజకవర్గం లోని సూర్యాపేట, హార్బర్ పేట అభివృద్ధికి తన వంతు కృషి చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. కాకినాడ పట్టణం శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. 1996లో వచ్చిన భారీ తుఫాను మత్స్యకారులకు కలిగించిన నష్టాన్ని స్వయంగా పరిశీలించిన అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మత్స్యకారులకు ప్రత్యేక సంక్షేమ పథకాల అమలు చేయడం ప్రారంభించారన్నారు. అప్పటినుంచి మత్స్యకారులకు ఫైబర్ బోట్లు అందించడం మొదలుపెట్టారని. 2014-19 కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం కాకినాడ పట్టణంలో చాపల మార్కెట్లను ఆధునికరించడంతో ఎంతోమంది మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపడిందన్నారు. వేట నిషేధ కాలం ఏప్రిల్ 15 నుండి జూన్ 15 వరకు గల రెండు నెలల కాలానికి ప్రభుత్వం ప్రతి మత్స్యకార కుటుంబానికి రూ. 20 వేలు చొప్పున నిషేధ భృతిని సకాలంలో అందించిందని ఆయన గుర్తు చేశారు. చనిపోయిన మత్స్యకారులకు ఆర్థిక పరిహారం, ఇతర సంక్షేమ పథకాలనకు గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూపకల్పన చేశారని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వలలు ఇతర వేట పరికరాలపై 12 నుంచి 5 శాతం జీఎస్టీ రేట్లను తగ్గించడం ద్వారా ఎంతోమంది మత్స్యకారులకు ప్రయోజనం చేకూరిందన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా అందించే ఇంజన్లను, వలలు, ఇతర వాహనాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శాసనమండలి సభ్యులు పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ.. ప్రపంచ మత్స్యకార దినోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడం జరుగుతుందన్నారు. మత్స్యకారులు సముద్రంపై వేటకు వెళ్లిన సందర్భాల్లో తుఫాను ఇతర విపత్తులు సంభవించినప్పుడు టెక్నాలజీ ద్వారా సమాచారం అందజేసేందుకు మత్స్యకారులకు ట్రాన్స్ పాండర్స్ ను పీఎంఎంఎస్ పథకం కింద ఉచితంగా సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఈ ట్రాన్స్ పాండర్స్ తో మత్స్యకారులు సముద్రంలో ఎక్కడ ఉన్నా.. కచ్చితంగా తెలుసుకోవచ్చని, మెడికల్ ఎమర్జెన్సీ, ఫైర్ యాక్సిడెంట్ ఇతర ప్రమాదాలను గుర్తించి సమాచారం అందించేందుకు, సముద్ర జల సరిహద్దులు నావిగేషన్ చేసేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. ఎమ్మెల్సీ కరి పద్మశ్రీ మాట్లాడుతూ.. భారత ప్రభుత్వం ఇటీవల మత్స్యకారులు తీరం నుండి 200 నాటికల్ మైళ్ళు ( 340 కిలోమీటర్ల వరకు) చేపల వేట చేసుకొనుటకు అనుమతిస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం శుభపరిణామం అన్నారు. దీని ద్వారా లోతట్టు జలాలలో గల ట్యూనా చేపలను అధికంగా వేటాడేందుకు అవకాశం మత్స్యకారులకు దొరుకుతుందని ఆమె తెలిపారు. మత్స్యకారులు బాధ్యతాయుతగా చేపల వేటాడటం ద్వారా మత్స్య సంపదను పరిరక్షించుకోనేందుకు అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు.

కాకినాడ ఎస్ఐఎఫ్టీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ అంజలి మాట్లాడుతూ యాంటీబయోటిక్స్ ఉపయోగించని ఆక్వా ఉత్పత్తులతో అంతర్జాతీయ మార్కెట్లో మన రైతులకు గిరాకీ ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. యాంటీబయోటిక్స్ పరీక్షలకు కాకినాడ స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ప్రత్యేక ల్యాబ్ ను ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సదుపాయాన్ని అక్వా రైతులు, ఎక్స్ పోటర్లు వినియోగించుకోవాలని ఆమె తెలిపారు.

జిల్లా మత్స్యశాఖ అధికారి వి. కృష్ణారావు మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో 23 వేల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతుందన్నారు. ఆక్వా రైతుల చెరువులను ఆక్వా జోన్లో చేర్చుట ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.1.50 పైసలకు ఒక్క యూనిట్ విద్యుత్తు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. దీని ద్వారా ఒక్కొక్క ఆక్వా రైతుకు ఒక హెక్టార్ కు ఒక నెలకు సుమారు రూ.22 వేలు రాయితీ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కాకినాడ జిల్లాలో 66 ఇన్లాండ్ సొసైటీలకు 137 మైనర్ ఇరిగేషన్ చెరువులు, 451 గ్రామపంచాయతీ చెరువులను, నాలుగు రిజర్వాయర్లు నామమాత్రపు లీజుకు మత్స్యకార సొసైటీలకు ఇవ్వడం ద్వారా 5,153 కుటుంబాలకు ప్రభుత్వం అదనపు ఆదాయం చేకూర్చిందని ఆయన తెలిపారు. అనంతరం ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని మత్స్యకార రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన మత్స్యకారులు, హేచరీస్ ప్రతినిధులు, బోటు ఓనర్లు, సొసైటీ యజమానులు, ఆక్వా రైతులు, ఫీడ్ రిపోర్టర్, సొసైటీలు, మత్స్యశాఖ అధికారులకు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు చేతుల మీదుగా ప్రత్యేక అవార్డులను అందించి, సత్కరించారు.కార్యక్రమంలో జిల్లా మత్స్య సహకార సంఘాల ప్రెసిడెంట్ బాలసాడి రంగారావు, మత్స్యశాఖ సహాయ సంచాలకులు కె.కరుణాకర్, లావణ్య, మత్స్యశాఖ అభివృద్ధి అధికారులు అనురాధ, రాజేంద్ర రావు, డా. గోపి, నూకరాజు, ఉమామహేశ్వరరావు, శ్రీరామకృష్ణ, మత్స్యకారులు పాల్గొన్నారు.

## మత్స్యకార డ్వాక్రా మహిళలకు నాచు, పీతలు చేపలు పెంపకం పై సబ్సిడీ రుణాలు

### జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్



**అమలాపురం (మనసులో మాట) నవంబరు 21:** సముద్రపు తీర ప్రాంత మ త్స్యకారుల డ్వాక్రా మహిళలు సముద్ర నాచు పీతలు ఆర్న మెంట్ చేపలు పెంపకంపై ప్రత్యేక ఫోకస్ పెట్టి అధిక ఆదాయాన్ని ఆర్జించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ సూచించారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చిర్రయానం తీర ప్రాంతం లో తొలిదశలో 12 యూనిట్లుకు సంబంధించి ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సముద్రపు నాచు సాగు యూనిట్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూసముద్రపు నాచు తయారీ ప్రత్యా మ్నాయ జీవనోపాధిగా నిలుస్తుందన్నారు తదుపరి దశలో పది యూనిట్లు పీతలు పెంపకానికి చర్యలు తీసుకుంటామని తదుపరి 7 యూనిట్లు రంగు (ఆర్న మెంట్) చేపల పెంపకానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. మొత్తం 29 యూనిట్లు రూ 11 లక్షల 10 వేల అంచనా వ్య యంతో చేపట్టినట్లు తెలిపారు. సముద్రపు నాచు సాగు యూనిట్ కు రూ18,000 పెట్టుబడి వ్యయంగా నిర్ధారించగా దీనిలో గ్రీన్ క్లైమేట్ ఫండ్ సబ్సిడీగా రూ 11,662 లు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద సబ్సిడీగా రూ. 6,338 లు అందించనున్నారు. దీనికి అదనంగా డ్వాక్రా రుణం కూడా అందిస్తారని కలెక్టర్ తెలిపారు. పీతల యూనిట్కు పెట్టుబడి వ్యయం రూ 19,404 కాగా దీనిలో గ్రీన్ క్లైమేట్ ఫండ్ సబ్సిడీ రూ 19, 404లు లభిస్తుందన్నారు. రంగు చేపల పెంపకం యూనిట్కు లక్ష పెట్టుబడి వ్యయం కాగా, దీనిలో గ్రీన్ క్లైమేట్ సబ్సిడీ రూ 45,948 లు, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద 54,052 రాయితీగా లభిస్తుందన్నారు . తొలుత మత్స్యకార డ్వాక్రా లబ్ధిదారు మహిళలతో ముచ్చ టిస్తూ సముద్రపు నాచు పీతలు రంగు చేపలు తయారీ వల్ల కలిగే లాభాలను ప్రయోజనాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. మత్స్య సంపద పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అదేవి ధంగా స్థానికంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ తిలకించి పలు సూచనలు సలహాలు చేశారు. అనంతరం తుఫాన్ సెంటర్ నందు ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ ప్రసంగిస్తూ సముద్రపు నాచు పర్యావరణానికి వ్యవసాయానికి రెండు కోణాల నుండి దీర్ఘకాలిక లాభాలను అందిస్తుందన్నారు. ఈ ప్రకృతి సహజమైన నాచు తయారీకి తక్కువ పెట్టుబడితో అధిక లాభం అందించే తాజా వ్యవసాయ అవకాశంగా భావిం చాలన్నారు. తక్కువ పెట్టు బడితో కేవలం 45 రోజుల కాలవ్యవధిలో అధిక ఆదా యాన్ని పొందవచ్చునన్నారు. పలువురు శాస్త్రవేత్తల అధ్య యనం తర్వాత అనువైన ప్రాంతాలను ఎంపిక చేసి సాగు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ సముద్రపు నాచు తయారీకి అనువైన ఉష్ణోగ్రతలు, ఉప్పు శాతం ఉన్న నీటి పరిసరాలలో మంచి ఫలితాలు ఇస్తాయన్నారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ గంగ పుత్రుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక గా మత్స్య పరిశ్రమ నిలుస్తోందన్నారు .మత్స్య ఉత్పత్తులు పెంపు సాంకేతికత ప్రోత్సాహానికి ప్రభుత్వం కృషి చేస్తూ నీలి విప్లవం సాధించే దిశగా ముందడుగు వేస్తోంద న్నారు. గంగపుత్రులందరికీ మత్స్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. గంగపుత్రుల జీవనోపాధికి కుటుంబాల భద్రత కోసం ప్రభుత్వం అంచెలంచెల కట్టు బాటుతో కృషి చేస్తుందన్నారు. ఆధునిక సాంకేతికతను అందుబాటులో తేవడానికి కృషి జరుగుతుందన్నారు. ఆక్వా రంగం మరింత పురోగమించేలా ప్రత్యేక ప్రణాళికలు రూపుదిద్దుకుంటున్నాయన్నారు. చేపల వేట నిషేధిత సమయంలో జీవనభృతిని రూ. 20వేలకు పెంచామని గంగ పుత్రులకు ఇంధన రాయితీలు ఇస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నగంగ. గంగ పుత్రుల అభివృద్ధి, భద్రత ఆత్మ గౌరవం తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశాలన్నారు. ఈ సాగుకు ప్రభుత్వ పథకాల ద్వారా రాయితీలతో కూడిన ఆర్థిక మద్దతు ఇవ్వ బడుతుందని ఈ ఉత్పత్తు లను సేంద్రియ ఎరువుగా భూసారాన్ని పెంచుతుందన్నారు. ఈ ఉత్పత్తుల వల్ల మొక్కలకు తెగుళ్లను తట్టుకునే శక్తి లభిస్తుందని పశుగ్రాసంగా చేపలకు కోళ్లకు మేతగా నాచు ఉపయోగపడుతుం దన్నారు. ఇందులో ఐరన్ మెగ్నీషి యం జింక్ వంటి ఖనిజాలు ఉంటాయని వీటితో ఔషధ పదార్థాలు పోషక పదార్థాలు తయారు చేయవచ్చునన్నారు. ఆర్డిఓ కే మాధవి ప్రసంగిస్తూ సముద్రపు నాచు కార్బన్ ఆకర్షించి నీటిని శుభ్రం చేయడంలో సహాయపడి సముద్ర జీవులకు కార్బన్ ముప్పును తగ్గిస్తుందన్నారు. తీర ప్రాంత మహిళలు మత్స్యకారి కుటుంబాలకు భరోసా ఇవ్వ డమే కాకుండా వేగంగా ఆదాయ వృద్ధికి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. డ్వాక్రా సంఘాలకు ఈ సాగుకై రుణాలు కూడా అందిం చడం జరుగు తుందన్నారు .ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి పీవీ శ్రీనివాసరావు, డి ఆర్ డి ఎ పి డి జయచంద్ర గాంధీ మత్స్య శాఖ ఏడి వర్ధన్ ఎఫ్ డి ఓ. కె చలపతి స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## వలస కార్మికుల పిల్లలకు బాసట..

### - పాఠశాలలో చేర్పించిన కంటిపూడి సర్వరాయుడు

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 21:** వలసపై తమ సంస్థలో పని చేసేందుకు వచ్చిన బిహార్ వాస్తవ్యుల పిల్లలకు కంటిపూడి స్టీల్స్ అధినేత కంటిపూడి సర్వరాయుడు బాసటగా నిలిచారు. ఆ పిల్లలను శుక్రవారం రాజమహేంద్రవరం రూరల్ కొంతమంది మండల పరిషత్ ఆదర్శ పాఠశాలలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కే మోహిని, ఉపాధ్యాయులు ఉమా మహేశ్వరరావు నాయుడు, సాధిక్ అలీషావలి, గాయత్రి పాల్గొన్నారు. వలస వచ్చిన వారి పిల్లలు ఖాళీగా తిరగకుండా వారు చక్కగా చదువుకోవాలని ఈ నిర్ణయం తీసుకున్నట్టు కంటిపూడి సర్వారాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీ మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఐఎమ్ఎ అధ్యక్షునికి పీఎంపిల అభినందనలు



**కాకినాడ (మనసులో మాట) నవంబర్ 21..** ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కాకినాడ శాఖ నిర్వహించిన ఎన్నికలలో ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షులు సత్య స్కాన్ అధినేత డాక్టర్ కాదా వెంకటరమణ, కార్యదర్శి ట్రస్ట్ మల్టీ స్పెషాలిటీ ఎండి ఎస్ సి హెచ్ ఎస్ రామకృష్ణని కమ్యూనిటీ పారామెడిక్స్ & ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పి ఎం పి అసోసియేషన్) కాకినాడ జిల్లా కార్యదర్శి ఎండి తానీషా కాజులూరు కరప మండల అధ్యక్షులు జె వి వి సూర్యనారాయణమూర్తి కాకినాడ టౌన్ అధ్యక్షుడు సిహెచ్ ఏడుకొండలు సెక్రెటరీ కే శ్రీనివాస్ మధు సూర్య మొదలైన సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రసిద్ధ పుణ్య క్షేత్రం శ్రీ గౌరీ కేదారేశ్వర స్వామి వారినీ దర్శించుకున్న సినీ నటుడు గౌతమ్ రాజు దంపతులు



**కాకినాడ (మనసులో మాట) నవంబర్ 21..** కాకినాడ రూరల్ స్థానిక ఇంద్రపాలెం శ్రీ గౌరీ కేదారేశ్వర స్వామి వారి దర్శనానికి సినీ నటుడు గౌతమ్ రాజు శుక్రవారం దర్శించుకున్నారు. దర్శనానంతరం వారి దంపతులు చే ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించామని చైర్మన్ చొల్లంగి శ్రీనివాసరావు తెలిపారు.సినీ నటుడు గౌతమ్ రాజు మాట్లాడుతూ కార్తీక మాసంలో దీపాలను వెలిగించటం శివుడికి ఎంతో ప్రీతికరమైనది పిల్లి అప్పారావు గారి ఆశీస్సులు తో ఇంద్ర పాలెం లో వెంకట్ నగర్ నందు కొలువైయున్న శ్రీ గౌరీ కేదారేశ్వర స్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందిందని ఇక్కడే కోనేరు దగ్గర దీపాలను నీటిలో వదిలామని స్వామివారిని దర్శించుకున్న అనంతరం ప్రసాదాలు భక్తులు కి అందజేశామని స్వామివారి కృప భక్తులకు ఎల్లప్పుడూ ఉండాలని అదేవిధంగా స్వామివారి కి సేవలు చేస్తున్న చైర్మన్ శ్రీనివాస్ కి బుజ్జి కి తదితరులు కి ఆ స్వామి ఆశీస్సులు పొందాలని ఈ ఆలయ అభివృద్ధికి సంబంధించిన సేవలు చేస్తున్న వారిని అందరిని ఆయన అభినందించారు. ఆయన మాట్లాడుతూ కాశీ నుంచి తీసుకొచ్చిన శివలింగన్నీ శ్రీ గౌరీ కేదారేశ్వర స్వామి ఆలయం చైర్మన్ కి స్వామి వారి సన్నిధిలో అంద చేసినారు. ఈ కార్యక్రమం లో భాగంగా ఆలయానికి ఎంతో సేవలు చేస్తున్న ప్రధాన అర్చకుడు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

### 108మంది మహిళలతో

## ఘనంగా బోనాల కార్యక్రమం

### అనంతరం భక్తులకు భారీ అన్న సమారాధన



**జగ్గంపేట (మనసులోమాట) నవంబరు 21..** జగ్గంపేట మండలం గుర్రంపాలెం గ్రామంలో ఎంతో ప్రసిద్ధిగాంచిన శ్రీ ఉమా చంద్రశేఖర స్వామి వారి ఆలయం వద్ద కార్తీక మాసం ముగింపును పురస్కరించుకొని 108 మంది మహిళలతో బోనాలు కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగింది.వేకువజాము నుంచి ఊరంతా ప్రతి ఇంటి ముందు సుందరంగా తీర్చిదిద్దిన రంగవల్లులతో ప్రతి ఒక్కరూ దీపారాధన కార్యక్రమాలు ముగించుకోవడం జరిగింది.భక్తులందరూ ముందుగా ఆలయంనుండి బయలుదేరి ఊరంతా గోమాత వెనుక భజనా కార్యక్రమంతో నగర సంకీర్తనలు చేసుకొంటూ స్వామివారి కీర్తనలతో 108 మంది మహిళలతో బోనాలు ఎత్తుకొని అమ్మవారి ఆలయం వద్ద నుండి గ్రామ సచివాలయం మీదుగా మధ్యలో ఉన్న ప్రతి ఆలయాన్ని సందర్శించుకుని బోనాలను ప్రతీ ఆలయానికి చూపిస్తూ తిరిగి దేవీ సెంటర్ మీదుగా ఉమా చంద్రశేఖర స్వామి ఆలయానికి చేరుకోవడం జరిగింది.అనంతరం బాదం రవి,(జేసీబీ రవి) పెరుమాళ్ళ రాజు, పడాలదుర్గ ఆధ్వర్యంలో గ్రామస్తులందరికి అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామస్తులందరు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయడం జరిగింది.

మనసులో మాట — KANCHARLA — సంచలన తెలుగు దిన పత్రిక



## వాడపల్లి వేంకటేశ్వర ఆలయంలో అభివృద్ధి పనులు

**ఆత్రేయపురం (మనసులో మాట) నవంబర్ 21..** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు కు ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ప్రత్యేక పూజల అనంతరం పనులను ప్రారంభించారు. స్వాతంత్ర సమరయోధుల స్థూపాన్ని అనుకూల ప్రదేశంలో ఏర్పాటు చేసే పనులు, ఆలయంలో భక్తుల సౌకర్యాల మెరుగుదల, క్యూ లైన్‌ల ఏర్పాట్లు, అనంతరం అర్చకులు, అధికారుల తో అభివృద్ధి పనులపై సమీక్షించారు. కార్తీక మాసంలో వివిధ సేవల ద్వారా ఆలయ ఆదాయం రూ,ఐదు కోట్ల 55 లక్షల 734 వచ్చిందని, గత సంవత్సరం కార్తీకమాసం వచ్చిన ఆదాయం కంటే రూ, 75 లక్షల 92 వేల 305 ఆదాయం పెరిగిందని ఆలయ సహాయ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కే. శ్రీనివాస్‌కు నూతన బాధ్యతలు



**కాకినాడ (మనసులో మాట), నవంబరు 21:** కాకినాడ నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న కే. శ్రీనివాస్‌ను జీఎస్ డబ్ల్యూఎస్ (గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ) అదనపు కమిషనర్‌గా నియమిస్తూ రాష్ట్ర మున్సిపల్ శాఖ కమిషనర్ మరియు డైరెక్టర్ పి. సంపత్ కుమార్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. పరిపాలనలో విశేష అనుభవం ఉన్న శ్రీనివాస్‌ను ఈ కీలక పదవికి నియమించడం ద్వారా జీఎస్‌డబ్ల్యూఎస్ విభాగం పనితీరులో మరింత పారదర్శకత, సమర్థత పెరుగుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నరు. అదనపు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించనున్న కె.శ్రీనివాస్ త్వరలోనే విభాగ కార్యకలాపాలను సమగ్రంగా సమీక్షించాలని నిర్ణయించారు. సేవల అందుబాటు పెంపు, ప్రజా పరిష్కార వ్యవస్థ, పరిపాలన సామర్థ్యాన్ని బలోపేతం చేయడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. విభాగ కార్యకలాపాలు ప్రజలకు మరింత చేరువయ్యేలా, సేవల నాణ్యత పెరగేలా కృషి చేస్తానని ఆయన తెలిపారు. కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది, అధికారులు జి ఎస్ డబ్ల్యూ ఎస్ అదనపు కమిషనర్ గా నియమితులైన కె.శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

### ఆత్మహత్యకు పాల్పడిన బి.ఆర్ అంబేద్కర్

## గురుకుల పాఠశాల విద్యార్థిని

### ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన



**జగ్గంపేట (మనసులోమాట) నవంబరు 21..** కాకినాడ జిల్లా జగ్గంపేటలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని హాస్టల్ భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామానికి చెందిన విద్యార్థిని (14) పదవ తరగతి చదువుతుంది. అయితే హాస్టల్లో నవంబర్ 14వ తేదీన ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ వేధింపులకు గురి చేయడంతో మా అమ్మాయి భయభ్రాంతులకు గురై ఆత్మహత్య చేసుకున్నట్లుగా తల్లిదండ్రులు ఆరోపిస్తూ కాకినాడ జిల్లా కలెక్టర్ కు ఈ విషయం పై పిర్యాదు చేయడం జరిగింది. ఈ విషయం పై తమకు న్యాయం జరిగేలా చూడాలని వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది.ఈ విషయం పై వైస్ ప్రిన్సిపాల్ ను వివరణ కోరగా ఇంటర్ విద్యారిని,బాధిత అమ్మాయి గొడవ పడగా హాస్టల్ మేడ పైనుండి వేగంగా వచ్చేక్రమంలో మెట్లపై నుండి కాలు జారి పడిందని ఈ విషయం అమ్మాయి తల్లితండ్రులకు తెలియజేసి వెంటనే స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి కి చికిత్స నిమిత్తం టీచర్లను ఆ అమ్మాయి కి తోడుగా పంపడం జరిగిందని అక్కడనుండి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జి జి హెచ్ కు పంపించడం జరిగిందని,ఈ విషయం పై తమ పై అధికారులకు తెలియజేయాలని తెలియక తెలుపలేదని తెలియజేసారు అయితే ప్రస్తుతం ఆ విద్యార్థినికి రెండు కాళ్లు, మరియు వెన్నుపూస,తలకు బలమైన గాయం కావడం కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుంది.సమాచారం తెలుసుకున్న జగ్గంపేట తహసీల్దార్ జేవియర్ రమేష్, జగ్గంపేట సీ.ఐ వై ఆర్ కె శ్రీనివాస్,గురువారం రాత్రి హాస్టల్ కు చేరుకుని ప్రిన్సిపాల్, సిబ్బంది వద్ద నుంచి వివరాలు తెలుసుకున్నారు.

# కూటమి పాలనలో అన్నదాత దుఃఖీభవ





## మంత్రి వాసంశెట్టి మాటలన్నీ అబద్ధాలే

- చర్చకు రాగలరా..ఆ దమ్ముందా
- కులాన్ని ఎవరు తప్పుదోవ పట్టిస్తున్నారో తేలుద్దాం
- మంత్రి వాసంశెట్టి సుభాష్ కు సవాల్ విసిరిన మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 21:** కార్మిక శాఖ మంత్రి సుభాష్ ను వనభోజనాల్లో మాట్లాడిన అంశాలపై చర్చకు సిద్ధమా అని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు గోపాల కృష్ణ సవాల్ విసిరారు. శుక్రవారం ఆయన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియా సమావేశంలో మంత్రి వాసంశెట్టికి సవాల్ చేస్తున్నా..

చర్చ నుండి మీరు తప్పుకుంటే కులానికి క్షమాపణ చెప్పాలని, మీరు చేసిన ఆరోపణలు వాస్తవం కాదని నిరూపిస్తాను... నిరూపణ చేయకపోతే.. నేను క్షమాపణ చేపుతా....మీరు చేసిన ఆరోపణలు నిజమని నిరూపణ చేయకపోతే మీరు క్షమాపణ చెప్పాలి..నా ఛాలెంజ్ ను స్వీకరించగలరా అని చెల్లుబోయిన సూటిగా ప్రశ్నించారు. వైఎస్ఆర్సీపీ పాలనలో ఏం జరిగింది ...టీడీపీ పాలనలో ఏం జరిగిందో చర్చిద్దాం..టైం , వెన్యూ మీరే చెప్పండి అని సవాల్ విసిరారు. జీవోలు అడ్డం పెట్టుకుని మీరేం చేశారో నేను చెబుతాను..కులాన్ని ఎవరు తప్పుదోవ పట్టిస్తున్నారో తేలుద్దాం అన్నారు. దేశంలో మొదటి సారిగా రైతులకు పెట్టుబడి సహాయం కింద ఏడాదికి రూ. 13,500లు రైతులకు అందజేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాత్రమే అన్నారు. మీరు చెప్పినట్టు రాష్ట్రంలో అన్నదాత సుఖీభవ అమలు కావడం లేదు ...అన్నదాత దుఖీభవ అమలవుతోందని చెల్లుబోయిన ఘాటుగా వ్యాఖ్యానించారు. హాస్టల్లో 53 లక్షల మంది రైతులకు ఈ పథకం అమలు చేయాల్సి ఉండగా ఏడు లక్షల మంది రైతులను తగ్గించేశారన్నారు.

రైతులను ఎందుకు భ్రమలో పెడుతున్నారని ప్రశ్నించారు. కిలో అరటి రూపాయికి రైతు అమ్ముకుంటున్నారని ఈనాడు లోనే రాశారు..నష్టం భరించలేక రోడ్డుపైనా కాలువల్లోనూ పారేస్తున్న దైన్య స్థితిలో అరటి రైతుల్లో ఉన్నారన్నారు. రైతును ఆదుకోకపోతే రైతు ద్రోహిగా చంద్రబాబు చరిత్రలో మిగిలిపోతారని చెల్లుబోయిన వ్యాఖ్యానించారు. రైతులకు రాష్ట్రంలో వ్యవసాయం అనేది ఒక నమ్మకమని, మీరు చెప్పే పరిశ్రమలు రాష్ట్రంలో కనిపించవన్నారు. ఎండమావుల్లో నీరు ఎంత ఉంటుందో ...చంద్రబాబు మాటల్లో నిజం కూడా అంతే ఉంటుందని ఎద్దేవా చేశారు.

చంద్రబాబు ప్రజాధనాన్ని దారుణంగా దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు.

తప్పుడు లెక్కలు చూపించి మొంథా తుపాను నష్టాన్ని తగ్గించి చూపించే ప్రయత్నం చేస్తున్నారని మాజీ మంత్రి చెల్లుబోయిన టీడీపీ పాలనపై దుమ్మెత్తిపోశారు.

### జవహర్లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ లో

## ఫార్మా ఫ్యూజన్ 2కే25 ప్రారంభం

### వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సి. ఎస్. ఆర్.కె. ప్రసాద్




**కాకినాడ( మనసులో మాట) నవంబర్ 21..** జవహర్లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ కాకినాడ (జె ఎన్ టీ యు కే ) స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీస్- ఐ ఎస్ టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫార్మా ఫ్యూజన్ 2కే 25 (ఫార్మా ఫ్యూషన్ 2కే 25) దినోత్సవం శుక్రవారం ప్రారంభమైంది. నవంబర్ 21 మరియు 22 తేదీల్లో జరుగుతున్న ఈ వేడుక ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ విజ్ఞానం పరిశోధనా మనోభావం సృజనాత్మకతను వెలుగులోనికి తెచ్చే వేదికగా నిలుస్తోంది. మొత్తం 500 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జేఎన్టీయూకే వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ ప్రారంభోత్సవంలో పాల్గొని విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశం అందించారు. అనంతరం ముఖ్య అతిథులు వివిధ ఫార్మా ఇన్నోవేషన్ స్టాల్స్ను ప్రారంభించి విద్యార్థుల ప్రదర్శనలను అభినందించారు. విశిష్ట అతిథులుగా ఓఎస్డి ప్రొఫెసర్ డి. కోటేశ్వర రావు, డైరెక్టర్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ వి. కృష్ణ మోహన్, ఐ ఎస్ టీ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.టి. కృష్ణ, ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగాధిపతి ప్రొఫెసర్ బి. భవాని పాల్గొని తమ సూచనలు ఆశయాలను వ్యక్తం చేశారు.కార్యక్రమాన్ని మరింత విశిష్టంగా నిలబెట్టేందుకు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ముఖ్యంగా మైసూర్ జెఎస్ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్, ప్రో-ఛాన్సలర్ మరియు మాజీ ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ బి. సురేష్ వర్చువల్ గా పాల్గొని ఫార్మసీ రంగంలో కృత్రిమ మేధస్సు పాత్ర అనే అంశంపై విలువైన ప్రసంగం అందించారు. ఫార్మా పరిశోధన ఔషధ ఆవిష్కరణ (డ్రగ్ డిస్కవరీ) క్లినికల్ డేటా విశ్లేషణ (క్లినికల్ డేటా అనాలిటిక్స్) మరియు రోగి- కేంద్రీకృత ఆరోగ్య సంరక్షణ (పేషెంట్-సెంట్రిక్ హెల్త్కేర్) లో కృత్రిమ మేధస్సు మార్గదర్శక మార్పులు తీసుకువస్తుందని ఆయన తన ప్రసంగంలో వివరించారు. అదనంగా ఆంధ్రా యూనివర్సిటీ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. గిరిజా శంకర్, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ డి. నాగమణి తమ అనుభవాలను పంచుకున్నారు. రెండవ రోజు లైఫ్ ట్రాన్స్ఫర్మింగ్ ఎడ్యుకేషన్ నిపుణులు డాక్టర్ వై. మోహన్ రావు లైఫస్ ఫార్మాస్యూటికల్స్ ప్లాంట్ హెడ్ ఎస్. లక్ష్మీనారాయణన్ జనరల్ మేనేజర్ ఎమ్. వేణుగోపాల్, సత్య స్కాన్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె. వెంకట రమణ తమ అనుభవాలను పంచుకోబోతున్నారు. ఫార్మా ఫ్యూజన్ 2 కే 25 లో భాగంగా పేపర్ ప్రెజెంటేషన్స్ పోస్టర్ ప్రెజెంటేషన్స్ టెక్నికల్ కాంటెస్ట్ అలాగే విద్యార్థుల ప్రతిభను ప్రతిబింబించే కల్చరల్ ప్రోగ్రామ్స్ కూడా నిర్వహించబడుతున్నాయి. అదే విధంగా 10 అనుబంధ కళాశాలల నుండి విద్యార్థులు పాల్గొనడం ఈ వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో మద్దతు అందించిన స్పాన్సర్ సంస్థలు ఐవీ ఓవర్సీస్ మాస్టర్స్ వీసా సత్య స్కాన్స్ డయాగ్నొస్టిక్స్, హెరిటల్ ఎస్ వీ ఎన్ గ్రాండ్ వారందరికీ నిర్వాహక కమిటీ ధన్యవాదాలు తెలిపింది.

## కార్తీక అమావాస్య పుణ్యకాలంలో బాల గోకర్ణేశ్వరుని దివ్యదర్శనం

**కాజులూరు (మనసులో మాట) నవంబరు 21..** కార్తీక మాసం దేవతారాధనకు అత్యంత శ్రేష్ఠమైన సమయం. ఆ పుణ్యకాలంలో, కార్తీక అమావాస్యని పురస్కరించుకొని నిర్వహించిన లక్ష బిల్వార్చన అనంతరం జరిగిన దివ్యానుభూతి భక్త హృదయాలను నింపింది. భక్తజనుల సంకల్పాలతో, అర్చకుల మంత్రోచ్చరణల మధ్య, దేవాలయ ప్రాంగణం పవిత్రతతో నిండిపోయింది. శుక్రవారం గొల్లపాలెం బాలా త్రిపుర సుందరి గో కర్ణేశ్వర స్వామి ఆలయంలో

అర్చకులు పూజ్యం మల్లికార్జున శర్మ నేతృత్వంలో జరిగిన లక్ష బిల్వార్పణ యజ్ఞం అనంతరం, ఆలయంలో బాల త్రిపురసుందరి మరియు గోకర్ణేశ్వర స్వామి భక్తులకు దర్శనమిచ్చారని భక్తులు భావోద్వేగంతో తెలిపారు. దేవాలయ అంతరాలయ మండపంలో వెలసిన ఆ శోభ, అక్కడి దైవిక వాతావరణం భక్తులను భక్తిసాగరంలో ముంచెత్తింది.పోలిస్వర్గం విశేషాలంకరణ - ఒక దైవనీయ అద్భుతం లక్ష బిల్వార్చన పూర్తి చేసిన సందర్భంగా, ఆలయాన్ని "పోలిస్వర్గం" అలంకరణతో అద్భుతంగా దర్శనమిచ్చారు. సన్నని వెలుగులు, పూలతో చేసిన రంగోలి, దీపాల వెలుగులతో నిండిన ప్రాంగణం స్వర్గంలోకి ప్రవేశించిన అనుభూతిని కలిగించింది. బాల త్రిపురసుందరి అమ్మవారి సౌందర్యం భక్తులను ముగ్ధులను చేయగా, గోకర్ణేశ్వరుని శివానంద రూపం అక్కడ ఉన్న ప్రతి ఒక్కరి మనసును పవిత్రం చేసింది.అలంకరణ ప్రత్యేకత ఏమిటంటే బిల్వదళాలతో రూపొందించిన శివలింగాకార దీప మండపం బాల త్రిపురసుందరి అమ్మవారి శ్రింగారంలో పంచపుష్ప, నవరత్నాభరణాలు



కార్తీక మాసం దేవతారాధనకు అత్యంత శ్రేష్ఠమైన సమయం. ఆ పుణ్యకాలంలో, కార్తీక అమావాస్యని పురస్కరించుకొని నిర్వహించిన లక్ష బిల్వార్చన అనంతరం జరిగిన దివ్యానుభూతి భక్త హృదయాలను నింపింది. భక్తజనుల సంకల్పాలతో, అర్చకుల మంత్రోచ్చరణల మధ్య, దేవాలయ ప్రాంగణం పవిత్రతతో నిండిపోయింది.

ఈ మహాచర్యకు ప్రధానంగా వ్యవహరించిన పూజ్యం మల్లికార్జున శర్మ గారి నేతృత్వంలో జరిగిన లక్ష బిల్వార్పణ యజ్ఞం అనంతరం, ఆలయంలో బాల త్రిపురసుందరి మరియు గోకర్ణేశ్వర స్వామివారు భక్తులకు అమోఘ కరుణగా దర్శనమిచ్చారని భక్తులు భావోద్వేగంతో తెలిపారు. దేవాలయ అంతర్యాగ మండపంలో వెలసిన ఆ శోభ, అక్కడి దైవిక వాతావరణం భక్తులను భక్తిసాగరంలో ముంచెత్తింది.లక్ష బిల్వార్చన పూర్తి చేసిన సందర్భంగా, ఆలయాన్ని "పోలిస్వర్గం" అలంకరణతో అద్భుతంగా శృంగరించారు. సన్నని వెలుగులు, పూలతో చేసిన రంగోలి, దీపాల వెలుగులతో నిండిన ప్రాంగణం స్వర్గంలోకి ప్రవేశించిన అనుభూతిని కలిగించింది. బాల త్రిపురసుందరి అమ్మవారి సౌందర్యం భక్తులను ముగ్ధులను చేసగా, గోకర్ణేశ్వరుని శివానంద రూపం అక్కడ ఉన్న ప్రతి ఒక్కరి మనసును పవిత్రం చేసింది.బిల్వదళాలతో రూపొందించిన శివలింగాకార దీప మండపం బాల త్రిపురసుందరి అమ్మవారి శ్రింగారంలో పంచపుష్ప, నవరత్నాభరణాలు గోకర్ణేశ్వరుని అలంకరణలో పంచాక్షరి మదంగ నాదం ప్రతిధ్వనించే విధంగా ఏర్పాట్లు

ఈ విశేషాలతో ఆలయం ఒక పవిత్ర దివ్యలోకంలా దర్శనమిచ్చింది. ఆధ్యాత్మిక దిశానిర్దేశం చేసిన పూజ్యం మల్లికార్జున శర్మ భక్తులకు కార్తీక మాసంలో బిల్వార్చన ప్రాముఖ్యతను వివరించారు. బిల్వం శివానికి అత్యంత ప్రియమైనది. లక్ష బిల్వదళాలతో చేసిన ఆర్చన పరమేశ్వరుని సన్నిధికి మరింత చేరుస్తుంది" అని ఆయన చెప్పారు.

"శివ-శక్తి సమసమాజం మనలోని అంతర్మలినాలను దహనం చేసి, మంగళశక్తిని ప్రసాదిస్తుంది. ఈ రోజు జరిగిన దర్శనం అదే దైవానుగ్రహానికి నిదర్శనం.లక్షలాది దీపాల కాంతిలో, మంత్రోచ్చారణల మధ్య, బాల త్రిపురసుందరి అమ్మవారి సౌందర్యదీప్తి, గోకర్ణేశ్వరుని శివతేజస్సు భక్తులకు హృదయాంతరాళంలో నిలిచిపోయే అనుభూతిని కలిగించాయి.

భక్తులు "ఇది దేవతల సాక్షాత్కారం చేసినట్లుంది" అని ఆనందభాష్పాలతో తెలిపారు.కార్తీక అమావాస్య అనే పవిత్ర దినంలో జరిగిన లక్ష బిల్వార్చన, దానికి అనుసంధానంగా జరిగిన పోలిస్వర్గం విశేషాలంకరణ మరియు దివ్యమైన బాల త్రిపురసుందరి-గోకర్ణేశ్వర దర్శనం భక్తులకు చిరస్మరణీయమైన అనుభవమైంది.



## తెలుగుదేశం నుంచి వైసిపిలోకి చేరికలు

### పార్టీ కండువా వేసి ఆహ్వానించిన వైసిపి జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి

**ఆత్రేయపురం (మనసులో మాట )నవంబర్ 21..** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం ఆలమూరు మండలం ఆలమూరు గ్రామం లో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు వాసంశెట్టి సత్యనారాయణ,నక్క రాజు,తాడిబట్టి యేసు, బాలు, మధు, రాజు లు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైసిపి అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో జాయిన్ అయ్యారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం జగ్గిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రతిపక్షంలో ఉండి ప్రజల తరపున పోరాడుతున్న వై యస్ జగన్ మోహన్ రెడ్డి, నాయకత్వం నచ్చి పార్టీలో జాయిన్ అయ్యారని. ఈ చేరికతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం వెల్లివిరుస్తుందని, పార్టీ కార్యకలాపాలు మరింత బలపడతాయని పేర్కొన్నారు.చేరిన వారికి పార్టీ తరపున హృదయపూర్వక స్వాగతం తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జగ్గంపేటలో ప్రజాదర్బార్ కు విశేష స్పందన



**జగ్గంపేట (మనసులోమాట) నవంబర్ 21..** ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ప్రజా దర్బార్ కార్యక్రమం నిలుస్తుందని జగ్గంపేట ఎమ్మెల్యే, టిటిడి బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ వ్యాఖ్యానించారు.శుక్రవారం జగ్గంపేట క్యాంపు కార్యాలయంలో జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ప్రజలు హాజరై వినతులు, పిర్యాదులు అందజేశారు. అందరి సమస్యలు ఓపికగా వింటూ ఎమ్మెల్యే వారి వద్ద నుంచి వినతులు స్వీకరించారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు, రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు తాను ఎప్పుడు ముందుంటానన్నారు. ప్రజా దర్బార్ వేదికను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.అధికారులు ప్రజలకు జవాబుదారిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో భాగంగా మొత్తం20 వినతులు ప్రజల నుంచి అందగా పలు సమస్యలను అప్పటికప్పుడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ జగ్గంపేట కార్యాలయంలో ప్రతి శుక్రవారం ప్రజ సమస్యలపై ప్రజా దర్బార్ నిర్వహిస్తామని ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గ ప్రజలందరికీ తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర టీం ద్వారా నియమించి ఎప్పటికప్పుడు జగ్గంపేట నియోజవర్గ సమస్యలు ప్రభుత్వానికి నివేద ఇస్తారని అన్నారుఈ కార్యక్రమంలో అడపా భరత్, ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, కొత్త కొండబాబు, కన్నబాబు, జనపరెడ్డి బాబు, బుర్రి సత్తిబాబు, నీలం శ్రీను, సుంకవిల్లి రాజు, పాండ్రంకి రాంబాబు, అనుకుల శ్రీకాంత్, చింతల రవికాంత్, కంచుమర్తి రాఘవ, చిట్యాల బాబ్జి, కందుల జమ్మి, మారిశెట్టి రాధా, తదితరులు పాల్గొన్నారు.

## యర్రవరం గ్రామంలో క్లీన్ అండ్ గ్రీన్

### ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి నరసింహామూర్తి(బుజ్జి)



**ఏలేశ్వరం (మనసులో మాట) నవంబర్ 21..** కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం యర్రవరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ బీసెట్టి అప్పలరాజు పంచాయతీ కార్యదర్శి డిప్యూటీ ఎంపీడీఓ రామరాజు వర్మ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ లో భాగంగా తీమ్5- క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఏలేశ్వరం మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గొల్లపల్లి నరసింహ మూర్తి (బుజ్జి) ఏలేశ్వరం మండలాభివృద్ధి అధికారి సిహెచ్. రవికుమార్ వర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు క్లాప్ మిత్రాలు వి ఓ లు పలువురు నాయకులు ముందుగా వందేమాతర గీతం ఆలపించారు. అనంతరం మండల వ్యాప్తంగా వచ్చిన గ్రీన్ అంబాసిడర్ లతో గ్రామంలో పలు ప్రాంతాలలో జీరో వెస్ట్ సేకరణ కార్యక్రమం చేపట్టారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వద్ద ఎంపీడీఓ సిహెచ్ రవి వర్మ డిప్యూటీ ఎంపీడీఓ రామరాజు వర్మ ఆధ్వర్యంలో పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఏలేశ్వరం వెలుగు కార్యాలయంలో గ్రీన్ అంబాసిడర్ (పారిశుధ్య కార్మికులు) కు శిక్షణా తరగతులను నిర్వహించ నున్నామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బస్వా ప్రసాద్ మైరాల కనకారావు గంగిరెడ్ల మణికంఠ బండారు సూరిబాబు పంచాయతీ అభివృద్ధి అధికారులు ఆర్. వీరబాబు వివోలు పారిశుధ్య కార్మికులు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## లక్ష్మీపతిపురంలో ఉత్సాహంగా రిలయన్స్ చిల్డ్రన్ ఫెస్ట్ - 2025



**తాళ్ళరేవు (మనసులో మాట), నవంబరు 21:** బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని రిలయన్స్ సంస్థ ఆధ్వర్యంలో చిల్డ్రన్ ఫెస్ట్ - 2025 కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్కూల్ గెజిటెడ్ హేచ్ఎం ఎల్.గోవిందరాజులు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి సర్పంచ్ కామాడి గోవలక్ష్మి, ఉప సర్పంచ్ కొక్కిలిగడ్డ లోకేష్, ఎంపీటీసీ సభ్యులు రేఖాడి నరసింహమూర్తి, కామేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొని క్రీడాజ్యోతిని వెలిగించి బెలూన్లను గాలిలోకి వదిలి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం స్కూల్ పిడిలు విజయకుమారి, వెంకన్న ల నేతృత్వంలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ తదితర పోటీలు నిర్వహించారు. అనంతరం బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ సిఎస్ఆర్ హెడ్ సుబ్రహ్మణ్యం, ఎంఈఓ మోకా ఉమా, ఉపాధ్యాయులు బలాంతరపు రవి, కేవీపీ సత్యనారాయణ, కడలి శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## 25న కాకినాడలో సీపీఐ జిల్లా స్థాయి సమావేశం

### -జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ వెల్లడి

**కాకినాడ (మనసులో మాట) నవంబర్ 21..** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కాకినాడ జిల్లా విస్తృతస్థాయి సమావేశం నవంబర్ 25 తేది మంగళవారం ఉదయం కాకినాడలో స్థానిక అపోలో హాస్పటల్ వెనుక ఎన్జీవో హెూం లో జరగనున్నదని కాకినాడ జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ పత్రిక ప్రకటనలో శుక్రవారం చేశారు. తోకల ప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర మహాసభ జిల్లాల విస్తృత స్థాయి సమావేశాలు జరుగుతున్నాయని అందులో భాగంగానే కాకినాడ జిల్లాలో నవంబర్ 25వ తేదీన కాకినాడ జిల్లా సిపిఐ విస్తృతస్థాయి సమావేశం జరగనున్నదని తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన కామ్రేడ్ గుజ్జుల ఈశ్వరయ్య కాకినాడ జిల్లా ఇన్చార్జ్ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కార్యవర్గ సభ్యులుగా నూతనంగా ఎన్నికైన తాటిపాక మధులు హాజరుకానున్నారు ఆయన వివరించారు. కామ్రేడ్ జి. ఈశ్వరయ్య సిపిఐ నూతన రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికై తొలిసారిగా కాకినాడ జిల్లాకు విచ్చేయుచున్నారని ఈ సమావేశానికి భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా సమితి సభ్యులు ఏఐటీయూసీ అనుబంధ ప్రజా సంఘాల సభ్యులు బాధ్యులు కమ్యూనిస్టు పార్టీ సానుభూతిపరులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన పిలుపు నిచ్చారు. పేద బడుగు బలహీన వర్గాల ప్రజల సమస్యలపై ఇళ్ల స్థలాలు పెన్షన్లు విద్యార్థి యువజన సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అని కాకినాడ జిల్లాలో సిపిఐ పార్టీని మరింత బలోపేతానికి కృషి ఈ సమావేశ వేదిక అని విద్యార్థుల యువజనుల సమస్యలపై నిరుద్యోగ సమస్యల అలుపెరగని ఎన్నో పోరాటాలు నిర్వహించి ప్రజాసంఘాల నాయకత్వం వహించిన ఈశ్వరయ్య కాకినాడ జిల్లాకు వస్తున్నారని తోకల ప్రసాద్ వెల్లడించారు.

## పోలిస్వర్గం పర్వదినం దుర్గాడ శివాలయంలో విశేష పూజలు



**గొల్లప్రోలు (మనసులో మాట)నవంబరు 21:** గొల్లప్రోలు మండల పరిధి దుర్గాడ గ్రామంలో వెలసినటువంటి శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో పోలిస్వర్గం పర్వదినం సందర్భంగా శుక్రవారం ఘనంగా ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు సోదరులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తెల్లవారుజామున నుంచి పూజా కార్యక్రమాల్లో భాగంగా ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు సోదరులు స్వామివారికి ఏకాదశ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి, స్వామి మరియు అమ్మవారి విగ్రహాలకు ప్రత్యేక పుష్పాలంకరణ సేవలు చేశారు. అనంతరం భక్తుల కోరికల పరిపూర్తికై విశేష హారతులు సమర్పించారు. పోలిస్వర్గం పర్వదినం శుక్రవారం రావడంతో మహిళా భక్తులు పెద్ద ఎత్తున ఆలయంకు చేరుకున్నారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని భక్తులు దామోదర ప్రీతయే అంటూ దీపదానాలు చేయగా, కొందరు భక్తులు సాలిగ్రామ దానాలు కూడా సమర్పించారు. ఆలయ ప్రాంగణం పూలు, దీపాలతో శోభాయమానంగా కనిపించింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ యువత, భక్తులు పాల్గొన్నారు.

# పిఠాపురంలో వైసీపీకి ఎదురుదెబ్బ

### - వైసీపీ నుండి జనసేన లో చేరిన 50 మంది నాయకులు, కార్యకర్తలు

### - పవన్ కళ్యాణ్ చేస్తున్న అభివృద్ధి మెచ్చి పార్టీలో చేరామన్న నాయకులు



**పిఠాపురం, ( మనసులో మాట) నవంబరు 21:** ఉప్పాడ కొత్తపల్లి మండలం పాత ఇసుకపల్లి గ్రామానికి చెందిన వైయస్సార్సీపి కీలక నేత ఆ గ్రామ ఉపసర్పంచ్ యరకం నూక రెడ్డి సహా గ్రామంలో పలువురు నాయకులు కార్యకర్తలు జనసేనలో చేరారు. శుక్రవారం సాయంత్రం పిఠాపురం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కళ్యాణ మండపం లో ఎంపీ తంగేళ్ల ఉదయ శ్రీనివాసు,జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబుల చేతుల మీదగా 50 మంది నాయకులు కార్యకర్తలను కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అనంతరం తుమ్మల బాబు పార్టీలో నూతనంగా చేరిన నాయకులు, కార్యకర్తలతో ప్రమాణం చేయించారు. జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని తెలియజేశారు.

ఈ సందర్భంగా వైయస్సార్సీపీ నుండి జనసేన లో చేరిన పలువురు నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ యొక్క పరిపాలన పై పూర్తి నమ్మకం ఉందన్నారు. పిఠాపురం నియోజకవర్గాన్ని దేశంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తయారు చేయడంలో పవన్ కళ్యాణ్ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. అధికారం చేపట్టిన నాటినుండి పవన్ కళ్యాణ్ నియోజకవర్గం లో చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై నేడు జనసేన లో చేరినట్లు తెలిపారు.

కార్యక్రమం లో కూనిసెట్టి రామ భూపాల్ రెడ్డి, పక్కుర్తి లోవరాజు, దాసరి ప్రభాకరరావు, గెడ్డం సత్తిబాబు,జల్లూరి దీపక్, రామ సత్యనారాయణ రెడ్డి, దడాల నూకరాజు, ఏనుగుపల్లి పవన్ ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

## జగ్గంపేట గురుకులం పాఠశాల విద్యార్థి ఘటనపై

# సమగ్రమైన విచారణ చేయాలి

### బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

### విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలి - ఎస్.ఎఫ్.ఐ డిమాండ్




**జగ్గంపేట (మనసులోమాట) నవంబరు 21..** కాకినాడ జిల్లా, జగ్గంపేట మండలం, జగ్గంపేటలో గల సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకులం పాఠశాలలో భవనం పైనుంచి పడిపోయిన విద్యార్థి ఘటన పై సమగ్రమైన విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), కాకినాడ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈరోజు జగ్గంపేట లో ఉన్న హాస్టల్ లో ఎస్.ఎఫ్.ఐ బృందం సందర్శించింది. హాస్టల్ లో అమ్మాయి పడిపోయిన ప్రాంతాన్ని పరిశీలించి, విద్యార్థులను కూడా ఘటన కోసం అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం. గంగా సూరిబాబు మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్లో ఉన్న విద్యార్థులకు రక్షణ లేకుండా పోతుందని విమర్శించారు. జగ్గంపేటలో గురుకులం పాఠశాలలో ఈనెల 14వ తేదీన విద్యార్థి భవనం పైనుంచి పడి తీవ్రమైన గాయాలతో ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి కాకినాడలో వైద్యం పొందుతుందని ఆ విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. 14వ తేదీన ఘటన జరిగిన అధికారులు గుర్తుచప్పుడు కాకుండా వ్యవహరించడం దుర్మార్గం అన్నారు. హాస్టల్లో ఉంటున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు రక్షణ లేకుండా ఉంటుందని విమర్శించారు. అమ్మాయి భవనం పైనుంచి పడిపోవడానికి గల కారణాలను ప్రభుత్వం వెంటనే విచారణ చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హాస్టల్ సిబ్బంది ఈ విషయాన్ని గుర్తు చప్పుడు కాకుండా ఉండటం కోసం భవనం మీద నుంచి పడిపోతే మెట్ల మీద నుంచి పడిపోయిందని చెప్పడం దుర్మార్గం అన్నాడు. విషయం తెలుసుకుని వెళ్లిన స్థానిక పోలీస్ అధికారులు,ఎమ్మార్వో ఘటనా స్థలాన్ని పరిశీలించి ఏ విధంగా జరిగిందో వివరణాత్మక విచారణ చేయకుండా కేవలం తుతూ మంత్రంగా ఉండడంతో విషయాన్ని పక్కదోవ పట్టించే వైఖరి కనబడుతుందని విమర్శించారు. హాస్టల్ భవనంలో సీసీ కెమెరాలు ఉన్నాయి. అమ్మాయి పడిపోయిన ప్రాంతాన్ని కూడా సీసీ కెమెరా కవరయ్యే విధంగా ఉన్న పోలీసు అధికారులు సీసీ కెమెరాలు ఇప్పటివరకు ఎందుకు సేకరణ చేయలేదు. అదేవిధంగా అమ్మాయి అమ్మాయి పడిపోయిన వెంటనే జగ్గంపేట ప్రభుత్వ హాస్పిటల్ తీసుకెళ్ళమని హాస్టల్ సిబ్బంది చెప్తున్నారు. పడిపోయిన అమ్మాయి విపరీతంగా దెబ్బలు తగిలితే హాస్పిటల్ వారు ఎమ్మెల్సీ కేసు నమోదు చేయాలి. కానీ ఈ ఘటనపై ఇప్పుడు వరకు ఎమ్మెల్సీ కేసు నమోదు చేయకపోవడం అనేక అనుమానాలు తావిస్తుందని అన్నారు. ఈ ఘటనపై తక్షణమే జగ్గంపేట పోలీసు వారు కేసు నమోదు చేసి సమగ్రమైన విచారణ చేసి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేయాలని కోరుతూ విద్యార్థిని కుటుంబ సభ్యులతో కలిసి జగ్గంపేట పోలీస్ స్టేషన్ నందు ఎస్ఎఫ్ఐ బృందం ఫిర్యాదు చేయడం జరిగింది. అమ్మాయికి రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ బృందంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సిహెచ్.లోవరాజు, జిల్లా గర్ల్స్ కన్వీనర్ చిన్ని, మండలం నాయకులు అరుణ్‌కుమార్ పాల్గొన్నారు

# స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని పిలుపు



**పిఠాపురం, ( మనసులో మాట) నవంబరు 21:** పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కళ్యాణ మండపంలో శుక్రవారం జనసేన పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. ప్రతి వార్డులను ఐదుగురు సభ్యుల సమన్వయ కమిటీ ఏర్పాటు చేసేందుకు గాను ఈ సమావేశంలో కీలకంగా చర్చలు జరిపారు.

ఈ కార్యక్రమంలో పిఠాపురం నియోజకవర్గ జనసేన సమన్వయ కమిటీ సభ్యులైన కాకినాడ ఎంపీ తంగేళ్ల ఉదయ శ్రీనివాసు,జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, మాజీ ఎమ్మెల్యే పెండం దొరబాబు, ఓదూరి కిషోర్, డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్ లు పాల్గొని నాయకులు కార్యకర్తలతో చర్చలు జరిపారు. 30 వార్డులకు చెందిన జన సైనికులు నాయకులు, కార్యకర్తలతో నేతలు ముఖాముఖి నిర్వహించారు. పట్టణంలోని వివిధ సమస్యలపై కార్యకర్తలు నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాబోయే స్థానిక ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలన్నారు. కష్టపడి పనిచేసి 100% స్ట్రైక్ రేటుతో పిఠాపురంలో జనసేన జెండా ఎగరవేయాలని ఎంపీ ఉదయ శ్రీనివాసు పిలుపునిచ్చారు.

ఎంపీ ఉదయ శ్రీనివాస్ మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలంతా కృషి చేయాలన్నారు పిఠాపురం పట్టణ అభివృద్ధి కోసం పార్టీ తరపున నిరంతరం కృషి చేస్తామని తెలిపారు ఇటీవల కాలంలో పిఠాపురంలో ముంపు ప్రాంతాలను సందర్శించి బాధితులను పరామర్శించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువు చేయడంలో జనసైనికులు ముందుండాలని పిలుపునిచ్చారు పార్టీ సిద్ధాంతాలను ప్రతి గడపకు తీసుకెళ్లాలని సూచించారు.

కార్యక్రమంలో పిఠాపురం పట్టణ జనసైనికులు వీర మహిళలు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా పగడాల కన్స్ట్రక్షన్స్ వారి పడిపూజ మహోత్సవం



**పల్నాడు, నవంబర్ 21,(మనసులో మాట):** బెల్లంకొండ మండలంలోని గంగిరెడ్డిపాలెం గ్రామంలో పగడాల కన్స్ట్రక్షన్స్ వారి మండల కాల ద్వితీయ దివ్య పడిపూజ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలు భజన కార్యక్రమాలతో ఆధ్యాత్మిక శోభసంతరించుకుంది. పగడాల కన్స్ట్రక్షన్ చైర్మన్ పగడాల శ్రీనివాసరావు నివాసంలో వేదపండితులు ఉదయం లక్ష్మీ గణపతి హెూమం పంచామృతాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. గంగిరెడ్డిపాలెం రంగా బొమ్మ సెంటర్లో నిర్వహించిన ద్వితీయ దివ్య పడిపూజ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఐదు అరటి మండపాలు, 18 కళశాలతో శబరిమల ఆచార అనుస్థానం ప్రకారం దివ్య పూజ ఏకాదశ అభిషేక ద్రవ్యములతో వైదిక, తంత్రోక్త విధానములతో అయ్యప్ప స్వామి వారి పడిపూజ మహోత్సవం బ్రహ్మశ్రీ ప్రవీణ్ కుమార్ నంబూద్రి శబరిమల అయ్యప్ప దేవస్థానం మేల్ శాంతి స్వామివారు,వేద పండితుల వేదమంత్రోచ్చరణల మధ్య గణపతి, సుబ్రహ్మణ్యం, అయ్యప్ప స్వామికి పుష్పాలంకరణ, అనంతరం విశేష పుష్పాభిషేకం పూజలు నిర్వహించారు. అయ్యప్ప,గోవింద స్వామి,శివయ్య, స్వాములు,భవానీ భక్తులు అయ్యప్ప నామస్మరణతో శబరిమలై అయ్యప్ప స్వామి ఇక్కడే ఉన్నాడు అన్నట్లుగా తన్మయత్వంతో డప్పు శీను స్వామి భజన పాటలు పలువురు భక్తులను అలరించాయి. పెద్ద మండపాలు పుష్పాల అలంకరణ విద్యుత్ కాంతులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన. అనంతరం స్వాములకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెదకూరపాడు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు, ముఖ్య అతిథులు, బెల్లంకొండ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు భరద్వాజ సంఘము ద్వారా ఉపకార వేతనాలను పంపిణీ

### భరద్వాజ సేవా సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఐ.వి. రావు

**కాకినాడ (మనసులో మాట )నవంబర్ 21..** భరద్వాజ సేవా సంఘం వార్షిక జనరల్ బాడీ సమావేశం లో విద్యార్థులకు ఉపకార వేతనాలను సంఘ అధ్యక్షులు డాక్టర్ ఐ వి రావు చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు . అమలాపురం పివిసి ఇంజనీరింగ్ కాలేజీలో కేశప్రగడ శ్రావ్య ఐడియల్ ఇంజనీరింగ్ కాలేజీలో బాలాంతరపు సాయి దత్త ఆశ్రిత్ ఐడియల్ కాలేజీలో ఇంటర్ చదువుతున్న వక్కలంక సౌమ్య పైడా పాలిటెక్నిక్ కాలేజీలో చదువుతున్న తురగా లక్ష్మీప్రసన్న లకు పదివేల రూపాయలు చొప్పున ఉపకార వేతనాలకు చెందిన చెక్కులను పంపిణీ చేశారు. భరద్వాజ సేవా సంఘం వార్షిక జనరల్ బాడీ సమావేశం వేద వనంలో అధ్యక్షులు డాక్టర్ ఐ వి రావు అధ్యక్షతన శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సభ్యులకు వివిధ రకాల పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సంఘము ప్రధాన కార్యదర్శి మంజులూరి విశ్వేశ్వర రావు మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన తెలివైన విద్యార్థులను ప్రోత్సహించాలని ఉద్దేశంతో స్కాలర్షిప్లను అందిస్తున్నామని చెప్పారు. విద్యా వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నదే తమ సంఘ ఆశయమని చెప్పారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తూ రానున్నతరానికి హిందూ ధర్మము వాటి ప్రయోజనాలను పరిచయం చేయాలన్న దే తమ ప్రధాన లక్ష్యం అన్నారు. పండితులను సత్కరించడం పేద బ్రాహ్మణులకు స్వయంపాక రూపంలో సహాయం చేయడం వంటి కార్యక్రమాలను కూడా నిర్వహిస్తూ హైందవ ధర్మ పరిరక్షణకు కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రముఖ పర్వదినాలలో వాటి ప్రాశస్త్యం పై పిల్లల్లో అవగాహన కల్పించేందుకు వివిధ పోటీలను పాఠశాల స్థాయిలో నిర్వహించాలన్న ఆలోచన ఉన్నదని ముంజలూరి విశ్వేశ్వరరావు చెప్పారు. కార్తీకమాస సందర్భంగా ప్రముఖ దేవాలయాల్లో డాక్టర్ ఐ వి రావు సహకారంతో విశేష అన్న ప్రసాద కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని ఆయన గుర్తు చేశారు.

కార్తీక మాసం సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి వన సమారాధన కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహించడమే కాక గోపూజ ధాత్రి పూజ వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను కూడా నిర్వహించడం జరిగిందని వివరించారు ప్రముఖ వైద్యుల సహకారంతో ఉచిత వైద్య శిబిరా లను నిర్వహించడం అవసరమైన వారికి మందులను కూడా ఉచితంగా అందించడం వంటి సామాజిక సేవా కార్యక్రమాలకు నిర్వహించాలన్నదే తమ భరద్వాజ సేవా సంఘము లక్ష్యమన్నారు. త్వరలో వార్షికోత్సవ కార్యక్రమాన్ని వినూత్నరీతిలో నిర్వహించాలన్న ఆలోచన ఉన్నట్లు మంజులూరి విశ్వేశ్వరరావు ఈ సందర్భంగా ప్రకటించారు. ఇస్కాన్ కాకినాడ సెంటర్ ప్రతినిధి శ్రీధర్ దాస్ ప్రభు జి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి రంగాభట్ల శ్రీనివాసరావు ఆదిత్య శర్మ అయ్యగారి వెంకటేష్ చాగంటి నాగేశ్వరరావు సాగర్ మండలిక శాస్త్రి వద్దిపర్తి మురళి రావు డాక్టర్ వాడ్రేవు రవి సీతారాం దంటు భాస్కరరావు కందాలం రవీంద్రనాథ్ అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

## జగ్గంపేటలో పచ్చదనం పరిశుభ్రత



**జగ్గంపేట (మనసులోమాట) నవంబరు 21..** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం జగ్గంపేట పంచాయతీ కార్యదర్శి జి.శివ ఆధ్వర్యంలో జగ్గంపేటలోని మంచినీళ్ల చెరువు పరిసర ప్రాంతాలలో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు సంబంధించి 108 మంది పారిశుద్ధ్య కార్మికులతో మంచినీటి చెరువు వద్ద ఉన్నటువంటి చెత్త,చెదారాలు, తుప్పలు తొలగింపు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డివిజనల్ పంచాయతీ అధికారి బాలామణి హాజరై పనులను పరివేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎక్కడైతే ఎక్కువగా చెత్త చెదారాలు ఉంటాయో అటువంటి ప్రదేశాలను గుర్తించి శుభ్రం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మూర్తి, జగ్గంపేట మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, మరియు పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే దత్తత గ్రామం అల్లిపూడిలో అభివృద్ధి పనులకు అధికారులకు ఆదేశాలు



**కోటనందూరు (మనసులో మాట )నవంబర్ 21..** తుని నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ శ్రీ యనమల దివ్య దత్తతు గ్రామము అయినా అల్లిపూడిలో స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్ పర్యటించి గ్రామంలో వివిధ అభివృద్ధి పనులు పర్యవేక్షించి గ్రామానికి అవసరమైన తాండవ నది పైన బ్రిడ్జ్, స్మశాన వాటిక మరియు గ్రామానికి అత్యవసరమైన పనులు గురించి అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు . ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మండల అధికారులు మరియు అల్లిపూడి గ్రామ సచివాలయ సిబ్బంది,అంకంరెడ్డి బుల్లిబాబు ,అంకంరెడ్డి గోపి కూటమి నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక




**అమలాపురం (మనసులో మాట) నవంబరు 21:** ఏపీఎన్జీవో అసోసియేషన్ అమలాపురం తాలూకా యూనిట్ నూతన కార్యవర్గం కోనసీమ జిల్లా అధ్యక్షుడు మాధవరపు వెంకటేశ్వరావు అధ్యక్షతన స్థానిక కాటన్ గెస్ట్ హౌస్ లో శుక్రవారం జరిగింది. ఈ నూతన కార్యవర్గ ఎన్నికల్లో ఎలక్షన్ అధికారులుగా డివిఎస్ఎన్ సుబ్రహ్మణ్యం ఐ ప్రతాప్ లు వ్యవహరించారు. అమలాపురం తాలూకా యూనిట్ అధ్యక్షునిగా నిమ్మకాయల శ్రీను, అసోసియేట్ ప్రెసిడెంట్ గా మహాదశ శ్రీనివాసరావు, సెక్రటరీగా పి కోదండరామయ్య ట్రెజరర్ గా డీ పృథ్వీరాజ్ సంఘం కార్యవర్గ సభ్యులు వైస్ ప్రెసిడెంట్ గా డి రామకృష్ణ డి శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎలక్షన్ అధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు.



## ఉద్యోగుల పీజీఆర్ఎస్ కు 11 అర్జీలు

**కాకినాడ (మనసులో మాట), నవంబరు 21:** ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం నిమిత్తం శుక్రవారం సాయంత్రం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం జరుగింది. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు.. ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమం వివిధ సమస్యలపై 11 అర్జీలు అందాయని ఆయన తెలిపారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని ఉద్యోగుల సమస్యల పరిష్కార నిమిత్తం ప్రతినెల 3వ శనివారం ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని సద్వినిచేసుకోవాలని డీఆర్వో తెలిపారు.

## బుద్ధుని బోధనలే శరణ్యం

**ముమ్మిడివరం (మనసులో మాట) నవంబరు 21..** ముమ్మిడివరం మానవ నైతిక వికాసానికి బుద్ధుని బోధనలే శరణ్యమని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా (బిఎస్ఐ) జిల్లా శాఖ పేర్కొంది. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బుద్ధ పార్కు ఆవరణలో శుక్రవారం బిఎస్ఐ మండల శాఖ అధ్యక్షుడు సింహాద్రి వర్మ అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశానికి ముఖ్య అతిది గా విచ్చేసిన అధ్యక్షుడు కె.వి.వి సత్యనారాయణ మాట్లాడుతూ సమాజంలో మానవతా విలువలతో పాటు జ్ఞానతృష్ణ సాధనకు బౌద్ధం ఎంతో దొహదం చేస్తుందన్నారు. మరో అతిధి జిల్లా కార్యదర్శి బుడితి బాబు రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 23న మండలం లో జరగనున్న బౌద్ధ దమ్మ ప్రచార యాత్ర ను బౌద్ధులు, అంబేద్కరీయులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రధం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో సీనియర్ ఉపాసకులు మట్టా వెంకట్రావు, కవి, దత్తు, కాశి బాబు జగజీవన్ రావు, డి అంజనేయులు, వడ్డీ నాగేశ్వర రావు, అప్పారావు లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## వసతి గృహాల్లో సిబ్బంది కొరతను భర్తీ చేయాలి..

- ప్రభుత్వానికి ధారా యేసురత్నం విజ్ఞప్తి



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 21:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవడం పట్ల కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ కార్యనిర్వాహణ కార్యదర్శి, జగ్గంపేట నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు ధారా యేసురత్నం హర్షం వ్యక్తం చేశారు. బడుగు, బలహీన వర్గాల పిల్లలు ఆశ్రయం పొందుతున్న వసతి గృహాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం పట్ల ఆయన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సాంఘిక సంక్షేమ శాఖను పూర్తిగా గాలికి వదిలేయడంతో విద్యార్థులకు చాలా ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, సాంఘిక శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి సాంఘిక సంక్షేమ వసతి గృహాలపై దృష్టి పెట్టి మౌలిక వసతులను ఏర్పాటు చేసి విద్యార్థుల పట్ల వారి చిత్తశుద్ధిని నిరూపించుకున్నారన్నారు. ఇదే సమయంలో సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో సిబ్బంది కొరతను భర్తీ చేస్తే చాలా ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రస్తుతం వార్డెన్లు, క్లాస్ ఫోర్ సిబ్బంది. కొరత అధికంగా ఉందని, అందువలన సాంఘిక సంక్షేమ శాఖలో పనిచేసే సిబ్బందిపై అదనపు భారం పడుతుండటంతో మానసిక శారీరక ఒత్తిడికి లోనై వారి ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించలేని పరిస్థితి నెలకొందన్నారు. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖపై ప్రత్యేక దృష్టి పెట్టి సిబ్బందిని నియమించి ప్రస్తుతం ఉన్న సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల నుండి ఉపశమనం కలిగేలా వసతి గృహ విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

### మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ కు వ్యతిరేకంగా వైసీపీ శ్రేణులు

# గోకవరంలో కోటి సంతకాల సేకరణ



**గోకవరం (మనసులో మాట), నవంబర్ 21 :** :వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు మాజీ మంత్రి , మాజీ పార్లమెంటు సభ్యులు, జగ్గంపేట నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోట నరసింహం, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి, విద్యార్థి విభాగం జోన్ 2 వర్కింగ్ ప్రెసిడెంట్, తోట శ్రీ రాంజీ అదేశాలు మేరకు ఎంపీపీ సుంకర శ్రీవల్లీ వీరబాబు ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ గోకవరం సంజీవయ్య నగర్ లో చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు వైసీపీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేయడం చాలా దుర్మార్గమైన చర్య అన్నారు, పేద, బడుగు బలహీన వర్గాలకు, విద్య, వైద్యం అందని ద్రాక్షలా మారుతుందని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వారికి నచ్చిన వారికి దోచి పెట్టే విధంగా జీవోలు ఉంటున్నాయని ఇలాంటి విధానాలను మానుకోవాలని మాను కునేంతవరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటలు చేస్తూనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైస్సార్ సీపి రైతు విభాగం జాయింట్ సెక్రటరీ దాసరి చినబాబు, వైసీపీ నాయకులు సుంకర వెంకట రమణ, జిల్లా వైస్సార్ సీపీ టి.యూ.సి.విభాగం ఉపాధ్యక్షుడు నారాలశెట్టి నరసయ్య, జిల్లా వైస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం సెక్రటరీ అంబటి అబ్రహం, రాష్ట్ర వైస్సార్ సీపీ ఎస్సి సెల్ విభాగం సెక్రటరీ తోలేటి రాంప్రసాద్, గోకవరం మండల వైస్సార్ సీపీ ఎస్సి సెల్ అధ్యక్షుడు బిజ్జి రాజు, గోకవరం టౌన్ ఉపాధ్యక్షుడు వీర్ల వెంకటేశ్వరరావు, గోకవరం వైస్సార్ సీపీ టౌన్ అధ్యక్షుడు బాడిత బోయిన చిన్న, గోకవరం మండల కమిటీ వైస్సార్ సీపీ ఎడ్యుక్యూటి మెంబర్ నందూరి బుజ్జి, యువజన విభాగం అధ్యక్షు బొర్రా శేఖర్, మండల వైస్సార్ సీపీ సెక్రటరీ బొడ్డపాటి వీరచంద్రం , మహిళలు పాల్గొన్నారు.

# అల్పపీడనం ప్రభావం తో రైతులు అప్రమత్తంగా ఉండాలి

### ఎమ్మార్వో రామ్ కుమార్



**గొల్లప్రోలు (మనసులో మాట) నవంబరు 21:** రాబోయే రెండు రోజుల్లో అల్పపీడనం ప్రభావంతో మండల వ్యాప్తంగా అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మండల రైతులందరూ అప్రమత్తంగా ఉండాలని గొల్లప్రోలు ఎమ్మార్వో జి ఎమ్ రామ్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో రామ్ కుమార్ మాట్లాడుతూ.. ఈనెల 22 నుంచి 25 తేదీ వరకు అల్పపీడనం ప్రభావంతో అధిక వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించిన నేపథ్యంలో మండల రైతులు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు.ప్రస్తుతం పండు దశలో ఉన్న వరి పంటలకు అధిక వర్షాలు ప్రమాదకరమని, అందువల్ల పచ్చిగా ఉన్న పంటలకు కోతను వాయిదా వేసుకోవాలి అని తెలిపారు.కోతకు సిద్ధంగా ఉన్న వరి పొలాలను వెంటనే చూసుకుని రక్షణ చర్యలు చేపట్టాలి అని సూచించారు. అంతేకాకుండా వరికుప్పలపై బరకాలు వేసి నీరు నిల్వ కాకుండా జాగ్రత్తపడాలి అని వర్షపు కారణంగా పొలాల్లో నీరు చేరినట్లయితే ఐదు శాతం ఉప్పు ద్రావణం పిచికారి చేయడం ద్వారా దానిలో మొలకలు రాకుండా నిరోధించవచ్చు అని పేర్కొన్నారు. రైతులు ఈ సూచనలను ఖచ్చితంగా పాటించి పంటను రక్షించుకోవాలని రైతులను విజ్ఞప్తి చేశారు. వాతావరణ పరిస్థితులు మారే అవకాశం ఉన్నందున రోజువారీ అప్డేట్స్‌పై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.వివి. సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

### తొలిసారిగా వేట నిషేధ భృతిని ప్రవేశపెట్టింది

# తెలుగుదేశం ప్రభుత్వమే




**పిఠాపురం,(మనసులో మాట) నవంబరు 21:** పట్టణంలోని రాజావారి కోటలో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నవంబర్ 21 శు క్రవారం ప్రపంచమత్స్యకార దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి ఎస్ వి ఎస్ ఎన్ వర్మ పాల్గొన్నారు. మత్స్యకార సోదరుల సమక్షంలో కేక్ కట్ చేసి వారికి దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్ వి ఎస్ ఎన్ వర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వలన మత్స్యకారుల దశ మారిందని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట నిషేధ సమయంలో ఆర్థిక సాయం రెట్టింపు చేసినట్లు తెలిపారు. పదివేలు అందించే వారిని గతంలో దీనిని 20 వేలకు కూటమి ప్రభుత్వం పెంపుదల చేసినట్లు తెలిపారు. గత తెలుగుదేశం పార్టీ హయాంలో 2014 -19 మధ్య కొత్తపల్లి మండలం మత్స్యకారులకు సుమారు 1200 మందికి ఆయిల్ సబ్సిడీ కార్డులు అందజేయడం జరిగిందన్నారు. మత్స్యకార గ్రామాలలో 85% పైగా రోడ్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. 330 కోట్ల రూపాయలతో అమీనాబాద్ ప్రాంతంలో హార్బర్ నిర్మాణానికి కృషి చేశామన్నారు. 2014లో తొలిసారిగా తెలుగుదేశం ప్రభుత్వమే వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు భృతిని ప్రవేశపెట్టిందని తెలిపారు. సముద్రంలో వేటకు ఉపయోగించే వలలు, పడవలు, ఐస్ బాక్సులు వంటి వాటిని సబ్సిడీపై అందజేసినట్లు తెలిపారు . చేపల వేట సమయంలో మత్స్యకారులు ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే 10 లక్షల పరిహారం కూటమి ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. వేటకు వెళ్లే బోట్లకు లీటర్ డీజిల్ పై 9 రూపాయలు సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. వైసీపీ పాలకులు ఫిష్ ఆంధ్ర పేరుతో 300 కోట్లు ఖర్చు పెట్టామని మోసపూరిత మాటలు చెప్పారన్నారు. చంద్రబాబు నాయుడు మత్స్యకారుల అభివృద్ధి కోసం సంక్షేమం కోసం నిరంతరం పాటు పడతారని తెలిపారు. కార్యక్రమంలో సురాడ రాజు, కకోర్ని రమణ,మెరుగు సూరిబాబు, రాచపల్లి సనపయ్య, కంబాల వెంకటరమణ, చోడిపల్లి ప్రసాదు,మెరుగు భూషణం సూరడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# కార్తీక మాసానికి వీడ్కోలు

- చివరిరోజు నగరసంకీర్తనలు, స్వామివారి ఊరేగింపులతో కొలహాలంగా మారిన గ్రామాలు
- మల్లేపల్లిలో మహా అన్నసమారాధన





**జగ్గంపేట (మనసులోమాట)నవంబరు 21..** చివరిరోజు వేకువజామున దీపాలతో కార్తీకమాసానికి ఘనంగా వీడ్కోలు పలికారు జనులు. కార్తీకమాసం చివరిరోజు కావడంతో దేవాలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకొన్నాయి.విద్యుత్ దీపకాంతులు, ప్రమీదల జ్యోతుల వెలుగులలో శివ కేశవుల ఆలయాలు కొలహాలంగా మారాయి. ఆలయాలన్నీ భక్తజన సంద్రంతో రద్దీగా మారిపోయాయి. ఆ దేవదేవుని దర్శించుకోవడానికి భక్తులందరు బారులు తీరారు.గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామంలో కార్తీకమాసం నెలరోజులు నిర్వహించే నగరసంకీర్తనలకు అత్యంత ప్రాధాన్యత ఉంది. చాలా ఏళ్లుగా ఇక్కడ కార్తీకమాసం వేడుకలను ఘనంగా నిర్వహిస్తుంటారు.మల్లేపల్లి లో కార్తీకమాసం ఆఖరి రోజు ఘనంగా ముగిసింది.ఈ మాసమంతా గ్రామంలో ఉన్న భక్తులు వేకువ జామునే మేల్కొని, స్నానమాచరించి, అఖండ జ్యోతితో గ్రామమంతా తిరిగి నగర సంకీర్తన చేస్తారు.ఈ నగర సంకీర్తన ఆయా ఆలయాల భజన గురువులచే భక్తిశ్రద్ధలతో,శివనామ స్మరణలతో, భక్తి కీర్తనలు పాడుతూ భజనలు చేయుచు పండుగ వాతావరణంలా గ్రామమంతా తిరుగుతారు. బాజా భజంత్రీలు, బాణాసంచా కాల్పులతో, తీన్మార్ డప్పులతో, కోలాటాలతో, పువ్వుల పల్లకిపై స్వామివారిని ఊరేగిస్తారు. మల్లేపల్లి కొత్తూరు రామాలయం వద్ద ఉప్పలపాడు గ్రామానికి చెందిన రామకుర్తి సత్తిబాబు గురువు కి ఆలయ కమిటీ సభ్యులు సన్మానించి సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరమశివునికి అత్యంత ప్రీతికరమైన మాసం కార్తీక మాసం అన్నారు. తొలి రోజు లా ఆఖరి రోజు కూడా భక్తులు ప్రాధాన్యతను ఇస్తారు అన్నారు. అనంతరం గ్రామంలో అన్న సమారాధనలు జరిపించారు. ఈ అన్న సమారాధన కార్యక్రమానికి జగ్గంపేట జనసేన పార్టీ ఇన్చార్జ్ తుమ్మలపల్లి రమేష్ ముఖ్య అతిథి గా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ పురోహితులు చింతా అరుణ కుమార్ శర్మ, వినయ్ శర్మ, రావిపాటి వెంకట్రావు,గ్రామ ఉపసర్పంచ్ దొమ్మా శ్రీను, జనసేన పార్టీ ఉభయగోదావరి జిల్లాల ప్రోగ్రాం కమిటీ సభ్యుడు రామకుర్తి నరసింహ, తోలేటి సూర్యనారాయణ,సొసైటీ డైరెక్టర్ వెలిది సుబ్రహ్మణ్యం,అడబాల గంగారావు, సూరిబాబు, పడాల శ్రీను, నీలం దుర్గారావు, ఉండమట్ల వెంకటేశులు,శ్రీను,త్రిమూర్తులు, వెలిది పెద్దకాపు, చిన్నోడు రావిపాటి తాతీలు, నరవ శ్రీను, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



# యంత్రాలకు యమ గిరాకీ

- రైతులకు తొలగని కష్టాలు
- వరికోతయంత్రాలకు భారీగా పెరిగిన డిమాండ్
- ఎకరాలకు రూ. 9వేల నుంచి రూ. 10వేలు
- ఆద్దే పెరగటంతో అన్నదాత ఆందోళన

**రామచంద్రపురం(మనసులో మాట)నవంబరు 21..** ఒక పక్కన భారీ వర్షాలు, మరో పక్కన తుఫాను ప్రభావంతో రైతుల అతలాకుంతం అవుతుంటే తాజాగా ఖరీఫ్ మాసూళ్లతో రైతులు యంత్రాల కష్టాలు వచ్చిపడ్డాయి. వరి కోత యంత్రాలకు భారీగా డిమాండ్ పెరగటంతో అటు ధరలు కూడా పెరిగిపోయి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలకు రోజుల తరబడి పంట నీటమునిగిపోగా ఈదురు గాలులకు అధిక శాతం పంట నేలనంటింది. నీటమునిగిన పొలాలు పలు రకాల తెగుళ్ళ బారిన పడటంతో ఖరీదైన మందులు వాడి రైతులు వాటిని అదుపులోనికి తెచ్చుకున్నారు. ఇక ప్రస్తుతం నేలనంటిన పంట కోత కొయ్యటం మాత్రం రైతులకు పెను సవాళ్ళుగా మారింది. పొలాల్లో నీరు తొలగి తడి ఆరిన తర్వాత పంటకోతలు కొయ్యాల్సి రావటంతో ముదురు, లేత పొలాలన్నీ ఒకేమారు కొతకు వచ్చాయి. దీంతో రైతులంతా ఒకేసారి వరికోతలు చేపట్టడంతో కూలీలు దొరకటం కష్టతరంగా మారింది. ఒక వేళ కూలీలు దొరికినా వేతనాలు ఎక్కువవ్వటంతో అందరి దృష్టి వరికోత యంత్రాలపైనే పడింది. కూలీల కొరతతో వరికోత యంత్రాలతో మాసూళ్ళు నిర్వహించాల్సి వస్తోంది. పంటకాలం పూర్తయిన తర్వాత వీలైనంత త్వరగా మాసూళ్ళ పూర్తి చెయ్యాలని లేని పక్షంలో గింజ రాలిపోయే ప్రమాదం ఉందని వ్యవసాయాధికారులు చెభుతున్నారు. దీంతో వరికోత యంత్రాలకు ఎక్కడలేని డిమాండ్ వచ్చిపడింది. దీనిని అదునుగా తీసుకుని వ్యాపారులు యంత్రాలకు అద్దే పెంచటంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో ఈ ఏడాది 52 వేల ఎకరాల్లో రైతులు దాళ్వా సాగు చేపట్టారు. మొంథా తుఫాను సమయంలో ఈదురు గాలులకు సుమారు 30 వేల ఎకరాలలో పంట నేలనంటినట్టు అధికారులు లెక్కకట్టారు. స్థానికంగా వరికోత యంత్రాల లభ్యత తక్కువగా ఉంది. కాజులూరు మండల గ్రామాలలో రైతుమిత్ర సంఘాలకు ప్రభుత్వం మంజూరు చేసిన నాలుగు కోతమిషన్లతో కలిపి కేవలం 30 కోత మిషన్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఎగువ ప్రాంతంలో వర్షాలకు ముందే మాసూళ్ళు పూర్తయ్యాయి. వరికోత యంత్రాలకు ఇక్కడ ఎర్పడ్డ డిమాండ్ దృష్టిలో ఉంచుకుని వ్యాపారులు ప్రక్క జిల్లాల నుంచి వరికొత యంత్రాలను రంపించారు. ప్రస్తుతం మండల గ్రామాలలో 60 వరకూ వరికోత యంత్రాలు నడుస్తున్నాయి. అయితే ప్రస్తుతం వాతావరం కాస్త తెరపిచ్చినప్పటికీ మద్య,మద్యలో ఆకాసంలో కారుమబ్బులు కమ్ముతుండటం, దానికి తోడు మరో కొన్ని రోజులలో మరో తుఫాను ఏర్పడేందుకు అవకాశం ఉందని వాతావరణ నిపుణు చెభుతుండటంతో ఉన్న పంటను ఎదోవిదంగా దక్కించుకోవాలని రైతులంతా వరికొత యంత్రాల వద్దకు పరుగులు పెరుతున్నారు. దీంతో నిర్వాహకులు డిమాండ్‌కు తగ్గట్టుగా అద్దేలు పెంచేస్తున్నారు. వర్షాల సమయానికి నియొజకవర్గగ్రామాల్లో వరికోత కొయ్యటానికి కోతయంత్రానికి ఎకరానికి రూ '2800 నుంచి రూ 3000' వరకు ఉండేది. ఎకరం పొలంలో పంట కోతకొయ్యాటానికి యంత్రానికి గంట సమయం పట్టేది. మొంథా తుఫాను సమయంలో ఈదురు గాలులకు పంట నేలనంటటంతో పడిపోయిన పంట నిలబెట్టి కోతకొయ్యటానికి ఎకరానికి రెండు గంటల నుంచి మూడు గంటల పైబడి సమయం పడుతుంది. వర్షాల భయంతో రైతులంతా ఒక్కసారిగా పనులు ప్రారంబించడంతో మిషను యజమానులు గంటల లెక్కన అద్దెకట్టి గంటకు రూ 3000 తీసుకుంటున్నారు. ఈ లెక్కన ఎకరానికి పంటకోతకొయ్యటానికి రూ తొమ్మిది వేలు వరకూ ఖర్చవుతుందని రైతులు అంటున్నారు. వరికోత యంత్రాల ధర రూ 25 లక్షల నుంచి 30 లక్షల వరకూ ఉంటుంది. స్థానిక రైతులు అంత ధరపెట్టి యంత్రాలు కొనలేకపోవటంతో కొందరు నిర్వాహకులు ప్రక్క జిల్లాల నుంచి యంత్రాలను రంప్పించి డిమాండ్ ఎక్కువగా ఉన్న సమయాల్లో అద్దే ధరలు పెంచి వసూళ్ళు చేస్తున్నారని రామచంద్రపురం మండల వ్యవసాయాధికారి మణిదీప్ వెల్లడించారు.

# కోరంగిలో ప్రత్యేక పారిశుద్ధ్యం

### పాల్గొన్న 100 మంది పారిశుద్ధ్య కార్మికులు



**తాళ్లరేవు (మనసులో మాట), నవంబరు 21:** మండల పరిధిలోని కోరంగి పంచాయతీలో శు క్రవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంపీడీఓ లక్ష్మణరావు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి విజెవి రమణ పారిశుధ్య చర్యలు చేపట్టారు. మండలంలోని 17 పంచాయతీలకు చెందిన కార్యదర్శులతోపాటు సచివాలయ సిబ్బంది. 100 మంది పారిశుధ్య కార్మికులు పాల్గొని పరిశుభ్రతాచర్యలు చేపట్టారు. గ్రామంలో దీర్ఘకాలికంగా ఉన్న అపారిశుధ్య ప్రాంతాలతోపాటు, డ్రైనేజీలు, నీటి కుంటలను సైతం శుభ్రం చేసారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి విజెవి రమణ తెలిపారు.

# యాదవ సంఘానికి శ్రీకారం చుడదాం



**పిఠాపురం, (మనసులో మాట నవంబరు) 21.** ఐక్యత, సేవ, సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా, పిఠాపురం పట్టణంలో యాదవ సంఘానికి శ్రీకారం చుట్టేందుకు ముందుకు వెళ్దామని, యాదవ సామాజిక వర్గానికి చెందిన పలువురు వ్యక్తులు కొనియాడారు.శుక్రవారం పట్టణంలోని స్థానిక రాజా రామ్మోహన్ రాయ్ పార్క్ లో సమన్వయ కర్తలు సమావేశం అయ్యారు.ఈ సందర్భంగా సమన్వయ కర్తలు మాట్లాడుతూ పట్టణంలో యాదవ సంఘానికి శ్రీకారం చుట్టి, యాదవ సామాజిక వర్గానికి సేవాభావంతో ముందుకు వెళ్ళాలనే సంకల్పంతో వచ్చే నెల డిసెంబర్ 14వ తేదీన ఆదివారం పట్టణ యాదవ సంఘం నూతన కమిటీని ఎన్నుకొనుటకు ప్రతీ ఒక్కరు ముందుకు రావాలని, సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో యాదవ సామాజిక వర్గం సమన్వయకర్తలు కౌన్సిలర్ మఠం లోవరాజు, గింజాల రామకృష్ణ, మొల్లి శివ శంకర్ ప్రసాద్, మొల్లి సతీష్, జోగా లోవరాజు, కుండల నాగ సురేష్, మొల్లి కిషోర్, మొల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



## సంఘ సేవకుడు పట్టపగలు వెంకట్రావుకు సతీ వియోగం

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 21:** నగరంలో ప్రముఖ సంఘ సేవకుడు, కైలాస భూముల నిర్మాత రొటేరియన్ పట్టపగలు వెంకట్రావు సతీమణి అనంత రామలక్ష్మి శుక్రవారం ఉదయం మృతిచెందారు. ఆమె గత కొంత కాలంగా తీవ్ర అస్వస్థతకు గురై విశాఖపట్నం అపోలో హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. అనంత రామలక్ష్మి 1954 సంవత్సరం జనవరి నెలలో ముమ్మిడివరంలోని మండే వెంకట్రావు, అచ్చియమ్మ దంపతులకు ముగ్గురు సంతానంలో ప్రథమ కుమార్తె. ఈమె మెట్రిక్ వరకు చదువుకున్నారు. తర్వాత 1969వ సంవత్సరంలో వేమగిరికి చెందిన పట్టపగలు వెంకట్రావుతో వివాహమైంది. ఈ దంపతులకు నలుగురు ఆడ పిల్లలు. అనంతలక్ష్మి సంఘ సేవలో ముందు ఉంటూ రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి తరపున ఇన్నర్ వీల్ క్లబ్ చైర్మన్ గా పనిచేసి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సొంతంగా అనంత సేవా నికేతన్ సంస్థను స్థాపించి బొమ్మూరులోని బబ్బర్ సింగ్ కాలనీలో గృహ నిర్మాణాలలో కీలక పాత్ర పోషించారు. స్థానిక మంగళవారం పేటలోని పురపాలక సంఘ పాఠశాలను దత్తత తీసుకుని భవనాలు నిర్మించి ఫర్నిచర్, విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్ లు అందజేశారు. సంఘ సేవలో భర్త పట్టపగలు వెంకట్రావుకు చేదోడు వాదోడుగా ఉంటూ శ్రీమహా కాళేశ్వరాలయం నిర్మాణంలో చురుకైన పాత్ర పోషించారు. అనంత సేవా నికేతన్ నుంచి సమాజంలో సేవా కార్యక్రమాలు చేస్తున్న వ్యక్తులను, ప్రముఖులను గుర్తించి అనంత సేవా పురస్కారాలతో ప్రోత్సహించేవారు. అనంతలక్ష్మి పార్థివ దేహాన్ని విశాఖపట్నం నుంచి శుక్రవారం రాత్రి మల్లిన నగర్ లోని స్వగృహం వద్దకు తీసుకువచ్చారు. ప్రజలు, బంధువులు, శ్రేయోభిలాషుల సందర్శనార్థం నేటి (శనివారం) ఉదయం 11 గంటల వరకు ఉంచి నగరంలోని ఇన్నీసు పేటలోని రోటరీ కైలాస భూమిలో అంత్యక్రియలు నిర్వహిస్తారని కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతలక్ష్మి మృతి వార్త తెలిసి పలువురు నగర ప్రముఖులు పట్టపగలు వెంకట్రావుకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

### సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు

## ఉచిత శిక్షణ

- దరఖాస్తులు ఆహ్వానం ఆఖరి తేదీ నవంబరు 25
- డిసెంబరు 5 న దరఖాస్తుల పరిశీలన
- ఏపీ బీసీ స్టడీ సర్కిల్ రాజమహేంద్రవరం సంచాలకురాలు బీ శశాంక



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 21:** యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు అర్హత గల తూర్పు గోదావరి జిల్లా వాసులకు బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు విజయవాడలో ఉచిత శిక్షణ అందించనున్నట్టు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ రాజమహేంద్రవరం సంచాలకురాలు బీ శశాంక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు నవంబరు 25 లోగా రాజమహేంద్రవరం బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుందన్నారు. డిసెంబరు 5న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నట్లు, స్క్రీనింగ్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి మెరిట్ ప్రాతిపదికన విజయవాడలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

**ఎంపిక ప్రక్రియ..**

ఎంపిక రిజర్వేషన్ కోటా ప్రకారం బీసీ 66 శాతం, ఎసదసీ 20 శాతం, ఎస్టీ 14 శాతం నిష్పత్తిలో జరుగుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు బీసీ భవన్, గొల్లపూడి, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా- సంపూర్ణ ఉచిత శిక్షణ అందించబడుతుందన్నారు.

**దరఖాస్తుకు అవసరమైన పత్రాలు..**

అభ్యర్థుల బయోడేటా, 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ మార్కుల జాబితాలు, కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం (తల్లిదండ్రుల వార్షిక ఆదాయం లక్ష లోపు మాత్రమే), ఆధార్ కార్డు ఫొటోస్టాట్ ప్రతులు, బ్యాంకు పాస్‌బుక్ ప్రతులు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు. అభ్యర్థులు పై పత్రాలతో పాటు తమ దరఖాస్తులను ఆంధ్రప్రదేశ్ బీసీ స్టడీ సర్కిల్, ఆర్ట్స్ కాలేజ్ సమీపంలో, సంగీత కళాశాల పక్కన, రాజమహేంద్రవరం కార్యాలయానికి నిర్ణీత సమయంలోగా అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు (9494452267, 9000058102, 7032197288, 9393934825) సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నిర్దేశిత తేదీ లోపు తమ దరఖాస్తులను సమర్పించాలని విజ్ఞప్తి చేశారు.

## మత్స్య సంపదను పెంచేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ





**ఐ .పోలవరం,(మనసులో మాట). నవంబర్ 21.** రాష్ట్రంలో మత్స్య సంపదను పెంపొందించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని రైతులంతా మత్స్య సంపద వైపు చొరవ చూపాలని ప్రభుత్వ శాసనసభ విప్ ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) అన్నారు. శుక్రవారం ఐ. పోలవరంలో పెద్దమడి గ్రామంలో రైతు దంతులూరి సీతారామరాజు చేపల సాగు చేస్తున్న అక్వేరియం లో పెంచుతున్న చేపలను, చేపల పెంపకాన్ని జిల్లా కలెక్టర్ రావిరాల రమేష్ కుమార్ తో కలిసి ఎమ్మెల్యే బుచ్చిబాబు మత్స్యశాఖ అధికారులు పర్యవేక్షించారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం పురస్కరించుకొని మత్స్య సంపదకు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రాయితీలతో కూడిన నిధులు మంజూరు చేస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ రమేష్ కుమార్ మాట్లాడుతూ మత్స్య సంపదలో చేపల పెంపకాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం మత్స్య శాఖ ద్వారా అనువైన పద్ధతులను అవలంబించాలని కోరారు. చేపల పెంపకం, మత్స్య సంపద పుట్టుక, ఉత్పత్తి సరఫరా తోపాటు పాము వద్ద ఎలా ఉత్పత్తి చేస్తున్నారు సీడ్ ని ఎలా డెవలప్ చేస్తున్నారని విషయాలపై జిల్లా కలెక్టర్ రమేష్ కుమార్ జీడి ఫిషరీస్ తో చర్చించారు. మత్స్య సంపద పెంచుతున్న రైతు దంతులూరీ సీతారామరాజును ఎమ్మెల్యే బుచ్చిబాబు జిల్లా కలెక్టర్ రమేష్ కుమార్ చేపల పెంపకం, సాగు విస్తీర్ణం గురించి అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ రంగం కంటే ఈ ప్రాంతంలో చేపల పెంపకానికి ఎక్కువగా అనువైన వాతావరణ ఉందని చేపల సాగు చేసే రైతు సీతారామరాజు కలెక్టర్ కు ఎమ్మెల్యేకు వివరించారు. చేపల సంపద ద్వారా ప్రభుత్వానికి పన్నుల ద్వారా ఆదాయంతో పాటు చేపల పండించే రైతులకు సహకారం కూడా కావాలని కోరారు. మరిన్ని ఎకరాల్లో చేపల పెంపకాన్ని సీడ్ ఎలా ఉత్పత్తి చేయాలి అనే విషయంపై ఆయన సమగ్రంగా జిల్లా కలెక్టర్కు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ కార్యక్రమంలో అమలాపురం ఆర్టీవో మాధవి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి గుత్తుల సాయి, టిడిపి నాయకులు పిన్నమరాజు శివ, డిప్యూటీ తాసిల్దార్ కే మహాలక్ష్మి నాయుడు, వీఆర్వో వెలువలి కిరణ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### మాక్ అసెంబ్లీ స్టూడెంట్ ఎమ్మెల్యేగా ఎంపికైన

## అలమూరు విద్యార్థి అనసూరి లోకేష్



**ఆత్రేయపురం (మనసులో మాట )నవంబరు 21..** రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నవంబర్ 26న అమరావతిలో జరగనున్న విద్యార్థుల మాక్ అసెంబ్లీ కోసం అలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న అనసూరి లోకేష్ కుమార్ స్టూడెంట్ ఎమ్మెల్యేగా ఎంపిక కావడం పట్ల కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సంతోషం వ్యక్తం చేశారు. శుక్రవారం రావులపాలెం క్యాంప్ కార్యాలయంలో ఎంపికైన లోకేష్ కుమార్‌ను ఎమ్మెల్యే దుశ్శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడితూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రేరణతో జరుగుతున్న విద్యార్థుల మాక్ అసెంబ్లీలో చోటు పొందడం ఒక అరుదైన అవకాశం అని, ఇది ప్రతీ ఒక్కరికీ దక్కేది కాదని పేర్కొన్నారు. ఇలాంటి అవకాశాన్ని అదృష్టంగా భావించి మరింత కృషితో ముందుకు సాగాలని లోకేష్‌కు సూచించారు. కొత్తపేట నియోజకవర్గానికి స్టూడెంట్ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించనున్న లోకేష్‌కు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు.

## పల్నాటి వీరుల ఉత్సవాల బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ



**పల్నాడు, నవంబర్ 21,(మనసులో మాట):** పల్నాడు జిల్లా కారంపూడి నందు ఎంతో వైభవంగా నిర్వహిస్తున్న పల్నాటి వీరుల ఉత్సవాలు బందోబస్తు ఏర్పాట్లను పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు పరిశీలించారు. 900 సంవత్సరాలు దేశవ్యాప్తంగా ఎంతో చరిత్ర కలిగిన పల్నాటి వీరుల ఉత్సవాలు సందర్భంగా శుక్రవారం మూడవ ఘట్టంగా పిలవబడే మందపోరు (చాపకూడు) కార్యక్రమ బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ స్వయంగా పరిశీలించి అధికారులకు సూచనలు ఇవ్వడం జరిగింది

నేడు శనివారం జరుగు కోడిపోరు కార్యక్రమం,23 వ తేదీన జరుగు కల్లిపాడు కార్యక్రమాలకు సంబంధించి పోలీసు శాఖ తీసుకోవలసిన చర్యల గురించి ఎస్పీ స్వయంగా పరిశీలించి అధికారులతో చర్చించారు. అంకాలమ్మ ఆలయం వద్ద భక్తులు పొంగళ్ళు సమర్పించడానికి వచ్చినప్పుడు, కొణతాల ఊరేగింపు సమయంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూసుకోవాలని ఆయన గురజాల సబ్ డివిజనల్ అధికారి జగదీష్ ని ఆదేశించారు. వీర్ల తిరునాళ్ల సందర్భంగా కారంపూడి నందు భక్తుల కు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు. అనంతరం వీరుల తిరునాళ్ళు సందర్భంగా ఈ రోజు జరిగిన చాపకూడు ఘట్టం నందు ఎస్పీ, జిల్లా అధికారులతో, స్థానిక ప్రజలతో కలిసి పాల్గొనడం జరిగింది.

## పోలిపాడ్యమి దీపాలతో కార్తీక మాసానికి వీడ్కోలు





**పిఠాపురం, ( మనసులో మాట) నవంబరు 21:** ఆధ్యాత్మిక శోభతో వెలిగిపోతున్న కార్తీక మాసం చివరి రోజున కాకినాడ జిల్లా ప్రఖ్యాత పుణ్యక్షేత్రం పిఠాపురం పాదగయ క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది . పోలి స్వర్గం పురస్కరించుకుని భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పవిత్రమైన పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. దీపాలను వెలిగించి వాటిని అరటిగొప్పలలో ఉంచి పుష్కరిణిలో విడిచిపెట్టారు.

**జ్యోతుల వెలుగులో భక్తి పారవశ్యం**

ఈ ఏడాది కార్తీక అమావాస్యతో కార్తీకమాసం ముగియడంతో చివరి రోజున పోలీ వర్గం పేరిట భక్తులు దీపాలను నీటిలో వదిలే సాంప్రదాయాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ పుష్కరిణి కాంతులతో వెలిగిపోయింది. ఈ దీపారాధన పూర్వజన్మల పాపాలను తొలగించి మోక్షాన్ని ప్రసాదిస్తుందని భక్తుల విశ్వాసం. భక్తి గీతాలు పాడుతూ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఆధ్యాత్మిక పారవశ్యంలో భక్తులు మునిగిపోయారు . శ్రీ ఉమా కుక్కుటేశ్వర స్వామి వారికి వేద పండితులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తమ మొక్కలను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం పరిసరాలు భక్తులతో పూజా కార్యక్రమాలతో నిండిపోయాయి. కార్తీకమాసం మొత్తం చేసిన దీపారాధన పూజల ఫలితాన్ని ఈ చివరి రోజున పొందుతారని భక్తులు ప్రగాఢ నమ్మకం. ఈ పుణ్యకార్యం ద్వారా సుఖ సంతోషాలు ఐశ్వర్యాలు లభిస్తాయి అని పండితులు తెలిపారు. కార్తీకమాసంలో వెలిగించే ప్రతి దీపం జ్ఞానానికి పాపప్రక్షాళనకు ప్రతీక ముఖ్యంగా పోలి పాడ్యమి రోజున నీటిలో దీపాలను వదలడం అజ్ఞానం అనే చీకట్లను తొలగించి జ్ఞానమనే వెలుగులను జీవితంలో ప్రకాశింపజేస్తుందని భక్తుల విశ్వాసం. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సహాయక కమిషనర్ కాట్నం జగన్మోహన్ శ్రీనివాసు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## పిచ్చికుక్క స్వైర విహారం - పదిమందికి గాయాలు

### ఆసుపత్రి పాలు - పట్టించుకోని గ్రామపంచాయతీ



**ఐ .పోలవరం,(మనసులో మాట ) నవంబర్ 21.** మురమళ్ళ గ్రామపంచాయతీలో పిచ్చికుక్కల సైర విహారం... విచ్చలవిడిగా తిరుగుతూ పదిమందిని ఒక పిచ్చికుక్క కరవడంతో పదిమంది గాయాలు పాలై ఆసుపత్రులు పాలు అయ్యారు. స్థానిక గ్రామపంచాయతీ అధికారులు సర్పంచి పాలకవర్గం పట్టించుకోకపోవడంతో ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు. శుక్రవారం పిచ్చికుక్కలు రెచ్చిపోయి వాహనదారులను పాదచారులను దొరికిన వారిని దొరికినట్లుగా కరిచేసి ముక్కలు పీకేసాయి. పిచ్చికుక్కల దాడిలో గాయపడ్డ పాదచారులు వాహనదారులు టీ కొత్తపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య నిమిత్తం చికిత్స చేయించుకుంటున్నారు. గ్రామపంచాయతీ సర్పంచ్ పాలకవర్గం అధికారులు సిబ్బంది పట్టించుకోకపోవడంతో పిచ్చి కుక్కల నివారణ జరగడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పిచ్చికుక్కల నివారణకు నిబంధనలు ఉన్నప్పటికీ కనీసం గ్రామపంచాయతీ అసలు పట్టించుకోవడంలేదని ఒకే రోజు పదిమందిని పిచ్చికుక్క కరిచి గాయాలు పాలు చేసింది. పిచ్చికుక్క కరిచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నపలువురు పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇలాగే పరిస్థితి వదిలేస్తే పిచ్చికుక్కల కాటు గురై మరి కొంతమంది రాబిస్ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే పిచ్చికుక్కల నివారణకు స్థానిక గ్రామపంచాయతీ ప్రత్యేక చర్యలు గైకొనాలని పిచ్చికుక్క దాడిలో గాయపడ్డ పాదచారులు, వాహన దారులు, ప్రయాణికులు బెంబేలెత్తి పోతున్నారు. కనీసం జ్ఞానం లేకుండా సిగ్గు శరం లేకుండా పిచ్చికుక్కల నివారించాలని ఆలోచన లేకపోవడం సిగ్గుచేటని స్థానికులు దుమ్మెత్తి పోస్తున్నారు.




## కపిలేశ్వరపురం లో స్వచ్ఛ దివస్

**కపిలేశ్వరపురం (మనసులో మాట) నవంబర్ 21..** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టుతున్న స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం లో భాగంగా శుక్రవారం డాక్టర్ బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, మండల కేంద్రం కపిలేశ్వరపురం గ్రామంలో నిర్వహించారు. మండలలో వివిధ గ్రామాలు నుండి విచ్చేసిన పూర్వపు మిత్రులు కపిలేశ్వరపురం గ్రామం లో చెత్త ను సేకరించి, చెత్త నుండి సంపద కేంద్రం వద్ద తడి, పొడి చెత్త లు గా విభజించారు. తడి, పొడి చెత్త లుగా విభజించి వాటిని వేర్వేరు తొట్టెలు లో ఉంచడం జరిగింది. తడి చెత్త ను సేంద్రీయ ఎరువుగా తయారు అయిన తర్వాత రైతులకు విక్రయించడం ద్వారా ఆదాయం పొందవచ్చునీ ఎంపిడిఓ బానూజీ రావు క్లాప్ మిత్రులు కు వివరించారు. అలాగే పొడి చెత్త అయిన ప్లాస్టిక్ సీసాలు, వంటి వ్యర్థాలను రీ సైక్లింగ్ వాళ్లకి విక్రయించ వచ్చు అన్నారు. చెత్త నుండి ఏ విధంగా వర్మీ కంపోస్ట్ తయారు అవుతుందీ వాకతిప్ప కార్యదర్శి వెంకటేశ్వర రావు, అంగర కార్యదర్శి రాయుడు మోహన్ లు వివరించారు. మధ్యాహ్న భోజన విరామం అనంతరం ఎంపీపీ కార్యాలయంలో ఒక రోజు శిక్షణ తరగతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శాకా శ్రీనివాస్, డిప్యూటీ ఎంపిడిఓ బి. వర ప్రసాద్,వైస్ ప్రెసిడెంట్ బి.రాంబాబు, కార్యదర్శి శివ చక్రవర్తి, క్లాప్ మిత్రులు, వివిధ గ్రామాలు నుండి కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

### చక్రద్వారాబంధంలో

## లక్ష దీపోత్సవం అద్భుతం

- సంస్కృతి, సాంప్రదాయాలే మన ఆశయం
- కంబాల లక్ష విరాళం ప్రకటన
- రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల



**గోకవరం (మనసులో మాట), నవంబర్ 21 :** రాజానగరం మండలం శ్రీ చక్రద్వారా బంధం గ్రామంలోని శ్రీశ్రీశ్రీ భవాని సమేత చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం వద్ద లక్ష దీపోత్సవం ఘనంగా జరిగింది. కమిటీ వారి ఆహ్వాన మేరకు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. అలయంలో స్వామి వారిని దర్శించుకొని, పూజలు నిర్వహించి, దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. సనాతన ధర్మ పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తానన్నారు. మనమందరం భారతీయులమని, కులమతాలకు అతీతంగా కలిసికట్టుగా జీవించాలని సూచించారు. ఆలయం వద్ద వాటర్ ట్యాంక్ నిర్మాణానికి సహకారం అందించాలని ఆలయ కమిటీ సభ్యులు కంబాల శ్రీనివాసరావుని కోరారు. స్పందించిన ఆయన లక్ష రూపాయలు విరాళాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాజానగరం బీజేపీ మండల అధ్యక్షులు ఆళ్ల శివ నాగరాజు, రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు బత్తుల నానాజీ, పెద్దాడ వెంకన్న దొర కమిటీ సభ్యులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు

## జగన్మోహిని కేశవ స్వామి ఆలయానికి విరాళాలు




**ఆత్రేయపురం మనసు లో మాట నవంబర్ 21..** జిల్లాలోని ప్రసిద్ధిగాంచిన ర్యాలీ జగన్మోహిని కేశవ స్వామి ఆలయ అన్నదానం పథకానికి రాజమహేంద్రవరం చెందిన చింతలపాటి రఘురామరాజు, రాధా దంపతులు రూ 5 వేలు, విజయనగరం కి చెందిన పురాణం వెంకట శశికాంత్ రూ పదివేలు 116, బెంగళూరుకు చెందిన కంచ సముద్రం వెంకటేశ్వర మూర్తి,జయలక్ష్మి దంపతులు రూ 5వేలు, విరాళాన్ని ఆలయ ఈవో భాగవతల వెంకటరమణమూర్తి కి అందజేశారు. దాతలు స్వామివారి ప్రత్యేక దర్శనం చేయించి, స్వామిచిత్రపటాన్ని అందజేశారు.

## ఘనంగా శివ స్వాముల నగరోత్సవం



**పిఠాపురం, (మనసులో మాట) నవంబరు 21:** పిఠాపురం నగరం శివనామ స్మరణతో మారుమ్రోగింది . కార్తీక మాసం చివరి రోజు కావడంతో శుక్రవారం నాడు శివదీక్ష స్వాములు పిఠాపురం పట్టణంలో నగరోత్సవం నిర్వహించారు. స్వామి అమ్మవార్లను రథంపై ఉంచి ఊరేగించారు. ఈ ఊరేగింపు కార్యక్రమంలో ఏర్పాటుచేసిన శక్తి, శివ వేషధారణలు పలువురిని ఆకట్టుకున్నాయి. నగరోత్సవం సందర్భంగా కేరళ కళాకారులచే ఏర్పాటుచేసిన భజంత్రీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సుమారు 200 మంది శివ దీక్ష స్వాములు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పిఠాపురం పాదగయ క్షేత్రంలో ఇరుముడులు అనంతరం స్వాములు నగరోత్సవం పాదయాత్రగా సాగారు. పాదగయ క్షేత్రం నుండి పోలీస్ స్టేషన్ ఉప్పాడ బస్టాండ్ చర్చి సెంటర్ మీదగా కుక్కుటేశ్వరుడి ఆలయం వరకు నగరోత్సవం కొనసాగింది. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున శివ స్వాములు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



# నిఖత్ జరీన్ పోలీస్ శాఖకు గర్వకారణం

- గోల్డ్ మెడల్ సాధించినందుకు డీజీపీ అభినందనలు




**హైదరాబాద్, నవంబర్ 21 (మనసులో మాట):**

ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ గోల్డ్ మెడల్ సాధించడం పట్ల తెలంగాణ డీజీపీ బీ. శివధర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ స్పెషల్ పోలీస్ డీఎస్పీ నిఖత్ జరీన్‌ను అభినందించారు. మహిళల 51 కేజీల ఫైనల్స్‌లో తన ప్రత్యర్థిపై 5-0 తేడాతో ఘన విజయం సాధించడం ఆమె సామర్థ్యానికి, అంకితభావానికి నిదర్శనమని కొనియాడారు. 'గోల్డ్ మెడల్ సాధించి తెలంగాణ పోలీస్ శాఖకు గర్వకారణంగా నిలిచిన నిఖత్ జరీన్‌ను అభినందిస్తున్నాను. క్రీడల్లో అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పిన నిఖత్ విజయం ఇతర క్రీడాకారులకు ఆదర్శం' అని పేర్కొన్నారు. తెలంగాణ పోలీస్ కుటుంబం తరఫున నిఖత్ జరీన్ భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని డీజీపీ ఆకాంక్షించారు. ఇదిలావుంటే సీఐడీ విభాగంలో నేర విశ్లేషణ, సాంకేతికత కోసం క్రైమ్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ ఎనాలసిస్ పేరుతో ప్రత్యేక వింగ్‌ను ఏర్పాటు చేసినట్టు డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ఎంపిక చేసిన జిల్లాల్లో 'సేఫ్ విలేజ్' కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈ మేరకు రాష్ట్రంలోని పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తీవ్రమైన నేరాలు, ఆర్థిక నేరాలు, బాలలకు సంబంధించిన నేరాలపై లోతుగా చర్చించారు. రాష్ట్రంలోని ఏడు జిల్లాల పరిధిలో 'సేఫ్ విలేజ్ ప్రోగ్రాం'ను విస్తృతంగా నిర్వహించనున్నట్టు తెలిపారు.

# భారీగా ఐపీఎస్‌ల బదిలీ

- స్థానిక సంస్థల ఎన్నికల వేళ సర్కారు నిర్ణయం
- పలు జిల్లాలకు కొత్త ఎస్పీల నియామకం




**హైదరాబాద్,నవంబర్21(మనసులో మాట):**

తెలంగాణలో స్థానిక ఎన్నికలకు రంగం సిద్ధంచేస్తున్న వేళ ప్రభుత్వం భారీ ఎత్తున పోలీస్ అధికారులను బదిలీ చేసింది. పలు జిల్లాలకు కొత్త ఎస్పీలను నియమించింది. డిసెంబర్‌లో స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నోటిఫికేషన్ వస్తే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. దీంతో ముందుగానే ప్రభుత్వం ఐపిఎస్‌లను బదిలీ చేసినట్లు అర్థం అవుతోంది. ప్రస్తుతం ఉన్న వారిలో చాలామందిని బదిలీ చేసింది. ఈ క్రమంలో మొత్తం 32 మంది ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అడిషనల్ డీజీగా జయేంద్రసింగ్ చౌహాన్, సీఐడీ డీజీగా పరిమళ హన నూతన్ జాకబ్, పోలీసు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా చేతన్ మైలబత్తుల, మహేశ్వరం జోన్ డీసీపీగా కే నారాయణ రెడ్డి, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీగా పీవీ పద్మజలు నియమితులయ్యారు. ఇక నాగర్‌కర్నూల్ ఎస్పీగా సంగ్రామ్ సింగ్, హైదరాబాద్ సౌత్ జోన్ డీసీపీగా కిరణ్ ప్రభాకర్, మహబూబాబాద్ ఎస్పీగా శబరీష్, కుమ్రంభీం ఆసిఫాబాద్ ఎస్పీగా నిఖిత, టీజీ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీగా గిరిధర్, వికారాబాద్ ఎస్పీగా స్నేహ మిశ్రా బదిలి అయ్యారు. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీగా గైక్వాడ్ వైభవ్, ములుగు ఎస్పీగా కేకన్ సుధీర్ రామ్‌నాథ్, జయశంకర్ భూపాలపల్లి ఎస్పీగా సంకీర్త్, గవర్నర్ ఏడీసీగా పాటిల్ కాంతిలాల్ సుభాష్, పెద్దపల్లి డీసీపీగా రామ్ రెడ్డి, మల్కాజ్‌గిరి డీసీపీగా సీహెచ్ శ్రీధర్, భద్రాద్రి కొత్తగూడెం అడిషనల్ ఎస్పీగా అవినాష్ కుమార్, భువనగిరి అడిషనల్ ఎస్పీగా కంకణాల రాహుల్ రెడ్డి, జగిత్యాల అడిషన్ ఎస్పీగా శేషాద్రిని రెడ్డి, ములుగు అడిషనల్ ఎస్పీగా శివం ఉపాధ్యాయ, ఆదిలాబాద్ అదనపు ఎస్పీగా మౌనిక, ఏటూరు నాగారం ఏఎస్పీగా మనన్ భట్, నిర్మల్ ఏఎస్పీగా సాయికిరణ్, వేములవాడు ఏఎస్పీగా రుత్విక్ సాయి, సత్తుపల్లి ఏసీపీగా యాదవ్ వసుంధర, టీజీ ట్రాన్స్‌కో ఎస్పీగా శ్రీనివాస్, వనపర్తి ఎస్పీగా సునీత నియామకం అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# త్వరలో 'స్కిల్' యూనివర్సిటీ

## ఏటీసీలుగా 65 ఐటీఐ కళాశాలల మార్పు

## జేఎన్టీయూ డైమండ్ జూబ్లీ వేడుకల్లో డిప్యూటీ సీఎం



**హైదరాబాద్, నవంబర్ 21 (ఆర్ఎన్ఎ):**

65 ఐటీఐ కళాశాలలను ఏటీసీలుగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క తెలిపారు. హైదరాబాద్ కూకట్‌పల్లిలోని జేఎన్టీయూ డైమండ్ జూబ్లీ వేడుకలకు ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరయ్యారు. విద్యార్థుల భవిష్యత్తులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. త్వరలోనే స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. జేఎన్‌టీయూ ఒక విశ్వవిద్యాలయం మాత్రమే కాదని.. ఇది దేశానికి, ముఖ్యంగా తెలంగాణకు గొప్ప ఆస్తి అని పేర్కొన్నారు. ఇంజనీర్లను తయారు చేసే శక్తివంతమైన దేశ ఇంజిన్ అని ప్రశంసించారు. విద్యార్థుల ప్రతిభ ప్రపంచానికి ఎంతో గర్వకారణమన్నారు. విద్య అనేది ఖర్చు కాదని, భవిష్యత్తును నిర్మించే పెట్టుబడని విద్యార్థులకు భట్టి విక్రమార్క సందేశం ఇచ్చారు. ఉద్యోగాలు వెతికే వారిగా కాకుండా ఉద్యోగాలు సృష్టించే వారిగా ఎదగాలని సూచించారు. మొదటి 60 ఏళ్ల కంటే, వచ్చే 60 ఏళ్లు మరింత మహోన్నతంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు.

# అబద్ధాల ప్రచారంలో కేటీఆర్ దిట్ట

**గతంలో లాగా అడ్డగోలు నిర్ణయాలకు మేం దూరం**

**ఉపాధి, ఉద్యోగాల కోసం పెట్టుబడుల వేట**

**గతంలో ఇచ్చిన జీవోల ఆధారంగానే భూ భూ కేటాయింపులు**

**ఎవ్వరికీ భూములు దోచిపెట్టే పరిస్థితి లేదు**

**కేటీఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు**



**హైదరాబాద్,నవంబర్21(మనసులో మాట):**

పదేళ్లు మంత్రిగా పనిచేసిన కేటీఆర్ రాష్ట్ర ప్రజలకు అసత్యాలు చెబుతున్నాని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం సిఎం రేవంత్ నేతృత్వంలో పెట్టుబడుల కోసం, ఉపాధి, ఉద్యోగాల కల్పనకు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నదని అన్నారు. అచిర కాలంలోనే తెలంగాణ అనేక విజయాలు సాధించిందని అన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా అడ్డగోలుగా జీవోలు, చెల్లింపులు చేయడం లేదని, వారి హయాంలో ఏం చేసినా దాని వెనుక ఓ మతలబు ఉండేదని ఆరోపించారు. శుక్రవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'మా కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలపై కేటీఆర్ ఆరోపణలు చేశారు. మొత్తం 9,292 ఎకరాల భూమి గురించి మాట్లాడారు. పరిశ్రమలను ప్రోత్సహించాలని ప్రభుత్వం భూములను తక్కువ ధరకు ఇస్తోంది. 2023లో భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం మూడు జీవోలు ఇచ్చింది. ఆ జీవో ప్రకారం హైదరాబాద్‌లోని భూములను ట్రాన్స్‌ఫర్‌కు అనుమతి ఇచ్చారు. ప్రభుత్వ భూమి అమ్ముకున్నట్టు కేటీఆర్ మాట్లాడుతున్నారు. ఫ్రీహోల్డ్, ల్యాండ్ లీజ్‌కు తేడా లేకుండా మాట్లాడారు. 2023లో భారత రాష్ట్ర సమితి తెచ్చిన జీవో ప్రకారమే భూములు ఇస్తున్నాం. భూమి హక్కులు ఉన్న వారికి మేలు చేయాలని చూస్తున్నాం. గత ప్రభుత్వం హయాంలో చాలా భూములు బదిలీ చేశారు. పరిశ్రమలకు ఉపయోగపడాలని గ్రిడ్ పాలసీ తీసుకున్నారని అనుకున్నాం. పారిశ్రామిక వేత్తలను ఇబ్బంది పెట్టకూడదు. పెట్టుబడులు రావాలని రాయితీలతో కూడిన పాలసీలు తీసుకుంటాం. కొన్ని రాష్ట్రాల్లో 99 పైసలకే భూములు ఇస్తున్నారు. పెట్టుబడులు రావాలి, ఉపాధి పెంచాలి అనేది మా లక్ష్యం. ఫ్రీహోల్డ్ ల్యాండ్ ఉన్నవారు పాలసీ ద్వారా అవకాశం ఉంటే దరఖాస్తు చేసుకుంటారని అన్నారు. భారత రాష్ట్ర సమితి నేతలు అభూత కల్పనలతో రాష్ట్ర ప్రజలకు సత్యదూరమైన మాటలు చెబుతున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమి తర్వాత ఆ పార్టీ నేతలకు పగలే చుక్కలు కనిపిస్తున్నాయి. పెట్టుబడులు రాకూడదు, రాష్ట్ర అభివృద్ధి జరగకూడదు అనేది కేటీఆర్ ఆలోచన. ఆధారాలు ఉంటేనే మాట్లాడాలి. కేటీఆర్ కొంత మంది పేర్లు చెప్పారు.. వారు ప్రభుత్వంలో లేరు. ఆధారాలు ఉంటే చెప్పండి.. చర్యలు తీసుకుంటాం అని శ్రీధర్‌బాబు తెలిపారు. రాష్ట్ర ప్రగతిని అడ్డుకునేలా అబద్ధాల ప్రచారం మానుకోవాలన్నారు. గతంలో లాగా అడ్డగోలు నిర్ణయాలు జరగడం లేదన్నారు. స్వలాభం అన్నదానికి వారు హయాంలో తీసుకున్న నిర్ణయాలే నిదర్శనమని శ్రీధర్ బాబు అన్నారు.

# ఇందిరమ్మ చీరల పంపిణీ

- పేదల రాజ్యం ఇందిరమ్మ రాజ్యం
- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



**ధారూర్, నవంబర్ 21 (మనసులో మాట):**

ఇందిరా మహిళా శక్తిలో భాగంగా ధారూర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మహిళలకు ఇందిరమ్మ చీరలను తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ... ఇందిరమ్మ చీరలను అందుకుంటున్న అక్కా చెల్లెల్లకు నా శుభాకాంక్షలు. పండుగలకు, మన ఇళ్ళలో జరిగే ఫంక్షన్లకు ఇంటి ఆడబిడ్డకు చీర పెట్టడం మన ఆచారం అని పేర్కొన్నారు. రాష్ట్ర మహిళలందరికి అన్నగా మన ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు మీకు ఇందిరమ్మ చీరలను పెడుతున్నాడు. అందరికీ చీరలు వస్తాయన్నారు. గత ప్రభుత్వంలో బతుకమ్మ పేరుతో నాసిరకం చీరలు ఇచ్చారు. ఇంటి ఆడబిడ్డకు ఇచ్చే చీరలలో కూడా కక్కుర్తితో అవకతవకలకు పాల్పడి పనికిరాని చీరలను ఇచ్చారు. కానీ మన ముఖ్యమంత్రి మాత్రం అలా కాకుండా మీరు కట్టుకునేవి, మంచి నాణ్యమైన చీరలనే ఇస్తున్నాడు. మహిళలపై నిజమైన ప్రేమ ఎవరికి ఉన్నదో మీరు ఆలోచన చేయాలని పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటేనే పేదల రాజ్యమని, ప్రధానమంత్రిగా ఇందిరమ్మ పేదల కోసం సంక్షేమ పథకాలను అమలు చేసింది. ఇందిరమ్మను ఆదర్శంగా తీసుకొని మన ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు రాష్ట్రంలో మహిళల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. సమాజంలో సగ భాగంగా ఉన్న మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే కుటుంబాలతో పాటుగా, రాష్ట్రం, దేశం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, పేదలకు 200 యూనిట్ల వరకు కరంటు ఉచితంగా అందుతున్నాయన్నారు. ఇందిరమ్మ ఇళ్లను కూడా మహిళల పేరు మీదనే మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలన్నదే ప్రభుత్వం లక్ష్యం. అందుకే అనేక పథకాలు మహిళలకు ఇస్తున్నట్లు వివరించారు. మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు, ఆర్టీసీ సంస్థకు అద్దె బస్సులు ఇప్పించడం, పెట్రోల్ పంపుల నిర్వాహణ, ధాన్యం కొనుగోలు, రైస్ మిల్లుల ఏర్పాటు వంటి అనేక వ్యాపారాలను ఏర్పాటు చేయిస్తున్నట్లు వివరించారు. ఇందిరా శక్తి క్యాంటీన్ల ఏర్పాటు, పాఠశాలలకు ఏకరూప దుస్తులు కుట్టడం వంటి ఉపాధి అవకాశాలను మహిళలకు ఇస్తున్నామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలనే ఉద్దేశంతో సంవత్సరానికి రూ. 20 వేల కోట్ల రూపాయలు మహిళలకు వడ్డీ లేకుండా అందిస్తున్నారన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు రుణమాఫీలో భాగంగా వికారాబాద్ జిల్లాలో మొత్తం రూ. 32.70 కోట్లు రుణమాఫీ చేశారు. వికారాబాద్ నియోజకవర్గానికి చెందిన 2,987 సంఘాలలోని 30 వేల మంది మహిళా సభ్యులకు రూ. 9 కోట్ల 12 లక్షల రూపాయల మిత్తీ రుణమాఫీ జరిగిందన్నారు.

# పిల్లల హక్కుల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి

- రాష్ట్ర చైల్డ్ కమిషన్ చైర్‌పర్సన్ సీత దయాకర్ రెడ్డి

**ఆదిలాబాద్, నవంబర్ 21 (మనసులో మాట):**

పిల్లల రక్షణ, భద్రత, విద్య, ఆరోగ్యం, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ సీత దయాకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల బాలల భద్రత, బాల్య వివాహాల నియంత్రణ, పోక్సో చట్టం అమలు, చైల్డ్ ప్రొటెక్షన్ వ్యవస్థపై అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ, పిల్లలకు రక్షణ, విద్య, ఆరోగ్యం, గౌరవంతో జీవించే హక్కులు ఉన్నాయని, ఈ హక్కులను కాపాడటం ప్రభుత్వం మాత్రమే కాకుండా సమాజం మొత్తం పాలుపంచుకోవాల్సిన బాధ్యత అని స్పష్టం చేశారు. జిల్లాలో ఇంకా బాల్య వివాహాలు నమోదవడం ఆందోళనకరమని పేర్కొన్న ఆమె, సమాచారం వచ్చిన వెంటనే తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో పర్యవేక్షణ బలోపేతం చేయాలని, బాల్య వివాహ నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని సూచించారు. అలాగే హాస్టళు,, ఆశ్రమాలు, పాఠశాలల్లో పిల్లలపై వేధింపులు, దుర్వినియోగం, నిర్లక్ష్యంపై జీరో టాలరెన్స్ విధానంతో వ్యవహరించాలని సూచించారు. స్మార్ట్ ఫోన్లు, సోషల్ మీడియా వినియోగం పెరిగిన నేపథ్యంలో పిల్లలు సైబర్ మోసాలు, అనారోగ్యకర ఆన్‌లైన్ గేమ్స్ ప్రభావానికి గురవుతున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ఆన్‌లైన్ ప్రవర్తనను గమనించాలని, వారు ఏ యాప్స్ వాడుతున్నారు, ఎవరితో మాట్లాడుతున్నారు అనే అంశాలపై అవగాహన తప్పనిసరి అని సూచించారు. బాలల అత్యవసర సమస్యల పరిష్కారానికి చైల్డ్‌లైన్ 1098 సేవలను ప్రజలు విస్తృతంగా వినియోగించుకోవాలని కోరారు. పోక్సో చట్టం అమలు, బాల కార్మిక నిర్మూలన, సీపీఎస్ బలోపేతంపై అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, జిల్లాలో చిన్నారుల రక్షణకు సమగ్ర చర్యలు చేపడుతున్నట్టుగా తెలిపారు. ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ ద్వారా ఇప్పటి వరకు మొత్తం 354 మంది చిన్నారులను గుర్తించి, డ్రాప్‌అవుట్ పిల్లలను బడిలో చేర్పిచే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. షీ టీమ్, భరోసా సెంటర్, ఆరోగ్య పాఠశాల కార్యక్రమం ద్వారా కళాజాత బృందాల సహాయంతో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో బాల్య వివాహాల నియంత్రణ కోసం పటిష్ట చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఇప్పటి వరకు 83 పాక్సో కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. బడిబాట ప్రోగ్రాం కింద కెజీబీవీలు, పాఠశాలలు, భవిత కేంద్రాల్లో మరుగుదొడ్లు, భవనాలు, పెయింటింగ్ వంటి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. 70 శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే జరుగుతున్నాయని, వైద్య సేవల నాణ్యతను మరింత పెంచే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని కలెక్టర్ వివరించారు. విద్య, ఆరోగ్య విభాగాల పురోగతిని ఈ సందర్భంగా కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నిర్మల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇంఛార్జి జిల్లా సంక్షేమ అధికారి ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ, జిల్లాలో 31 సెక్టర్లలో 931 అంగన్వాడీలు, 0%-%6 ఏళ్ల పిల్లలకు సేవలు అందిస్తున్నాయని తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్ ద్వారా 57 కేసులు నమోదు చేసి విచారణ జరిపామని తెలిపారు. డ్రాప్‌అవుట్ పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించడం జరిగిందని అన్నారు. 2023 నుంచి ఇప్పటివరకు 44 బాల్య వివాహ కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. 120 పాక్సో కేసుల్లో పరిహారం అందించడం జరిగిందని అన్నారు. పాఠశాలల్లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, కళాజాత బృందాల ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నామని తెలిపారు. బాల కార్మికులను పనిలో పెట్టుకున్నవారిపై కేసులు నమోదు చేశామని, రక్షిత వాతావరణం కల్పించి బాల కార్మికులను పాఠశాలల్లో చేర్పించామన్నారు. గ్రామాల్లో బాల్య వివాహ నిరోధక కమిటీలు ఏర్పాటు చేసి, బాల్య వివాహాల పరిణామాలపై వాల్ పెయింటింగ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. జిల్లాలో బలశక్తి, అమ్మ రక్షిత కార్యక్రమాల పురోగతిని వివరించారు. అనంతరం కమిషన్ చైర్ పర్సన్, సభ్యులను శాలువా, జ్ఞాపికలతో కలెక్టర్ సత్కరించారు. అంతకుముందు పట్టణ కేజీబీవి, రిక్షా కాలనీ లోని అంగన్వాడీ కేంద్రాన్ని బాలల కమిషన్ బృందం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేసారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు వందన గౌడ్, అపర్ణ, సరిత, ప్రేమలత, వచన్ కుమార్, ఆదిలాబాద్, నిర్మల్ ఏఎస్పీ లు సురేందర్ రావు, అవినాష్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, డిఎమ్ అండ్ ఎచ్,ఓ రాథోడ్ నరేందర్, నిర్మల్ డిఇఓ బోజన్న, ప్రోగ్రాం కోర్డినేటర్ డా.సౌమ్య, విద్యా, సంక్షేమ, వైద్యారోగ్య, పోలీస్, శాఖల అధికారులు, సీడబ్ల్యూసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## మత్స్యకారులు దళారులను నమ్మి మోసపోవద్దు

**ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి**



**బాన్సువాడ, నవంబర్ 21 (మనసులో మాట):**

మత్స్యకారులు మధ్య దళారులను నమ్మి మోసపోవద్దని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. వర్ని మండలం జలాల్‌పూర్ పెద్ద చెరువులో ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డితో పాటు, అగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు హాజరయ్యారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా పోచారం మాట్లాడుతూ, రాష్ట్రంలో 100 శాతం సబ్సిడీతో చేప విత్తనం అందించే విధానం దేశంలోనే ప్రత్యేకమని తెలిపారు. గతంలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా మత్స్యకారులు దళారులపై ఆధారపడే పరిస్థితి ఉండేదని, దానివల్ల లాభాలు ఎక్కువగా దళారులకే దక్కేవని ఆయన పేర్కొన్నారు. మత్స్యకారులు స్వయంగా తమ గ్రామాలు, పట్టణాల్లో చేపలను అమ్మే విధానాన్ని అవలంబించాలని ఆయన గట్టిగా సూచించారు. దళారుల ఆధారాన్ని తగ్గించాలని, వారి దోపిడీకి గురికాకుండా జాగ్రత్తపడాలని ఆయన మత్స్యకారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహాతో, జిల్లా మత్స్యశాఖ అధికారి ఆంజనేయ స్వామి, ఫిషరీస్ మాజీ అదనపు డైరెక్టర్ శంకర్ నాయక్ రాథోడ్, వర్ని మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ బాబా తదితరులు పాల్గొన్నారు.

## తారామపురం కాలనీ భూ ఆక్రమణలపై ఉక్కుపాదం

**ఎమ్మెల్యే జీఎంఆర్ తీవ్ర ఆగ్రహం**



**పటాన్ చెరు, నవంబర్ 21 (మనసులో మాట):**

పటాన్ చెరు డివిజన్ పరిధిలోని సీతారామపురం కాలనీలో చోటుచేసుకుంటున్న భూ ఆక్రమణలపై పూర్తిస్థాయి సర్వే నిర్వహించి, కబ్జాదారులపై ఉక్కుపాదం మోపుతామని పటాన్ చెరు శాసన సభ్యులు (ఎమ్మెల్యే) గూడెం మహిపాల్ రెడ్డి (జిఎంఆర్) తెలిపారు. శుక్రవారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జీహెచ్ఎంసీ, రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ, రెండు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన సీతారామపురం కాలనీలో గత కొన్ని సంవత్సరాలుగా అంతర్గత రహదారులు, పార్కులు, ప్రార్థన స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయని స్థానికుల నుండి ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. కాలనీని ఏర్పాటు చేసిన డెవలపర్లు ప్రభుత్వానికి రిజిస్టర్ చేయవలసిన రహదారులు, ప్రార్థన స్థలాలు, పార్కుల స్థలాలను సైతం బై నెంబర్లు వేసి రిజిస్ట్రేషన్లు చేస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని ఎమ్మెల్యే తెలిపారు. చివరకు కాలనీ సరిహద్దులలో గల చెరువులు, కాలువలను సైతం ఆక్రమించి ప్లాట్లు అభివృద్ధి చేస్తున్నారని ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. 1998వ సంవత్సరంలో మొదటి లేఔట్‌తో ప్రారంభించి నేటి వరకు మూడు లేఔట్లుగా తయారు చేయడం జరిగిందని, రాబోయే రోజుల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. భూ ఆక్రమణలపై పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి, త్వరితగతిన ఆక్రమణలను తొలగించాలని ఎమ్మెల్యే జిఎంఆర్ అధికారులను ఆదేశించారు. కబ్జాలకు కారకులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని ఆయన స్పష్టంగా సూచించారు. ఈ సమావేశంలో ఎంఆర్‌ఓ రంగారావు, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్, నీటి పారుదల శాఖ డీఈ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుడి పాడె మోసిన ఆగ్రో చైర్మన్

**విషాదంలో ఇబ్రహీంపేట**



**బాన్సువాడ, నవంబర్ 21 (మనసులో మాట):**

బాన్సువాడ మండలం, ఇబ్రహీంపేట గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ ఉద్దెర చిన్న హన్మండ్లు అప్పా ఆకస్మిక మరణం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. గ్రామాభివృద్ధికి కృషి చేసిన ఆయన మరణం గ్రామానికి తీరని లోటుగా గ్రామస్థులు భావిస్తున్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుండే హన్మండ్లు, అందరికీ అందుబాటులో ఉండే నాయకుడిగా పేరుపొందారు. ఆకస్మికంగా కన్నుమూయడంతో గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. హన్మండ్లు మరణ వార్త తెలిసిన బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు వెంటనే ఇబ్రహీంపేట గ్రామానికి వెళ్లారు. అక్కడ పార్థివదేహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టీఎస్ ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు హన్మండ్లు పార్థివ దేహం పాడె మోసి, కార్యకర్త పట్ల తన అభిమానాన్ని, గౌరవాన్ని చాటుకున్నారు. హన్మండ్లు కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలు అందించారని ఈ సందర్భంగా నాయకులు గుర్తు చేశారు. అంత్యక్రియలకు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# 'భూ భారతి' భూ మేతగా మారిందా?

- రెవెన్యూ సంస్కరణలు చెత్త సంస్కరణలు
- మాజీ మంత్రి హరీష్ రావు ధ్వజం



**హైదరాబాద్, నవంబర్ 21 (మనసులో మాట):**

అవినీతి, అక్రమాలు, అడ్డగోలు వసూళ్లతో ప్రభుత్వం తీసుకొచ్చిన 'భూ భారతి' కార్యక్రమం 'భూ మేత'గా మారిందని, ఇది కాంగ్రెస్ నాయకులకు, రియల్ ఎస్టేట్ బ్రోకర్లకు 'మంగళ హారతి' పాడుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ అగ్ర నాయకులు హరీష్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో భూమి రిజిస్ట్రేషన్లు కాక, ఇతర భూ సమస్యల కారణంగా రైతులు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడుతున్న వరుస ఘటనల నేపథ్యంలో ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై విమర్శలు గుప్పించారు.

### రైతు ఆత్మహత్యాయత్నాలపై నిలదీత

ఎన్నికల ప్రచారంలో "ఒక్క రైతు కూడా భూ సమస్య వల్ల ఆత్మహత్య చేసుకోకూడదు. రైతుల భూమి హక్కులు 100శాతం కాపాడతాం" అని రేవంత్ రెడ్డి ఊదరగొట్టారని హరీష్ రావు గుర్తు చేశారు. అయితే, భూమి రిజిస్ట్రేషన్ చేయడం లేదనే కారణంతో మొన్న మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం తహసీల్దార్ కార్యాలయం ముందు అన్నదమ్ములు పురుగుల మందు డబ్బాతో ఆందోళనకు దిగారని, నిన్న నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారని ఆయన ఉదహరించారు. మీ పార్టీ ఎమ్మెల్యే కార్యాలయాల వద్ద, తహసీల్దార్ కార్యాలయాల వద్ద జరుగుతున్న ఈ రైతు ఆత్మహత్యాయత్నాలు ముఖ్యమంత్రికి కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు.

### రెవెన్యూ సంస్కరణలు 'చెత్త సంస్కరణలు'

'ధరణి'పై అడ్డగోలుగా మాట్లాడి, మీరు గొప్పగా తెచ్చిన 'భూ భారతి' భూముల సమస్యలు పరిష్కరించడంలో ఎందుకు విఫలమైందని హరీష్ రావు నిలదీశారు. అవినీతి, అక్రమాలు, అడ్డగోలు వసూళ్లతో భూ భారతి 'భూ మేత' అయ్యిందని ఆయన ఆరోపించారు. 'భూ భారతి.. భూ హారతిగా మారిందా? కాంగ్రెస్ నాయకులకు, రియల్ ఎస్టేట్ బ్రోకర్లకు మంగళ హారతి అయ్యిందా?' అని విమర్శించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన రెవెన్యూ సంస్కరణలు 'పేరు దిబ్బ ఊరు దిబ్బ' అన్న చందంగా ఉన్నాయని, ఇవి 'రెవెన్యూ చెత్త సంస్కరణలు' అని ఆయన అభివర్ణించారు.

### పెండింగ్ సమస్యలపై ఆగ్రహం

అధికారంలోకి వస్తే 3 నెలల్లో భూ సమస్యలు పరిష్కరిస్తాం అన్న హామీ ఏమైందని రేవంత్ రెడ్డిని ఆయన ప్రశ్నించారు. భూముల రికార్డులు సరిచేస్తాం, రైతుల హక్కులు కాపాడతాం అని చెప్పి... రెండేళ్లుగా కుంటి సాకులు చెబుతూ రిజిస్ట్రేషన్లు చేయకుండా రైతుల జీవితాలతో ఆడుకుంటున్నారని హరీష్ రావు మండిపడ్డారు. నెలలు గడుస్తున్నా సాదాబైనామా దరఖాస్తుదారులు ఎందుకు పరిష్కరించడం లేదని, కొత్తగా అప్లికేషన్ పెట్టుకోవడానికి ప్రభుత్వం ఎందుకు వెసులుబాటు కల్పించడం లేదని ఆయన ప్రశ్నించారు. రైతు భూమి మీద ఆ రైతుకే హక్కు లేకుండా చేస్తున్న దుర్మార్గ ప్రభుత్వం ఇదని, ఇది రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ద్రోహం అని పేర్కొన్నారు. ఆపదకో, అవసరానికో ఉన్న భూములు అమ్ముకోలేక.. అధిక వడ్డీకి రుణాలు తీసుకోలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

### లంచాలు, అక్రమ వసూళ్లు

ప్రజా పాలన దరఖాస్తులు ఏమయ్యాయని, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు ఏమయ్యాయని, ధరణి పేరు మార్చి తెచ్చిన భూ భారతి ఏమైందని హరీష్ రావు ప్రశ్నించారు. తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల్లో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే మీ ప్రభుత్వం ఏం చేస్తున్నట్లు అని ప్రశ్నించారు. నెలల తరబడి రెవెన్యూ ఆఫీసులు, కలెక్టరేట్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా రైతులు, ప్రజల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని తెలిపారు. మీ పాలనలో భూ సమస్యల పరిష్కారానికి 30 శాతం నుంచి 40 శాతం లంచాలు ఇస్తే గాని పని కాని పరిస్థితి ఏర్పడిందని, రిజిస్ట్రేషన్ల పేరిట మధ్యవర్తులు, ఏజెంట్లు, కాంగ్రెస్ నాయకులు రైతుల నుండి అక్రమ వసూళ్లకు పాల్పడుతుంటే ప్రభుత్వం ఏం చేస్తున్నట్లు అని నిలదీశారు. ఇప్పటికే మీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాల వల్ల 700 పైగా అన్నదాతలు ప్రాణాలు కోల్పోయారని ఆయన ఆరోపించారు. రుణమాఫీ కాక, రైతు భరోసా అందక, పంట బోనస్ ఇవ్వకపోవడంతో రైతులు ఆత్మస్థైర్యం కోల్పోతున్నారని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, రెవెన్యూ శాఖ మేలుకుని, పెండింగ్‌లో ఉన్న భూ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, రైతు ఆత్మహత్యలు చేసుకోకుండా నివారించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

# రూ.5 లక్షల కోట్ల అతిపెద్ద భూ కుంభకోణం

- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ సంచలన ఆరోపణలు



**హైదరాబాద్, నవంబర్ 21 (మనసులో మాట):**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌లోని పారిశ్రామిక భూముల రెగ్యులరైజేషన్ పేరుతో దేశ చరిత్రలోనే అతిపెద్ద 5 లక్షల కోట్ల భూ కుంభకోణానికి తెరలేపిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఆరోపించారు. 9,292 ఎకరాల విలువైన భూములను కేవలం 30% రిజిస్ట్రేషన్ విలువ చెల్లిస్తే సరిపోతుందనే కొత్త పాలసీ ద్వారా భారీ లాభాలు కల్పించే ప్రయత్నం జరుగుతోందని కేటీఆర్ పేర్కొన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 100% నుంచి200% ఎస్ఆర్ఓ రేట్లు తప్పనిసరిగా చెల్లించే విధానాన్ని అమలు చేసిందని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ఈ భారీ భూ కేసుకు సంబంధించిన పాలసీని రేవంత్ రెడ్డి, ఆయన అన్నదమ్ములు మరియు అనుచరుల కోసం ప్రత్యేకంగా రూపొందించిందని కేటీఆర్ విమర్శించారు. క్యాబినెట్ మీటింగ్‌లో నిర్ణయం తీసుకున్న వెంటనే 7 రోజుల్లో దరఖాస్తు, 7 రోజుల్లో ఆమోదం, 45 రోజుల్లో రెగ్యులరైజేషన్ అంటూ ప్రభుత్వం హడావిడి చేయడం ఈ కుంభకోణానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. పరిశ్రమల అభివృద్ధి కోసం రూపొందించిన టీఎస్ ఐపాస్ ను కాంగ్రెస్ పారిశ్రామిక భూముల విక్రయాలకు వాడుకుంటోందని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. ఈ పాలసీ ద్వారా భూములు కొనుగోలు చేసే పారిశ్రామికవేత్తలకు భవిష్యత్తులో చట్టపరమైన ఇబ్బందులు తప్పవని కేటీఆర్ హెచ్చరించారు. "ప్రజల ఆస్తిని అప్పనంగా కొట్టేస్తామంటే కుదరదు" అని స్పష్టం చేశారు. అవసరమైతే బీఆర్ఎస్ ఈ అంశంపై న్యాయపోరాటం చేస్తుందని, భవిష్యత్తులో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ లావాదేవీలన్నింటిపై పూర్తి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కేటీఆర్ తెలిపారు.



## స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**హైదరాబాద్,నవంబర్21 (మనసులో మాట):**

ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిశారు. ఈ నెల 23 లోపు పార్టీ ఫిరాయింపు ఆరోపణలపై వివరణ ఇవ్వాలని స్పీకర్ నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో ఆయన కలిశారు. పార్టీ ఫిరాయింపు ఫిర్యాదులకు సమాధానాలు ఇవ్వాల్సిందిగా ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ మరోసారి నోటీసులు జారీ చేశారు. ఈ నెల 23వ తేదీలోగా సమాధానాలను అఫిడవిట్ రూపంలో స్పీకర్ కార్యాలయంలో అందజేయాలని వాటిలో సూచించారు. గత ఆగస్టులో ఫిర్యాదులొచ్చిన 10 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు జారీ చేశారు. వారిలో దానం, కడియం మినహా మిగిలిన ఎనిమిది మంది తమ సమాధానాలను అఫిడవిట్ రూపంలో అసెంబ్లీ కార్యదర్శికి దాఖలు చేశారు.ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తక్షణమే వివరణ ఇవ్వాలని కోరుతూ స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ గురువారం మరోసారి నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఎమ్మెల్యే కడియం శ్రీహరి కలిశారు. ఈ నెల 23వ తేదీ లోపు ఫిరాయింపు ఆరోపణలపై వివరణ ఇవ్వాలని నోటీసుల్లో స్పీకర్ పేర్కొన్నారు. దీంతో వివరణ ఇచ్చేందుకు మరింత సమయం కావాలని స్పీకర్‌ను కడియం శ్రీహరి కోరారు. ఢిల్లీ నుండి రాగానే స్పీకర్‌ను దానం నాగేందర్ కలవనున్నారు. దానం నాగేందర్ మరింత సమయం కోరుతాడా లేదా రాజీనామా చేస్తాడా అనే అంశంపై సందిగ్ధత నెలకొంది.

## మత్స్యకారుల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

**ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి**



**మహబూబాద్, నవంబర్ 21 (మనసులో మాట):**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుపరుస్తున్న ఉచిత చేప పిల్లల పంపిణీలో భాగంగా శుక్రవారం మహబూబాద్ జిల్లా కేంద్రంలోని కంబాల చెరువులో ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి మహబూబాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి ముఖ్య అతిథిగా పాల్గొని చేప పిల్లల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో 17 చెరువులో గాను ఇప్పటికే కొన్ని కబ్జాదారుల కోరల్లో ఉన్నటువంటి వాటిని విడిపించి ఎఫ్ టి ఎల్ ఏర్పాటు చేసి బఫర్ జోన్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. చెరువు శిఖాలలో ఎలాంటి నిర్మాణాలను ఇతరులు చేయకూడదని సభాముఖంగా కబ్జాదారులను హెచ్చరించారు. మా ప్రభుత్వం నాణ్యమైన చేపపిల్లను పంపిణీ చేస్తున్నదని అట్టి చేపలతో మత్యకారులు అభివృద్ధి బాటలో పయనించాలని వారు కోరారు ఈ కార్యక్రమానికి సభ అధ్యక్షులుగా జిల్లా మత్స్యశాఖ అధికారి శివప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే ప్రారంభమైన చేప పిల్లల పంపిణీ కార్యక్రమం రెండు నియోజకవర్గాల్లో విజయవంతంగా పోయడం జరుగుతుందని నాణ్యమైన చేప పిల్లలు కొలత సరి చూసుకునే మేము ఈ చెరువులలో వదలడం జరుగుతుందని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం, చీఫ్ ప్రమోటార్ శ్రీ కొత్తూరు రమేష్ మాట్లాడుతూ 350 చెరువులు, 72 సొసైటీలు, 4099 మంది సభ్యులు ఉన్నటువంటి మహబూబాబాద్ నియోజక వర్గములో నేటి నుంచి ప్రారంభమైన ఉచిత చేప పిల్లల పంపిణి కార్యక్రమం సజావుగా జరగాలని సొసైటీ అధ్యక్షులు సభ్యులు చెరువు దగ్గరకు వచ్చినటువంటి చేప పిల్లలను సరిచూసుకొని కొలత ప్రకారం లెక్క ప్రకారం తీసుకొని చెరువులలో పోసుకోవాల్సిందిగా కోరారు. ఉచిత చేప పిల్లలు పోసుకొని అభివృద్ధి బాటలో ప్రయాణించాలని ప్రభుత్వము మత్స్యకారుల కోసం ఒక ప్రత్యేకమైన కార్యక్రమం మత్స్యకారుల కొరకే ప్రవేశపెట్టింది అట్టి పథకాన్ని మత్యకారులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ దామేర శ్రీనివాస్, సంఘ అధ్యక్షులు సింగాని అశోక్, కార్యదర్శి పిల్లి దశరథ నడిగడ్డ సంఘ అధ్యక్షులు అనుమతులు గడ్డ సంఘ అధ్యక్షులు గంగపుత్ర సంఘల అధ్యక్షులు నడిగడ్డ అధ్యక్షులు కొప్పు వీరయ్య సెక్రెటరీ కోళ్ల నాగరాజు కోశాధికారి ఐలయ్య హనుమంతుని గడ్డ అధ్యక్షులు గుర్రం వెంకన్న సెక్రెటరీ ఉత్సవ బాలకృష్ణ కోశాధికారి తోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వైఫల్యాలు ఎత్తి చూపినందుకే కక్షసాధింపు

- కేటీఆర్‌పై విచారణకు అనుమతి ఇందులో భాగమే
- మండిపడ్డ మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్



**హైదరాబాద్,నవంబర్21 (మనసులో మాట):**

అనునిత్యం ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్నందుకే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ సర్కారు కక్ష సాధిస్తున్నదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. ఫార్ములా- ఈ రేస్ కేసులో కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి ఇవ్వడం కక్ష సాధింపు చర్య అని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతీకార రాజకీయదాడిలో భాగంగా కేటీఆర్‌పై ఈ కార్ రేస్ కేసును తెరపైకి తెచ్చాడని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. కేంద్రంలోని బీజేపీతో చీకట్లో చేతులు కలిపి బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నారని, ఫార్ములా ఈ కేసులో చట్టపరమైన స్థిరత్వం, వాస్తవ ఆధారాలు, సాక్ష్యాలు లేవు, ఫార్ములా ఈ రేస్‌పై గతంలో లైడిటెక్టర్ టెస్ట్‌కు సిద్ధమని కేటీఆర్ చేసిన సవాల్‌కు రేవంత్ రెడ్డి తోకముడిచాడని ఆరోపించారు.రెండేండ్లుగా ఫార్ములా ఈ రేస్‌పై విచారణ పేరిట సాగదీస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం సాధించింది ఏమీ లేదని ఆయన అన్నారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను నిలువరించేందుకు మరోసారి ఈ-కార్ రేస్ కేసు పేరిట కుట్రలను తెరపైకి తెచ్చిందని హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచిన కేటీఆర్‌పై రేవంత్‌రెడ్డి అక్రమ కేసులు బనాయించి ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా పెట్టుకుని రెండు జాతీయ పార్టీలు పని చేస్తున్నాయని ఆరోపించారు. కేటీఆర్‌ను ప్రజాక్షేత్రంలో ఎదుర్కొనే దమ్ములేకే కుట్రలకు తెగబడుతున్నాయని మాజీ మంత్రి మండిపడ్డారు.దేశంలో కాంగ్రెస్, బీజేపీలు కేంద్రంలో బద్ధ శత్రువులు కానీ, తెలంగాణలో మాత్రం వారిది అన్నదమ్ముల అనుబంధం అని అన్నారు. ప్రాంతీయ పార్టీలను, యువ నాయకత్వాన్ని రాజకీయంగా నిర్మూలించడం, ప్రాంతీయ పార్టీలను బలహీనపరచడమే జాతీయ పార్టీలు కాంగ్రెస్, బీజేపీ ఎజెండా అని ఆరోపించారు. నిన్నటికి నిన్న బీహార్‌లో ఆర్జేడీని కాంగ్రెస్, బీజేపీలు కలిసి మట్టికరిపించాయని, అలాగే యూపీలో సమాజ్‌వాదీ పార్టీని, కర్ణాటకలో జేడీఎస్‌ను, ఢిల్లీలో ఆప్‌ను, మహారాష్ట్రలో ఎన్సీపీ, శివసేనలను ఇంకా అనేక ప్రాంతీయ పార్టీలను పూర్తిగా బలహీన పరిచాయని గుర్తు చేశారు.దేశంలో యువ నాయకత్వం ఎదుగుదలను నిరోధించడమే మోదీ-బీజేపీల ఎజెండా. అందుకే అఖిలేష్ యాదవ్, తేజస్వీ యాదవ్, కేటీఆర్, ఉదయనిధి స్టాలిన్ వంటి యువ నేతలను బీజేపీ చేసిందని, ఉత్తరాదిలో అనుసరించిన వ్యూహాన్నే తెలంగాణలోనూ బీజేపీ-కాంగ్రెస్ పార్టీలు అనుసరిస్తున్నాయని, అందులో భాగంగానే తెలంగాణలో కేసీఆర్ కుటుంబాన్ని ఇబ్బందులు పెట్టేందుకు జాతీయ స్థాయిలో బద్ధ విరోధులు ఆప్తమిత్రులు అయ్యారు. దర్యాప్తు సంస్థలను గుప్పిట్లో పెట్టుకొని బీఆర్ఎస్ నేతలపై రాజకీయ ప్రేరేపిత కేసులు పెడుతున్నారు. ఈ క్రమంలోనే ఫార్ములా ఈ- రేస్‌ను పదే పదే తెరపైకి తెస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ పేరుతో కేసీఆర్‌ను వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.స్థానిక ఎన్నికల నేపథ్యంలోనే రేవంత్, బీజేపీలు కలిసి మళ్లీ ఈ-కార్ రేస్‌ను తెరపైకి తీసుకువచ్చారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసింది. 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని నమ్మించి గొంతుకోసింది. ఇచ్చిన హామీని తుంగలో తొక్కి, మాటమార్చి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం సాధ్యం కాదని తేల్చేసింది. రాజ్యాంగబద్ధంగా కాకుండా, పార్టీ పరంగా బీసీలకు రిజర్వేషన్లు ఇస్తామని బీసీ సమాజాన్ని తడిగుడ్డతో గొంతుకోసింది కాంగ్రెస్ ప్రభుత్వం. అటు బీసీ రిజర్వేషన్ల కోసం బీఆర్ఎస్ పార్టీ ప్రత్యక్ష పోరాటం చేస్తున్నది. అందుకే డైవర్షన్ రాజకీయాలు, డ్రామాల పాలిటిక్స్‌కు స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఈ-రేస్‌ను తెరపైకి తీసుకువచ్చారని అన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ద్రోహంపై, రేవంత్ నయవంచక పాలనపై ప్రజల్లో చర్చ జరగకుండా మీడియా అటెన్షన్ మొత్తం ఈ-రేస్ చుట్టే ఉండాలని రేవంత్ కుట్రలు చేస్తున్నాడని రేవంత్ రెడ్డి మండిపడ్డారు.

# పత్తి, సోయాబిన్ కొనుగోళ్లలో నిర్లక్ష్యం



- అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళన
- జాతీయ రహదారి 44 పై ధర్నా

**ఆదిలాబాద్,నవంబర్21 (మనసులో మాట):**

ఆదిలాబాద్ జిల్లాలోని పత్తి ,సోయాబిన్ కోనుగోళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న వైఖరిని నిరసిస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. హైదరాబాద్ -నాగపూర్ జాతీయ రహదారి 44 పై నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు భారీగా తరలివచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి నిరసనగా జాతీయ రహదారిపై బైఠాయించిన రైతులు నిరసన తెలిపారు. పంటల కొనుగోలలో రెండు ప్రభుత్వాలు నిబంధనల పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని నాయకులకు తెలిపారు. సీసీఐ తేమశాతం పేరిట పత్తిని మద్దతు ధరతో కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. రైతులకు మద్దతు ధర లభించకపోవడంతో మధ్య దళారులకు విక్రయించి పత్తి క్వింటాలుకు రూ.1500 చొప్పున నష్టపోతున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు ఏడు క్వింటాళ్లు మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తుందని, మిగిలిన పత్తిని రైతులు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారని తెలిపారు. సోయాబీన్ కొనుగోలు సైతం పలు నిబంధనలు అమలు చేస్తున్నారని, వేలిముద్ర తప్పనిసరి చేయడంతో రైతులు పంటను అమ్ముకునే పరిస్థితి లేదని వాపోయారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న సోయాబిన్ పంటను మార్క్ ఫెడ్ కొనుగోలు చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారులకు విక్రయించిన నష్టపోతున్నారని తెలిపారు. పంటల కొనుగోలులో నిబంధనలు ఎత్తివేసే వరకు ఆందోళన నిర్వహించనునట్లు అఖిలపక్షం నాయకులకు తెలిపారు. రైతుల ఆందోళన ఫలితంగా జాతీయ రహదారిపై వాహనాలు ఎక్కడికి అక్కడ నిలిచిపోయాయి.



# 'జల్ సంచయ్' అవార్డు


## కలెక్టర్‌కు ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ శుభాకాంక్షలు

**నిర్మల్, నవంబర్ 21 (మనసులో మాట):**

నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఇటీవల న్యూఢిల్లీలో కేంద్ర జల శక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ చేతుల మీదుగా 'జల్ సంచయ్-జన భాగీదారీ' ప్రతిష్ఠాత్మక అవార్డును స్వీకరించిన సందర్భంగా, శుక్రవారం ముధోల్ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) పవార్ రామారావు పటేల్ ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ సాయంత్రం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. జిల్లాకు ప్రతిష్ఠాత్మకమైన అవార్డు రావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అదేవిధంగా డీఆర్‌డీఓ విజయలక్ష్మిని కూడా ఎమ్మెల్యే సన్మానించి అభినందించారు. అంతకుముందు పలువురు ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు కూడా కలెక్టర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాకు ప్రతిష్ఠాత్మక అవార్డు రావడంలో అధికారుల కృషి విలువైనదని అన్నారు. ముమ్మందు రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తూ జిల్లా ఖ్యాతిని మరింత నిలిపేలా తోడ్పాటును అందించాలని కోరారు.

# ఉప ఎన్నిక వస్తే బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం

- నియోజకవర్గ ఇన్చార్జ్ ఆదర్శ్ రెడ్డి



**పటాన్‌చెరు, నవంబర్ 21 (మనసులో మాట):**

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలో ఉప ఎన్నిక వస్తే బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమని నియోజకవర్గ ఇన్చార్జ్ ఆదర్శ్ రెడ్డి అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని శుక్రవారం పటాన్‌చెరు నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో, పటాన్‌చెరు డివిజన్ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ నివాసంలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. గుమ్మడిదల, పటాన్‌చెరు మండల పరిధిలోని గ్రామ పంచాయతీల విషయాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా నాయకులను వివిధ బాధ్యతలకు నియమించారు: బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గోవర్ధన్ రెడ్డి (సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్), గుమ్మడిదల బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి. జిన్నారం మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి, జిన్నారం సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్. పటాన్‌చెరు మండలం ఇన్చార్జ్‌లు: కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్. పటాన్‌చెరు పరిశీలకులు: తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమీ రెడ్డి, రామచంద్రపురం మాజీ కార్పొరేటర్ తోంట అంజయ్య, తెల్లాపూర్ మాజీ వైస్ మున్సిపల్ చైర్మన్ రాములు గౌడ్. పటాన్‌చెరు నియోజకవర్గంలో ఉప ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ పార్టీ గెలుపు సాధించేందుకు క్యాడర్ పూర్తిగా సిద్ధంగా ఉందని, ఉప ఎన్నికలను ధైర్యంగా ఎదుర్కొనే శక్తి పార్టీకి ఉందని నాయకులు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పట్టణం నుండి గ్రామాల దాకా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ శక్తివంతమైన పోరాటం చేపడుతుందని, పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి పార్టీ అండగా నిలుస్తుందని చెప్పారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు భారీ మెజారిటీ వచ్చేలా కట్టుదిట్టమైన కార్యాచరణ చేపట్టనున్నట్లు నాయకులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆదర్శ్ రెడ్డి, మెట్టు కుమార్ యాదవ్, తోంట అంజయ్య, కొలన్ బాల్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, పాల్గొన్నారు.

# నిబంధనల మేరకే జీపీ రిజర్వేషన్లు

## జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్ధిపేట, నవంబర్ 21 (మనసులో మాట):**

గ్రామ పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ కె. హేమావతి శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో పంచాయతీ శాఖ అధికారులు మరియు సిబ్బందితో సమావేశం నిర్వహించి తగు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు జిల్లాలో గల 508 గ్రామ పంచాయతీలు, 4508 వార్డులలో రిజర్వేషన్ ప్రక్రియను చేపట్టాలని కలెక్టర్ సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల కొరకు 2011 సెన్సస్ను, బీసీ రిజర్వేషన్ల కొరకు ఎస్ఈఈపీసీ 2024 ను పరిగణలోకి తీసుకోవాలని ఆదేశించారు. మొత్తం రిజర్వేషన్లు 50% మించకుండా చూసుకోవాలని, ఈ ప్రక్రియను ఆయా డివిజన్ల ఆర్డీవోల నేతృత్వంలో చేపట్టాలని కలెక్టర్ అన్నారు. గ్రామ వార్డు సభ్యుల రిజర్వేషన్ కూడా ఎస్ఈఈపీసీ ప్రకారం చేపట్టాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ రమేష్, డీపీఓ విజయ్ కుమార్, సిద్ధిపేట గజ్వేల్ ఆర్డీవోలు సదానందం, చంద్రకళ, డిఆర్‌డిఓ జయదేవ్ ఆర్య, డివిజనల్ పంచాయతీ అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యాసంస్థల తరలింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

## విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు



**కొడంగల్, నవంబర్ 21 (మనసులో మాట):**

మెడికల్ కాలేజీ, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల భవనాల నిర్మాణాలను శంకుస్థాపన చేసినచోట నుండి హకీంపేట్, పోలేపల్లికి తరలించడం సరికాదని,యథాస్థానంలో నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రజాసంఘాల నాయకులు అన్నారు.కెడిపి జెఏసి ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థి,ప్రజాసంఘాల నాయకుల చేత వాల్ పోస్టర్ కరపత్రాలు విడుదల చేశారు. ఈసందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భీములు,కేడిపి జేఏసీ కో కన్వీనర్స్ గంటి సురేష్ కుమార్,ఎరన్ పల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రంలో విద్యా,వైద్య, భవనాలతో పాటు ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలని, శంకుస్థాపన చేసి పనులు కొనసాగించి, మధ్యలో ఆపేసి మారుమూల ప్రాంతాలకు తరలించడం సరికాదన్నారు.అన్ని రకాల రవాణా, వ్యాపార,సదుపాయాలు కలిగిన నియోజక వర్గ కేంద్రంలో మెడికల్ కాలేజీ,గురుకుల భవనాలు,సైనిక్ పాఠశాలలు వంటివి నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరాలోచించి హకింపేట్, పోలేపల్లికి తరలించిన మెడికల్ కాలేజీ, గురుకుల భవన నిర్మాణాలను కొడంగల్ పట్టణ కేంద్రంలో నిర్మించేందుకు చొరవ తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో ఏబీవీపీ పట్టణ అధ్యక్షులు నిఖిల్,బస్వరాజ్, వెంకటేష్,విద్యార్థి సంఘాల నాయకులతో పాటు ఆయా గ్రామాల యువకులు పాల్గొన్నారు.


# పోషణ, ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలి

## కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్, నవంబర్ 21 (మనసులో మాట):**

శుక్రవారం సభలో పాల్గొని మహిళలు తమ ఆరోగ్యం, పిల్లల పోషణ పట్ల అవగాహన పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్ అంగన్వాడీ కేంద్రంలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సభ జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, శుక్రవారం సభల ద్వారా గ్రామస్థాయిలో ప్రతి మహిళకు పోషణ, ఆరోగ్యం తదితర విషయాల పట్ల అవగాహన వస్తోందని అన్నారు. మహిళ తనతో పాటు తన పిల్లల పోషణ ఎలా ఉందో తెలుసుకోగలుగుతోందని తెలిపారు. అంగన్వాడీ టీచర్లు: సృజనాత్మకతతో విభిన్నమైన ఆట వస్తువులను తయారు చేసి చిన్నారులకు మంచి అలవాట్లు, క్రమశిక్షణ నేర్పుతారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న విభిన్న కార్యక్రమాలతో మంచి ఫలితాలు వస్తున్నాయని, తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశానికి కచ్చితంగా హాజరు కావాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బీపీ, షుగర్ వంటి అన్ని వ్యాధులకు పరీక్షలతో పాటు గోలీలు (మాత్రలు) ఉచితంగా ఇస్తారని తెలిపారు. నెల నెల మందులు వాడేవారు ఆరోగ్య సిబ్బందికి తెలియజేస్తే ఇంటి వద్దకే మాత్రలు అందజేస్తారని అన్నారు. గ్రామంలోని ప్రతి మహిళ ఆరోగ్య మహిళ ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉచిత పరీక్షలు చేయించుకున్న అనేకమందిలో రోగ నిర్ధారణ ముందుగా గుర్తించారని, తద్వారా ఉచిత వైద్య సేవలు పొంది కోలుకున్నారని తెలిపారు. అంగన్వాడీ చిన్నారులు కథలు, పాటలు చెప్పి ఆకట్టుకున్నారు. గర్భిణీలు, బాలింతలు సభలో తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, సీడీపీఓ సబిత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ



**హన్వాడ, నవంబర్ 21 (మనసులో మాట):**

హన్వాడ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి కలెక్టర్ నేరుగా వారితో మాట్లాడి తెలుసుకున్నారు. ధాన్యం తేమ శాతాన్ని పరీక్షించారు. నిర్ణీత తేమ, తాలు, మట్టి లేకుండా నాణ్యతా ప్రమాణాలు ఉన్న ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం వివరాలు, ట్యాబ్ ఎంట్రీ గురించి కలెక్టర్ ఆరా తీశారు. ప్రస్తుతం 2514 బస్తాల ధాన్యం నిల్వ ఉండగా, 1566 బస్తాలకు ట్యాబ్ ఎంట్రీ పూర్తయిందని కొనుగోలు కేంద్రం నిర్వాహకులు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తూకం వేసిన వెంటనే మిల్లులకు తరలించాలని కలెక్టర్ ఆదేశించారు. రవాణా పరంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, కొనుగోలు తర్వాత కేంద్రం నిర్వాహకులదే బాధ్యత అని, రైతులు మిల్లుకు వెళ్లే అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్లను వినియోగిస్తున్నారా అని కలెక్టర్ అడిగారు. క్లీనర్లకు కొద్దిగా రిపేరింగ్ చేయాల్సి ఉందని కేంద్రం ఇన్‌ఛార్జి తెలుపగా, వెంటనే పరిశీలించి రిపేరింగ్ చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఆర్.డి.ఓ నవీన్ తదితరులు ఉన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# ట్రేడ్ లైసెన్స్ ఫీజులో మోసం

## అన్నపూర్ణ, రామానాయుడు స్టూడియోలకు నోటీసులు

**హైదరాబాద్, నవంబర్ 21 (మనసులో మాట):**

అన్నపూర్ణ స్టూడియో, రామానాయుడు స్టూడియోలకు జిహెచ్ఎంసి నోటీసులు జారీ చేసింది. ఇరు సంస్థలు ట్రేడ్ లైసెన్స్ ఫీజ్ తక్కువగా చెల్లిస్తున్నాయని, వ్యాపార విస్తీర్ణం తక్కువ చూపిస్తూ భారీగా ట్యాక్స్ ఎగవేస్తున్నట్లు జిహెచ్ఎంసి అధికారులు గుర్తించి శుక్రవారం నోటీసులిచ్చారు. పూర్తి స్థాయిలో ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాలంటూ జిహెచ్ఎంసి అధికారులు నోటీసులిచ్చారు. తెలుగు రాష్ట్రాల్లో పరిచయం అవసరం లేని అన్నపూర్ణ, రామానాయుడు సంస్థలు ట్యాక్స్ ఎగవేస్తున్నాయంటూ వార్తలు రావడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఇంతవరకు ఆ రెండు సంస్థల నుండి ఎలాంటి స్పందన రాలేదు. అన్నపూర్ణ స్టూడియో లక్షా 92 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో వ్యాపారం చేస్తూ కేవలం 8 వేల100 చదరపు అడుగులకు మాత్రమే ట్యాక్స్ పే చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అన్నపూర్ణ స్టూడియో రూ. 11 లక్షల 52 లక్షలు ఫీజు చెల్లించాల్సి ఉండగా, కేవలం రూ.49 వేలు మాత్రమే చెల్లిస్తున్నట్లు అధికారులు తెలిపారు. రామానాయుడు స్టూడియో 68 వేల చదరపు అడుగుల్లో వ్యాపారం చేస్తూ? కేవలం 19 వందల చదరపు అడుగులకు ట్యాక్స్ పే చేస్తోందని.. రూ. 2 లక్షల 73 వేలు చెల్లించాల్సిన రామానాయుడు స్టూడియోస్ కేవలం 7 వేల 600 మాత్రమే చెల్లిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

# ఇంట్లోనే గంజాయి మొక్కల పెంపు

## పోలీసులకు దొరికిన యువకుడు

**అచ్చంపేట,నవంబర్21 (మనసులో మాట):**

బహిరంగ ప్రదేశాల్లో నిషేదిత గంజాయి పండిస్తే పోలీసులకు దొరికిపోతామన్న భయంతో ఓ యువకుడు ఏకంగా ఇంట్లోనే గంజాయి సాగును మొదలు పెట్టాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఎట్టకేలకు పోలీసులకు దొరికి పోయాడు. పోలీసులు దాడి జరిపి ఆ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన నాగర్ కర్నూల్ జిల్లాలో చోటు చేసుకుంది. జిల్లాలోని అచ్చంపేట మండలం పల్కపల్లి గ్రామంలో నాగనులు మధు అనే యువకుడు గంజాయికి బానిసగా మారి ఇంట్లోనే గంజాయి మొక్కలు పెంచుతున్నాడు. గంజాయి సాగు, అక్రమ రవాణాపై , విక్రయాలపై పోలీసులు గట్టి నిఘా వేయడంతో పాటు తనిఖీలు, దాడులు చేస్తూ గంజాయిని పట్టుకుంటున్నారు. ఈ క్రమంలో సమాచారం అందుకున్న పోలీసులు గ్రామంలోని మధు ఇంటిపై దాడి జరిపి గంజాయి మొక్కను గుర్తించి యువకుడిని అదుపులోకి తీసుకున్న స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# వరి కొనుగోలు కేంద్రాల తనిఖీ



**దోమ, నవంబర్ 21 (మనసులో మాట):**

వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ శుక్రవారం దోమ మండలంలోని రాకొండ మరియు దోమ గ్రామాల్లోని వరి కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. ట్యాబ్ ఎంట్రీలు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. రైతుల బ్యాంకు ఖాతాలలో మద్దతు ధర డబ్బులు ఎప్పటికప్పుడు త్వరగా చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వరి కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా చూసుకోవాలని, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సుదర్శన్, దోమ తహసీల్దార్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్‌తో శిక్షణ డిప్యూటీ కలెక్టర్ భేటీ

**ఖమ్మం, నవంబర్ 21 (మనసులో మాట):**



డిప్యూటీ కలెక్టర్‌గా శిక్షణ నిమిత్తం ఖమ్మం జిల్లాకు నియమించబడిన యం. అపూర్వ శుక్రవారం ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన ఈ భేటీ సందర్భంగా, ఆమె జిల్లా కలెక్టర్‌కు పూల మొక్కను అందించారు.

# గిరి ప్రసాద్‌కి నియోజకవర్గ జర్నలిస్టుల ఘన నివాళి



**పటాన్‌చెరు, నవంబర్ 21 (మనసులో మాట):**

పటాన్‌చెరు సీనియర్ జర్నలిస్ట్ గిరి ప్రసాద్ ఇటీవల గుండెపోటుతో అకాల మరణం చెందడంతో స్థానిక జర్నలిస్టు వర్గంలో తీవ్ర విషాదం నెలకొంది. ఇందులో భాగంగా పటాన్‌చెరు నియోజకవర్గ జర్నలిస్టుల ఆధ్వర్యంలో రామచంద్రాపురంలోని లక్ష్మీ గార్డెన్స్‌లో సంస్మరణ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీ ప్రభాకర్, పటాన్‌చెరు సీఐ వినాయక రెడ్డి, బీఆర్ఎస్ యువ నాయకులు ప్రిథ్వీరాజ్ హాజరయ్యారు. అనంతరం గిరి ప్రసాద్ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిథ్వీరాజ్ మాట్లాడుతూ, గిరి ప్రసాద్ నిజాలను వెలుగులోకి తేవడంలో చూపిన ధైర్యం, నిబద్ధత జర్నలిజం విలువలకు నిదర్శనమని పేర్కొన్నారు. పటాన్‌చెరులో సామాజిక సమస్యలు, ప్రజల కష్టాలు, ప్రభుత్వ పథకాల అమలు వంటి ఎన్నో అంశాలను ఆయన నిరంతరం ఆవిష్కరించి పరిష్కార దిశగా నడిపినట్లు అభిప్రాయపడ్డారు. గిరి ప్రసాద్ మృతి పటాన్‌చెరు జర్నలిస్ట్ వర్గానికి తీరని లోటు అని పేర్కొంటూ, ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జర్నలిస్టులు, నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# ప్రజలకు అందుబాటులో ఉండాలి

- జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి ఆదేశం



**వికారాబాద్, నవంబర్ 21 (మనసులో మాట):**

సామాన్యులకు న్యాయం అందించడంలో ఆలస్యం జరగకూడదని, ప్రతి ఫిర్యాదుపై చట్టపరమైన విచారణ వేగంగా పూర్తి కావాలని వికారాబాద్ జిల్లా పోలీస్ ఉన్నతాధికారి (ఎస్పీ) కె. నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో జిల్లాలోని అన్ని సబ్–డివిజన్ల పోలీస్ అధికారులు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు మరియు ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు. సమావేశం ప్రారంభంలో, ఎస్పీ జిల్లాలో ఇప్పటివరకు నమోదైన కేసుల వివరాలు, దర్యాప్తు పురోగతి, అలాగే వివిధ పోలీస్ స్టేషన్‌లలో పెండింగ్‌లో ఉన్న కేసుల స్థితి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేసుల పరిష్కారంలో జాప్యం జరగకుండా చూడాలని, త్వరితగతిన పూర్తి చేయాల్సిన కేసులను వెంటనే ముగించాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సామాన్యులకు న్యాయం అందించడంలో ఆలస్యం జరగకూడదని, ప్రతి ఫిర్యాదుపై విచారణ వేగంగా పూర్తి కావాలని ఎస్పీ తెలిపారు. ప్రతి కేసు దర్యాప్తులో శిక్షా శాతం (కన్విక్షన్ రేటు) పెరిగే విధంగా పకడ్బందీగా ఇన్వెస్టిగేషన్ చేయాలని ఆయన అధికారులకు స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల నేపథ్యంలో తమ తమ పోలీస్ స్టేషన్ల పరిధిలలో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందుగానే పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, ముఖ్యంగా హైవేలపై మరియు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలలో ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని ఎస్పీ గారు తెలిపారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల విషయంలో సున్నితంగా వ్యవహరించి, దర్యాప్తును వేగవంతం చేయాలని, వారికి తక్షణ న్యాయం అందేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆన్‌లైన్ మోసాలు (సైబర్ నేరాలు) జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన స్పష్టం చేశారు. అధికారులు అందరూ ప్రజలకు పోలీస్ సేవలు అందుబాటులో ఉండేలా, పోలీస్ వ్యవస్థ పట్ల ప్రజల్లో మరింత నమ్మకం పెరిగేలా పనిచేయాలని జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి కోరారు.



# అంగడిరైచూర్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల క్షేత్ర పర్యటన

## గ్రంథాలయం సందర్శన

**కొడంగల్, నవంబర్ 21 (మనసులో మాట):**

క్షేత్ర పర్యటనలో భాగంగా కొడంగల్ మండలంలోని అంగడిరైచూర్ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మొదటగా ఆంజనేయ స్వామి దేవాలయం ప్రాంగణంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు శివమ్మ అచ్చప్ప స్మారక గ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రంథాలయంలోని వివిధ రకాల పుస్తకాలను విద్యార్థులకు చూపించిన ప్రధానోపాధ్యాయులు మురళీధర్, పుస్తకాల వల్ల కలిగే ప్రయోజనాలను, విద్యార్థి జీవితంలో వాటి ప్రాముఖ్యతను వివరించి సందేశం ఇచ్చారు. చదువు వల్ల లాభాలు, జీవితంలో ఉన్నత స్థానానికి ఎలా చేరుకోవచ్చు అనే అంశాలపై ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. తమ ప్రాంతంలోనే ఇంత పెద్దదైన, అనేక రకాల పుస్తకాలతో కూడిన లైబ్రరీని నిర్వహించి విద్యార్థులకు సేవ చేస్తున్న రిటైర్డ్ హెడ్ మాస్టర్ హనుమయ్యను ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులను లైబ్రరీకి తీసుకొచ్చి, దాని ఉపయోగాలను వారికి వివరించిన ప్రధానోపాధ్యాయులు మురళీధర్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్ మరియు ఇతర టీచర్లను హనుమయ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, గీత, భార్గవి, గోవింద, శ్రీనివాస్, సుమిత్ర, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలను అరికట్టాలి

- ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్, నవంబర్ 21 (మనసులో మాట):**

జిల్లాలో రోడ్డు ప్రమాదాల వల్ల అమూల్యమైన ప్రాణ నష్టం, ఆర్థిక నష్టం జరుగుతున్న సందర్భంలో రహదారి భద్రతపై ప్రతి ఒక్కరూ మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ,జిల్లా ఎస్ పి శ్రీనివాస్ రావు లు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటిస్తే ప్రమాదాలలో గణనీయమైన తగ్గుదల సాధ్యమని తెలిపారు. ప్రమాదాలకు ప్రధాన కారణాలుమద్యం సేవించి వాహనాలు నడపడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ లేదా మెసేజ్‌లు టైప్ చేస్తూ డ్రైవింగ్ చేయొద్దని పేర్కొన్నారు. అతివేగం, ఓవర్‌టేకింగ్ దుర్వినియోగం, సిగ్నల్ జంపింగ్, ఓవర్‌లోడింగ్, హెల్మెట్/సీట్‌బెల్ట్ ఉపయోగించకపోవడం ప్రమాదాలకు ప్రధాన కారణంగా సూచించారు. అలసట, నిద్రమత్తు, పొగమంచు, రోడ్డుపై కనిపించే దూరం తగ్గడం వంటి పరిస్థితుల్లో నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయవద్దన్నారు. డ్రైవర్లు తప్పనిసరి పాటించాల్సిన జాగ్రత్తలుమద్యం, మత్తు పదార్థాలు తీసుకుని ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనం నడపకూడదు అని వివరించారు. డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించరాదన్నారు. ద్విచక్రవాహన దారులు ఐఎస్ఐ మార్కు హెల్మెట్, కారు ప్రయాణికులు ముందూ వెనుకా సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. చలికాలంలో పొగమంచు ఎక్కువగా ఉన్నప్పుడు హెడ్లైట్లు, ఫాగ్ లైట్లు ఆన్‌లో ఉంచి, వాహనాల మధ్య సురక్షిత దూరం పాటించాలన్నారు. పాదచారులు, ప్రయాణికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలురోడ్డు దాటేటప్పుడు జెబ్రా క్రాసింగ్, ఫుట్ ఓవర్ బ్రిడ్జ్, సబ్‌వేలు ఉండే చోట్లే దాటాలనీ,ఒక్కసారి రెండు వైపులా చూసి, పరుగులు పెట్టకుండా నెమ్మదిగా దాటాలన్నారు. బ్లాక్‌స్పాట్లను గుర్తించి తగిన సంకేత బోర్డులు, ఆదేశించారు.

# విపత్తు ప్రణాళిక హ్యాండ్‌బుక్

- ఇండియా హౌస్ బృందం విస్తృత పర్యటన



**కొత్తగూడెం, నవంబర్ 21 (మనసులో మాట):**

జిల్లా విపత్తు కార్యాచరణ ప్రణాళిక హ్యాండ్‌బుక్‌ను శాస్త్రీయ ఆధారాలతో, క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా రూపొందించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సూచించిన దిశలో, ఇండియా హౌస్ ప్రతినిధి బృందం శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విస్తృత స్థాయి క్షేత్ర పర్యటన నిర్వహించింది. జాహ్నవి, సోనల్ ఘోర్గే, మురళి (డిప్యూటీ కలెక్టర్) లతో కూడిన ఈ బృందం సహజ వనరులు, పర్యావరణ వ్యవస్థ, అడవి సంరక్షణ, పరిశ్రమల ప్రభావం, వాతావరణ మార్పుల నేపథ్యం వంటి అంశాలను పరిశీలిస్తూ పలు ప్రాంతాలలో ప్రత్యక్ష సమాచారం సేకరించింది. పర్యటనలో భాగంగా ముందుగా సింగరేణి ఆధ్వర్యంలో నడుస్తున్న నర్సరీలను సందర్శించిన బృందం, గనుల తవ్వకాల వల్ల కోల్పోయిన అడవులను పునరుద్ధరించేందుకు చేపడుతున్న పునర్వనీకరణ చర్యలు, శాస్త్రీయ పద్ధతుల్లో పెంచుతున్న వివిధ జాతుల మొక్కలు, పునరావాసం చేసిన గనుల ప్రాంతాల్లో అమలు చేస్తున్న జీవవైవిధ్యం సంరక్షణ కార్యక్రమాలపై అధికారులు ఇచ్చిన వివరాలను సమగ్రంగా పరిశీలించింది. పర్యావరణ పరిరక్షణ చర్యలలో సింగరేణి సంస్థ చేపడుతున్న నాణ్యతా ప్రమాణాలను కూడా బృందం అధ్యయనం చేసింది. తదుపరి కిన్నెరసాని అభయారణ్యం మరియు కిన్నెరసాని డ్యామ్‌ను సందర్శించిన బృందం, అభయారణ్యంలో అరుదైన వృక్షజాతులు, జంతువులు, అడవి సంరక్షణ పథకాలు, అడవుల నరికివేత వల్ల వాతావరణ మార్పులపై పడుతున్న ప్రభావం వంటి అంశాలను అటవీ అధికారులు వివరించారు. కిన్నెరసాని డ్యామ్ వద్ద నీటి నిల్వలు, వరద నియంత్రణ వ్యవస్థ, జలవనరుల నిర్వహణ విధానాలు మరియు డ్యామ్ భద్రతా ప్రమాణాలను బృందం సమీక్షించింది. అటవీ శాఖ అధికారి కృష్ణగౌడ్‌తో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లాలో అడవుల ప్రస్తుత స్థితి, అక్రమ వృక్ష నరికివేత నియంత్రణ చర్యలు, వాతావరణ మార్పులతో సంభవించే సహజ విపత్తుల ప్రభావం, వరదలు మరియు నేల ధూపాన్ని నిరోధించేందుకు చేపట్టాల్సిన వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు. మాదారం గ్రామంలోని నాయకపోడు మాస్క్ తయారీ కేంద్రాన్ని పరిశీలించిన సందర్భంగా, మాస్క్ తయారీలో వినియోగించే చెక్క మూలాలు, వాటి వల్ల అడవులపై పడే ప్రభావం, పర్యావరణ హిత ప్రత్యామ్నాయాల అమలు వంటి అంశాలను బృందం సమీక్షించింది. అనంతరం దమ్మపేటలోని ఆయిల్ పామ్ పరిశ్రమను సందర్శించి, ఉత్పత్తి విధానాలు, పరిశ్రమ వ్యర్థాల నిర్వహణ, కాలుష్య నియంత్రణ చర్యలపై అధికారులు అందించిన వివరాలను అధ్యయనం చేశారు. రోజంతా సాగిన ఈ విస్తృత క్షేత్ర అధ్యయనంలో బృందం జిల్లాలోని సహజ వనరులు, అటవి వ్యవస్థ, పరిశ్రమల పర్యావరణ ప్రభావం, గ్రామీణ జీవన విధానాలు వంటి పలు కీలక రంగాలపై వివరాలను సేకరించింది. ఈ సమాచారం మొత్తం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మార్గదర్శకంలో రూపుదిద్దుకుంటున్న జిల్లా విపత్తు కార్యాచరణ ప్రణాళిక హ్యాండ్‌బుక్ తయారీలో ప్రధాన ఆధారాలుగా ఉపయోగించబడనున్నాయని అధికారులు తెలిపారు.

# డొంకేశ్వర్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

- 'భూ భారతి' దరఖాస్తులపై సమీక్ష

**నిజామాబాద్, నవంబర్ 21 (మనసులో మాట):**

నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి శుక్రవారం డొంకేశ్వర్ మండల కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తహసీల్దార్ కార్యాలయం, ధాన్యం కొనుగోలు కేంద్రం మరియు రైతు వేదికను సందర్శించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, భూ భారతి (రెవెన్యూ సదస్సులలో వచ్చిన) దరఖాస్తులపై ఒక్కో గ్రామం వారీగా రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్ష జరిపారు. వచ్చిన దరఖాస్తులలో ఎన్ని అర్జీలు పరిష్కరించారు, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి, ఎంతమందికి నోటీసులు ఇచ్చారు వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరించాలని, తిరస్కరణకు గురైన దరఖాస్తులకు సంబంధించి స్పష్టమైన కారణాలను పేర్కొనాలని సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సన్నాహక ప్రక్రియ తీరును పరిశీలించి, గడువు లోపు ఎస్.ఐ.ఆర్ పూర్తి చేయాలని ఆదేశించారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ మంజూరీలపై ఆరా తీశారు. దరఖాస్తులు అందిన వెంటనే అర్హులైన వారిని గుర్తిస్తూ వెంటవెంటనే మంజూరీ జాబితాలు పంపాలని ఆదేశించారు. ఆధార్ అవసరమైన విద్యార్థులకు జనన ధృవీకరణ పత్రాలను సత్వరమే మంజూరు చేయాలని అన్నారు.

**ధాన్యం కొనుగోలు, రైతులతో భేటీ**



అనంతరం కలెక్టర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, ధాన్యం సేకరణ తీరును పరిశీలించారు. ఇంకా పది శాతం వరకు వరి కోతలు మిగిలి ఉన్నాయని నిర్వాహకులు తెలుపగా, రైతులు ధాన్యం తెచ్చిన వెంటనే తూకం వేయించి మిల్లులకు తరలించాలని కలెక్టర్ సూచించారు. మిల్లుల వద్ద దొడ్డు రకం ధాన్యం సైతం సకాలంలో దిగుమతి చేసుకునేలా చూడాలని, ఒకవేళ ఎక్కడైనా అన్‌లోడింగ్ చేసుకోకపోతే నేరుగా తన దృష్టికి తేవాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. రైతులు ఇబ్బందులు పడకుండా, సకాలంలో ట్రక్ షీట్లు తెప్పించుకుని ట్యాబ్ ఎంట్రీలు చేయించాలని, తద్వారా రైతుల ఖాతాలలో వెంటనే బిల్లులు జమ అవుతాయని అన్నారు. రైతు వేదికను సందర్శించిన సందర్భంగా కలెక్టర్ స్థానిక రైతులతో భేటీ అయ్యారు. ధాన్యం అమ్మకాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేవని రైతులు తెలిపారు. వరితో పోలిస్తే అధిక ఆదాయాన్ని అందించే ఆయిల్ పామ్ పంట సాగుపై దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ వారికి సూచించారు. రబీ సీజన్‌కు సంబంధించి కూడా రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేలా ఇప్పటి నుండే ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట తహసీల్దార్ నరేష్ కుమార్, వ్యవసాయ అధికారి ఉన్నారు.

# ప్రధాన రోడ్లలో ఫుట్‌పాత్ ఏర్పాటుకు చర్యలు

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**ఖమ్మం, నవంబర్ 21 (మనసులో మాట):**

నగరంలోని ప్రధాన రోడ్లలో ఫుట్ పాత్ ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో జిల్లా కలెక్టర్, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి ఖమ్మం నగరంలో ప్రధాన రోడ్లలో ఫుట్ పాత్ ల ఏర్పాటు, రోడ్డు ప్రమాదాల నియంత్రణ చర్యల గురించి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఖమ్మం నగరంలో వైరా రోడ్డు, బైపాస్, ఇల్లందు రోడ్డు వంటి 8 ప్రధాన రోడ్లకు సంబంధించి ఫుట్ పాత్ ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఫుట్ పాత్ పై ఏర్పాటు చేయాల్సిన ప్లాంటేషన్, స్ట్రీట్ లైటింగ్, టైల్స్, సైకిల్ ట్రాక్ ఏర్పాటు వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. నగరంలో అవసరమైన చోట ఫుట్ పాత్ వద్ద బస్ బే సైతం ఉండేలా ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు. దేశంలోని ఇతర నగరాలలో ఉన్న డిజైన్లను పరిశీలించి, ఖమ్మం నగర అవసరాలను దృష్టిలో పెట్టుకుని మంచి డిజైన్ తయారు చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సెంట్రల్ డివైడర్ తో పాటు ఫుట్ పాత్ వే అధికంగా ఉండేలా చూడాలని అన్నారు. దాంతో పాటు పోల్స్, లైటింగ్ ప్రత్యేకంగా ఉండాలని అన్నారు. నగరంలో రాంగ్ సైడ్ డ్రైవింగ్ అరికట్టడానికి ఏఐ సాంకేతికత సహాయంతో దీనిని గుర్తించేలా ఏర్పాట్లు చేసి, రోడ్ల ప్రమాదాల నియంత్రణకు నగరంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఖమ్మం నగరంలో పలు చోట్ల గుంతలను పూడ్చి రోడ్లను మరమ్మత్తు చేశామని, ప్రస్తుతం లేన్ మార్కింగ్ పనులు కూడా జరుగుతున్నాయని అన్నారు. వాహనదారులు పాటించేలా పకడ్బందీ పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ తెలిపారు.



# ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభం

**ప్రతి మహిళకు నాణ్యమైన చీరలు అందిస్తాం**

**ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి**

**పరిగి మున్సిపల్, నవంబర్ 21 (మనసులో మాట):**

తెలంగాణలోని ప్రతి మహిళకు నాణ్యమైన ఇందిరమ్మ చీరలు అందజేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిరిసిల్లలోని చేనేత కార్మికులతో ప్రత్యేకంగా ఈ చీరలను తయారు చేయించారని వికారాబాద్ జిల్లా పరిగి ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి (టిఆర్ఆర్) అన్నారు. పరిగిలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో శుక్రవారం ఎమ్మెల్యే టిఆర్ఆర్ ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. మహిళా సంఘాలతో పాటు ప్రతి ఇంటి మహిళలకు ఈ చీరలు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇందిరా గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని తెలంగాణలో ప్రతి ఇంటికి, ప్రతి ఒక్కరికి రెండు చీరలు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఇందిరా గాంధీ సేవలు: ఇందిరా గాంధీ తొలి మహిళా ప్రధానిగా భూస్వాముల వద్ద భూములు తీసుకొని పేదలకు పంపిణీ చేశారని, బ్యాంకులను జాతీయం చేసిన ఘనతతో పాటు 'రోటీ కప్డా మకాన్' అనే నినాదంతో సంస్కరణలు చేశారని ఆయన గుర్తు చేశారు. మహిళల పేరు మీద ఇందిరమ్మ ఇళ్లు ప్రతి గ్రామంలో నిర్మించుకోవడం జరుగుతుందని, నియోజకవర్గంలో సుమారు 3500 ఇళ్లు కట్టడం జరుగుతుందని తెలిపారు. సోనియా గాంధీ నగర్, రాజీవ్ గాంధీ నగర్‌లుగా పూడూరు మండలంలో నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని వివరించారు. మహిళా సంఘాలకు ఈ విడతలో పరిగి నియోజకవర్గానికి 41 వేల చీరలు అందిస్తున్నామని తెలిపారు. పరిగి నియోజకవర్గంలో మహిళా సంఘాలకు రూ. 1075 కోట్లు రుణాలు ఇవ్వడం జరిగిందని, వడ్డీ లేని రుణాలు ఇవ్వడంతో పాటు రూ. 9 కోట్ల 63 లక్షలు వడ్డీ తిరిగి సంఘాలకు పంచడం జరిగిందని అన్నారు. మహిళా సంఘాల సభ్యులు ఎవరైనా చనిపోతే రూ. 10 లక్షల బీమా చేయించడం జరిగిందని, ఇప్పటికే చనిపోయిన 11 మందికి నియోజకవర్గంలో ఈ పథకం ద్వారా కోటి పది లక్షల రూపాయలు మంజూరు అయిందని పేర్కొన్నారు. మహిళా సమాఖ్య ద్వారా పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడం, బస్సు అద్దెకు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# ఆయిల్ పామ్ సాగుతో రైతుల ఇంట సిరుల పంట!

- పంట మార్పిడి చేస్తేనే రైతు స్థితిగతుల్లో గణనీయమైన మార్పు సాధ్యం
- మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్

**మంథని, నవంబర్ 21 (మనసులో మాట):**

ఆయిల్ ఫామ్ పంట సాగుతో రైతుల ఇంట సిరుల పంట పండుతుందని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. ఉద్యాన వన, వ్యవసాయ, సహకార శాఖ, సహకార సంఘం మరియు తిరుమల ఆయిల్ కెమ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మంథని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ఆవరణలో ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ, రైతులు ముందుకు వచ్చి పంట మార్పిడి చేస్తేనే వారి జీవితాల్లో గణనీయమైన మార్పులు సాధ్యమవుతాయని ఉద్ఘాటించారు. ఆయిల్ ఫామ్ పంట ఒకసారి వేస్తే నాలుగేళ్ల నుంచి దాదాపు 30 ఏళ్ల వరకు నిరంతరంగా పంట దిగుబడులు వస్తూనే ఉంటాయని తెలిపారు. ఇందుకోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావులు ఆయిల్ ఫామ్ సాగుపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఎంసీ



చైర్మన్ కుడుదుల వెంకన్న మాట్లాడుతూ, కల్తీ నూనెల నుంచి మన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ఆయిల్ ఫామ్ పంటలను సాగు చేయాలని సూచించారు. టీజీఈఆర్‌సీ సలహాదారు శశిభూషణ్ కాచే మాట్లాడుతూ, రైతులు ఆయిల్ ఫామ్ పంట సాగులో ప్రయత్న లోపం లేకుండా మంచి భూ యాజమాన్య పద్ధతులు పాటించి దిగుబడులు పొందాలని, ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సహకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సదస్సులో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త భాస్కర్ రావు, ఉద్యాన వన అధికారి జ్యోతి, సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె. అనిల్ కుమార్, వ్యవసాయ అధికారి నవ్యలు ఆయిల్ ఫామ్ పంట సాగు పద్ధతులు, వచ్చే దిగుబడులు, లాభాలు, మార్కెటింగ్ వివరాలను రైతులకు చాలా చక్కగా వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు బెల్లంకొండ ప్రకాష్ రెడ్డి, డైరెక్టర్లు కొత్త శ్రీనివాస్, దాసరి లక్ష్మి–మొండయ్య, దేవల్ల విజయ్ కుమార్, నాయకులు మూల పురుషోత్తంరెడ్డి, ఊదరి శంకర్, బూడిద శంకర్, ఆరెల్లి కిరణ్ గౌడ్, బెజ్జంకి దిగంబర్, భూడిద గణేష్, దొరగోర్ల శ్రీనివాస్, సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్, సంఘ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# డా. ప్రసాదరావుకు 'ఇంటర్నేషనల్ లైఫ్‌టైమ్ ఎడ్యు ఐకాన్ అవార్డు'





**కరీంనగర్, నవంబర్ 21 (మనసులో మాట):**

పారమిత విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాదరావుకు అరుదైన గౌరవం దక్కింది. విద్యారంగానికి ఆయన చేసిన విశేష సేవలకు గుర్తింపుగా, అత్యంత ప్రతిష్ఠాకరమైన 'ఇంటర్నేషనల్ లైఫ్‌టైమ్ ఎడ్యు ఐకాన్ అవార్డు'ను అందుకున్నారు. ఈ మహోన్నత పురస్కారాన్ని నవంబర్ 19వ తేదీన ఢిల్లీలోని యశోభూమిలో నిర్వహించిన కార్యక్రమంలో, 'నిసా' (%చీ×ూా%) ఆధ్వర్యంలో ఆయనకు ప్రధానం చేశారు. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని ఎడ్యుకేషన్ వరల్డ్ ఫోరమ్ డైరెక్టర్ డామినిక్ సేవేజ్ మరియు నిసా ప్రెసిడెంట్ డా. కుల్ భూషన్ శర్మ చేతుల మీదుగా డా. ప్రసాదరావు ఈ అవార్డును అందుకున్నారు. పారమిత విద్యాసంస్థలలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తూ, అదేవిధంగా దేశంలోని వివిధ విద్యా సంస్థలను సందర్శిస్తూ ఆయన చేస్తున్న అవిశ్రాంత సేవలకు గాను ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ అవార్డు ప్రదానోత్సవంతో పాటుగా, మూడు రోజుల పాటు ఢిల్లీలోని యశోభూమిలో జరిగిన అంతర్జాతీయ విద్యా సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సదస్సులో భారత్, జర్మనీ, ఫిన్‌లాండ్, యునైటెడ్ కింగ్‌డమ్, ఆస్ట్రేలియా వంటి అనేక దేశాల నుండి వచ్చిన విద్యావేత్తలు తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ అంతర్జాతీయ సదస్సుకు పారమిత విద్యా సంస్థల డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులు కూడా హాజరయ్యారు. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును అందుకున్న డా. ఇ. ప్రసాదరావును పారమిత విద్యా సంస్థల డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులు, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు మరియు పారమిత విద్యార్థుల తల్లిదండ్రులు హృదయపూర్వకంగా అభినందించారు.

# పార్టీలకు అతీతంగా మత్స్యకారుల హక్కులకై పోరాడాలి

**మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్ పోతరవేని క్రాంతి**




**పెద్దపల్లి, నవంబర్ 21 (మనసులో మాట):**

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా మంథని మత్స్యశాఖ అధ్యక్షులు, జిల్లా డైరెక్టర్ పోతరవేని క్రాంతి కుమార్ ముదిరాజ్‌ను ఘనంగా సన్మానించారు. ప్రగతి మత్స్యకార సేవ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఉస్థం శ్రీనివాస్ ముదిరాజ్, ప్రణాళిక కమిటీ చైర్మన్ నూనె రాజేశం ముదిరాజ్ మరియు సమితి సభ్యులు శాలువాతో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా క్రాంతి కుమార్ మాట్లాడుతూ, మత్స్యకారులను ప్రభుత్వం చిన్నచూపు చూడకుండా, సకాలంలో ఉచిత చేప పిల్లల పంపిణీ జరిగేలా చూడాలని సూచించారు. అంతేకాకుండా, నూతన పథకాలను ప్రవేశపెట్టి మత్స్యకారులను ఆర్థికంగా ప్రోత్సహించాలని కోరారు. అనంతరం, ప్రపంచ మత్స్యకారులందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ, పార్టీలకు అతీతంగా మత్స్యకారుల హక్కులకై ప్రతి ఒక్కరూ సంఘటితంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.

# వికారాబాద్ నోడల్ అధికారి శంకర్ నాయక్ పర్యటన

**జూనియర్ కళాశాలలో సమీక్ష**



**దౌల్తాబాద్ మండలం, నవంబర్ 21 (మనసులో మాట):**

దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం వికారాబాద్ జిల్లా నోడల్ అధికారి శంకర్ నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో ముచ్చటించి, అర్ధవార్షిక పరీక్షల మార్కులు, పరీక్ష ఫీజు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫైనల్ పరీక్షలకు ఇంకా కొద్ది రోజులే సమయం ఉందని, అందరూ పట్టుదలగా చదివి, మంచి మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశం ఏర్పాటు చేసి, 90 రోజుల ప్రణాళికను వెంటనే సిద్ధం చేయాలని, ఈ నెల చివరి వరకు సిలబస్‌ను పూర్తి చేయాలని సూచించారు. సబ్జెక్టుల వారీగా ఉదయం 9 గంటల నుండి 9:30 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు స్టడీ అవర్స్ తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. అన్ని సబ్జెక్టులలో విద్యార్థులందరూ మంచి మార్కులు సాధించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ టి. వసంత మాట్లాడుతూ, విద్యార్థులు ఉన్నతమైన ఫలితాలు సాధించేలా అధ్యాపకులు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారని తెలిపారు. ముఖ్యంగా ఫెయిల్ అయ్యే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నామని, ఇప్పటికే కళాశాలలో ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అధ్యాపకులందరూ 90 రోజుల ప్రణాళిక తయారుచేసి ఇచ్చారని, దాని ప్రకారమే తరగతులు నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్‌లో సీతాదయాకర్ రెడ్డి పర్యటన



**ఆదిలాబాద్, నవంబర్ 21 (మనసులో మాట):**

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీత దయాకర్ రెడ్డి శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా, పిల్లల హక్కుల సంరక్షణ, రక్షణ, సంక్షేమానికి సంబంధించిన అంశాలపై జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, నిర్మల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పాల్గొన్నారు. వీరితో పాటు, విద్యా, సంక్షేమ, వైద్యారోగ్య, పోలీసు శాఖల అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు మరియు ఇతర సంబంధిత విభాగాల ప్రతినిధులు హాజరయ్యారు. పిల్లల సంరక్షణకు సంబంధించి జిల్లాలో తీసుకుంటున్న చర్యలపై కమిషన్ చైర్‌పర్సన్ ఈ సందర్భంగా అధికారులతో వివరంగా చర్చించారు.

# క్రీడా సంస్థల కృషి అభినందనీయం

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



**పటాన్ చెరు, నవంబర్ 21 (మనసులో మాట):**

గ్రామ స్థాయి నుంచే క్రీడా ప్రతిభను వెలికితీయడానికి క్రీడా సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండల పరిధిలోని భానూరు గ్రామంలో ఆర్కే స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-14, అండర్-17 కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత క్రీడల్లో రాణించేందుకు ఇలాంటి పోటీలు ఎంతో దోహదం చేస్తాయని పేర్కొన్నారు. క్రీడా సంస్థలు గ్రామ స్థాయి నుంచే ప్రతిభావంతులను గుర్తించేందుకు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ విజయ్ కృష్ణ, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గోపాల్, పోటీల నిర్వాహకులు రామకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీలలో పాల్గొనే ఆటగాళ్లకు ప్రజాప్రతినిధులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

# గృహప్రవేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



**బొంరస్‌పేట, నవంబర్ 21 (మనసులో మాట):**

కొడంగల్ నియోజకవర్గం బొంరాస్‌పేట్ మండలం, నందర్‌పూర్ గ్రామ మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి నూతన గృహప్రవేశం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ మున్సిపల్ తాజా మాజీ కౌన్సిలర్ ఆర్. మధుసూదన్ యాదవ్, బొంరాస్‌పేట్ మండల మాజీ అధ్యక్షులు కోట్ల యాదగిరి, విష్ణు వర్ధన్ రెడ్డి, శేరి నారాయణ రెడ్డి, మహేందర్ రెడ్డి, చంద్ పాషా, దుద్యాల నరేష్ గౌడ్, దౌల్తాబాద్ మాజీ జెడ్పీటీసీ కోట్ల మహిపాల్, లగచర్ల సురేష్, వి. రవీంద్ర చారీ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఓయూలో జాబ్‌మేళా



**హైదరాబాద్,నవంబర్21 (మనసులో మాట):**

ఉస్మానియా యూనివర్సిటీ లోని ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో మిత్రా ఏరిన ఆటోమె-ంబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ నెల 22 న శనివారం ఉదయం 11 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నది. ఉస్మానియా యూనివర్సిటీ, ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నారు. మిత్రా ఏరిన ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ లోని ,(టెక్నీషియన్ / సర్వీస్ అడ్వైజర్ )25 పోస్టులను ఈ జాబ్ మేళా ద్వారా భర్తీ చేయనున్నారు. డిగ్రీ చేసిన యువతి యువకులకు18 నుండి 30 సంవత్సరాల వయసు వారికి మాత్రమే ఈ జాబ్ మేళాలో అవకాశం కల్పిస్తున్నట్లు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డిప్యూటీ చీఫ్ ఒక ప్రకటనలో తెలియజేసింది. రూ.15,000 నుండి రూ.25,000 వేలవరకు వేతనం ఉండే ఈ టెక్నీషియన్ / సర్వీస్ అడ్వైజర్స్ ఉద్యోగాలకు మరిన్ని వివరాలకు 7799884996, 7799464344 నంబర్లను సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు. విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ తో ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరో వద్ద నేరుగా నవంబర్ 22 ,2025 న హాజరు కావాలని ప్రకటనలో పేర్కొన్నారు.

# సంక్షేమ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- **జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, నవంబర్ 21 (మనసులో మాట):**

వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టంపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, డిసిపి ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్,, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వయోవృద్ధులకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టంపై వృద్ధులకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఫిర్యాదుదారులకు రక్షణ కల్పించడానికి ఎవరూ లేని పక్షంలో ఓల్డ్ ఏజ్ హోమ్స్/ స్వచ్ఛంధ సంస్థల సహాయంతో సంరక్షించడం జరుగుతుందని, ట్రిబ్యునల్ లో దరఖాస్తు చేసుకున్న వారికి సహాయం అందించడం జరుగుతుందని, వయోవృద్ధుల దరఖాస్తులను పోలీసు, రెవెన్యూ సిబ్బంది సానుకూల దృష్టితో చూడవలసిన అవసరం ఉందని తెలిపారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం సంబంధించిన విధివిధానాలు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. వయోవృద్ధులు వెబ్సైట్ ద్వారా వారి సంరక్షణకు సంబంధించిన దరఖాస్తు, ట్రిబ్యునల్ కు అప్పీలు, ఎవిక్షన్ ఆర్డర్, అప్పిలేట్ అథారిటీకి దరఖాస్తు చేసుకోవచ్చని, ఈ వెబ్సైట్ ద్వారా సీనియర్ సిటిజన్స్ యాక్ట్ చట్టాన్ని డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. వయావృద్ధులు శారీరకంగా, మానసికంగా కలిగే ఇబ్బందులను ఫిర్యాదు చేయవచ్చని, రెవెన్యూ, పోలీస్, సంక్షేమ శాఖల సమన్వయంతో పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వయోవృద్ధుల సంరక్షణ కొరకు అనేక చర్యలు తీసుకుంటుందని, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టంపై అందరూ అవగాహన కలిగి ఉండాలని, తద్వారా ప్రభుత్వ సేవలు వినియోగించుకోవచ్చు అని తెలిపారు. పదవీ విరమణ పొందిన తర్వాత వచ్చే డబ్బులను ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ ఖర్చు చేయాలని, ఏదైనా సలహాలు సూచనల కొరకు అధికారులు ఎప్పుడు సిద్ధంగా ఉంటారని తెలిపారు. తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం జాతీయస్థాయిలో జల సంరక్షణలో భాగంగా అవార్డు పొందిన జిల్లా కలెక్టర్ ను తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు శాలువాతో సన్మానించారు. వయోవృద్ధులను సత్కరించారు. జిల్లా పౌర సంబంధాల అధికారి ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు జిల్లా కలెక్టర్ పై ప్రత్యేక పాట పాడి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వయోవృద్ధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనకు ఏర్పాట్లు వేగవంతం

- **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశం**



**కొత్తగూడెం, నవంబర్ 21 (మనసులో మాట):**

డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రానున్న నేపథ్యంలో, ఏర్పాట్ల పురోగతిని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ శుక్రవారం పరిశీలించారు. ఈ పనులను మరింత వేగవంతం చేయాలని ఆయన సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనకు అనుగుణంగా యూనివర్సిటీ ప్రాంగణం మొత్తాన్ని తీర్చిదిద్దే పనులను కలెక్టర్ విభాగాల వారీగా పరిశీలిస్తూ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆడిటోరియం, హాస్టల్ బ్లాక్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లు, అంతర్గత రహదారుల మరమ్మత్తు వంటి కీలక ప్రదేశాలను సందర్శించారు. ముఖ్యమంత్రి పర్యటన సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో ప్రతీ పనిని వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఆలస్యానికి కారణమయ్యే అంశాలు ఏవైనా ఉంటే వెంటనే నివేదించాలని, తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. యూనివర్సిటీ మొత్తం పరిశుభ్రత మరియు పచ్చదన సదు-పాయాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి విభాగాన్ని అందంగా మార్చేందుకు ఎంపీడీఓలను ప్రత్యేక విభాగాలకు నియమించారు. గ్రౌండ్ లెవలింగ్, మొక్కలు నాటడం, రోడ్ల పక్కన హార్టికల్చర్ పనులు, చెత్త తొలగింపు వంటి సుందరీకరణ కార్యక్రమాలు తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన రోజున యూనివర్సిటీ ఒక ఆదర్శవంతమైన విద్యాసంస్థగా కనిపించాలనే లక్ష్యంతో పనుల్ని అమలు చేయాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఏలాంటి లోపాలు లేకుండా, ప్రణాళికాబద్ధంగా పని చేయాలన్న దిశగా విద్యుత్, నీటి వసతులు, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, మీడియా ఏర్పాట్లు, వసతి సదుపాయాలు వంటి అన్ని విభాగాలు పరస్పరం సమన్వయంతో వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పర్యటన విజయవంతం కావాలంటే ప్రతి శాఖ సమిష్టిగా పనిచేయాలని, అన్ని ఏర్పాట్లు ప్రభుత్వ ప్రతిష్ఠకు తగ్గట్టుగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయి సమన్వయంతో పని చేసి, సకాలంలో అన్ని పనులు పూర్తి చేయాలని, ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జగన్మోహన్ రాజు, మున్సిపల్ కమిషనర్ సుజాత, డీపీఓ అనూష, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్, ఎంపీడీవోలు, కళాశాల ఉపాధ్యాయులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల సంక్షేమమే

# ప్రభుత్వ లక్ష్యం

**కుల వృత్తులను ప్రోత్సహిస్తున్నాం**

**సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**



**కరీంనగర్, నవంబర్ 21 (మనసులో మాట):**

అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం నిరంతరం కృషి చేస్తున్నామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో లోయర్ మానేరు డ్యామ్ జలాశయంలో 100% రాయితీతో ఉచిత చేప పిల్లల విడుదల కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో పాటు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి హాజరై జలాశయంలో చేప పిల్లలను విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా రూ. 2 కోట్ల 18 లక్షల వ్యయంతో 2 కోట్ల 20 లక్షల చేప పిల్లలను చెరువులు, కుంటలు, జలాశయాల్లో విడుదల చేస్తున్నామని తెలిపారు. ఈ చేప పిల్లలు 80 నుండి 100 ఎంఎం సైజు గలవిగా పేర్కొన్నారు. వీటి విడుదల ద్వారా సుమారు 2500 మంది మత్స్యకారులు ప్రత్యక్షంగా, 1300 మంది పరోక్షంగా జీవనోపాధి పొందుతారని వివరించారు. ముఖ్యంగా ఎల్ఎండీలో 30 లక్షల చేపలను విడుదల చేస్తున్నామని ఆయన అన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వం కుల వృత్తులను ఆదరిస్తూనే ఉందని తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో మత్స్యశాఖ కాంట్రాక్టర్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేసేలా కృషి చేస్తామని అన్నారు. మత్స్యకారుల సొసైటీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా ప్రయత్నిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రమాదవశాత్తు మ-రణించిన మత్స్య కార్మికుని కుటుంబానికి రూ. 5 లక్షల బీమా చెక్కును అందజేశారు. జిల్లాలో మొట్టమొదటగా మహిళా మత్స్యకార్మిక సహకార సంఘం ఏర్పాటు చేసినందున, వారికి రిజిస్ట్రేషన్ పత్రాన్ని అందజేశారు. అలాగే, మత్స్య కార్మిక సంఘంలో సభ్యత్వం తీసుకున్న వారికి సభ్యత్వ నమోదు పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య కార్మిక సంఘం చైర్మన్ పిట్టల రవీందర్, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, మత్స్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయభారతి, మత్స్య కార్మిక సహకార సంఘాల నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



## మండల స్థాయి చెకుముకి

# టాలెంట్ టెస్ట్

**ప్రారంభించిన చౌదర్‌పల్లి జీహెచ్‌ఎం రవీందర్ గౌడ్**

**బొంరస్‌పేట మండలం, నవంబర్ 21 (మనసులో మాట):**

బొంరస్‌పేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ను చౌదర్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు (జీహెచ్‌ఎం) రవీందర్ గౌడ్ ప్రారంభించారు. ఈ పోటీ పరీక్షలో జడ్పీహెచ్‌ఎస్ బొంరాస్‌పేట్, జడ్పీహెచ్‌ఎస్ చౌదర్‌పల్లి, జడ్పీహెచ్‌ఎస్ రేగడి మైల్వారు, గిరిజన ఆశ్రమ పాఠశాలల నుండి తెలుగు మరియు ఇంగ్లీష్ మీడియంలలో మొత్తం 18 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీ పరీక్షలో విద్యార్థులు గ్రూప్ చర్చ ద్వారా జవాబులు వ్రాయవలసి ఉంటుంది. మండల స్థాయిలో మెరిట్ సాధించిన విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపిక చేయబడతారు. ఇంగ్లీష్ మీడియం విభాగంలో పీఎం శ్రీ జడ్పీహెచ్‌ఎస్ బొంరస్‌పేట జిల్లా స్థాయికి ఎంపికైంది. తెలుగు మీడియం విభాగంలో జడ్పీహెచ్‌ఎస్ రేగడి మైల్వారు ఎంపికైంది. మండల పరిధిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు సరోజ (10వ తరగతి), అఖిల్ (9వ తరగతి), డి. రమణ (8వ తరగతి) లకు జీహెచ్‌ఎం రవీందర్ గౌడ్ సర్టిఫికెట్లను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులు కే. ప్రశాంత్ కుమార్, రేగడి మైల్వారు పాఠశాల ఉపాధ్యాయులు శ్యామలయ్య, ఆశ్రమ పాఠశాల నుండి నవనీత పి.డి., మండల కోఆర్డినేటర్ బాకారం మల్లయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# కెప్టెన్‌గా రిషబ్ పంత్

## రెండో టెస్ట్ నుంచి శుభమన్ గిల్ అవుట్

శుభ్‌మన్ గిల్ అధికారికంగా భారత్ vs దక్షిణాఫ్రికా రెండో టెస్ట్ నుంచి వైదొలిగాడు. కోల్‌కతాలో జరిగిన మొదటి టెస్ట్ రెండో రోజున మెడ నొప్పి కారణంగా మైదానాన్ని వీడాడు. అతని నొప్పి చాలా ఎక్కువగా ఉండటంతో ఆసుపత్రికి తీసుకెళ్లాల్సి వచ్చింది. అతను రెండో ఇన్నింగ్స్‌లో కూడా బ్యాటింగ్ చేయలేకపోయాడు. గువాహటిలో జట్టుతో చేరిన గిల్ ఆడటంపై ముందే సందేహం ఉంది, కానీ ఇప్పుడు ఒక ప్రకటన విడుదల చేసి దీన్ని ధృవీకరించింది. అతని స్థానంలో రిషబ్ పంత్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. తన ప్రకటనలో,"దక్షిణాఫ్రికాతో జరిగిన మొదటి టెస్ట్‌లో మెడ నొప్పికి గురైన టీమ్ ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్, గువాహటిలో జరిగే రెండో టెస్ట్ నుంచి వైదొలిగాడు. గిల్ కోల్‌కతా టెస్ట్ రెండో రోజున మెడ నొప్పికి గురయ్యాడు. ఆట ముగిసిన తర్వాత పరీక్షల కోసం ఆసుపత్రికి తీసుకెళ్లారు. అతన్ని పరిశీలనలో ఉంచారు. మరుసటి రోజు డిశ్చార్జ్ చేశారు. అతను నవంబర్ 19, 2025న గువాహటికి వెళ్ళాడు. దురదృష్టవశాత్తు, అతను రెండో టెస్ట్‌లో ఆడటానికి పూర్తిగా ఫిట్‌గా లేడు. తన గాయం గురించి మరింత పరీక్షల కోసం ముంబైకి వెళ్తాడు. గిల్ లేకపోవడంతో రిషబ్ పంత్ రెండో టెస్ట్‌లో జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు." టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదికల ప్రకారం.. శుభ్‌మన్ గిల్ ప్రస్తుతం ముంబైలో రెండు నుంచి మూడు రోజులు విశ్రాంతి తీసుకుని, ఆ తర్వాత ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ దినషా పర్దివాలా నుంచి మెడ నొప్పికి సంబంధించి ప్రత్యేక సలహా తీసుకోనున్నాడు.కోల్‌కతాలో జరిగిన తొలి టెస్ట్ మ్యాచ్‌లోనే గిల్‌కు గాయమైంది.మ్యాచ్ రెండవ రోజున బ్యాటింగ్‌కు వచ్చిన వెంటనే, కొన్ని బంతులు ఎదుర్కొన్న తర్వాత మెడలో తీవ్రమైన అసౌకర్యాన్ని అనుభవించాడు. ఫిజియో వచ్చి పరీక్షించిన తర్వాత, అతను రిటైర్డ్ హర్ట్‌గా మైదానం వీడాల్సి వచ్చింది. గాయం తీవ్రత దృష్ట్యా, అతన్ని వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఆ మ్యాచ్‌లో అతను మళ్లీ ఆడలేదు. జట్టుతో కలిసి గువహాటి వచ్చినా, చివరకు రెండో టెస్ట్‌కు దూరమయ్యాడు.శుభ్‌మన్ గిల్ దూరమవడంతో అతని స్థానంలో వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ జట్టు కెప్టెన్సీని చేపట్టనున్నారు. అయితే ప్లేయింగ్ ఎలెవన్‌ను ఎంపిక చేయడంలో గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని జట్టు మేనేజ్‌మెంట్‌కు కొన్ని ముఖ్యమైన సవాళ్లు ఎదురవుతున్నాయి. శుభ్‌మన్ గిల్ నాలుగో స్థానంలో సాయి సుదర్శన్ లేదా నితీష్ కుమార్ రెడ్డిలలో ఒకరికి అవకాశం దక్కవచ్చు. అదనపు స్పిన్నర్ అక్షర్ పటేల్‌ను బెంచ్‌కే పరిమితం చేసే అవకాశం ఉంది. మ్యాచ్‌కు ముందు జరిగిన నెట్ ప్రాక్టీస్‌లో కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్, సాయి సుదర్శన్ మాత్రమే పాల్గొన్నారు.గిల్ తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకుని టెస్ట్‌లో ఆడాలనుకున్నప్పటికీ, జట్టు యాజమాన్యం అతని భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎటువంటి రిస్క్ తీసుకోవడానికి సిద్ధంగా లేదు. దక్షిణాఫ్రికాతో భారత జట్టు నవంబర్ 29 నుంచి వన్డే సిరీస్ కూడా ఆడాల్సి ఉంది. అయితే గిల్ ప్రస్తుతం మెడ నొప్పితో బాధపడుతున్నందున, ఆ వన్డే సిరీస్‌లో అతను పాల్గొంటాడా లేదా అనే విషయంపై ఇంకా అధికారికంగా ఎటువంటి స్పష్టత లేదు.

## గౌహతి మైదానం నాకు చాలా ఇష్టం

### నా వన్డే అరంగేట్రం ఇక్కడే జరిగింది : రిషభ్ పంత్

భారత్, సౌతాఫ్రికా మధ్య జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో రెండవ మ్యాచ్ రేపటి నుంచి గౌహతిలో ప్రారంభం కానుంది. మొదటి టెస్ట్ కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరిగింది. ఆ మ్యాచ్‌లో సౌతాఫ్రికా 30 పరుగుల తేడాతో గెలిచింది. ఈడెన్ గార్డెన్స్ పిచ్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో గౌహతి పిచ్ కూడా స్పిన్నర్లకు అనుకూలంగా ఉంటుందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే ఈ విషయంపై భారత కెప్టెన్ రిషభ్ పంత్ ఒక పెద్ద స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఈసారి పిచ్ మెరుగ్గా ఉంటుందని తాను ఆశిస్తున్నానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రెండవ టెస్ట్ మ్యాచ్ ప్రారంభానికి ముందు జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో రిషభ్ పంత్ మాట్లాడారు. "ఈ మైదానం (గౌహతి) నాకు చాలా ఇష్టం అని ముందుగా చెప్పాలనుకుంటున్నాను. నా వన్డే అరంగేట్రం ఇక్కడే జరిగింది. అంతేకాదు టెస్ట్ టీమ్‌కు కెప్టెన్‌గా నా అరంగేట్రం కూడా ఈ మైదానంలోనే మొదలవుతోంది. అందుకే ఈ స్థలం నాకు, అలాగే గౌహతి మొత్తానికి చాలా ప్రత్యేకం. ఎందుకంటే ఇక్కడ తొలిసారి టెస్ట్ మ్యాచ్ జరుగుతోంది" అని పంత్ భావోద్వేగంగా చెప్పారు. పిచ్ గురించి మాట్లాడుతూ.. పంత్ సానుకూలత వ్యక్తం చేశారు. "పిచ్ విషయానికి వస్తే ఈసారి పిచ్ మెరుగ్గా ఉంటుందని నేను అనుకుంటున్నాను. ముఖ్యంగా బ్యాటింగ్‌కు ఇది బాగా అనుకూలించే అవకాశం ఉంది. కొన్ని రోజుల తర్వాత పిచ్ టర్న్ అయ్యే అవకాశం ఉంది. కానీ నా ఉద్దేశంలో ఇది ఒక మంచి టెస్ట్ మ్యాచ్‌గా ఉంటుంది" అని పంత్ నమ్మకంగా చెప్పారు. అంటే మొదటి రోజు నుంచే పిచ్ స్పిన్నర్లకు పట్టు ఇవ్వకుండా.. బ్యాట్స్‌మెన్‌లకు కూడా అవకాశం ఇస్తుందని పంత్ టీమ్ ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించినందుకు పంత్ ఈ సందర్భంగా బీసీసీఐకి మరోసారి ధన్యవాదాలు తెలిపారు. "కొన్నిసార్లు మనం పెద్ద మ్యాచ్ గురించి ఎక్కువగా ఆలోచిస్తే దాని వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. అందుకే నేను ఎక్కువగా ఆలోచించదలుచుకోలేదు. మొదటి టెస్ట్ మాకు బాగా ఆడలేదు. అందుకే రెండవ టెస్ట్‌లో గెలవడానికి అవసరమైనదంతా చేస్తాం" అని పంత్ పేర్కొన్నారు. కోల్‌కతా ఓటమిని మర్చిపోయి.. ఈ టెస్ట్‌లో ఎలాగైనా గెలిచి సిరీస్‌ను సమం చేయాలని టీమిండియా పట్టుదలగా ఉంది.

# తొలిరోజే అభిమానులకు థ్రిల్

- పూర్తిగా ఆధిపత్యం కనిపించిన బౌలర్లు
- 172 పరుగులకే ఇంగ్లాండ్ ఆలౌట్
- ఇంగ్లాండ్? నడ్డివిరిచిన మిచెల్ స్టార్క్
- 7 వికెట్లతో ఆదరహో అనిపించుకున్న స్టార్క్
- ఇంగ్లాండ్ బౌలర్లు దీటుగా సమాధానం
- ఆసీస్ మొదటి ఇన్నింగ్స్‌లో 123-9
- బెన్ స్టోక్స్ ధాటికి కుదేలైన ఆసీస్ బ్యాటర్లు
- స్టోక్స్ కేవలం 6 ఓవర్లలోనే 5 వికెట్లు
- రసవత్తరంగా సాగుతున్న యాషెస్ సిరీస్



యాషెస్ సిరీస్ 2025లో పెర్త్ వేదికగా జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్ మొదటి రోజు అసాధారణ రీతిలో చరిత్ర సృష్టించింది. ఈ రోజు మొత్తం బౌలర్ల ఆధిపత్యమే నడిచింది. ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ 7 వికెట్లతో విజృంభించగా.. ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ కేవలం 6 ఓవర్లలోనే 5 వికెట్లు పడగొట్టడంతో టెస్ట్ క్రికెట్‌లో అరుదైన రికార్డు నమోదైంది. మొదటి రోజు ఆటలో ఏకంగా 19 వికెట్లు నేలకూలాయి.యాషెస్ సిరీస్ చరిత్రలో గత 100 ఏళ్లలో టెస్టు మ్యాచ్ తొలి రోజున 19 వికెట్లు పడటం ఇదే మొదటిసారి. అంతకుముందు 1909లో ఓల్డ్ ట్రాఫర్డ్ మైదానంలో తొలి రోజు 18 వికెట్లు నేలకూలాయి. పెర్త్‌లో ఒక టెస్ట్ మొదటి రోజు అత్యధిక వికెట్లు పడటం కూడా ఇదే తొలిసారి. గతంలో 2024లో భారత్-ఆస్ట్రేలియా మ్యాచ్‌లో 17 వికెట్లు పడ్డాయి.టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ జట్టు మిచెల్ స్టార్క్ (7 వికెట్లు) విధ్వంసకర బౌలింగ్ వల్ల 172 పరుగులకే ఆలౌట్ అయింది.హ్యారీ బ్రూక్ (52), ఓలీ పోప్ (46) మాత్రమే కొంత పోరాటాన్ని చూపగా.. మిగతా బ్యాటర్లు స్టార్క్ ధాటికి తలవంచారు.ఇంగ్లండ్‌ను స్వల్ప స్కోరుకే పరిమితం చేసిన తర్వాత, బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా పరిస్థితి మరింత దయనీయంగా మారింది. రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా కేవలం 123 పరుగులకే 9 వికెట్లు కోల్పోయి బ్యాక్‌ఫుట్‌లో పడింది.ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ తన బౌలింగ్‌తో మెరిశాడు. బెన్ స్టోక్స్ కేవలం 6 ఓవర్ల స్పెల్‌లో 23 పరుగులు మాత్రమే ఇచ్చి ఏకంగా 5 కీలక వికెట్లు పడగొట్టాడు.ఆసీస్ బ్యాటర్లు స్టీవ్ స్మిత్ (17), ట్రావిస్ హెడ్ (21), కామెరూన్ గ్రీన్ (24)తో పాటు మరో ఇద్దరు కీలక బ్యాటర్లను స్టోక్స్ పెవిలియన్ చేర్చాడు. జోఫ్రా ఆర్చర్ కూడా జోస్యం చేసి జేక్ వెదెరాల్డ్‌ను (0) తొలి బంతికే ఔట్ చేయగా, లబుషేన్ (9), ఖవాజా (2) తక్కువ స్కోరుకే ఔటయ్యారు. రోజు ఆట ముగిసే సమయానికి నాథన్ లయన్ (3), బ్రెండన్ డాగెట్ (0)



క్రీజులో ఉన్నారు. కెప్టెన్ స్టోక్స్ స్పెల్ కారణంగా ఆస్ట్రేలియా తమ తొలి ఇన్నింగ్స్‌లో కూడా ఆధిక్యాన్ని సాధించడంలో విఫలమైంది. ఆసీస్ స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ అద్భుతంగా ప్రదర్శన చేయడంతో ఇంగ్లండ్ జట్టు తమ మొదటి ఇన్నింగ్స్‌లో కేవలం 172 పరుగులకే ఆలౌటైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్‌కు ఆరంభంలోనే భారీ షాక్ తగిలింది. దూకుడుగా ఆడే 'బేజ్‌బాల్' వ్యూహాన్ని అమలు చేయాలని భావించిన ఇంగ్లండ్‌కు ఆస్ట్రేలియా పేస్ ఎటాక్ ఆదిలోనే కళ్లెం వేసింది.ఇంగ్లండ్ బ్యాటర్లలో అత్యధికంగా పరుగులు చేసింది ఇద్దరే కావడం గమనార్హం. హ్యారీ బ్రూక్ (52 పరుగులు) తనదైన శైలిలో దూకుడుగా ఆడి అర్ధ సెంచరీ పూర్తి చేసి జట్టుకు కొంత ఉపశమనం అందించాడు. ఓలీ పోప్ (46 పరుగులు) కూడా బ్రూక్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నిలబెట్టేందుకు గట్టి పోరాటం చేశాడు. వీరితో పాటు జెమీ స్మిత్ (33), ఓపెనర్ బెన్ డకెట్ (21) ఫర్వాలేదనిపించినా.. మిగతా బ్యాటర్లంతా ఆసీస్ పేస్ దాడి ముందు చేతులెత్తేశారు. కెప్టెన్ బెన్ స్టోక్స్ సహా కీలక బ్యాటర్లు తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరడంతో ఇంగ్లండ్ భారీ స్కోరు సాధించలేకపోయింది. ఇంగ్లండ్ పతనంలో ప్రధాన పాత్ర పోషించింది ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్. తన పదునైన స్వింగ్, వేగంతో ఇంగ్లండ్ బ్యాటింగ్ ఆర్డర్‌ను స్టార్క్ కూల్చేశాడు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్ 7 వికెట్లు పడగొట్టగా.. బ్రెండన్ డొగ్గెట్ 2 వికెట్లు, క్యామెరాన్ గ్రీన్ ఒక వికెట్ తీశాడు. స్టార్క్ ఏకంగా 7 వికెట్లు తీయడం ఆస్ట్రేలియాకు బలమైన ఆరంభాన్ని ఇచ్చింది. దీంతో ఇంగ్లండ్ జట్టు 172 పరుగులకే తమ ఇన్నింగ్స్‌ను ముగించింది.ఇంగ్లండ్ స్వల్ప స్కోరుకే ఆలౌట్ కావడంతో, ఆస్ట్రేలియా బ్యాటింగ్ ప్రారంభించి, తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యాన్ని సంపాదించేందుకు సిద్ధమవుతోంది. యాషెస్ ఆరంభంలోనే పైచేయి సాధించిన ఆసీస్, ఇంగ్లండ్‌పై ఒత్తిడిని మరింత పెంచింది.

## రెండు లేదా మూడు నెలలు శ్రేయస్ ఆటకు దూరం



టీమిండియా స్టార్ బ్యాటర్, వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు గాయం కారణంగా మరోసార ఎదురుదెబ్బ తగిలింది. శ్రేయస్ అయ్యర్ గాయం కారణంగా క్రికెట్‌కు చాలా కాలం దూరంగా ఉండబోతున్నాడు. కడుపులో అంతర్గత గాయం నుంచి కోలుకుంటున్న శ్రేయస్ అయ్యర్.. రాబోయే దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్‌లతో జరిగే వన్డే సిరీస్‌లను కోల్పోవడం ఖాయంగా కనిపిస్తోంది. తాజా వైద్య నివేదికల ప్రకారం.. శ్రేయస్ అయ్యర్ పూర్తిస్థాయి పునరాగమనం కోసం కనసం రెండు లేదా మూడు నెలలు పట్టే అవకాశం ఉంది. ఈ సమయంలో శ్రేయస్ అయ్యర్ కచ్చితమైన గ్రేడెడ్ రిహాబిలిటేషన్ ప్రోగ్రామ్‌ను మాత్రమే అనుసరించాలని వైద్యులు సూచించారు. ఆస్ట్రేలియా వన్డే సిరీస్ సమయంలో గాయమైనప్పటి నుంచి శ్రేయస్ అయ్యర్ విశ్రాంతి తీసుకుంటున్నాడు.అక్టోబర్ 25న సిడ్నీలో ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డే మ్యాచ్‌లో క్యాచ్ తీసుకునే ప్రయత్నంలో శ్రేయస్ అయ్యర్ అసాధారణంగా కింద పడ్డాడు. ఈ ప్రమాదం వల్ల అతనికి కడుపులో గాయం అయి, అంతర్గత రక్తస్రావం జరిగి, ప్లీహం పైన గాయం ఏర్పడింది. రక్తస్రావాన్ని ఆపడానికి చికిత్స చేసిన తర్వాత పరిస్థితి స్థిరపడే వరకు అతన్ని ఐసీయూలో పర్యవేక్షణలో ఉంచారు.ఇండియాకు తిరిగి వచ్చినప్పటి నుంచి శ్రేయస్ అయ్యర్ నిరంతర వైద్య పర్యవేక్షణలో ఉన్నారు. ఈ వారం ప్రారంభంలో అతనికి అల్ట్రాసౌండ్ స్కాన్ నిర్వహించగా.. ఆ ఫలితాలను ప్రముఖ స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణుడు డాక్టర్ దినషా పర్దివాలా పరిశీలించారు. తాజా స్కాన్ ఫలితాలు సానుకూలంగా ఉండటం, అయ్యర్ కోలుకోవడం స్థిరంగా ఉందని సూచించింది.ప్రస్తుత పరీక్షల ఫలితాల ఆధారంగా శ్రేయస అయ్యర్ ప్రాథమిక ఐసోమెట్రిక్ వ్యాయామాలు, సాధారణ దైనందిన కార్యకలాపాలను తిరిగి ప్రారంభించడానికి అనుమతి పొందారు. ప్లీహం గాయం మరింత తీవ్రం కాకుండా ఉండేందుకు కడుపుపై ఒత్తిడి పెంచే ఏ విధమైన శిక్షణనూ కనీసం తదుపరి ఒక నెల పాటు చేయకూడదని సూచించారు. అతని పునరావాస ప్రణాళికలో భాగంగా, రెండు నెలల తర్వాత రెండో అల్ట్రాసౌండ్ స్కాన్ నిర్వహిస్తారు. ఆ తదుపరి స్కాన్ ఫలితాల ఆధారంగా మాత్రమే బీసీసీఐసెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో రిహాబిలిటేషన్ ప్రారంభించడానికి అనుమతిస్తారు.ఈ గడువును బట్టి చూస్తే శ్రేయస్ అయ్యర్ కనీసం మరో రెండు లేదా మూడు నెలల పాటు ఆటకి దూరంగా ఉంటాడని స్పష్టమవుతోంది. దీంతో శ్రేయస్ అయ్యర్ రాబోయే దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్‌లతో జరిగే వన్డే సిరీస్‌లను కోల్పోవడం ఖాయంగా కనిపిస్తోంది. ప్రస్తుతానికి 29 ఏళ్ల ఈ ఆటగాడు పూర్తిగా, సురక్షితంగా కోలుకోవడానికే అధిక ప్రాధాన్యత ఇవ్వబడుతోంది.

## మీర్‌పూర్‌లో స్టేడియంలో భూకంపం

### స్టేడియంలో వణికిపోయిన ప్రేక్షకులు!

క్రికెట్‌లో అప్పుడప్పుడు వెలుతురు లేకపోవడం లేదా వర్షం కారణంగా మ్యాచ్‌లు నిలిచిపోవడం చూస్తుంటాం. కానీ బంగ్లాదేశ్, ఐర్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న టెస్ట్ మ్యాచ్‌ను ఆతిథ్య జట్టు ఎప్పుడూ ఊహించని కారణంతో ఆపాల్సి వచ్చింది. మీర్‌పూర్‌లోని షేర్-ఎ-బంగ్లా నేషనల్ స్టేడియంలో శుక్రవారం జరుగుతున్న రెండో టెస్ట్ మూడో రోజు మొదటి సెషన్ సందర్భంగా భూకంపం రావడంతో ఆటను నిలిపివేశారు.కామెంటరీ బాక్సులో ఉన్న కామెంటేటర్లు కూడా భూకంపం వచ్చినట్లు ధ్రువీకరించారు. స్టేడియంలో ప్రకంపనలు రావడంతో ఐర్లాండ్ ఆటగాళ్లు వెంటనే తమ డ్రెస్సింగ్ రూమ్ నుంచి బయటకు వచ్చి బౌండరీ లైన్ వద్ద గుమిగూడారు. స్టాండ్స్‌లో కూర్చున్న ప్రేక్షకులు కూడా కొద్దిగా ఆందోళనకు గురయ్యారు. అయితే కొన్ని నిమిషాల తర్వాత ప్రకంపనలు ఆగిపోవడంతో మ్యాచ్ తిరిగి ప్రారంభమైంది.ఆట నిలిచిపోయే సమయానికి ఐర్లాండ్ జట్టు 98 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో ఉంది. ఆ దశలో స్టీఫెన్ డోహెనీ, లోర్కాన్ టకర్ నిలకడగా ఆడి జట్టు స్కోరును 113 పరుగులకు చేర్చారు. వీరిద్దరూ కలిసి 81 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఇది ఐర్లాండ్ జట్టును పతనం అంచు నుంచి కాపాడింది. ఆ తర్వాతే భూకంపం ధాకాను తాకింది.రెండో రోజు ఆటలో బంగ్లాదేశ్ బ్యాటర్లు ముష్ఫికర్ రహీమ్, లిట్టన్ దాస్ సెంచరీలు సాధించడంతో బంగ్లాదేశ్ జట్టు పటిష్టమైన స్థితికి చేరుకుంది. 5 వికెట్లకు 340 పరుగులతో రెండో రోజు ఆటను ముగించిన బంగ్లాదేశ్, మూడో రోజు 476 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. ముష్ఫికర్ రహీమ్ తన 13వ టెస్ట్ సెంచరీని పూర్తి చేశాడు. అంతేకాకుండా తన 100వ టెస్ట్ మ్యాచ్‌లో సెంచరీ చేసిన ప్రపంచంలో పదకొండో క్రికెటర్‌గా రికార్డు సృష్టించాడు. అతను 106 పరుగుల వద్ద ఔటయ్యాడు. లిట్టన్ దాస్ కూడా దూకుడుగా ఆడి, ఒక సిక్సర్, ఒక ఫోర్‌తో తన సెంచరీని పూర్తి చేశాడు.



## ఆఖరికి వైడ్ బాల్‌తో గెలిచి ఫైనల్‌కు వెళ్లిన బంగ్లాదేశ్

రైజింగ్ స్టార్స్ ఆసియా కప్ 2025లో తొలి సెమీ-ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠకు పరాకాష్టగా నిలిచింది. ఈ మ్యాచ్‌ను ఒక సాధారణ క్రికెట్ మ్యాచ్ అని కాకుండా ట్విస్టులు, ఉత్కంఠ, చివరికి ఊహించని ఫలితం ఇచ్చిన డ్రామా సినిమా అని చెప్పవచ్చు. మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 194 పరుగులు చేయగా, దానికి సమాధానంగా టీమిండియా A కూడా సరిగ్గా 194 పరుగులే చేసి మ్యాచ్‌ను టై చేసింది. అయితే, సూపర్ ఓవర్ లో మాత్రం భారత్‌కు దారుణ అనుభవం ఎదురైంది. ఆఖరికి ఒకే ఒక్క వైడ్ బాల్ కారణంగా బంగ్లాదేశ్ అద్భుత విజయం సాధించి ఫైనల్‌లోకి అడుగుపెట్టింది. ఈ ఓటమితో టోర్నమెంట్‌లో భారత్ ప్రయాణం ముగిసింది. 195 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన భారత్ జట్టుకు ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ, ప్రియాన్ష్ ఆర్య మంచి ఆరంభాన్ని ఇచ్చారు. వైభవ్ సూర్యవంశీ (15 బంతుల్లో 38 రన్స్), ప్రియాన్ష్ ఆర్య (23 బంతుల్లో 44 రన్స్) మెరుపు ఇన్నింగ్స్‌లతో దూసుకుపోయారు. ఆ తర్వాత కెప్టెన్ జితేష్ శర్మ కూడా 23 బంతుల్లో 33 పరుగులు చేసి పోరాడాడు.చివరి 6 బంతుల్లో భారత్‌కు గెలవడానికి 16 పరుగులు అవసరం కాగా, అశుతోష్ మూడవ బంతికి సిక్సర్, నాలుగో బంతికి ఫోర్ కొట్టి ఉత్కంఠను పెంచాడు. ఆఖరి బంతికి హర్ష్ దూబే 3 పరుగులు తీయడంలో విజయం సాధించడంతో స్కోరు 194 పరుగుల వద్ద నిలిచి మ్యాచ్ టై అయింది. మ్యాచ్ టై అవ్వడంతో విజేతను నిర్ణయించడానికి సూపర్ ఓవర్ అనివార్యమైంది. అయితే ఈ చిన్న పోరాటంలో భారత జట్టు దారుణంగా విఫలమైంది. సూపర్ ఓవర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన భారత్ A జట్టు తరఫున కెప్టెన్ జితేష్ శర్మ, ఆశుతోష్ శర్మ కనీసం ఒక్క పరుగు కూడా చేయకుండానే తొలి రెండు బంతులకే ఔట్ అయ్యారు. దీంతో భారత ఇన్నింగ్స్ సున్నా పరుగులకే ముగిసింది. కేవలం ఒకే ఒక్క పరుగు లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్ కూడా సూపర్ ఓవర్ లో తొలి బంతికే యాసిర్ అలీ వికెట్ కోల్పోయింది. అయితే, అదృష్టం బంగ్లాదేశ్ వైపు ఉండటంతో భారత బౌలర్ వేసిన రెండో బంతి వైడ్ అంపైర్ ప్రకటించారు. దీంతో వైడ్ ద్వారా వచ్చిన ఆ ఒక్క పరుగుతో బంగ్లాదేశ్ A జట్టు ఉత్కంఠభరితమైన ఈ సెమీ-ఫైనల్‌లో విజయం సాధించి నేరుగా ఫైనల్ బెర్త్ ఖాయం చేసుకుంది. గుర్జప్నీత్ సింగ్ 2 వికెట్లు తీసినా వైభవ్ సూర్యవంశీ (38), ప్రియాన్ష్ ఆర్య (44), జితేష్ (33) బాగా ఆడినా చివరికి సూపర్ ఓవర్‌లో వైడ్ బాల్ రూపంలో వచ్చిన అదృష్టం బంగ్లాదేశ్‌ను గెలిపించింది.

# వారణాసిలో చిన్నమస్తాదేవి



## చర్చనీయాంశంగా మారిన రక్తం తాగే సీన్

దర్శక ధీరుడు రాజమౌళి ఒక సినిమా తెరకెక్కిస్తున్నాడంటే..వడుదలయ్యే వరకు కథపై చర్చిస్తూనే ఉంటారు. తాజాగా ఇప్పుడు వారణాసిపై ఎవరికి వారు తమ ఊహలను జోడించి కథలు అల్లుతున్నారు. జక్కన్న మహేష్ బాబుతో కలిసి వారణాసి సినిమాను తెరకెక్కిస్తున్నాడు. ఈ మధ్యనే ఈ సినిమా టైటిల్ గ్లింప్స్ ను రిలీజ్ చేశారు. అందరిలా వీడియోని రిలీజ్ చేయకుండా సినిమా కథను తెలిపే ప్లేసెస్, షాట్స్ ను చూపించి వారణాసి టైటిల్ ను రిలీజ్ చేశారు.అందులో ఒక్క షాట్ ఇండస్ట్రీ మొత్తాన్ని షేక్ చేసింది. అదే ఒక దేవత షాట్.. ఆ దేవత చాలా భయంకరంగా కనిపిస్తుంది. నగ్నంగా ఉన్న ఆ దేవత ఒక చేతిలో కత్తి.. ఇంకో చేతిలో తన తలను పట్టుకొని.. సంభోగంలో ఉన్న స్త్రీపురుషుల మీద కాళ్లు పెట్టి.. తన మెడ నుంచి మూడు రక్తధారల్లో.. రెండు కింద ఉన్న ఇద్దరు ఆడవారు చెరో వైపు తాగుతుండగా.. మూడో రక్తధార.. డైరెక్ట్ గా చేతిలో ఉన్న తల నోట్లోకి వెళుతున్నట్లు కనిపించింది. దేవతలందరిలో చాలా పవర్ ఫుల్ దేవతగా కొలవబడే ఛిన్నమస్తా దేవినే ఆ షాట్ లో కనిపించే దేవత. ఛిన్నా అంటే ఖండించినా అని అర్థం.. మస్తా అంటే తల.. తన తలను తానే ఖండించుకోవడంతో ఆమెకు ఛిన్నమస్తా దేవి అనే పేరు వచ్చింది. ఇక అలా ఖండించడం వెనుక ఉన్న కథను చాలామంది చాలారకాలుగా చెప్పుకొస్తారు. అందులో ఒకటి.. మందాకినీ నదిలో పార్వతి దేవి స్నానం ఆచరిస్తుండగా ఆ నీటిలో ఉన్న మాయనో ఏమో తెలియదు కానీ దేవికి కామ కోరిక రగులుతూ ఉంటుంది. సమయం కానీ సమయంలో ఇలాంటి కోరిక రావడంతో పార్వతి దేవి కోపోద్రికురాలు అవుతుంది. ఇంకోపక్క తనతో పాటు స్నానం ఆచరిస్తున్న చెలికత్తెలు అయిన డాకిని, వర్ణినిలకు తీవ్ర ఆకలి వేస్తుంటుంది. వారు దేవిని తమకు చాలా ఆకలి వేస్తుందని అడుగుతారు.ఇక అన్నపూర్ణాదేవి అయిన పార్వతి దేవి.. ఆకలి అన్నవారి ఆకలి తీర్చడానికి తనను తానే ఆహారంగా మార్చుకుంది. శరీరంలో రగులుతున్న కామాన్ని ఆపడానికి.. రతీ మన్మథుల శరీరాల మీద నిలబడి.. తన తలను తానే ఖండించుకొని.. డాకిని, వర్ణినిలకు రక్తాన్ని ఇచ్చి ఆకలి తీరుస్తోంది. మరో రక్తధార నేలమీద పడితే.. తన రక్తంతో సృష్టి నాశనం అవుతుందని.. తన నోటికే ఆ రక్తధారను అందిస్తుంది. పార్వతి దేవిని అలా చూస్తే ఎవరికైనా గగుర్పాటు పుడుతుంది అని చెప్పొచ్చు. పార్వతి దేవి ఈ రూపాన్ని రౌద్ర రూపంగా పూజిస్తారు. ఇక వారణాసికి ఛిన్నమస్తా దేవికి సంబంధం ఏంటి అంటే.. రణ కుంభ( పృథ్వీరాజ్ సుకుమారన్) ఈ సినిమాలో ఒక తంత్ర విద్యను అభ్యసిస్తాడు. అందులో భాగంగానే ఈ దేవతకు పూజ చేస్తాడు. ఇక ఆ శక్తితో మందాకినీ(ప్రియాంక చోప్రా)ను అంతమొందించే ప్రయత్నంలో రుద్ర( మహేష్ బాబు) ఆమెను కాపాడడానికి వస్తాడు..అని నెటిజన్స్ చెప్పుకుంటున్నారు. మరి ఇందులో నిజం ఎంత అనేది తెలియాలంటే సినిమా విడుదలయ్యేవరకు ఆగాల్సిందే.

# అరుంధతి పాత్ర చాలా ఇష్టం

## అనుష్కలా అన్ని పాత్రలు చేయగలగాలి

### భాగ్యశ్రీ



అరుంధతీ'లో అనుష్క చేసిన తరహా పాత్రలంటే ఇష్టం అని నటి భాగ్యశ్రీ భోర్సే అన్నారు. రామ్ పోతినేని హీరోగా నటించిన 'ఆంధ్రా కింగ్ తాలుకా' చిత్రంలో ఆమె కథానాయికగా నటించారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలోమహేష్ బాబు.పి దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 27న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే విలేకర్లతో మాట్లాడారు. నాకోసం ఎలాంటి కథలు రాసిపెట్టి ఉన్నాయో నాకు తెలియదు. వచ్చిన ప్రతి క్యారెక్టర్‌కి వందశాతం న్యాయం చేసేలా పని చేస్తా. వెర్సటైల్ యాక్ట్రెస్‌గా పేరు తెచ్చుకోవాలని కోరిక. ' అలాంటి పాత్రలు నాకూ వస్తాయని ఆశిస్తున్నా' అని భాగ్యశ్రీ భోర్సే అన్నారు. సినిమాలో మహాలక్ష్మి క్యారెక్టర్‌లో కనిపిస్తాను. కాలేజ్ గోయింగ్ గర్ల్. సాగర్‌తో ప్రేమలో ఉంటుంది. అంతకుమించి ఇప్పుడు ఎక్కువ క్యారెక్టర్ గురించి రివీల్ చేయకూడదు. కథకు ఈ పాత్ర చాలా ఇంపార్టెంట్.. అదేంటి అనేది తెరపైనే చూడాలి. నా పాత్రను ఆడియన్స్ తప్పకుండా గుర్తుపెట్టుకుంటారు. ఇందులో ప్రేమ కథ చాలా స్వచ్ఛంగా ఉంటుంది. లవ్ స్టోరీ, డైలాగ్స్ చాలా బ్యూటిఫుల్‌గా ఉంటాయి. రామ్‌తో పనిచేయడం అమేజింగ్ ఎక్స్‌పీరియన్స్. అతని ఎనర్జీకి మ్యాచ్ చేశానని అనుకుంటున్నాను. సినిమా ఓ ఇంపార్టెంట్ సీన్‌ను దర్శకుడు వివరించారు. ఆ సన్నివేశాన్ని నేను ఎలా అనుకుంటున్నానో చేసి చూపిస్తానని దర్శకుడిని రిక్వెస్ట్ చేశా. నేను చేసింది అందరికీ నచ్చింది. అంత క్రియేటివ్ స్పేస్ ఇవ్వడం ఆనందం కలిగించింది. నిర్మాత సంస్థ కూడా అంతే స్పేస్ ఇచ్చింది. కాంప్రమైజ్ కాకుండా సినిమా తీశారు. ఈ సినిమాలో తులసీ, రావు రమేశ్, మురళి శర్మ వంటి అద్భుతమైన ఆర్టిస్ట్‌లతో పని చేశా. వారి నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నా. ఉపేంద్రగారితో నాకు ఒక్క సీనే ఉంది. ఆయన వెరీ హంబుల్, డౌట్ టు ఎర్త్ యాక్టర్. ఆయనతో వర్క్ చేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది.అభిమానం అనేది డివైన్ ఎమోషన్. నేను నార్త్ నుంచి సౌత్ కొచ్చినప్పుడు ఇక్కడ ప్రేక్షకులు చూపించిన అభిమానానికి ఒక స్టార్‌ని ఇంతగా అభిమానిస్తారా అన్నది ప్రత్యక్షంగా చూశా. చాలా గొప్ప ఎమోషన్ అది. ఎలాంటి రిలేషన్ లేకుండా పరిచయం లేకుండా ఒక వ్యక్తిని అంతలా ఎలా అభిమానిస్తారని ఆశ్చర్యపోయా. మహేశ్ ఈ కథ చెప్పిన తర్వాత అభిమానం అన్నదానికి ఆన్సర్ దొరికింది. రెండు సినిమాలకే మంచి పేరు, ఫ్యాన్ ఫాలోయింగ్ పెరిగింది అంటుంటే చాలా ఆనందంగా ఉంది. ఆర్టిస్ట్‌కు మాత్రమే ఆ అదృష్టం ఉంటుంది. అందరూ తమ అమ్మాయిగా అభిమానాన్ని చూపించారు. ఆ అభిమానం మరింత పొందాలని కోరుకుంటున్నట్లు భాగ్యశ్రీ వెల్లడించింది.


# 23న రాజాసాబ్ పాట

## ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రభాస్ అభిమానులు



యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ అభిమానులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ది రాజా సాబ్' సినిమాకు సంబంధించిన కీలక అప్‌డేట్ విడుదలైంది. హారర్ చిత్రాల దర్శకుడు మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ మాస్ ఎంటర్‌టైనర్ 'ది రాజా సాబ్' నుంచి మొట్టమొదటి పాట విడుదల తేదీని చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ మూవీ ఫస్ట్ సింగిల్ రెబల్ సాబ్ ను నవంబర్ 23న విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. ఈ సినిమాకు థమన్ సంగీతం అందిస్తుండగా.. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నాడు. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, జరీనా వాహాబ్, రిద్ది కుమార్ కథానాయికలుగా నటిస్తుండగా బోమన్ ఇరానీ, సంజయ్ దత్ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు.

# భన్సాలీ ప్రొడక్షన్ నుంచి మరో లవ్ స్టోరీ



బాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థలు జీ స్టూడియోస్, భన్సాలీ ప్రొడక్షన్స్ కలిసి ఒక భారీ ప్రాజెక్ట్‌ను నిర్మించబోతున్నాయి. ఈ ప్రాజెక్ట్‌కి 'దో దీవానే షెహర్ మే' అనే టైటిల్‌ను ఖరారు చేయగా.. ఇందులో బాలీవుడ్ నటుడు సిద్ధాంత్ చతుర్వేది, మృణాల్ ఠాకూర్ జంటగా నటించబోతున్నారు. లవ్ స్టోరీగా రాబోతున్న ఈ చిత్రంకి రవి ఉద్యవార్ దర్శకత్వం వహిస్తుండగా.. సంజయ్ లీలా భన్సాలీ, ప్రేరణ సింగ్, ఉమేష్ కుమార్ బన్సాల్, భరత్ కుమార్‌లు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది ఫిబ్రవరి 26న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి అనౌన్స్‌మెంట్ వీడియోను పంచుకుంది చిత్రయూనిట్. ఈ టీజర్ చూస్తుంటే మెట్రో లవ్‌స్టోరీగా ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది.

# రాజమౌళికి ఆర్జీవీ సపోర్ట్

## దేవుడిపై నమ్మకం లేదని చెప్పే హక్కు ఉందని వ్యాఖ్యలు



దిగ్గజ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి ఇటీవల తాను దేవుడిపై పెద్దగా నమ్మకం లేదని చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. గ్లోబ్ ట్రాటర్ సినిమా ఈవెంట్‌లో ఆయన చేసిన ఈ కామెంట్స్‌పై పలు హిందూ సంఘాలు, బీజేపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ వివాదంపై తాజాగా దర్శకుడు రామ్ గోపాల్ వర్మ ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. రాజమౌళికి మద్దతుగా నిలడడమే కాకుండా విమర్శకులకు గట్టి కౌంటర్ ఇచ్చాడు. రాజమౌళిపై విషం కక్కుతున్న సోకాల్డ్ ధర్మ రక్షకులు తెలుసుకోవాల్సింది ఏంటంటే? భారతదేశంలో నాస్తికుడిగా ఉండటం నేరం కాదు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 దేవుడిని విశ్వసించకపోవడాన్ని కూడా రక్షిస్తుంది. అందుకే, మీరు దేవుడిని నమ్ముతున్నామని చెప్పే హక్కు మీకు ఎంత ఉందో, రాజమౌళికి కూడా తనకు దేవుడిపై నమ్మకం లేదని చెప్పే హక్కు అంతే ఉంది. అయితే రాజమౌళి దేవుడిని నమ్మకపోతే తన సినిమాల్లో దేవుడిని ఎందుకు చూపిస్తున్నాడు? అనేది మూర్ఖపు వాదన. ఆ లెక్కన, గ్యాంగ్‌స్టర్ సినిమా తీయాలంటే దర్శకుడు గ్యాంగ్‌స్టర్‌గా మారాలా? హారర్ సినిమా కోసం దెయ్యంగా మారాలా? అని ఆర్జీవీ విమర్శకులను ప్రశ్నించారు. నిజం చెప్పాలంటే? రాజమౌళి దేవుడిని నమ్మకపోయినా చాలా మంది దేవుడిని నమ్మేవారు కూడా తమ జీవితాల్లో చూడనంత విజయం, సంపద నాస్తికుడైన రాజమౌళికి ఇచ్చాడు. దీనిని బట్టి చూస్తే దేవుడు నాస్తికులనే ఎక్కువగా ప్రేమిస్తున్నాడేమో, లేదా దేవుడు అసలు జనాలను పట్టించుకోడేమో? లేదంటే ఎవరు నమ్ముతున్నారని లెక్కలు రాసుకునే నోట్‌ప్యాడ్ పట్టుకొని దేవుడు కూర్చోలేదేమో? అని ఆర్జీవీ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. రాజమౌళితో దేవుడికే సమస్య లేనప్పుడు, ఈ స్వయం ప్రకటిత ధర్మ రక్షకులైనవారు ఎందుకు బీపీ, అల్సర్ తెచ్చుకుంటున్నారు? నిజమైన సమస్య ఆయన నాస్తికత్వం కాదు. దేవుడిని నమ్మకుండానే ఆయన విజయం సాధించడమే అసలు సమస్య. ఎందుకంటే దేవుడిని పిచ్చిగా ప్రార్థించినా విజయం సాధించలేని వారిని ఇది భయపెడుతోంది అని ఆర్జీవీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. విశ్వాసులు దేవుడిని రక్షించడం మానేయాలి. అది దేవుడిని అవమానించినట్లే. రాజమౌళి నాస్తికుడైనంత మాత్రాన దేవుడి శక్తి తగ్గదు. నమ్మకం ఆగిపోయిన వెంటనే విశ్వాసం కూలిపోతుందని భావించే వారి ఇన్ సెక్యూరిటీ మాత్రమే పెరుగుతుంది అని ఆర్జీవీ అన్నారు. చివరిగా.. దేవుడు బాగానే ఉన్నాడు. రాజమౌళి బాగానే ఉన్నాడు. వీరిద్దరినీ అర్థం చేసుకోలేని వారు మాత్రమే బాధపడుతున్నారు. రాజమౌళి తదుపరి చిత్రం 'వారణాసి' ద్వారా దేవుడు ఆయన బ్యాంకు బ్యాలెన్స్‌ను మరింత పెంచుతాడు. దేవుడి నమ్మకం పేరుతో అసూయ పడుతున్న వాళ్లు ఏడుస్తూ కూర్చోవడమే. జై హనుమాన్ అంటూ ఆర్జీవీ తన వ్యాఖ్యలను ముగించారు.

# ప్రేమంటే..

## కొత్త తరానికి కొత్త కథ..



ప్రమోషన్ మొదలైన నాటినుంచి 'ప్రేమంటే' సినిమాపై ఆడియన్స్‌లో ఓ పాజిటీవ్ వైబ్ క్రియేటైంది. దానికి తోడు లియోన్ జేమ్స్ పాటలు కూడా జనబాహుళ్యంగా బాగా వినిపిస్తున్నాయి. ఖర్చును వెనుకాడని నిర్మాతలు పుస్కూర్ రామ్మోహన్‌రావు, జాన్వీ నారంగ్ ఈ చిత్రానికి నిర్మించడం.. యువతరానికి ఆకట్టుకునే ప్రియదర్శి, ఆనంది ఇందులో జంటగా నటించడం సినిమాపై ఆడియన్స్‌లో ఆసక్తి పెరగడానికి కారణాలని చెప్పొచ్చు. ఎట్టకేలకు శుక్రవారం 'ప్రేమంటే' విడుదలైంది. అభిప్రాయాలు కలవక పెళ్లికి దూరంగా ఉంటున్న అమ్మాయి రమ్య(ఆనంది). సమస్యల కారణంగా పెళ్లి వద్దనుకుంటున్న అబ్బాయి మదన్మోహన్ అలియాస్ మది(ప్రియదర్శి). వీరిద్దరూ అనుకోకుండా ఓ పెళ్లిలో కలుస్తారు. వారి కలయిక ప్రేమగా, ఆ తర్వాత పెళ్లిగా పరిఢమిల్లుతుంది. తొలి నెల వారి వైవాహిక జీవితం సంతోషంగా సాగిపోతుంది. కానీ తర్వాత నుంచి కష్టాలు మొదలవుతాయి. బాధ్యతలు రమ్యను ఆఫీస్‌కు నడిపిస్తాయి. సమస్యలు మదిని వ్యాపారం వైపుకు తరలిస్తాయి. అసలు సమస్య ఇక్కడే వచ్చిపడుతుంది. సీసీ కెమెరాలు, లాక్స్ సంబంధించిన బిజినెస్ మదిది. దీనికి సంబంధించిన వర్కంతా నైటే ఎక్కువ ఉంటుంది. దాంతో రమ్య ఆఫీస్ నుంచి ఇంటికి రావడం.. అదే టైమ్‌కి మది తన ఆఫీస్ వెళ్లిపోవడం.. ఈ కారణంగా వారి వైవాహిక జీవితం అసంతృప్తిగా తయారవుతుంది. ఇదిలావుంటే.. ఇంట్లో ఉన్న కొద్ది సమయంలో మది కదలికలు రమ్యకు అనుమానం కలిగిస్తాయి. తాను ఎవరితోనే రిలేషన్‌లో ఉన్నాడనే సందేహం రమ్యకు మొదలవుతుంది. అందుకు తగ్గట్టు సాక్ష్యాలు కూడా కనిపిస్తుంటాయి. దాంతో మదిని నిలదీస్తుంది రమ్య. ఇద్దరి మధ్య జరిగే గొడవలో అనుకోకుండా తన బిజినెస్‌కి సంబంధించిన రహస్యాన్ని బయటపెడతాడు మది. దాంతో రమ్య షాక్. అసలు మది చేస్తున్న బిజినెస్ ఏంటి? రమ్య ఎందుకు షాకయ్యింది? ఆ తర్వాత వీరిద్దరి వైవాహిక జీవితం ఎలాంటి మలుపు తీసుకుంది? అసలు చివరికి ఏం జరిగింది? అనేది అసలు కథ.ఈ సినిమా ఓ విధంగా హీరోయిన్ కథ. ఈ కథకు ప్రధానమైన సోల్ హీరోయిన్ పాత్రే. చెడ్డవాడైన భర్తతో కలిసి చెడ్డపనులు చేసే భార్యల కథలు విన్నాం. సకలగుణసంపన్నుడైన భర్త అడుగుజాడల్లో నడుస్తూ.. సుగుణవతిగా ఇంటిని చక్కబెట్టే భార్యల కథల్ని కూడా చూశాం. ఇందులో హీరోయిన్ కూడా ఓ విధంగా అలాంటి భార్యే. కాకపోతే ఇదోరకం. సాధారణంగా సమస్యల కారణంగా భర్త దొంగగా మారితే.. ఏ భార్యలైనా అతన్ని మార్చుకోడానికి ప్రయత్నిస్తారు. కానీ భార్య అలా కాదు. భర్త దొంగని తెలిసి.. భర్త సమస్యలను అర్థం చేసుకొని.. భర్తకు సాయంగా తాను కూడా దొంగలా మారుతుంది. ఓ విధంగా ఈ పాయింట్ నిజంగా కొత్తదే అనాలి. ఇందులో హీరోయిన్ వీక్నెస్ భర్తను అమితంగా ప్రేమించడమే. భర్త బలహీనతను కూడా ఇష్టపడటమే. నిజానికి అతడు చెడ్డవాడేం కాదు. తాను దొంగతనాలు కూడా యతికల్‌గా చేస్తాడు. అందుకే.. తాను కూడా భర్తతో కలిసి దొంగగా మారుతుంది. ఈ పాత్రలో ఆనంది నిజంగా అదరగొట్టిందనే చెప్పాలి. ఇందులో ఆనంది పోషించిన రమ్య పాత్ర జనాలకు పడితే.. సినిమా హిట్. పట్టకపోతే సినిమా ఫట్. ఈ విషయం దర్శకుడు నవనీత్ శ్రీరామ్ కొంతమేర సక్సెస్ అయ్యాడని చెప్పొచ్చు. ఓ వైపు గమ్మత్తైన ఈ కథను వినోదంగా ప్రజెంట్ చేస్తూనే.. మరోవైపు ఆ జంట మధ్య ఉండే పరస్పర ప్రేమానురాగాలను తెరపై చక్కగా ప్రజెంట్ చేశాడు దరశకుడు నవనీత్ శ్రీరామ్. ఆనంది, ప్రియదర్శి మధ్య వచ్చే సన్నివేశాలన్నీ సినిమా బావున్నాయి. సుమ, వెన్నెల కిశోర్ తమ పాత్రలను ఎప్పటిలాగే రక్తికట్టించారు. మిగతా నటీనటలంతా పరిధిమేర ఆకట్టుకున్నారు.సాంకేతికంగాదర్శకుడు రాసుకున్న కథ కొత్త ఉంది. కథనం కూడా ఆకట్టుకునేలా ఉంది.

CHIEF EDITOR BY **KANCHARLA ATCHUTA RAO** PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169. PRINTED BY **CHAITANYAVARADHI** PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861